తాళ్లపాక సాహిత్యము

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీతాళ్ళపాకవారిపదసాహిత్యము – సంపుటము 31

150
7.2.91

# శృంగార సంకీర్తనలు

అన్నమాచార్య విరచితములు

M. B. S. Sastry

పరిష్కర్త:
గౌరిపెద్ది రామసుబ్బశర్మ

AB45
Own Book

ప్రచురణ:
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1984

అన్నిహక్కులు
తిరుమల తిరుపతి దేవస్థానముల వారివి

ప్రకాశకులు :
**జి. కుమారస్వామిరెడ్డి,** ఐ. ఏ. ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

మొదటి ముద్రణ 2,000 ప్రతులు

ముద్రణము :
తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాయలము,
తిరుపతి.

# ముందుమాట

పరమభక్తాగ్రేసరుడు, వేంకటేశ్వరునిచేత తనవంశములో తాను మొదలు మూడుతరములవారికి ముక్తిని వరముగాగొన్న — మహనీయుడు, పదకవితాపితామహుడు, గానమునందు నారద తుంబురులతో సాటివాడుగా ప్రసిద్ధికెక్కినవాడు, కవిత్వమునందు కాళిదాస తిక్కనలతో సమానుడుగా పేరుగన్నవాడు అగు అన్నమాచార్యునిపదములను పరిష్కరింపించి, ముద్రింపించి, ప్రకటించి, సహృదయులకందరకు సరసమైనధరలకు విక్రయించు చున్నందులకు మా తిరుమల తిరుపతి దేవస్థానము గొప్పఅదృష్టముగా భావించు చున్నది.

ఈ పనికి సమర్థులైనవ్యక్తులు దొరకడముకూడ మాభాగ్యములలో ఒకటి. ఇప్పుడు ప్రకటించుచున్న 31 వ సంపుటమునందు దీని పరిష్కర్త శ్రీ గౌరిపెద్దిరామసుబ్బశర్మ ఈపాటలను సాహిత్యరూపములో చవిమాచేవారికి అనువుగా వింత పలుకుబడులు, భావములుకల కొన్నిపాటలను మచ్చుకు వ్యాఖ్యానించినారు. ఈవ్యాఖ్య సహృదయకోటికి మెప్పైతే అదే మాకార్యక్రమానికి బలమని ఊహించుచున్నాను. చదివినపెద్దలు గుణదోషములను వింగడించినచో మేము పైపై సంపుటములలో పరిష్కర్తలకు మెలకువ లివ్వగలము.

జి. కుమారస్వామిరెడ్డి,
కార్యనిర్వహణాధికారి
తి. తి. దేవస్థానములు.

తిరుపతి,
ఏప్రిల్ 9,1984.

# పీఠిక

మధురై రుజ్జ్వలై ర్వ్యాపైః వాచికాంగికసాత్త్వికైః।
శృంగారం యః పుపోషాద్యే బ్రహ్మణి శ్రీపతౌ నుమః॥

1501వ రేకునుండి 1600 వ రేకువరకుగల 100 రేకులలోని పాటలుగలది ఈసంపుటము. 1521 నుండి 1530 వరకు గల 10 రేకులు, 1581 నుండి 1590దాకగల 10రేకులు వెరసి 20 రేకులు ఇందులో లేవు.

ప్రతిశృంగారసంకీర్తనలసంపుటమునందును ఏదైన ఒక — వ్యాకరణ విషయము చర్చించుట పరిపాటి. కడచిన సంపుటమునందు 'అన్నమయ్య శృంగారభండారము' అను శీర్షికతో శృంగారమునందు అన్నమయ్య విరివిగా వాడిన కొంతపదసముదాయమును ఎత్తి చూపడము జరిగినది. ఆతరువాత ఒకటి రెండుపాటలు వ్యాఖ్యా నింపబడినవి. ఈసంపుటమునందు కొన్ని పాటలు తేటతెలుగు పదము లలో నున్నను, భావము లోతుగా నున్నవానిని వ్యాఖ్యానింప దలచితిని.

అన్నమయ్య తననాట, తననాట గల గ్రాంథిక వ్యావహారిక పదములను గుట్టుమట్టు ఎరిగి ఆయాస్థలములందు ప్రయోగించినాడు. ఆయన పలుకుబళ్ల వెంబడి అలంకారములు వద్దంటే వానులుగా నడచి వస్తాయి.

మనకంతా పూజనీయుడు, వరాలిచ్చేవాడు, సాక్షాత్పరబ్రహ్మ స్వరూపుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు, అన్నమయ్య శృంగార సంకీర్తనలలో ఏ పరిస్థితికి వచ్చినాడో ఈక్రింది పాటలో గుర్తింపుడు. ప్రతిపాట పైకి శృంగారభావము, లోపల అధ్యాత్మభావము రెండును సమప్రధానములుగా ఉండుట ఇందలి విశేషము.

దేసాళం

అప్పుడు పరాకై వుండె నది యెఱఁగవు నీవు
ఇప్పు డాకె గనుఁగొని యేమనునో ఇఁకను ॥పల్లవి॥

కప్పురవువసంతము కలికి నీపై నాడఁగా
డప్పిదేరె నక్కడి బడలిక వాసె
కొప్పు ముడుచుకో ఇఁకఁ గొనగొంగు చెరువుకో
చొప్పు లాపె గంటేను సూడువట్టీ నిన్నును ॥అప్పు॥

గక్కన నీవు రాఁగానే కాంత పన్నీరు చల్లఁగా
చెక్కుచెమటెల్లా జారె సేదలుదేరె
చక్కదిద్దుకో నామము చందన మలఁదుకో
వెక్కసా లివెల్లాఁ గంటే వెంగమాడీ నిన్నును ॥అప్పు॥

దగ్గర నీవు గూచుండేతరి పూవుల వేయఁగా
కగ్గిన యలఁతదేరె కాఁకలు మానె
యెగ్గులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సిగ్గరి యాపె గంటేను చిమ్మిరేఁచీ నిన్నును ॥అప్పు॥

(ఈ సంపుటము—పాట4)

అన్నమయ్యాచేతిలో కొన్ని వేలమంది దాదులు, నాయికలు, ప్రతినాయికలు, కొందరు మహానాయికలు ఈవాఙ్మయములో తీరినారు. ఈపాటలో ఎక్కడనో ఏ సాధారణ నాయికనో యేచెలికత్తెనో వలచి, వలపించి, తనిపించి మహానాయిక దగ్గరకు వచ్చిన శ్రీవేంకటేశ్వరుని, ఆ మహానాయికచెలికత్తె హెచ్చరించి నాయకుని దోసము కప్పుచున్నట్లు ఈపాటకు ప్రకరణముగా చెప్పవచ్చు.

నీవు ఇంకొకనాయికతో (నాతో) వున్నప్పుడు మా మహానాయిక ఎక్కడనో పరాకున వుండినది. ఆసంగతి నీకుతెలియదు.

ఇప్పుడు ఇతరకాంతలను భోగించివచ్చినలక్షణములుగలనిన్ను ఆమె చూస్తే ఏమిమండిపడుతుందోకదయ్యా అని చెలికత్తెమాట. ఈ పల్లవిలో ఇంతపొరపాటు ఎందుకు చేసితివయ్యా ఆ పచ్చిలక్షణముతోనే ఏల ఇక్కడికి వచ్చితివయ్యా అనుటవ్యంగ్యము.

మొదటిచరణములో వచ్చిననాయకునకు కప్పురవసంతముతో ఎదురాడుతూ వచ్చినది మహానాయిక. పసుపునీరు, కొద్దిపాటి సున్నము, దానిలో పచ్చకప్పురము, ఏలకులు, లవంగాలు, వట్టివేరు అంతా కలిసినదానిని కప్పురవసంతమంటారు. దానిని మహానాయిక స్వామిపై చిలికించినది. దానితో అక్కడ అలసిపోయివచ్చినస్వామికి దప్పి తీరినది. బడలికనుండి తేరుకొన్నాడు. కాని కొన్ని లక్షణములు ఇంకా సరిదిద్దుకోవలసినవి ఉన్నాయి. వాటినిగూర్చి హెచ్చరించు చున్నది చెలికత్తె. స్వామి సిగముడి చెదరియున్నది. రింగులువారగట్టిన ధోవతిఒకచెరగు వీడిపోయివున్నది. స్వామి తనఇంటికి వేంచేసి నాడని ఉప్పొంగిపోవుచు వసంతముతో ఎదురాడే మహానాయిక ఈసిగముడివీడడమును, దోవతికొంగు జారడమును గుర్తించినదంటే నీపై పగబట్టుతుందయ్యా కాబట్టి 'కొప్పుముడుచుకో', 'ఇంకఁ గొనఁగొంగుచెరువుకో' అను మెత్తనిమాటలతో స్వామిని హెచ్చ రించుచున్నది. నాయికచెలికత్తెలైనను, నాయకునకు కావలసినవారే. నాయికానాయకులు సంబరములతో నుంటేనే వీరికి చనవు సత్కా రములు జరుగుతాయి, లేకుంటే ఇరు ప్రక్కలా వీరికి చీదరింపులే. అందువలన నాయికచెలికత్తె నాయకుని హెచ్చరించుట, ఆయన తప్పులనుకాపాడుట తనధర్మము.

ఇక రెండవచరణములో నాయకుడు తన ఇంటికి దయచేయగా మహానాయిక స్వామికి పన్నీరుచల్లుచు ఎదుర్కొన్నది. దానితో స్వామి ఇంకొకచోట పడినశ్రమవలనకలిగినచెమటెల్ల సడలినది. స్వామి కొంత కుదుటపడినాడు. కాని జారిననామ మట్టులే

యున్నది. చందనము కరిగి పోయియున్నది. మనసుకు బరువయ్యే "ఇటువంటి వేసాలను" మహానాయిక గుర్తించెనా దేవరవారికి దెప్పి పొడపులు తప్పవు. కాబట్టి నామమును సవరించుకొని, కరగిన చందనమును పలుచగా మెత్తించుకొని, నాయికకంటికి క్రొత్తగా వచ్చినట్లే అగపడవయ్యా అని హెచ్చరించుచున్నది నాయికచెలికత్తె.

మూడవ చరణములో మహానాయిక ప్రక్కన మనస్వామి కూర్చుండగా, ఆమె ఆయనపై పువ్వులువిసరినది. పువ్వులలోని మెత్తదనముతో పుప్పొడులతో స్వామికి అలపు దీర వేడిచల్లారినది. 'స్వామీ! నన్ను మీరనుగ్రహించితిరి. మహానాయిక మిమ్ములనూ, నన్నూ చూస్తే మీపై రుసరుసలాడుతుంది. అని హెచ్చరించింది.

ఈపాటలో మూడవచరణము మూడవపాదము 'ఎగ్గులేక శ్రీవేంకటేశ నన్నునేలితివి' అను పాదముతో పూర్వ పాదములను జతచేసినపుడు అన్వయము కుదురనట్లే తోచును. కాని ఎగ్గులేక అన్న – పాదములో స్వామిఅనుగ్రహమునకు పాత్రమైన నాయికసఖియే, స్వామిని తన నాయకురాలిదగ్గరకు తోకొని వచ్చుచు, నాయిక చేసిన స్వాగత సత్కారములతో మాటుపడక మిగిలిన సిగముడి, నామము వగైరాలసవరణములహెచ్చరికతో తననూ స్వామిని కాపాడుచూ హెచ్చరించు చున్నది ఈచెలికత్తె. ఇక్కడ ఇది గుణీభూతవ్యంగ్యము. మరియొకపాట:—

శ్రీరాగం

అందరిలో నీవు నన్ను నానకొలిపేవుగాక
పొందు నీకే కలిగితే భోగించనా ॥పల్లవి॥

చిత్తమురా నీసేవ సేయఁగలఁగాక నీకు
బత్తి గొట్టానఁ బెట్టేనా పలుమారును
వత్తునంటాఁ జెప్పంపేవు వారివీరిచేత నేఁడు
వొత్తి నే నంతక తొల్లి వొద్దంటినా ॥అంద॥

సముకాన నుండి సరసములాడఁగలఁగాక
తమకము రేఁచేనా తగిలి నీకు
చెమటలు గారఁగాను చేతులు చాఁచేవు నీవు
అమరఁ గాఁగిలించఁగా నౌఁగాదనేనా ॥అంద॥

ననుపు సేసుక నీతో నవ్వు నవ్వఁగలఁగాక
పెనఁగి గుణము చక్కఁబెట్టేనా నేను
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలోనే నన్ను
వొనర కెన్నఁడైనా వొడ్డుకొంటినా ॥అంద॥

(ఈ సంపుటము. పాట-36)

పదుగురిలోనున్న నాయికను గిలిగింతలుచేసి, మనసు చెర రేగునట్లు మాటలాడించి, తుదకు ఆమెను అనుగ్రహింపకయే పోయిన స్వామినిగూర్చి, ఆమె ఏకాంతమున విన్నవించుకునే మాటగా ఈ పాటకు ప్రకరణము తోచుచున్నది.

నలుగురిలో నున్నప్పుడు నాపై నీకూ తమకమున్నట్లు ఏమేమో మాటలాడి నన్ను ఆపకోలుపుతావు. అంతే. నాపైన నిజమైన ప్రేమవుంటే నన్ను భోగించక వుంటావా? ఇది నాయిక వాక్యము. ఈమె కొంత అమాయకురాలు. స్వామి చెప్పినసేవలు లేదా, స్వామికి చేయవలెనని తనకు తోచినసేవలు చాలా మర్యాదగా వాగుడుకాయకాక చేసే గుణవంతురాలైననాయిక.

మొదటిచరణములో నీమనసుతాకునట్లు నీకు నేను సేవలు చేయగలను కాని, నీపై నాకున్నప్రేమ పిడికటబట్టిచూపగలనా? ధర్మాధర్మములు, పాపపుణ్యములు, కామక్రోధాదులు, ప్రేమా సూయలు అనునవి మనిషి చేసే పనులవలన వారిమనసును గుర్తెరగ వలెగాని, వైధర్మములను ప్రత్యక్షముగ సాకారముగ చూపుటకు వీలుపడదుకదా. అంటే నేను నీమాట కెదురాడను. నాకప్పగించిన

సేవను లేక, నాకు తోచినసేవను నేను మాటలాడక చేసికొనిపోవుచుందును. నీపై నాబత్తి(ప్రేమ)ఇంతా అని నేను ప్రత్యక్షమున చూపగలనా? నేడు వస్తా రేపు వస్తానని వారి వీరితో చెప్పింపుచే గాని నీవు వస్తే నేనెన్నడైన వద్దంటినా.

రెండవచరణము. నీ ఎదుటనుండి నీ మనసంటునట్లు సరసములాడగలనుగాని, నీ మనసులోలేని మోహమును నేను రేచగలనా. సరసములాడినసమర్థురాలగునాయికను గట్టిగా కాగిలించుకొనుట పతిపని. అది మనసులో ప్రేమ మున్నప్పుడే జరుగును. ప్రేమ మన్నది తనకు తాను పుట్టవలెగాని, లేనిదానిని ఒకరు పుట్టింపలేరు. నీ చేతులు చెమటగారగా అనగా నీ మనసు కరగుచుండగా అని అర్థము. నాపైకి చేతులు చాచుతావు. కాగిలించితే నేను వద్దన్నానా? ప్రథమ పరిష్వంగము పురుషునిది. తరువాతిది అంగనది అని కామశాస్త్రము. అది నీకు నేను నేర్పవలెనా అని వ్యంగ్యము.

మూడవ చరణమున, నీపై ప్రేమముట్టిపడగ నా నిండు మనసు నీకప్పగించుచున్నట్లు నవ్వు నవ్వగలనుగాని, నీ ప్రేమ–గుణము నాపై కెక్కునట్లు నేను చక్కపెట్టగలనా? నవ్వైన నన్ను దగ్గరకు తీయవలసినది నీ ధర్మము. ఇకమూడవ చరణము మూడవ పాదమునుండి అన్నమయ్య మారిపోవుచున్నాడు. తొలి రెండు చరణములలో ఎంత విరహవేదన వర్ణింపబడినా, మూడవ చరణములో కరగి కలసి పోవుటయే ఈయనశృంగారరహస్యము. శుభాంతముగ చూపవలెనను విశ్వాసముగూడ ఒకటి కావచ్చును. స్వామీ నేనట్ల అనుకొనుచున్నంతలోనే నన్ననుగ్రహించితివి. ఇంతకు ముందెన్నడైన మీరు నన్ను కావలెనన్నపుడు నేను ఎదురొడ్డు కొంటినా. మీ చరణదాసినికదా. నన్నింత వేగించి కూడుట, మీరు గట్టిగా నామనసు భక్త్యున్ముఖమైనదా లేదాయని పరీక్షించుటగా తలపోయుచున్నదాన. ధన్యాస్మి స్వామిన్ ధన్యాస్మి.

అన్నమయ్య కొన్ని స్థలములలో ఒట్టిఅను భావములతోనే పాటలోనిశృంగారమును పొర్లిపోయేటట్టు వర్ణిస్తాడు.

ఈ క్రిందిపాటలో ఒక ప్రౌఢనాయిక, ఒక ముగ్ధనాయికను ఎత్తిపొడుస్తూ, ఆమె అభిప్రాయసూచకములైనఅనుభావాలను, అట్లనే ఆ అభిప్రాయాలనుకూడా వర్ణించడములో ఇది వ్యంగ్య ధోరణికి సున్నజుట్టి వాచ్యధోరణిలో పడినట్లు ప్రకరణమువలన అర్థమవుతుంది.

పళవంజరం

ఇన్నాళ్లుఁ బలుచ వేమీ నెరఁగవంటా నుంటిమి
కన్నులారా నీయందుఁ గంటిమి వేడుకలు ॥ పల్లవి ॥

చెలరేఁగి లోలోనే చిరునవ్వులు నవ్వేవు
వలపులతలపోఁతవరుసా ఇది
అలయుచు సొలయుచు నసురుసురయ్యేవు
కొలఁదిమీరినరతికోరికా ఇది ॥ ఇన్నా ॥

చిట్టంటుఁ జెమటలతో సిగ్గువడేవు నీవు
దట్టమైనపాయపుమదములా ఇది
గుట్టుతోడఁ బులకలు గుబ్బతిల్లే విప్పి డిట్టె
మట్టులేనిశమకపుమర్మమా ఇది ॥ ఇన్నా ॥

యీడనే పానుపుమీఁద నెదురులు చూచేవు
కూడేటిఆసలకెల్లా గురుతా ఇది
పాడితో శ్రీవేంకటపతి నిన్ను నన్ను నేలె
వేడుకఁ జూచేవు వెల్లవిరులా యిది ॥ ఇన్నా ॥

(ఈసంపుటము పాట 58)

ఇన్నిదినములు చిన్నదానవు; ఏమీ తెలియని దానవు; అను కొనుచూ వుంటిని. ఇప్పుడు నీయందు క్రొత్తక్రొత్త వింతలు గమ నిస్తున్నాను. అని, బాగా అనుభవజ్ఞురాలైన ప్రౌఢనాయిక ముగ్ధ-నాయికతో అంటుంది. లోలోపలనే చెలరేగి చెలరేగిప మేమో తలచు కొని చిరునవ్వులు నవ్వుతున్నావు. ఇదిచూస్తే నీలోనివలపులు అంటే, రతి–సమయములో నాయకుని ఇట్లు చేయవలె అట్లుచేయవలె అని ఊహించే తలపోతలా. ఒకసారి అలసిపోయినట్లు సొలసిపోయినిటు ఉసుళ్ళుకొడుతూ వుంటావు. నీశక్తికి మించిన రతిపైన కోరికయూఅది. రతికై ఉబలాటపడుతున్న ఉపిద మధ్యవ్యక్తులచేత, మధ్యసన్ని వేశ ములచేత, అరతిసమయము దూరమగుచుండగా ఉసుళ్లు కొట్టుకోవ డము కామశాస్త్రములో వర్ణింపబడినదే.

రెండవచరణములో బయటికి కనపడేటట్లు బొబ్బిలిచెమటలు కాక, చిట్టంటుచెమటలు=పలచనిచెమటలతో సిగ్గుపడుతున్నావు. నఖదంతక్షతాదులతో మురిసిపోయే ప్రాయపుమదమూ ఇది. ఒడలిపై గుబురుగా మొలకకెత్తు పులకలతో, లోపల లోపల గుబులు కొంటూ వున్నావు. తటుకోలేక పైకెగదటుచున్న కామమర్మమా ఇది. యువతీయువకులకు మొలకప్రాయములో ఇతరులకు చెప్పలేని కామమదము తనశరీరము పట్టక, పులకల రూపముగా ఒంటిపై పరువులు దీయుననుట కామశాస్త్ర రహస్యము.

మూడవచరణములో ఈ అనుభావముల కన్నింటికి తుదిపద మైనపడకటింటిలో పానుపుమీద, ఎదురుచూస్తున్న ముగ్ధనుగూర్చి ప్రౌఢనాయిక, నీవు అనుభవింపపోయే కోరికలన్నింటికి ఇది తుది గురుతా; ఇకపై పతితో మీరహస్య ప్రసంగమునకు ఇది మేరలేని తార్కాణయా. ఇంతకుముందే నేను చెప్పినట్లు మూడవచరణము ఉత్తరార్థములో సంభోగశృంగారముతో ముగిస్తున్నాడు అన్న మయ్య. శ్రీవేంకటేశ్వరుడు ప్రౌఢలకు ప్రౌఢుడు; ముగ్ధలకు

ముగ్ధుడు. కావున నిన్నూ నన్నూ అనుగ్రహించినాడు. అరమోడ్పు కండ్లతో నలుదిక్కుల జూచేవు. మీరతి సంగ్రంథముబట్టబయలా ఇది. అనగా రతితో తనిసిననాయిక అరపిరికనుదోయితో పతిని చూచుట శృంగారమర్మము. ఈ పాటలో ప్రౌఢనాయికకు ముగ్ధనాయిక పోటీదారు. తాను ప్రౌఢకాబట్టి ముగ్ధను అధికారదర్పముతో మందలిస్తూవుంచె.

అన్నమయ్య తన శృంగారకీర్తనలన్నీ లోపలి అర్థముతో అధ్యాత్మ పరములుగా వర్ణించినాడని సాహిత్యజ్ఞులమాట. మధురకు వెళ్లినతరువాత బలరామకృష్ణులు ఒకసారి గోపసుందరులను చూడ వచ్చినపుడు "గోపాల సుందరు లఘుతానందకందళితహృదయలై. హృదయేశ్వరుండైన గోవిందుండు చిరకాలసమాగతుం డగుటం జేసి, యతనిం జూచుతలంపు లుల్లంబుల వెల్లిగొనం జేరి.

చం॥ నలినదళాక్షుఁ జూచి నయనంబులు మోడ్వఁగఁ జాల కాత్మలన్
వలచి తదీయమూర్తి విభవంబు దలంపుచుఁ గౌఁగిలింపుచున్
బులకలు మేన జాదుకొనఁ బొల్తులు చొక్కిరి; బ్రహ్మమున్ మనం
బులఁగని చొక్కు యోగిజనమున్ బురుణింపఁగ మానవేశ్వరా

(అం. మహాభాగవతదశమస్కంధం, ఉత్తర 1063, 1064)

అట్లనే

తే॥ ఘోర సంసార సాగరోత్తారణంబు
ధీయుతజ్ఞాన యోగిహృద్ధ్యేయవస్తు—
వగుచుఁ దెలువఁడు నీ చరణాంబుజాత—
యుగళమును, మానసంబులఁ దగులనీవె!

(అం. మహాభాగ. దశ. స్కం. ఉత్త 1070)

పద్యములలో గోపాంగనలభక్తిని శృంగారరూపముగ ప్రపంచించిన, పోతనవలెనే మన అన్నమయ్య ఈక్రింది పాటలో, వేంకటేశ్వరుని చూచిన భక్తులందరు తాము నాయికలై ఆపురుషోత్తముని మొగము చూచి, ఆతనితో సరసమాడి, ఆతనిమేను సోకి పరవశులై స్వామి చరణారవిందంబులనునావ నెక్కి సంసారసాగరమును తరించి ముక్తి ద్వీపమునకు చేరుకొన్నారని వర్ణించుట త్రిసత్యమైనమాట.

పాడి

అంటి నిన్నుఁ బాయలేని దాపె తలనే వేఁగెనా
వెంటవెంటఁ దిరుగరా వెలఁదులెల్లాను ॥పల్లవి॥

తలకొని నీమోము తప్పక చూచితేను
వలవరా యెటువంటివనితలైనా
సెలవుల నేపాటైనా చిరునవ్వు నవ్వితేను
మొలవవా పులకలు మోపులకొలఁదులు ॥అంటి॥

చనవున నీతోను సరసములాడితేను
మనసులు గరఁగరా మగువలెల్లా
యెనసి నీతోఁ గన యేపాటి మాటాడినాను
తనుఁదానె కాఁగిళ్ల తగులుకోకుండునా ॥అంటి॥

నివ్వటిల్లుతమకాన నీమేను సోఁకితేను
నివ్వెరగుఁ బొందరా నెలఁతలెల్లా
రవ్వగా శ్రీవేంకటేశ రతి నలమేలుమంగ
యివ్వలఁ గూడినందుకు హెచ్చవా వేడుకలు ॥అంటి॥

(ఈ సంపుటము, పాట 282)

ఒకనాయిక తనపై జూపిన ప్రేమ వృత్తాంతము, ఇతర నాయికలకందరకు స్వామి సెలవియ్యగా, అప్పుడా నాయికలందరు స్వామితో ఈ క్రింది విధముగ పలుకుచున్నారనుట ప్రకరణము.

నిన్ను తాకిన తరువాత నిన్ను యెడబాయలేకుండుట ఆమె తలనే పొద్దుపొడచెనా. నీవెంట కాంతలందరు(భక్తులు)తిరుగుటలేదా. ఒకసారి నీముఖము తప్పక దీక్షతో చూచిన ఎటువంటిస్త్రీలైనా నీకు వలవరా. నీవు నీ సెలవులువార చిరునవ్వు నవ్వితే ఎటువంటి స్త్రీలకైనా మోపులకొలదిగ పులకలు మొలవవా. నీతో చనవుగ సరసమాడినఏమగువలైనా మనసులు వెన్నవలె కరగరా నీతో ఏ కొంచమునేపు మాటలాడినా తమకు తామే పరవశలై కౌగిళ్ల నిన్ను చేరుకోవా. నిండు మోహముతో నీ ఒడలు సోకితే స్త్రీలందరు నివ్వెరగు చెందరా. శ్రీవేంకటేశా! అలమేలుమంగను నీవు కూడి-నందులకు ఆమెకు వేడుకలు హెచ్చవా.

ఇది ఈ పాటలోనున్న స్థూలమైనఅర్థము. ఇందు ప్రయోగించిన వెంటవెంట దిరుగుట తప్పక చూచితే వలచుట, సెలవుల చిరునవ్వు నవ్వితే మోపులకొలది పులకలు మొలుచుట, చనవున సరసమాడితే వెన్నవలె మనసులు కరగుట, నీతో ఏపాటి మాటాడినాను పరవశలై కౌగిళ్ల తమకుతామే తగులుకొనుట, నిండు మోహమున నీమేను సోకితే విెవ్వెరగందుట, రతిలో అలమేలుమంగను కూడినచో వేడుకలు హెచ్చుట అను ఈ పదములు కృష్ణపాదరజః పవిత్రములైనగోపికలయోగిమనస్తత్వమునకు, కామినీమనస్తత్వమునకును సమానములు వలచిన వానివెంటవెంట దిరుగుట, కామినీజనులధర్మము. స్వామిని కొలచెడివారు ఆయన వున్నచోటనే పరిభ్రమించుచుండుట యోగిలక్షణము. మొగము దీక్షగా చూచినచో ఆయనకు పరవశమగుట కామినీజనధర్మము. అట్లే స్వామిముఖమును మనసున నింపుకొన్నయోగి ఆయనకు పరవశుడగుట తత్త్వజ్ఞాని లక్షణము. స్వామి చిరునవ్వు నవ్వితే మనలను స్వామి అనుగ్రహించెకదా అని మనమున బుట్టినఆనందమునకు ప్రతిరూపములైనపులకలు శరీరముపైకన్పట్టుట కామినీధర్మము. మనసున స్వామిని ధ్యానించు

నపుడుఆయన ఒకసారి చిరునవ్వుతో తనను చూచినట్లు అనుభవముగల భక్తునికి, ఆనందము పొంగులు వారి శరీరమున నిడు వెన్నటుక వెట్టుట యోగిధర్మము. అట్టులే స్వామితో చనవున సరసమాడితే ఆయన సరసున ఉన్నందున మనసు వెన్నవలె కరగుట కామినీధర్మము. సమాధియందు స్వామిఅంగీకరించినట్లు తనకు అనుభవము కలిగిన, అప్పుడు మనసు కరగుట అది యోగిజనధర్మము. కామినులు కాముకులతో ఏ కొంచెము సేపు మాటలాడినా పరవశలై వానిని నిండు కౌగిట గుచ్చుకొనుట కామినీధర్మము. అట్టులే ధ్యాన సమాధిలో స్వామితో తాము మాటలాడినట్లు భావించినచో ఆ స్వామిని బట్టబయట కౌగలించుకొనుట యోగిజనధర్మము. కామినికి ప్రియునిమేను సోకితే నివ్వెరగుపడుట కామినీధర్మము. భక్తుడు స్వామి తనను స్పృశించినట్లు, వెన్నుచరచినట్లు సమాధిలో కనుగొనెనేని అప్పుడు తాను కొయ్యబారుట యోగిజనధర్మము. ఇక్కడ అల మేలుమంగ భక్తబృందమునకంతటికి ప్రతినిధి. ఆమె స్వామితో రతినందునది. ఆమె రతి శారీరకముగా కావచ్చునేమో. భక్తుడు కూడా స్వామితో రతి=నిరతిశయప్రేమ, దానివలన గాఢపరిష్వంగము ఇత్యాదుల ననుభవించుచున్నాడు. కావున ఈ పాట భక్తునికి కామినికి కలసమానధర్మములను నిరూపించుపదజాలముతో ఇమిడి యున్నదని నిరూపించితిని.

అన్నమయ్యశృంగారసంకీర్తనలన్నీ పైకి శృంగారతరములైనా లోపల స్వామిఅనుగ్రహమునకు పాత్రములగుట అనుభక్త-నాయికాధర్మములతో వెల్లివిరియుచున్నవి. ఏ పాటయందుగాని "నన్నేలెను, నిన్నేలెను, ఆపెనుయేలెను" ఇత్యాది అనుగ్రహ పర్యాయములైన రక్షణాత్మకములైన శబ్దములేకాని, పూర్తి శారీరక, సంబంధవాచికములైన శబ్దములు సమాగమసూచకములుగా మన అన్నమయ్య వాఙ్మయములో లేనేలేవు.

ఈసంపుటమునుండి సందిగ్ధపదసమీక్షను ఆయాపాటల క్రిందనే ఇచ్చుటచేత ఆశీర్షిక ప్రత్యేకతను కోల్పోయినది. పాఠకులు గమనింపగలరు.

తాళ్లపాకకవుల సంగీతసాహిత్యములను లోకమునకంతటికి పణ్యారముగ పంచవలెనను భావము, దానికై రొక్కమెంత ఖర్చైనను వెనుకాడని పట్టుదల, ఆకారముదాల్చిన ఉత్సాహముగా అగపడుచున్న తి. తి దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు శ్రీ వి. కె. డి. వి. సత్యనారాయణరాజు గారికి, వారి సభ్యులకును, మూడు పూవులారుకాయలుగ ఈకార్యమును నడిపించుచూ రూపెత్తిన దీక్షయో అన్నట్లు కనబడు శ్రీ కార్యనిర్వహణాధికారులు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి, ఐ.ఏ.యస్ గారికిని నాకృతజ్ఞతాభినందనలు. ఒకనెలపని ఒకవారములో తీర్చుస్వభావముగల తి. తి. దే. ప్రెస్ మేనేజరు శ్రీ M. విజయకుమారరెడ్డిగారికి, ప్రతిఅంశమునందును తలలోనాలుకగా పనిచేయుచు త్వరత్వరగ ముందుకు నడిపించు స్వభావముగల పౌరసంబంధశాఖాధికారి (P.R.O) శ్రీ R. సూర్యనారాయణమూర్తి, M.A, గారికి, అడుగడుగున మామాటలకు ముందుగనే, తమచేతలు చూపుచు మాకు సాయపడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ K. సుబ్బారావు M.A గారికిని నాధన్యవాదములు.

దాదాపు 5 పండ్లకుపైగా నాకీపరిష్కరణకార్యమునందు అన్నివిధముల సహాయకుడుగా చేయూతనిచ్చుచు, శ్రద్ధావిధేయతలు తనసొమ్ములుగా పనిచేయుచున్న చి॥ J. బాలసుబ్రహ్మణ్యం, M.A కును, అచ్చుపని వీలైనంత నిర్దుష్టముగా కొనసాగించు నేర్పరులగు అచ్చుకూర్పరులకును నా మంగళాశాసనములు.

నాబుద్ధికి తగినంతగా జరిగిన ఈ పరిష్కరణములో గుణ-దోషములను గమనించినపెద్దలు దోషములు తెలిపినచో పైపై పరిష్కరణములందు మెలకువగలిగి వుండగలమని మనవి.

వాగ్వ్యద్ధే సోమనాథస్య రంగనాథకవేస్తథా
ప్రత్యర్థినః పరాభూతాః యేన తం నౌమి దేశికమ్॥

ఇట్లు
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషలాఫీసరు,
అన్నమాచార్య వాఙ్మయమ్,
తి. తి. దేవస్థానములు.

తిరుపతి,
29-3-84.

శ్రీరస్తు

శ్రీతాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు.

## 31 వ సంపుటము.

[స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు-నేఁటి క్రోధిసంవత్సరమందు శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన-పదారుయేండ్లకు తిరువేంగళనాథుఁడు ప్రత్యక్షమైతేను, అది మొదలుగాను శాలి-వాహనశకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ-బహుళ ౧౨ నిరుధానకు ౧ తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగారసంకీర్తనలు.]

రేకు:- 1501 మాళవిగౌళ

నీవు మొదలిజాణవు నీకంటే జాణలు వారు
కావరపు నిన్నుఁ జూచి కన్నుల నవ్వేరు ॥పల్లవి॥

గుట్టున నెవ్వతెనో కూడవలసి యందరి-
నట్టే పనులు చెప్పి యంపేవు నీవు
నెట్టనఁ గొంద రిందులో నీతలఁపు తా మెరిఁగి
చుట్టి చుట్టి నీవద్దనే సుద్దులు చెప్పేరు ॥నీవు॥

---

౧. ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. అనాఁడు కడపటి దినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన 'సరియగు' అను నర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరికొండవెంగ-మాంబగారి ప్రయోగము దీనికి సహాయపడుచున్నది'. సాహిత్య అకాడమీవారి 'విష్ణుపారిజాతము' 55 పుట. నేనీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, "నిఱుత్తం" అను నరవ పదముగూడ 'నిలుపు' అను నర్థముతో దీనికి సహాయపడుననిరి.

పొద్దున నెవ్వరింటికో పోవలసి ఇంటివారి
నిద్దురలు వొమ్మనేవు నెమ్మది నీవు
వుద్దండపుకాంత లిది వూహించి తాము దెలిసి
వొద్దికతోఁ బాదములు వొత్తేరు నీకును ॥ నీవు ॥

సందడి నెవ్వతెతోనో సరసమాడవలసి
అందరి వసంతాలాడుమనేవు నీవు
ఇందె శ్రీవేంకటేశ నే నెఱిఁగితేఁ గూడితివి
విందుచెప్పి కొందరైతే వేడుకఁ గూడేరు ॥ నీవు ॥ 1

## బౌళిరామక్రియ

ఎడఁగొల్లకత్తె నీకె నేమందును
నడుమఁ జుట్టరికాలు నడపీఁ దాను ॥ పల్లవి ॥

వంచనతో విందుచెప్పి వడి నిన్నుఁ దోడితేఁగా
కంచముపొత్తుకు నీకె గాచుకున్నది
మంచముపై నే నిన్ను మరి కూచుండఁబెట్టితే
లంచము మోవినియ్యా లాఁచీఁ దాను ॥ ఎడఁ ॥

పైకొని నీచేతికి బాగా లొసఁగితేను
ఆకుమడిచియ్యా నీకె అమరినది
చేకొని పవ్వళించఁగఁ జేసి నిన్నాదరించితే
జోకల తాఁ బాదాలొత్తఁ జోటుచేసుకున్నది ॥ ఎడఁ ॥

నేను నీవు కాఁగిటిలో నెయ్యము సలుపఁగాను
ఆనించి తనచన్నుల నంటుకున్నది
పూని శ్రీవేంకటేశుఁడ పొంది నే సేసవెట్టఁగా
కానిమ్మని కంకణము గట్టీఁ దాను ॥ ఎడఁ ॥ 2

వరాళి

నంటున రెండువిధాలు నడపీఁ దాను
ఇంటచుట్టమైనవాఁడు సారె నేఁచనేఁటికే ॥పల్లవి॥

నాతో మాటలాడి ఇట్టే ననుపు సేసినవాఁడు
యేతుల నెవ్వతెఇంటి కేఁగఁగనేలే
చేరికి లోనైనవాఁడు సేవగొనుఁగాక తాను
కాతరానఁ బరాకులుగాఁ దనకేఁటికే ॥నంటు॥

నామోము చూచి నేఁడు నవ్వులు నవ్వినవాఁడు
వేమారు విన్నపాలు వినఁగనేలే
కామించి నావద్దికి గక్కున వచ్చినవాఁడు
చేముట్టి సంగడివారిఁ జెనకఁగనేఁటికే ॥నంటు॥

గట్టిగా నన్నుఁ గాఁగిటఁ గలసినయట్టివాఁడు
అట్టుసేసి యొకతె కాఁడి గానేలే
ఇట్టె శ్రీవేంకటేశుఁ డితఁడే నన్ను మన్నించె
గుట్టుతోడ నేమిటికిఁ గొంక నీఁకనేఁటికే ॥నంటు॥ 8

దేసాళం

అప్పుడు పరాకైవుండె నది యెఱఁగవు నీవు
ఇప్పు డాకె గనుఁగొని యేమనునో ఇఁకను ॥పల్లవి॥

కప్పురపువసంతము కలికి నీపై నాడఁగా
దప్పిదేరె నక్కడిబడలిక వాసె
కొప్పు ముడుచుకో ఇఁకఁ గొనగొంగు చెరువుకో
చొప్పు లాపె గంటేను సూడువట్టీ నిన్నును ॥అప్పు॥

గక్కన నీవు రాఁగానే కాంత పన్నీరు చల్లఁగా
చెక్కుచెమటెల్లా జారె నేదలుదేరె
చక్కదిద్దుకొ సామము చందన మలఁదుకో
వెక్కసా లివెల్లాఁ గంటే వెంగెమాడీ నిన్నును ॥ అప్పు ॥

దగ్గర నీవు గూచుండేతరి పూవుల వేయఁగా
సిగ్గియలఁత దేరె కాఁకలు మానె
యెగ్గులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సిగ్గరి యాపె గంటేను చిమ్మిరేఁచీ నిన్నును ॥ అప్పు ॥ 4

ఆహిరి

ఇద్దరుఁ గదిసినారు యెదురుబడి నున్నారు
పొద్దువొద్దునకు మిమ్ము బోదించవలసె ॥ పల్లవి ॥

పిలిచీ నూఁకొనరాదా ప్రియురాలు నిన్నునిట్టె
తలయెత్తి చూడరాదా దండ నున్నది
బలిమిఁ బెనఁగరాదా పంతములే నెరపీని
చెలులముగన నేము చెప్పకుండరాదు ॥ ఇద్ద ॥

నవ్వీ మారు నవ్వరాదా నలినాక్షి నిన్నుఁజూచి
జవ్వన మంటఁగరాదా సమ్మతించీని
పువ్వుల వేయఁగరాదా పొంచి సరస మాడీని
ఇవ్వల నేమిటు మిమ్ము యెచ్చరించఁదగును ॥ ఇద్ద ॥

కలసిఁ బెండ్లాడరాదా గక్కనఁ బానుపుమీఁద
తలఁపు చేకొనరాదా తమకించీని
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
లలి నొడఁగూర్చి మిమ్ము లాలించే మిఁకను ॥ ఇద్ద ॥ 5

బౌళి

నలినాక్షులకెల్లాను నవ్వు వచ్చీని
వెలుచుసరసములఁ బెడరేఁచ కిపుడు ॥పల్లవి॥

కలకలనగవులు కాంతాళపుతగవులు
నలిపే వందరితోను సారెసారెకు
తెలిసెను నీజాడలు తేటతెల్లమిగాను
పలుకుల నిఁక నేమిఁ బచారించ కిపుడు ॥నలి॥

మంతనపుఁబ్రియములు మాటలలో నయములు
వింతలుగా నెరపేవు వీదులనెల్లా
దొంతులై నిలిచె నవె తొల్లె నీనేరుపులు
సంతలఁ బెట్టి యమ్మకు చాలుఁజాలు నిపుడు

జవ్వనపుమదములు సమరతి ముదములు
నివ్వటిల్లఁ జూపేవు నెమ్మది నీడ
ఇవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
రవ్వలాయ వఃపు పేరడిఁబెట్ట కిపుడు ॥నలి॥ 6

రేకు 1502 పాడి

ఏమి చెప్పినాఁ జేసేను యెగ్గా నాకు
వేమారు నెంతచేసినా వెంగెమా నాకు ॥పల్లవి॥

చేరి నన్ను వేఁడుకొని చెక్కు నొక్కరాఁగాను
సారెసారెఁ బెనఁగఁగ చలమా నాకు
గారవించి నీవు నన్నుఁ గతలు చెప్పుమనఁగా
వూరకే వుండఁగ నీతో వొరటా నాకు ॥ఏమి॥

అగపడి మంచిమాట లాడఁగానే వేగిరించి
యెగసక్కెలాడ నీతో యెమ్మెలా నాకు
నగుతా నీవు నన్ను నమ్మించి బాస లియ్యఁగా
పగటులు పచరించ పంతమా నాకు ॥ఏమి॥

పోదిసేసి విడెమిచ్చి పొందు నీవు నడపఁగా
కాదు గూడదన నీతో గర్వమా నాకు
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సాదించ నీతోడ రాజసమా నాకు ॥ఏమి॥ 7

సామవరాళి

ఎందాఁకా మూసిమంతనా లేల సేసేవు
పందెగాఁడవై నీవే పడితళించరాదా ॥పల్లవి॥

అంకెల నీవద్ద నుండి యాపెయాడేమాటలెల్లా
వంకలొత్తి చక్కదిద్దవలెనా నీవు
పొంకముగా నేరకుంటే పూనుక నీవే వచ్చి
తెంకి నుండి మాతోను దీకొనఁగరాదా ॥ఎందాఁ॥

చుట్టిచుట్టి యాపె నాతో జూజాలాడి యోడఁగాను
రట్టుగా నెత్తులు చెప్ప ఇట్టె వలెనా
నెట్టన నీ కంతేసి నెఁ(నెం?)తెరివి గలితేను
పట్టి నీవె సారెలు పన్నుకొనరాదా ॥ఎందాఁ॥

ముంచి నా కాపె చెల్లెలై మొక్కనేరక వుండఁగా
వంచనఁ జేతులు కూడ వంచేవు నీవు
యెంచఁగ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
కొంచి యాపె యుండితే నీకు మొక్కించుకోరాదా ॥ఎందాఁ॥ 8

శంకరాభరణం

చెప్పఁగనేఁటికి సేసినమే లిఁక
చొప్పుగ నీవే చూచుకొనేవు ॥పల్లవి॥

కన్నియ మాఁటల కసరఁగనోపక
సన్నలనే నిను జరసీని
అన్నిట ప్రౌఢవయసుదయితేఁగన
మొన్నటిసేఁతకు మొగమోడీనా ॥చెప్పఁ॥

బాలకి నీతో పంతము నెఱపక
వాడిక చూపుల వడి సొలసీ
యీలాగున నీయీడుదియైతే
నాలితనమున వెనకతీసీనా ॥చెప్పఁ॥

జవ్వని బొమ్మల జంకించనోపక
యివ్వల నిన్నిపు డెనసె నిదే
చివ్వన వింతది శ్రీవేంకటేశ్వర
రవ్వలు సేయక రతిఁ గొంకీనా ॥చెప్పఁ॥ 9

సామంతం

ఏమి సేయవచ్చునయ్యా యిల్లాండ్ల కివియేల
వేమారు నిటువంటివే వేడుకాయ నీకును ॥పల్లవి॥

కెలయుచు నింతి నీతో కిమ్ములు సారె నాడేటి—
పెలుచుమాటలు నీకుఁ బ్రియమాయను
బలిమిఁ బెనఁగి నీతోఁ బైకొన్న సరసముల—
చలపాదితనములు చవులాయను ॥ఏమి॥

కేరుచు నాపె నేఁడు కెలన నవ్వులు నవ్వె
ఆరజములే నీకు ననువాయను
చేరి చేరి యప్పటిని చేతిమీఁదఁ జేయివేసి
వీరపుపందెములే ప్రియమాయను ॥ఏమి॥

కందువఁ గాఁగిటఁ గూడి కమ్మటి నాకెకు నీకు
సందడిఁ బచ్చిసేఁతలే సాజమాయను
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
విందులు మోవితేనెలు వీడుదోళ్లాయను ॥ఏమి॥ 10

మాళవిగౌళ

నెమ్మది నుండవయ్యా నీకు నంతా సంతోసమే
సమ్మతించకుండరాదు సవతుల కిఁకను ॥పల్లవి॥

ముప్పిరిగొనఁగ నీవు మోహించిన కామినులు
చప్పనిమాట లాడినా చవిపుట్టును
యెప్పుడు నీకొలువున నెడయకుండేవారు
తప్పులెంచి కొసరినాఁ దమి రేఁగును ॥నెమ్మ॥

కోరి వేఁడి నీవుదెచ్చుకొనినసతులు నిన్ను
చేరి యేసేఁత సేసినాఁ జిత్తమువచ్చు
మేరమీరి నీచనవు మెరసినయట్టివారు
వీరము లెంతచూపినాఁ బ్రియములై తోఁచును ॥నెమ్మ॥

మంతనాన నీ వెప్పుడు మన్నించేకాంతలు
పంతా లెంతనెరపినా శాఁతులై యుండు
ఇంతలోన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వింతవా రెట్టునవ్వినా వేడుక వొడమును ॥నెమ్మ॥ 11

పాడి

బహుపరాకులు నీకు పనులెన్నైనాఁ గలవు
తహతహాలెల్లా మాని తలఁచుకో పొందులు ॥పల్లవి॥

కప్పుర మాపె యంపఁగాఁ గానుకిచ్చి పొడగంటి-
నిప్పుడు నావిన్నపాన కేమంటివి
ముప్పిరిగొని వున్నారు ముందర నావంటివారు
తప్పక నామోము చూచి తలఁచుకో పొందులు ॥బహు॥

చెంది యాపెలేఖలు నీచేతికి నే నియ్యఁగా నీ-
వందుకొన్నందుకు నడియాల మేది
యెందరైనా వచ్చి చెలు లింతకతొల్లె వున్నారు
[1]దండిగా(దండడి?) నారాకెఱిఁగి తలఁచుకో పొందులు ॥బహు॥

నెచ్చెలి పిలువుమనె నిన్ను శ్రీవేంకటేశ నే-
వచ్చినపనికి నీవు వచ్చేదెపుడు
రచ్చ నిందరు నున్నారు రతి కింతలో వచ్చి
తచ్చి యాకెఁ గూడితివి తలఁచుకో పొందులు ॥బహు॥ 12

రేకు 1503 సామంతం

చూచుకో ముందటిపని నూటిదప్పకుండాను
యేచి యీకెగుణమెద్దో యెఱుఁగముసుమ్మీ ॥పల్లవి॥

నమ్మికిచ్చి యాపెఁదెచ్చి నామొగము చూచి నీవు
కమ్మటి లోఁగుచు నిచ్చకము సేసేవు
దిమ్మరిమాటల యాపె దిక్కుల నీసుద్ది వింటే
యెమ్మెల నేమిసేసునో యెఱుఁగముసుమ్మీ ॥చూచు॥

1. ప్రాసభంగము.

పానుపుపై నా కెఁ బెట్టి పక్కననుఁ దెరవేసి
పూని నే రాఁగా నాతో పొందుసేసేవు
నానాబుద్ధులెరిఁగిననాతి యాపె ఇందుకుఁగా
యీ(యే?)నెపాన సాదించునో యెఱఁగముసుమ్మీ ॥చూచు॥

వొద్దికతో నాపెఁ గూడి వొడివట్టి నేఁ దియ్యఁగా
బుద్ధిచెప్పి నన్ను నేలి బుజ్జగించేవు
అద్దిరా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
ఇద్దెస నెట్టొరసునో యెఱఁగము సుమ్మీ ॥ చూచు ॥ 13

ఆహిరి

ఇప్పటికోపము మీకిట్టె వుండీనా
చొప్పుగా నాతఁడు నీవు నొక్కటే కాదటవే ॥ పల్లవి ॥

గుట్టుతోడ నీ విభుఁడు కొంగువట్టి తీసితేను
పెట్టరానివొట్టులేల పెట్టేవే నీవు
చుట్టమై తనముచ్చట సుద్దులు నీకుఁ జెప్పితే
వట్టితప్పులెల్లా వేసి వాదింతురటవే ॥ ఇప్ప ॥

పాయలేక యీతఁడు నీపై బత్తిసేసితేను
చేయరానిచేఁతవేల సేసేవే నీవు
నీయెడకు బాఁతిపడి నెయ్యములు చూపితేను
చాయలా సన్నలాఁజూచి చండిసేతురటవే ॥ ఇప్ప ॥

ఇవ్వల శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడితేను
నవ్వరాని నవ్వులేల నవ్వేవే నీవు
పువ్వులదండలు నీ కొప్పునఁ గడుజుట్టితేను
రవ్వగా నాతనిసిగ్గు రచ్చవేతురటవే ॥ ఇప్ప ॥ 14

పాడి

ఏల కొత్తలు సేసేవు ఇప్పుడే నాతో
మేలుతోడిదాననౌత మిక్కిలి నెఱఁగవా ॥పల్లవి॥

కనుచూపులనే చూచి కాఁక లెంత చేసేవు
ననుపు చూపి యెంత నమ్మించేవు
మనసులు సోదించి మర్మమేల వెదకేవు
యెనసి మోహించిన దెఱఁగవా నీవు ॥ఏల॥

తరితీపులనుఁ బెట్టి తమకమేల రేఁచేవు
పొరుగున నుండి యేమి పొద్దువుచ్చేవు
సరసములే యాడి చవులెంత మరపేవు
ఇరవైనదాననౌత యెఱఁగవా నీవు ॥ఏల॥

ఆసలనే చిక్కించి ఆయము లేఁటి కంటేవు
సేసవెట్టి నీవెట్టు సిగ్గుదేర్చేవు
వాసితో నన్నేలితివి వరుస శ్రీవేంకటేశ
యీసరి నలమేల్మంగ నెఱఁగవా నీవు ॥ఏల॥ 15

వేళావళి

ఎఱఁగనట్టున్నాఁడవు యేల దాఁచేవు పొందులు
మఱఁగున నింతి నిట్టె మన్నించరాదా ॥పల్లవి॥

చిటికిమాటికి నాపె సిగ్గులువడీ నీతో
గాటమైన నీదేవులు గాఁబోలును
మూటిదప్పకుండా నిన్నే చూచీ నప్పటి నాపె
బాటగాఁ దమకమెల్లాఁ బైకొనఁగఁబోలును ॥ఎఱఁ॥

నానఁబెట్టి ముసిముసినవ్వులు నవ్వీ నాపె
కానీలే నీయెరుకది గాఁబోలును
అనుకొని నీమాటలే ఆలకించి వినీ నాపె
వూని తన ఆసలెల్లా వుప్పొంగఁబోలును ॥ఎఱఁ॥

అంది నీవురముమీఁద నటు నెలకొనె నాపె
కందువ నలమేల్మంగ గాఁబోలును
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అందాలు చేసీఁ దాను అరుదుగాఁబోలును ॥ఎఱఁ॥ 16

ముఖారి

కంటిమిగా యీ వేడుకలు నే మెల్లాను
నంటున మీకెటువంటిననుఁపులో ఇపుడు ॥పల్లవి॥

ఘొనసి యాకె. నీవు నిద్దరు నుండఁగఁ జూచి
మనసొక్కటాయ నేఁడు మాకెల్లాను
మునుపటివలెఁ గాదు మొగములఁ గళలుబ్బె
వనితకు నీకు నెటువంటిసంతోసములో ॥కంటి॥

అలుకలుదేరి మేలమాడఁగా మిమ్మిటు చూచి
నెలవుల నవ్వు వచ్చెఁ జెలుల కెల్లా
చలముల మీవొట్లసడి వాసె సిగ్గుదేరె
తలపోఁత లెటువలెఁ దారుకాణ లాయనో ॥కంటి॥

వరుసతో రతి చేసి వచ్చి మీరాక చూచి
అరుదాయ సవతుల కందరికిని
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
దొరసి కూడితివి మీతొంటిపొందు లెట్టివో ॥కంటి॥ 17

ధన్నాసి

ఆసపడి వాసులెంచ నది యేఁటికే
పాసివుండలేనివాఁడు పదరఁగనేఁటికే ॥పల్లవి॥

తప్పక చూచినవాఁడు దండకు రావలెఁగాక
చిప్పిలఁ గలలోనే సిగ్గులేఁటికే
కొప్పు దువ్వినవాఁడు యిక్కువ లంటవలెఁగాక
దప్పిదేరేమోవితోడ తలవంచనేఁటికే ॥ఆస॥

మేలమాడినవాఁడు కామించి కూడవలెఁగాక
యీలాగు సెలవినవ్వు లిపుడేఁటికే
కాలుదొక్కినవాఁ డిట్టె కరఁ గించవలెఁగాక
తాలిమితో సారెసారెఁ దలపోఁత లేఁటికే ॥ఆస॥

చేరి పెండ్లాడినవాఁడు చెనకఁగవలెఁగాక
ఆరితి కాఁకల నలయఁగనేఁటికే
వూరకె శ్రీవేంకటేశుఁ డొద్దికతో నన్నుఁ గూడె
తారసిలె వలపులు తడఁబాటులేఁటికే ॥ఆస॥ 18

రేకు 1504 ముఖారి

రమణుఁడు మమ్మేల రవ్వసేసీనే
సముకాన నుండితేనే చవిపుట్టీనా ॥పల్లవి॥

బలిమిసేసి యెంత పలుమారు నవ్వినాను
వలపు గలంతేకాక వచ్చేదేమి
చలపట్టి యెన్నేసిసరసము లాడినాను
పిలువనిపేరటము ప్రియమయ్యీనా ॥రమ॥

తలిగొని యెంత మొక్కి తమితోడఁ బెనఁగినా
యితవు కొలఁదేకాక యెక్కుడున్నదా
నుతికెక్కి నెన్నేసి కానుకలు చేతికిచ్చినా
అతిరాజసమె కాక అంకెకు వచ్చీనా ॥ రమ ॥

వేడుకతో నొడివట్టి వేమారుఁ దీసినాను
వాడికగలట్టె కాక వసమయ్యీనా
యీడనె శ్రీవేంకటేశుఁ డేలె నింతలోనె నన్ను
వీడనిపొందులు మరివెగటయ్యీనా ॥ రమ ॥ 19

హిందోళవసంతం

వెరగంది వున్నదాన విభు నేమీ ననలేక
చురచురఁ బంతాలాడీ చోద్యమయ్యీనే ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమట గారె సిగ్గులు మోమునఁదేరె
యెక్కడిమాటలు పతి నేమనేనే
పక్కలు గట్టెను మోవి పైకొనెఁ గన్నులకావి
తక్కక నాతో నిఁక తా నేమనీనే ॥ వెర ॥

నెఱులకొప్పు వదలె నిట్టూర్పులు పొదలె
యెఱఁగి యుండియుఁ దను నేమనేనే
తలచాయ నలపులు తలిగొనె వలపులు
తలివచ్చె రతులకు తానేమనీనే ॥ వెర ॥

సెలవినవ్వులు మించె చిత్తము చెంగలించె
యెలమి శ్రీవేంకటేశు నేమనేనే
నలిరేఁగి పందెమాడె నన్నుఁ గాఁగిటఁ గూడె
తలఁగరా దిఁక నెందూ తా నేమనీనే ॥ వెర ॥ 20

పాడి

చిత్తమెఱిఁగి సేవలు సేయుటగాక
హత్తి నీతోడఁ బెనఁగి అలయించఁదగవా ॥పల్లవి॥

యెంతచనవరినైనా యింతి నింతె నీకు నేను
చెంత నీమోవి యెంగిలిసేయవచ్చునా
వింతసతు లెఱుఁగక వెక్కసానఁ బైకొనినా
పంతమాడి ఇందరిలోఁ బచ్చిసేయఁదగవా ॥చిత్త॥

నీవెంత మన్నించినా నే నూడిగపుదాననే
వేవేలైనాఁ గాలు నీపై వేయవచ్చునా
కావరించి నిన్ను జారకామిను లెట్టుచేసినా
యీవిధాన మాకునెల్లా నెమ్మె చూపఁదగవా ॥చిత్త॥

అక్కున నెంత వుండినా అలమేలుమంగ నేను
వుక్కువంటిచన్నుల నిన్నొత్తవచ్చునా
యెక్కడివారు నీకున్నా యేలితివి నన్ను నేఁడు
గక్కున శ్రీవేంకటేశ కడుమీరఁదగవా ॥చిత్త॥ 21

లలిత

ఇంత వెలవేల నియిచ్చరాఱువు
పంతము మెరసి నిన్నుఁ బంగించమా ॥పల్లవి॥

చేసినచేఁతలు నీకు చెల్లవలెనని వట్టి—
బాసలు సేయకుమీ పలుమారును
సేసవెట్టితివి తొల్లె చేకొంటిపి నీవారము
యేసుద్దులు గలిగినా యెగ్గు లెంచేమా ॥ఇంత॥

మనసున నీ పనులు మఱవవలసి నాకు
వినయాలు సేయకుమీ వెల్లవిరిగా
వొనరఁ నేఁ జిన్ననాటనుండి నీ కిచ్చకురాల
నినుఁ జూచిచూచి నేరము లెంచేమా ॥ ఇంత ॥

సురతములో నిన్నక్కడిచొవ్వు లెత్తకుండాను
పరవశ జేయకుమీ పక్కన నన్ను
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
గరిమ నన్నేలితివి కాకుసేసేమా ॥ ఇంత ॥ 22

## భైరవి

నీవై నా విన్నవించవే నిష్ఠూరము గాకుండాను
తావుకొన్న మొగమోట తలఁచు నా కిపుడు ॥ పల్లవి ॥

చెప్పఁజాలఁగాక తాను సిగ్గువడినంటాను
అప్పటనుండి నందరు నాడేమాటలు
తప్పనిబొంకనియట్టిదంటయై తానున్నాఁడు
వొప్పుగ నే వెరగంది వుందాననే యిపుడు ॥ నీవై ॥

మందలించఁజాలఁగాక మనసు నొచ్చినంటాను
గొందిసంది తనమేనిగురుతులెల్లా
చందాలుసేసుక ఇట్టె సాదువలె నున్నాఁడు
అందుకే నే నవ్వి నవ్వి యలసితి నిపుడు ॥ నీవై ॥

యెచ్చరించఁజాలఁగాక ఇంతలో లోఁగినంటా
రచ్చలకెక్కినతనరతులెల్లాను
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగక నేను
మచ్చికతోఁ దన్నుఁ గూడి మరిగితి నిపుడు ॥ నీవై ॥ 23

గౌళ

ఇంక నేడసుద్ది నీవు యెవ్వరికి లోనయ్యేవు
సంకెవిడిచినమీఁద సంగతౌనా దూరను ॥ పల్లవి ॥

చక్కఁదనములు చూపి జాణతనములె యాడి
చిక్కించుకొనెఁగా నిన్ను చిత్తిణి యాపె
ఇక్కువ లంటి నిన్ను నెవ్వరు తమి రేఁచినా
కక్కసమై వుండుఁగాక కరఁగీనా మనసు ॥ ఇంక ॥

మోవితేనెలు కురిసి ముసిముసినవ్వు నవ్వి
కైవసము చేసుకొనెఁగా నిన్నాపె
భావించి యెవ్వతెకైనాఁ బనికివచ్చేవా నేఁడు
నీవోజ నిలుచుఁగాక నేర్పులు వచ్చీనా ॥ ఇంక ॥

పూడిగాలెల్లఁ జేసి వూరకే చన్నుల నొత్తి
కూడెఁగా శ్రీవేంకటేశ కోరి నిన్నాపె
యీడ నలమేలుమంగనయిననన్ను నేలితివి
వెనుకై వుందువుగాక వింతగాఁ జూచేవా ॥ ఇంక ॥ 24

రేకు 1505 ఆహిరి

మాటలైనా నాడరాదా మనసిచ్చి
చోటిచ్చి పిలువరాదా చుట్టమైనవాఁడవు ॥ పల్లవి ॥

తలితో ని వింతలోనే తలవంచుకుండనేల
తెలివ నీకు మొక్కి దీవింఁరాదా
యెఱుఁగునో నీమర్మము లేమైనా నీకె తొల్లి
వెలవనేఁటికి నీవు వేడుక కాఁడవు ॥ మాట

వింతవా రున్నారంటా వేడుక దాఁచఁగనేల
ఇంతి బత్తిసేసీఁ జనవియ్యఁగరాదా
చెంతనుండి ఇప్పుడే సిగ్గయ్యీనో నీకేమైనా
చింతించనేఁటికి సిరిగలవాఁడవు ॥మాట॥

తలపోసి లోలోనే తమక మణఁపనేల
చెవియ పందెము వేసీఁ జెయ్యొగ్గరాదా
అలవేలుమంగ నేను అన్నిటా శ్రీవేంకటేశ
కలసితి గుట్టేఁటికి కతకాఁవాఁడవు ॥మాట॥ 25

బౌళి

ఏఁటికి వెరగువడే వెఱఁగని వానివలె
చాటిచెప్పి సణఁగులు చల్లనా నేను ॥పల్లవి॥

మంతనాన మీరిద్దరు మాటలాడుకొనఁగాను
వింతలుగా వీనులార విననా నేను
యింత సేసితినిసుమ్మీ ఇఁక లేదనకుమని
చెంతనుండి నీకెఱఁగఁ జెప్పనా నేను ॥ఏఁటి॥

యెనసి నీవో నాకె ఇట్టె కాఁగిలించుకోఁగా
ననుపులు(ల?)మిమ్ముఁ జూచి నవ్వనా నేను
కనుఁగొంటిఁజుమ్మీ మీతగవు మఱవకుమని
వొనర నీచెక్కు నొక్కనా నేను ॥ఏఁటి॥

వోవరిలో మోవితేనె లొకరొక రిచ్చుకోఁగా
మీవద్దనే కూచుండి మెచ్చనా నేను
శ్రీవేంకటేశుఁడవు జిగి నలమేల్మంగను
చేవదేరఁ గూడి సేవసేయనా నేను ॥ఏఁటి॥ 26

వరాళి

నా మొగము చూచి యెంత నగుతా సిగ్గువడేవు
కామించినవాని నిన్ను కాకుసేసేనా ॥పల్లవి॥

వెక్కుసతులను నీవు పెండ్లాడి వచ్చితివంటా
వెక్కసాన నిన్నుఁ గడు వెంగెమాడేనా
చిక్కించుక వారు నిన్నుఁ జెలరేఁగి తిట్టిరంటా
అక్కడా నిక్కడా నిన్ను నాడుకొనేనా ॥నామొ॥

హాదవారితోడ నీవు వసంతాలాడేవఁటా
జాడ గాదని నిన్ను సాదించేనా
వాడిక నాసందడిలో వారికాళ్లు దాఁకెవంటా
యీడ నిన్ను గేలిసేసి యెత్తిపెట్టేనా ॥నామొ॥

కన్నవారినెల్లా నీవు కాఁగిటఁ గూడితివఁటా
సన్నలా చాయలా నిన్ను జంకించేనా
అన్నిటా నలమేల్మంగ నైననన్ను నేలితివి
చెన్నుగా శ్రీవేంకటేశ సిగ్గువడచేనా ॥నామొ॥ 27

గుజ్జరి

కోపగించి పతినేల కొసరేరే చెలులాల
మాపుదాఁకా సొలసినా మతి గరఁగినా ॥పల్లవి॥

నగుతా నేమాడినాను నమ్మికయై తోఁచుఁగాక
మొగసక్కెలాడితేను ఇయ్యకోలౌనా
తగులమి గలిగితే తలఁపు గలుగుఁగాక
మొగము చూడకుండితే మోహా మేడుండునే ॥కోప॥

సరవితోఁ బిలిచితే సమ్మతించవచ్చుఁగాక
బిరుదున గద్దించితే ప్రియమయ్యీనా
సరిమేను సోఁకితేను చవులెల్లాఁ బుట్టుఁగాక
విరసాన వీఁగితేను వేడుకేడ నుండునే ॥కోప॥

ననుపై నడచితేను నాఁటుఁగాక మోహము
కొనగొన నుండితేను కూటమబ్బీనా
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
ననుఁ గూడె నలుక మానక యేల వుండునే ॥కోప॥ 28

## రామక్రియ

ఇన్నాళ్లవలెఁ గాదు ఇటు నీవుండేలాగు
అన్నిటా నీకు నతఁడే అసమిచ్చెనా ॥పల్లవి॥

చెలరేఁగి చెలరేఁగి చిరునవ్వులు నవ్వేవు
మలసి ని న్నతఁ డట్టె మన్నించెనా
కళదేరి నీమోము గర్వము నీకెక్కుడాయ
అలరి యీపెద్దరిక మాతఁడే వొసగెనా ॥ఇన్నా॥

ఆళాపించి ఆళాపించి అట్టె పాటలు వాడేవు
లాలించాతఁడు నీతో మేలము లాడెనా
రాలీఁ గొప్పున విరులు రాఁపుకత్తె వై తివి
ఆలే యీమురిపెము లాతఁడే నేరిపెనా ॥ఇన్నా॥

పవళించి పవళించి పానుపుపై నలసేవు
కవగూడెనా శ్రీవేంకటేశ్వరుఁడు
ఇవల నలమేల్మంగ నిటు తా నన్నేలినాఁడు
అవసరించేవు నీకు నాతఁడే రమణుఁడా ॥ఇన్నా॥ 29

భైరవి

నగుతా నీయిచ్చకొద్ది నడతుఁగాక
  యెగసక్కెముగా నీతో యీసడించేనా ॥పల్లవి॥

తలఁచుకో బాసలని తగవు నడపుమని
  పలుమారు నీతోను పచారించేనా
  పలుకు నమ్మితినని పాసితే దోసమని
  సొలసి యెక్కువెవలె సోఁకనాడేనా ॥నగు॥

చిన్నదాన నేనని చెలులు దూరుదురని
  కన్నచోటుల నే కరకరిఁ బెట్టేనా
  నిన్ను నీవెంచుకొమ్మని నెపమేది లేదని
  విన్నపాలుసేసి నిన్ను వేసరించేనా ॥నగు॥

కూడితివి నీవని కూరిమి చుట్టమనని
  యీడా నాడా నేతులు నే నిటు చూపేనా
  తోడనే శ్రీవేంకటేశ దొరయ నన్నేలితివి
  వాడికె కిట్టే రాఁగా వలపనేనా ॥నగు॥ 80

రేకు 1506 సామంతం

నీకేలే వెలపు నేఁడు సవతులఁ జూచి
  కైకొని కన్నవారిదే కంటి గురుమగాదా ॥పల్లవి॥

నిలుచున్నాఁ డదివో నీయెదుట రమణుఁడు
  పిలిచి పీఁటవెట్టవే ప్రియురాలవు
  తొలుతనే యాతఁడు పొత్తులమగఁడైతే నేమి
  వలచినవారిదే వలపింతేకాక ॥నీకే

మాటలాడీ నదివో మనసిచ్చి అతఁడు
పాటించి పూఁకొనవే పలుమారును
కూటమికి తావచ్చి గుట్టున నుంచే నేమే
వాటమైనచోటికి వచ్చుఁగదే నీరు ॥నీకే॥

చేరవచ్చె నదివో శ్రీవేంకటేశ్వరుఁడు
గారవించి కాఁగిటఁ గలయఁగదే
వారకపురతిఁ బరవశ మీఁడై తేనేమే
తారుకాణయినచోట తమిరేఁచుఁగదవే ॥నీకే॥ 31

మాళవిగౌళ

తప్పక యేమి చూచేవు తగ నాదిక్కు
యెప్పుడును నీవోజలేల మానే విపుడు ॥పల్లవి॥

ఆకె నీవు నేకతాన నాడుకొన్నమాటలెల్లా
మాకుఁ జెప్పేవా నీవు మాపుదాఁకాను
మైకొని నాకాతరాన మఱచి నే నడిగితే
యీకడ నమరఁజెప్ప కేల మానే విపుడు ॥తప్ప॥

సిగ్గుదేరి రతివేళఁ జేసుకొన్న మీచేఁతలు
తగ్గి దాఁచుకొనక ఇంతటఁ జూపేవా
వెగ్గళించి తమకాన వెరవక సోదించితి
యెగ్గులేకొడఁబఱచ కేల మానే విపుడు ॥తప్ప॥

కలసినప్పటి మీలోఁగలిగినవేడుకలు
నలిరేఁగి నేరిపేవా నన్నేలితివి
మెలఁగి శ్రీవేంకటేశ మిక్కిలి నిన్నొరసితి
యెలమి సమ్మతిసేయ కేల మానే విపుడు ॥తప్ప॥ 32

వరాళి

నెమ్మది నిచ్చకాలాడ నేఁడు గలిగితివిగాక
నమ్మిక నా కియ్యఁగా సన్నల మాన్పవలదా ॥పల్లవి॥

పొంతనే యాతనికిఁగా పూనుక వచ్చేవు నీవు
యెంత బత్తిగలదాన వేమిచెప్పేదే
వింతగా నన్నుఁ బెండ్లాడి వెసఁ దెచ్చుకొనె నాఁడు
మంతనాన వద్దనక మరియెందు వోతివే ॥నెమ్మ॥

పాడితోడ నాతనిపలుకు చెల్లఁబెట్టేవు
యేడ నేరుచుకొంటివే నీ వీసుద్దులు
తోడివారిలో నన్ను దొరకత్తెఁ జేసేవేళ
ఆడ వచ్చి బుద్ధిచెప్పి అడ్డగించవలదా ॥నెమ్మ॥

వొక్కటై శ్రీవేంకటేశునొద్దఁ గాచుకుందానవు
యెక్కడే నీయాసోద మిందరిలోనా
గక్కన నన్నేలినాఁడు కాఁపురము సేయఁగాను
తొక్కవైతివి పాదము తోడఁబడ నీవు ॥నెమ్మ॥ 33

కాంబోది

ఇంక నేడసుద్దులు యెవ్వరు నేమిచెప్పేరు
వంకలొత్తి మూడిఁబొచ్చి వాత వెళ్లివత్తునే ॥పల్లవి॥

వొల్లనే వద్దఁ గూచుండి వొనగూడ మాటలాడి
బల్లిదురాలవైతివే పతియెదుటను
అల్లన నీవు గోరినట్టాతఁడు నీసొమ్మాయ
చెల్లునే ఇంతటా నీకుఁ జేసినట్లెల్లాను ॥ఇంక॥

మచ్చికఁ బాదములొత్తి మంచముమీఁదట నెక్కి
అచ్చమై యాతనికి నిల్లాలవై తివే
కచ్చుపెట్టి యాతఁడు నీకై వశమైవున్నవాఁడు
అచ్చివచ్చునే నీకు నాతనిపై వలపు ॥ఇంక॥

పిడెమిచ్చి తమిరేఁచి వెలయఁగఁ దెరవేసి
తోడనే కాఁగిటఁ గూడి దొరవైతివే
వోడక శ్రీవేంకటేశుఁ డొద్దికై నిన్నుఁ గూడఁగ
యీడేరితి వౌదువు నన్నితఁడే యేలెఁగదే ॥ఇంక॥ 34

## శ్రీరాగం

అందరిలో నీవు నన్ను నానగొలిపేవుగాక
పొందు నీకే కలిగితే భోగించవా ॥పల్లవి॥

చిత్తము రా నీసేవ సేయఁగలఁగాక నీకు
బత్తి గొట్టానఁ బెట్టేనా పలుమారును
వత్తునంటాఁ జెప్పించేవు వారివీరిచేత నేఁడు
వొత్తి నే నంతక తొల్లి వొద్దంటినా ॥అంద॥

సముకాన నుండి సరసము లాడఁగలఁగాక
తమకము రేఁచేనా తగిలి నీకు
చెమటలు గారఁగాను చేతులు చాఁచేవు నీవు
అమరఁ గాఁగిలించఁగా నౌఁగాదనేనా ॥అంద॥

ననుపు సేసుక నీతో నవ్వు నవ్వఁగలఁగాక
పెనఁగి గుణము చక్కఁబెట్టేనా నేను
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలోనే నన్ను
వొనర కెన్నఁడైనా వొద్దుకొంటినా ॥అంద॥ 35

కన్నడగౌళ

ఏమనఁగవచ్చు నిఁక నింతా నీమహిమలే
ఆముకొన్నవలపు నీ కచ్చివచ్చెఁగా ॥పల్లవి॥

అలరి యాకెకు నెంత ఆసవెట్టితివో నీవు
నెలవుల నవ్వుకొంటాఁ జెలరేఁగీని
నలువంక చనవెల్లా నాకె కలదని వుంటి
కలిగెఁగా నీపె నొకతె నీకు నిపుడు ॥ఏమ॥

మట్టుమీర మరీ నెంత మన్నించితివో నీవు
పట్టెమంచ మెక్కుకొని పాయకున్నది
తొట్టినగర్వము లాడ దొరనై నే నుండానను
నెట్టనఁ దానూఁ గొంత నేర్చెఁగా యీపనులు ॥ఏమ॥

అంది శ్రీవేంకటేశ్వర ఆకె నెట్టు గూడితివో
చిందుఁజెమటల చెలి సిగ్గువడీని
కందువ నిన్నుఁ బెండ్లాడి కైకొంటి సిరులెల్లా
విందువలె తా వచ్చెఁగా వినోదముగాను ॥ఏమ॥ 36

రేకు 1507 సౌరాష్ట్రం

ఆకె యెటువంటిది నా కానతీవయ్యా
చేకొని యిద్దరిఁ బెండ్లిసేసే [1]నిన్నిపుడు ॥పల్లవి॥

పడఁతిచన్నులమీఁద పాదా లద్దుకొంటాను
అడరినకాఁక చల్లార్చుకొనేవు
యెడసి యెవ్వతో నిన్ను యేఁపులఁ బెట్టఁగఁబోలు
కడునీతమక మెల్లా కానవచ్చె నాకును ॥ఆకె॥

---

1 'నే నిపుడు' కావచ్చు.

జలజాక్షిపయ్యద సారెఁ గప్పుకొంటాను
  వొలుకుఁ జెమట తడియొత్తుకొనేవు
  వలపిం చెవ్వతో వుమ్మగిల నిన్నుఁ జేయఁబోలు
  వెలి నీవిరహమెల్లా వెల్లవిరులాయను ॥అకె॥

జవ్వని మోవితేనెలు చవిగొని తొడిఁబడ
  అవ్వలిరతులదప్పి యాఁపుకొనేవు
  ఇవ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
  దవ్వులాకెపొందు లిందె తారుకాణ వచ్చెను ॥అకె॥ 37

## రామక్రియ

ఇందాఁకా రాఁడంటానేల సాదించేవు
  ముందుగా నీ వితనికి మోవి ఇయ్యఁగదవే ॥పల్లవి॥

పిలువఁగఁ బిలువఁగ బిగిసేవు పతితోను
  చలమరితన మేలే సతికి
  చెలపలచెమటలు చెక్కుల వడియఁగ
  అలయుచుఁ బెనఁగీ నతనిఁ జూడఁగదె ॥ఇందాఁ॥

చూడఁగఁ జూడఁగ జుణిగేవు తెరలోన
  జాడదప్పఁగనేలే సతికి
  వాడుమోముతోడ వలపులు చల్లుచు
  యీడనే వున్నాఁడు ఇతనిఁ జూడఁగదె ॥ఇందాఁ॥

చెనకఁగఁ జెనకఁగ శ్రీవేంకటేశునెడ
  చనవియ్యకుండనేలే సతికి
  తనిసి నీకాఁగిటఁ దగ నన్ను మెచ్చి మెచ్చి
  యినుమడి మన్నించె నితనిఁ జూడఁగదె ॥ఇందాఁ॥ 38

కుంతలవరాళి

నీవాళ్లిచేఁతలు నీవు చూచుకొనవు
యీవల నన్నుఁ బొదిగే వేమందు నిఁకను ॥పల్లవి॥

పెదవికెంపులు రేఁగఁ బ్రియములు చెప్పేవు
వెదచల్లునూర్పులతో వేఁడుకొనేవు
మదము దొలఁకఁగాను మచ్చికలు చల్లేవు
యెదుట నిన్నుఁ జూచి యేమందు నిఁకను ॥నీవా॥

వాడుఁబువ్వులు రాలఁగా వచ్చి నాతోఁ బెనఁగేవు
వీడెపునెలవులతో విందుచెప్పేవు
జాడతోడ వలపుల సరసము లాడేవు
యీడ నీసముకమున నేమందు నిఁకను ॥నీవా॥

గందవొడి మైరాలఁగా కాఁగిలించి కూడేవు
సందుకొని మోవితేనె చవిగొనేవు
చిందేటిచెమటతోడ సిగ్గువడక నవ్వేవు
యిందుకు శ్రీవేంకటేశ యేమందు నిఁకను ॥నీవా॥ 39

దేసాళం

చాయవాటుసేసుకొని సరుసఁ గూచుండుఁగాక
నాయములేల పెట్టీనే నాటకపువిభుఁడు ॥పల్లవి॥

కన్నుల జంకించితినా గద్దించితినా బొమ్మల
చిన్నఁబోయి తానేల సిగ్గువడీనే
అన్నువ మోవిమీఁదఁ జిట్టంటుచేఁత లుంచేనేమి
చిన్ననాటిపనులు తీసివేయఁగవచ్చునా ॥చాయ॥

చొప్పులు వెదకితినా సోఁకఁగ నాడితినా
తప్పకచూచి తానేల తలవంచీనే
కప్పిన పచ్చడమెల్లా కడుఁబసపై తేనేమి
యెప్పుడు గలదే తన కేమి సేయవచ్చును ॥చాయ॥

చలము సాదించితినా జంపులు నడపితినా
నలువంకఁ జూచి యేల నవ్వులు నవ్వీనే
యెలమి శ్రీవేంకటేశుఁ డిట్టె తాను నన్ను నేలె
వలపు వెంట వచ్చితే వారించ నేఁటికే ॥చాయ॥ 40

ఆహిరినాట

ఈతఁ డెట్టుండినా నేమి యింతులాల
కాతరించి వెంగమాడి గయ్యాళించఁదగవా ॥పల్లవి॥

నగేవారివలెనే నాయకుని భావమెల్లా-
నగడుగాఁ జేతురా అక్కలాల
మొగము చూడఁగదరే మోహము నాపైఁ గురిసీ
తగ నితనిమీఁదట తప్పు లెంచఁదగవా ॥ఈతఁ॥

చుట్టాలవలెనే వుండి చొప్పులెత్తి మీ రితని-
గుట్టు బాయట వేతురా కొమ్మలాల
యెట్టుచేసినా నేమి నాయింటనే యీ నున్న వాఁడు
నెట్టుకొని యీతని నేర మెంచఁదగవా ॥ఈతఁ॥

మంచివారివలెనే మాటలు వెలుచుకొని
పొంచి సిగ్గువరతురా పొలఁతులాల
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
అంచెల నీతని నింకా అలయించఁదగవా ॥ఈతఁ॥ 41

లలిత

ఏల తలవంచుకొనే వెఱఁగనివానివలె
కోలుముందుగా నాపె కొలువుసేసీని ॥పల్లవి॥

సొలసి సొలసి నిన్నుఁ జూచి అల్లదె యింతి
తలపోఁతవలపుల దైలువారీని
నలిరేఁగి ముసిముసినవ్వులతో నప్పటిని
చెలులకు నీసుద్దులు చెప్పి చూపీని ॥ఏల॥

మక్కువైన నీవాడేమాటలు చెవుల విని
వెక్కసపుసంతోసాన విట్టవీఁగిని
వుక్కుమీరి నీవుండేవొయ్యారిబాగులకు
అక్కరతో కోరి వేఁడీ నాసపడీని ॥ఏల॥

వొయ్యనే నిన్నుఁ గదిసి వూడిగాలెల్లాఁ జేసి
తియ్యమోవి యాని దప్పిదేర్చుకొనీని
యియ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సయ్యాన నిందుకుఁ దానూ సారెఁ బొగడీని ॥ఏల॥ 42

రేకు 1508 హిజ్జిజి

నీవు నాతోనై తేను నిజములే నెరపేవు
భావించితే నీవొళ్లనే పచ్చిదేరీఁ జేఁతలు ॥పల్లవి॥

అప్పుడు నీవు నేను నాడుకొన్నమాటలెల్లా
చెప్పె నీకె నాతోను చెలరేఁగుచు
నెప్పునఁ బొంచువినెనో నీ వెరుక సేసితివో
చొప్పులెత్తేయీకెఁ జూచి సోద్యమయ్యా నాకు ॥నీవు॥

పొందుసేసి ఇద్దరము పొత్తు గలసినసుద్ది
మందలించె నీపె నాతో మర్మము లెంచి
సందునుడిపోలికలో చక్కని నీమతకమో
యెందుకైనా నీకె వచ్చి నెటువంటి మహిమో ॥నీవు॥

పానుపుపై మనము నిబ్బరానఁ గూడినరతి
తా నీకె తారుకాణగాఁ దలఁపించీని
పూని తానాడ నుండెనో బోదించఁగాఁ దెలిసెనో
దీనవె శ్రీవేంకటేశ తేటతెల్లమాయను ॥నీవు॥ 43

## ముఖారి

కలిగినట్టు చెప్పుమీ కల్లలాడక నీవు
వలతునంటాఁ జెప్పేవు వడిగా నాతోను ॥పల్లవి॥

తలఁపులోఁ జారునా తప్పక నారూపము
పిలువఁగ నోరికి నాపేరు వచ్చునా
కలలోన నీవు నన్ను కాఁగిలించి కొన్నట్టా
చెలులతో నాగుణాలు చెప్పి పొగడుదువా ॥కలి॥

మనసు గరఁగునా (నా)మాటలు వింటే నీకు
తనువు సోఁకించితేను తమి రేఁగునా
ననిచి నాచెలిఁ గంటే నంటుసేతువా నీవు
కొనబైన నారాక కోరుదువా యెపుడు ॥కలి॥

సూటిగా నాయింటివంక చూచితే వేడుకలౌనా
యీటున నేఁ బెనఁగితే ఇచ్చకమౌనా
గాఁటపు శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మేటి నావినయాలకు మెత్తువా నీవు ॥కలి॥ 44

పాడి

నిన్నుఁ జూచి వోర్చుకొని నే నుండానను
 తన్ను నింతక జంకించి తగ బుద్ధిచెప్పనా ॥పల్లవి॥

యింటిలోన నీవు నేను నేకతములాడఁగాను
 కంటివిగా ఆపె యెంత గయ్యాళించీని
నంటునను నీతో నేను నవ్వులు నవ్వఁగాను
 వింటివిగా తా నాడేవెంగేలెల్లాను ॥నిన్నుఁ॥

పలుమారు మనమున్నపానుపు దప్పక చూచీ
 తెలిసెఁగా నీకు నీకే దిట్టతనము
యెలమి మనవలపు లెగసక్కేలు సేయఁగా
 బలిసెఁగా చల మీకెపై నీకు నిపుడు ॥నిన్నుఁ॥

యెంచఁగ శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడుండఁగా
 ముంచెఁగా ఆపెపంతాలు మొత్తమై నీకు
పొంచియుండి మనలోనిపొందులెల్లాఁ దలపోసి
 నించెఁగా తనరతులనేరుపులెల్లాను ॥నిన్నుఁ॥ 45॥

మంగళకౌసిక

దొడ్డవాఁడైనవానికి దోసము లేదు
 వొడ్డారా లేమిసేసినా వొద్దనేవా రెవ్వరే ॥పల్లవి॥

తప్పకచూచితేనే తనవొళ్లి నేరమెల్లా
 కప్పి వూరివారికెల్లాఁ గానరాదా
ఇప్పుడే ఇందుకుఁగాను యేలబాసలు సేసీని
 చొప్పుగా తప్పు గలితే సోదించేవా రెవ్వరే ॥దొడ్డ॥

మాటదీసి మాటాడితే మర్మములు మనవెల్లా
తేటతెల్లమిగా మాకుఁ దెలియరాదా
చాటి ఇందరిచేతాను సాకిరులేల చెప్పించీ
గాఁటాన మీరివచ్చితేఁ గాదనేవా రెవ్వరే ॥దొడ్డ॥

సంగడిఁ గూచుండితేనే[1] సరిఁ దనవలపెల్లా
యింగితాకారములోనే యెఱఁగరాదా
చెంగట నన్నేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
కొంగు దాఁ బట్టితే నియ్యకొననివా రెవ్వరే ॥దొడ్డ॥ 46

నాదరామక్రియ

ఇంక నేమిచేసుఁ జెలి యింతకంటెను
కంకణాలచేతులెత్తి కడుమొక్కుచున్నది ॥పల్లవి॥

నిలిచి నీవు చేసిననేరము లెంచనొల్లక
నలినాక్షి పూరకె మోనాన నున్నది
వెలయ నిన్ను గద్దించి వేసరించనొల్లక
తళుకుఁజెక్కులతోడ తలవంచుకున్నది ॥ఇంక॥

గోమున నీ సతులను కోపించనొల్లక
లేమ పాన్పుపైఁ బవళించి వున్నది
ఆముకొన్న నీగుణాల కలుగఁగనొల్లక
నామువార సెలవుల నవ్వుకొంటా నున్నది ॥ఇంక॥

చెంగట నిన్ను రతుల సిగ్గువరచనొల్లక
అంగన యిట్టె పరాకై వున్నది
రంగుగఁ గూడితివి యీరామను శ్రీవేంకటేశ
పొంగుచు సంతోసానఁ బొగడుచు నున్నది ॥ఇంక॥ 47

1. సరిన్=సమక్షమునందు.

కాంబోది

అతఁడు యేమిసేసీనే అంగనలాల
చతురుఁడు పాదాలు చాఁచె నింతె మీపైని ॥పల్లవి॥

చిప్పిల లోలోనే యెంత సిగ్గులుపడేరే మీరు
దప్పిదేర మగనిపాదా లొత్తుతా
కొప్పులు జారఁగా యేమి కొంచి చూచేరే యతని
వుప్పటితిల్లుతమకాన వుమ్మగిలు తాను ॥అతఁ॥

నంటునను ముసిముసినవ్వులు యేల నవ్వేరే
జంటలై యితనివొద్ద సరిఁ గూచుండి
అంటిముట్టి సన్నల యేమాడుకొనేరే యతని
రెంటెనుమురుగుతోనే రిచ్చలువడు తాను ॥అతఁ॥

చేకొని కూడి యెంతేసి చెమటలే కురిసేరే
జోకల వొకరొకరు చొక్కుకొంటాను
కైకొని మిమ్మేలె శ్రీవేంకటాద్రి గోవిందరాజు
శ్రీకాంతవు భూకాంతవు సేవలెన్ని సేసేరే ॥అతఁ॥ 48

రేకు 1509 ఆహిరి

ఏమని విన్నవించేనే యింకాఁ దనకు
నేమముతో నుండఁగా మన్నించీఁ దానే నన్నును ॥పల్లవి॥

ఆసగొననేమిటికి పంతమాడనేమిటికి
సేసవెట్టిపెండ్లాడినచెలువకును
వాసితోడ నింటిలోన వలపు మీఁదెత్తుకొని
వేసరకుండితే నది విభునికే సెలవు ॥ఏమ॥

కల్లలెంచనేమిటికి కాఁతాళించనేమిటికి
    యిల్లాండ్లయినయట్టి ఇంతులకును
    చల్లఁగాఁ గన్నులఁ జూచి చలపట్టి కొలువులో—
    నల్లంత నుండఁగాను అతనికే సెలవు ॥ఏమ॥

పట్టి పెనఁగనేఁటికి బయలీఁదించనేఁటికి
    పట్టపుదేవుళ్లయినపడఁతులకు
    ఇట్టె శ్రీవేంకటేశుఁడేలె నన్ను నేఁ దనకు
    నెట్టన మొక్కఁగా నితనికి నింతా సెలవు ॥ఏమ॥ 49

కేదారగౌళ

ఏఁటికి నీవే వచ్చేవు యెందుకైనాను
    పాటించి యాతఁడు నీకే బాస లిచ్చేఁటవే ॥పల్లవి॥

బత్తిగలదాననంటా పతికిఁ బూనుకవచ్చి
    వుత్తరా లిచ్చేవు మాతో నొకటొకటె
    హత్తి యాతఁడు నీవాఁడో అవ్వల నెవ్వతెవాఁడో
    చిత్తములోపలఁ దెలిసికొవటవే ॥ఏఁటి॥

చనవరిదాననంటా సవతులలో నెల్లా
    పెనఁగే వాతనికిఁగా బింకము చూపి
    కనెనో యిది యాతఁడు కడుఁబరాకై వున్నాఁడో
    తనర నీసేవ యాతని కెక్కెనటవే ॥ఏఁటి॥

అండనుండేదాననంటా అట్టె శ్రీవేంకటేశుకై
    దండిగా వేఁడుకొనే వందరిలో నన్ను
    కొండవలె నన్ను నేలె కూటమి మనలో నెందో
    అందుకాచి నీవతని నడిగితివటవే ॥ఏఁటి॥ 50

### నాదరామక్రియ

ఏమే యెడమాట లేలాడించే వాతనితో
కామించి నీపతియున్నకడకు రాఁగదవే ॥పల్లవి॥

దాకొని వద్దనుండేనే తగులౌఁగాక మోహము
ఆకడ తెరమాఱైతే నందునా పొందు
రాక దరచైతే మొకదాకిరి గలుగుఁగాక
చేకొని గర్వాననుండే చిత్తము గరఁగునా ॥ఏమే॥

మాటలాడు తానుండేనే మర్మములు సోఁకుఁగాక
నీటున మోనాననుండే నిండునా తమి
కూటమికిఁ బెనఁగితే కొనసాగుఁగాక రతి
జూటుఁదనానఁ గొంకితే చుట్టరిక మబ్బునా ॥ఏమే॥

పట్టి కాఁగిలించితేనే వచ్చిసిగ్గు దేరుఁగాక
గుట్టున నెంత వుండినా కోరినట్లౌనా
ఇట్టె శ్రీవేంకటేశుఁ డేలెఁగాక నిన్ను నేఁడు
జట్టి గొనకుండితేను చవులు రెట్టించునా ॥ఏమే॥ 51

### హిందోళం

ఎంత వేడుకో నీకు నింతి సేసే సేవలు
చెంతనుండి చూచేమాకు సిబ్బితయ్యీ నిపుడు ॥పల్లవి॥

కొప్పులోని మొగలిరేకుల తావి దొలఁకగాను
చెప్పీ నేకతము నీకు చెవిలోనికే
చిప్పిలుఁ జెమటలెల్లా చేతుల జొబ్బిలఁగాను
అప్పుడే పాదములొత్తీ నంగమెల్లాఁ దడియ ॥ఎంత॥

చెక్కులజవ్వాది నీము(ముం?)జేతులపైన వడియఁగా
మొక్కి నీవు చెనకఁగా మోవాన నీకె
పుక్కిటితమ్ములము గొబ్బున నీమైఁ జెదరఁగా
మిక్కిలి నవ్వీఁ గుంచమే కొని విసరుచు ॥ఎంత॥

గుబ్బల నలఁగిన కుంకుమ నీమై నంటఁగా
వుబ్బునఁ గాఁగిట నించి వోరసీ నీకె
అబ్బురాన నన్నేలితి వన్నిటా శ్రీవేంకటేశ
నిబ్బరానఁ దానూఁ జేసీ నీకు నూడిగములు ॥ఎంత॥ 52

వరాళి

ఏల పురుఁడువెట్టేవు యీపెతో నన్ను
నీలాగు లిటువంటివే నిన్నిఁక నేమందును ॥పల్లవి॥

వేఁకపునీ(నా?)గుబ్బలతో వెలయ నీమనసారా
తూఁకువ కాపె చన్నులు తూఁచి చూడుమా
సోఁక నిద్దరికన్నులు సొరిది నీచేరలను
తేఁకువఁ గొలచి చూచి తెలుసుకొమ్మా ॥ఏల॥

జారెఁడేసినానెరులపాటి వాపెనెరులును
యేరీతి నుండినో ఇప్పు డీడువెట్టుమా
గారాపునాపాదాలసంగతి నాపెకాళ్లను
కేరడాలు మాని నీవు గెర వా(వ్రా?)సుకొనుమా ॥ఏల॥

పిక్కటిల్లునాపిరుఁదు ప్రేమ నాపెజఘనము
లెక్కసేసి నీవు కాఁగిలించి మెచ్చుమా
ఇక్కువ శ్రీవేంకటేశ యేలితి విద్దరి మమ్ము
పక్కనిడుకొని మమ్ముఁ బాయ కిట్టె వుండుమా ॥ఏల॥ 53

బౌళి

ఎట్టున్నదో నీచిత్తము యెద్దొకా నెరఁగరాదు
ముట్టి నీవు చూడఁగాను మోహించితి నేను ॥పల్లవి॥

చివ్వన నే విన్నపాలు సేయఁగాను వినివిని
నవ్వులు నీవు నవ్వఁగా నమ్మితి నేను
జవ్వనమదాన నేను సన్న సేయఁగా నప్పుడే
పవ్వళించఁగా నాసల భ్రమసితి నేను ॥ఎట్టు॥

బెరసి నీకొంగువట్టి పెనఁగితే నటు నీవు
శిరసు వంచఁగా సంతోసించితి నేను
వొరసి పాదాలొత్తితే వూరకే నీవుండఁగాను
వొరిమతోఁ జెంగలించి వుండితి నేను ॥ఎట్టు॥

వేడుక నేఁ గూడేవేళ వెరగంది నీవుండఁగా
జోడువాయవని మతిఁ జొక్కితి నేను
వాడికకుఁ బిల్వఁగా నావంకైతే శ్రీవేంకటేశ
పీడెము చేతఁబట్టుక వెలసితి నేను ॥ఎట్టు॥ 54

రేకు 1510 మధ్యమావతి

మాతో నేమిచెప్పేరే మగువలాల సుద్దులు
ఆతఁడే నేరుచు మిమ్ము నంకెకు రాఁజేయను ॥పల్లవి॥

సవతిమచ్చరములు సరుస రేఁచినవాఁడు
తివిరి మీతగవులు దిద్దనేరఁడా
చవిగొని మీమోవులు చప్పఁగాఁ జేసినవాఁడు
కవగూడియుండఁగ నొక్కటి సేయనేరఁడా ॥మాతో॥

పంతములు మీలోమీకు పైపై నెక్కించినవాఁడు
బంతినే మీబలి మేర్పరచనేరఁడా
ఇంతలో మీచక్కఁదనా లీడువెట్టి చూచేవాఁడు
చింతదీర మిమ్ము సంతోసింపించనేరఁడా ॥మాతో॥

తడయక మిమ్ముఁగూడి తమివుట్టించినవాఁడు
చిడుముడినిచ్చకాలు సేయనేరఁడా
అదరి శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నేలినాఁడు
జడిగొని అందరికిఁ జనవియ్యనేరఁడా ॥మాతో॥ 55

### పాడి

కలకాల మిందులకే కాచుకుంటివా
చెలికతె(త్తె?)వై నా నేమి సిగ్గుదెచ్చుకొంటివే ॥పల్లవి॥

చెక్కులపై చెమటలు సెలవుల నగవులు
యెక్కడనుండి వచ్చెనే ఇంతలో నీకు
చొక్కపునాపతిఁ బిలుచుకరా నంపితి నింతే
చక్కఁగా నిప్పుడే యెట్టు సందించుకొంటివే ॥కల॥

మోవిమీఁది చెనకులు ముంగురులచెదరులు
వేవేగ నమరెఁగదే వేడుకతోను
సోవల నాతనిమైఁ గస్తూరి పూయుమంటి నింతే
తావుకొని యెటువలెఁ దగిలించుకొంటివే ॥కల॥

నిలువునఁ బులకలు నిట్టూరుపులగములు
సులభాన నబ్బెఁగదె సొంపున నేఁడు
కలనే శ్రీవేంకటేశుఁ గాచుకుండుమంటి నింతే
లలిఁ ఘట్టముగా నెటువలెఁ జేసుకొంటివే ॥కల॥ 56

### బౌళి

నీవే తెలుసుకొనేవు నెట్టన నాగుణమెల్లా
వేవేలువిధాల నిన్ను వేసరించేనా ॥పల్లవి॥

చేఁగి నీదేవులని చేరి మన్నింతువుగాక
బలిమిచేసి నీకొంగు పట్టితీనేనా
వలపెరిఁగి నీవే నాపద్దికి వత్తువుగాక
పెలుచుఁదనాన నిన్నుఁ బిలిపించేనా ॥నీవే॥

నీమాట దలఁచుకొని నీవే నన్నేలుటగాక
ఆముకొని పెనఁగి నిన్నలయించేనా
చేముట్టి నీ విప్పుడే నాసిగ్గు దేరుతువుగాక
గామిడినై రతి నిన్నుఁ గక్కసించేనా ॥నీవే॥

చుట్టరికమెంచి నన్నుఁజూచి కాఁగిలింతుగాక
నెట్టనఁ గూడవంటాను నేరమెంచేనా
గట్టిగా (శ్రీ)వేంకటేశ కలసితి విటు నన్ను
జట్టిగొంటి నిఁక నిన్ను సాదించేనా ॥నీవే॥ 57

### పళపంజరం

[1]ఇన్నాళ్లఁ బడుచ వేమీ నెరఁగవంటా నుంటిమి
కన్నులారా నీయందుఁ గంటిమి వేడుకలు ॥పల్లవి॥

చెలరేఁగి లోలోనే చిరునవ్వులు నవ్వేవు
వలపులతలపోఁతవరుసా ఇది
అలయుచు సొలయుచు నసురుసురయ్యేవు
కొలఁదిమీరినరతికోరికా ఇది ॥ఇన్నా॥

చిట్టంటుఁ జెమటలతో సిగ్గువడేవు నీవు
దట్టమైనపాయపుమదములా ఇది
గుట్టుతోడఁ బులకల గుబ్బతిల్లే విప్పు డిట్టె
మట్టులేనితమకపుమర్మమా యిది ॥ఇన్నా॥

యీడనే పానుపుమీఁద నెదురులు చూచేవు
కూడేటిఆసలకెల్లా గురుతా ఇది
పాడితో శ్రీవేంకటపతి నిన్ను నన్ను నేలె
వేడుకఁ జూచేవు వెల్లవిరులా యిది ॥ఇన్నా॥ 58

## గౌళ

ఏల నన్ను మొరఁగేవు యెఱఁగనంటా నీవు
వాలాయ మాకెఁ గూడఁగా వద్దంటినా ॥పల్లవి॥

బాయిటఁ దిరిగేయట్టిపావురాల నాకుఁ జూపి
ఆయెడ నాకెతో మాటలాడేవు నీవు
చేయి నామీఁదట వేసి చెనకి పైకొంటానే
పాయలేక యాకెమీఁదఁ బాదము చాఁచేవు ॥ఏల॥

పమ్మిచు నీచేతి నిమ్మపండు నాముందర వేసి
కొమ్మచేత విడె మందుకొనేవు నీవు
నమ్మించి నామోము చూచి నవ్వులు నవ్వుతానే
వుమ్మడి సన్నల నాపె నొడఁబరచేవు ॥ఏల॥

గరిమ నివ్వల నన్నుఁ గాఁగిలించుకొంటానే
తెరమాటున నాపె నొద్దికఁ గూడేవు
సిరుల శ్రీవేంకటేశ సేస నాపైఁ జల్లుతానే
మరిగిం చాపెను నీవు మర్మము లంటేవు ॥ఏల॥ 59

### సాళంగనాట

మొదల నేనైతేను మొకదాకిరిదానను
చెదరక తనబత్తి చేకొంటి ననరే ॥ పల్లవి ॥

యిచ్చకము లాడఁగాను యెగసక్కె లాడరాదు
కచ్చుపెట్టి మొక్కఁగాక కాదనరాదు
మచ్చికలు చూపఁగాను మచ్చరము సేయరాదు
యెచ్చట నున్నాఁడు విభుఁ డేమిసేతునే ॥ మొద॥

చుట్టరికము సేయఁగా సూడుపట్టఁగరాదు
అట్టె యీడకు రాఁగా వద్దనఁగరాదు
నెట్టుక బాససేయఁగా నేరమి చేయఁగరాదు
యెట్టా ననరాదు నవ్వి నేమిసేతునే ॥ మొద ॥

పైకొని కాఁగిలించఁగా పంతము లాడఁగరాదు
ఆకుమడిచిమ్మనఁగా నలయరాదు
యీకడ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
యేకమాయ వలపులు యేమిసేతునే ॥ మొద ॥ 60

రేకు 1511 శ్రీరాగం

ఎంత నన్ను వేఁడుకొనే విందుకుఁగాను
వింతగా నాపంతము నీవే కనుఁగొనవే ॥ పల్లవి ॥

వేసరకుంటేఁ జాలు విన్నప మెట్టైనాఁ జేసి
ఆసవెట్టి నీపతిఁ జయ్యాన తెచ్చేనే
చేసూటికానికలు చేకొంటేనే చాలుఁగాని
నేసవెట్టి నీకుఁ బెండ్లిసేసే యాతనిని ॥ ఎంత ॥

1. 58, 59, 60 పాటలున్నరేకుభాగము చాలామట్టుకు చిలుమెక్కినది.

మొదలనే దిష్టించి నా మొగము చూచితేఁజాలు
కదిసి నీచేతికి లోఁగాఁజేసేనే
చెదరనిమన్ననతో సెలవి నవ్వితేఁజాలు
సదరాన నీపొందుకు సమ్మతించఁజేసేనే ॥ఎంత॥

నరవిగా నాముందర చక్కఁగా నిల్చితేఁజాలు
యిరవుగా నీతలఁపు లీడేర్చనే
అరుదై శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
పరగ నీతో నెప్పుడుఁ బాయకుండఁ జేసేనే ॥ఎంత॥ 61

వరాళి

ఈతఁ డింతాఁకా రాఁడఁటా నెదురులు చూచితివి
యేతులకు నిప్పుడేల యెగసక్కేలాడేవే ॥పల్లవి॥

పిలువఁగాఁ బతితోను పెనఁగేవు సారెకు నీ-
బలిమెంత గలదే పడఁతి
చెలరేఁగి నిన్నుఁ గూడఁగా శిరసు వంచుకొనేవు
చల మెంతాఁకానే నీకు సకియా ॥ఈతఁ॥

మంతనాన నిన్నతఁడు మర్మములు ముట్టఁగాను
పంతము లాడుదురటే భామినీ
సంతసాన నీమగఁడు సరసములాడఁగాను
చింతించ నింకానేలే చెలియా ॥ఈతఁ॥

కూడఁగా శ్రీవేంకటేశుఁ గొసరే వప్పటి నీకు
వేడు కెంత గలదే వెలఁది
జోడుగూడి వుండఁగానే సొలసి తమకించేవు
సూడు వెదకఁగనేలే సుదతీ ॥ఈతఁ॥ 62

### మాళవి

ఇంకా నేల తలఁపించీ నిపుడు నాకు
అంకెకుఁ దెచ్చి తాను అవియేడ సుద్దులే ॥పల్లవి॥

మాటలాడవచ్చుఁగాని మనసు నమ్మించరాదు
యేఁటికి నొడఁబరచీ నీతఁడు నన్ను
గాఁటపుతనచేఁతలు కన్నులారఁ గంటి నేను
[1]యేఁటవెట్టి యాడఁగాక ఇఁక నేడసుద్దులే ॥ఇంకా॥

అండకు రావచ్చుఁగాని అలుక మానుపరాదు
బెండ నాతోనేల పెనఁగాడీనే
వుండనుండఁ గానవచ్చె నోజలు తనవి నేఁడు
పండను వలపులు అప్పటి నేడసుద్దులే ॥ఇంకా॥

చెనకఁగవచ్చుఁగాని సిగ్గు విడిపించరాదు
వినయాన నన్ను నెంత వేఁడుకొనీనే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనే నే మెచ్చితి
యినుమడించెను మోహ మిది యేడసుద్దులే ॥ఇంకా॥ 63

### సామంతం

మందులో మంత్రాలో నీకు మర పంపు చేసుకొనె
సందడి నీపెండ్లాడినసగినాలు మంచివే ॥పల్లవి॥

చనవిచ్చినాఁడు, మోపిచవి నీకుఁ జూపినాఁడు
అనిశముఁ బతి నీకు నచ్చివచ్చునే
[2]య(యొ?)నసి పాయఁడు నీఇచ్చలోనే మెలఁగును
పొనుఁగ కిద్దరికిని పొంతనాలు గూడునే ॥మందు॥

---

1. ఏఁటవెట్టి=(ఇక్కడ ప్రకరణముతో) ఎత్తిపొడిచి' ప్రేలుచూపి ఇత్యాదులుగ తోచుచున్నది. ఎత్తులువేసి ఆడుటకు గావచ్చునా?. 22 వ సంపుటమునందు నిది విచార్యమన్నాను. (2.) 'య' ఐనచో యతి భంగము కావచ్చు.

నెలవై యింట నున్నాఁడు నీమాట చెల్లించినాఁడు
వెలయ నీవు గూడినవేళ మంచిదే
సులభాన దక్కె నీకు చొక్కుచు నిన్ను మరిగె
బలిమి నీవునోమినఫలము లీడేరెనే ॥ మందు ॥

వేడుక వుట్టించినాఁడు వెస నిన్నుఁ గూడినాఁడు
పాడిదప్ప కాతఁడు నీపాలిటివాఁడే
యీడనె శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్ను నేలె
జోడైనచుట్టరికము సూటికెక్కెఁగదవే ॥ మందు ॥ 64

ఆహిరి

ఏమసేతు నే నింక నెందుకౌదునే చెలియ
ప్రేమముఁ జలము రెండూఁ బెనఁగొనీఁగదె ॥ పల్లవి ॥

ఆతఁడు చేసినచేఁత కాతనినే చేసేఁగాక
దూతికవు నిన్నుఁజేయ దోసముగదే
కాతరించి నే నిన్నుఁగనక యేమిసేసినా
చేతులారా నాతనినే చేసినట్టుగదవే ॥ ఏమి ॥

గద్దించినపతినే గక్కనఁ జెనకుటగాక
వద్దనున్నదాని ముట్టవచ్చునటవే
అద్దుకొని యేమైనాఁగాని ఆతనిమారుగా నిన్నుఁ
గొద్దిమీరితే నందుకుఁ గోప మారుఁగదవే ॥ ఏమి ॥

శ్రీవేంకటేశ్వరుని చేరి కొసరుటగాక
సేవకురాలిఁ దడవఁ జెల్లునటవే
యీవేళ నన్నుఁ గూడె నీతఁడే నిన్నంటె
మూవంకలా నాతనినే మోచి వచ్చుఁగదవే ॥ ఏమి ॥ 65

బౌళి

మంచిదానివలెనే మనతోడఁ బొందుసేసి
కంచముపొత్తునఁబెట్టి కాకుసేసీ నాపె ॥పల్లవి॥

యీకడఁ దా నెలయించి యింటికిఁ దోడుకవచ్చి
నాకు నీకు విడెమిచ్చి నవ్వీ నాపె
యేకతాన కుఁ బిలిచి యిద్దరిఁ గూచుండఁబెట్టి
చేకొని యందరికినిఁ జెప్పిచూపీ నాపె ॥మంచి॥

యెడయక నిన్నూనన్నూ నిక్కొ సిగ్గులుదేర్చి
నడుమఁ దాఁ దెరవేసి నవ్వీ నాపె
జడియ క్కైకొ తనసకినలమంచ మిచ్చి
సడిఁబెట్టి రతులు రచ్చలవేసీ నాపె ॥మంచి॥

యిమ్ముల నొక్కొకరి నింతలోఁ బెండ్లిసేసి
నమ్మి యేడాఁ జెప్పనని నవ్వీ నాపె
నెమ్మది శ్రీవెంకటేశ నిన్నుఁ దా నిపుడు గూడి
రమ్మని లోలోఁ గాఁపురముసేసీ నాపె ॥మంచి॥ 66

రేకు 1512 వేళావళి

కంటినే నీవోజలెల్లా కన్నులయెదుట నేఁడు
ఇంటిలోనఁ గాచుకొని ఇందుకే వుందానవా ॥పల్లవి॥

పన్ని ఇద్దరము నొక్కపానుపుపై నుండగాఁను
సన్నలేమిసేసేవే సరసునికి
కిన్నెర వాయించేవఁటా కెలన నిలుపుకొంటే
చన్నులమెఱుఁగు చూపి చవులుసేసేవా ॥కంటి॥

కగ్గులేక మాలో నేము కాఁగిలించుకొనఁగాను
సిగ్గులేల రేఁచేవే చెలువునికి
యెగ్గులేదు పిడెము మా కిచ్చేవంటా నుండితే
దిగ్గన మాటాడి మోవితీపులు చల్లేవా ॥కంటి॥

మేలపురతులఁ గూడి మేము నవ్వుతా నుండఁగా
యేల మొక్కేవే శ్రీ వేంకటేశ్వరునికి
ఆలవట్టము విసరేవంటాఁ బరాకై వుండితే
ఆలవై ఆతనికి నీ వాసకొలిపేవా ॥కంటి॥ 67

## కన్నడగౌళ

తప్పు నేమిటాఁ; దనకు తనమనసు
యెప్పుడు తానే దిక్కు; యిఁకఁ దనమనసు ॥పల్లవి॥

మానితి నాచలమెల్ల మాట చెప్పినట్టె వింటి
తా నేమిసేసినాఁ దనమనసు
కానుక చేతికిచ్చితి కడుఁ దన్ను వేఁడుకొంటి
మానిని నింతే నేను మఱి తనమనసు ॥తప్పు॥

నగితిఁ దనతో నేను నమ్మి యిట్టె వుందానను
తగ వెంత నడపినాఁ దనమనసు
మిగులా బందుగురాల మేనరికము చెప్పితి
మగఁడు తా నాకైనాఁడు మరి తనమనసు ॥తప్పు॥

అలుగ నెన్నఁడూను అట్టె తన్నుఁ బొగడుదు
తలఁపెల్లాఁ దా నెరుఁగుఁ దనమనసు
యెలమి శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్ను నేతె
మలగొనె నామనసు మరి తనమనసు ॥తప్పు॥68

వరాళి

ఏల తలవంచే వందు కేమాయను
కీలు నాకుఁ దెలుసు మిక్కిలిఁ దగవాయను ॥పల్లవి॥

చిప్పిలఁగఁ బొడమిన [1]చెక్కుల నీచెమటలు
తప్పక చూచితే నాపెఁ దలఁపాయను
వుప్పతిల్లునీసుద్దులు వూడిగపుసతులెల్లా
చెప్పఁగానే వినివిని సిగ్గులాయను ॥ఏల॥

వేడుక నీచిటికనవేలనున్నవుంగరము
కూడినమీరతులకు గుఱుతాయను
యేడనుఁడో విచ్చేసితి విన్నిటా దొరవు నీవు
వీడె నిదె నీకొప్పు వెరగాయను ॥ఏల॥

కమ్మకొన్ననీమోముకళలు దై వారఁగాను
నెమ్మది నిద్దరిపొందు నిజమాయను
యిమ్మల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
నమ్మికతో నాకు నేఁడు నవ్వులాయను ॥ఏల॥ 69

రామక్రియ

చూచితే మంచివాఁడవు చుట్టమవై వున్నాఁడవు
యేచి యెట్టు సోదించి యెఱిఁగేమో నిన్నును ॥పల్లవి॥

తగిలి సరసములే తలఁచుగా నాడేవు
నగవులే నవ్వేవు నన్నుఁ జూచి
యెగసక్కెమో నిజమో యేదౌతా నెఱఁగము
నిగిడి రతికి నెట్టు నిన్నుఁ బిలిచేను ॥చూచి॥

1. 'నీచెక్కుల చెమట' అనుట సహజము.

మితిమీరి వూరకైనా మెచ్చులే మెచ్చేవు
అతిమోహములే చల్లే వప్పటి నాపై
మతకమో నాపైబత్తో మరి యేర్పరచరాదు
సతమై నీమీఁదఁ జేయిచాఁచ నెట్టు వచ్చును ॥చూచి॥

అడియాలాలే చెప్పి ఆపలెల్లాఁ జూపేవు
కడఁగి నిలుచుండఁగాఁ గాఁగిలించేవు
యెఱయక శ్రీవేంకటేశ నీ కిది ప్రియమో
కడుజాణ వౌదువు కాదనఁగఁ గలనా ॥చూచి॥ 70

## కాంబోది

నన్నుఁ జూడవే యితఁడు నంటున నేలినాఁడు
మన్నన యింత లేకుంటే మరి యది వనితా ॥పల్లవి॥

కందువ తనవిభుఁడు కడునెంత మన్నించినా
అందరితో నాడుకొనే దది వనితా
చందముగా నాతఁడు చనవిచ్చి వుండఁగాను
మందలించి కొసరేది మరి యది వనితా ॥నన్నుఁ॥

గుటుతోడ నాతఁడు కొంగువట్టి తీసితేను
ఇట్టె యెమ్మెలఁ బొదలే దది వనితా
జట్టిగొని యాతఁడు సరసము లాడితేను
మట్టుమీర నవ్వేది మరి యది వనితా ॥నన్నుఁ॥

గారవించి శ్రీవేంకటేశుఁడు గూడితేను
ఆరీతి నవ్వులు నవ్వే దది వనితా
కూరిమి నాతఁడే చెక్కు గోరికొన నొత్తితేను
చేరి మారుకుమారు సేసేది వనితా ॥నన్నుఁ॥ 71

ధన్నాసి

ఆయనాయ నుండవయ్యా అన్నిటా సంతోసించితి
నాయము లింకా నెంత నడపేవు నీవు ॥ పల్లవి ॥

మాటలాడ నేరిచినమగవానితోడుత
ఆఁటది సారెకు నెదురాడఁగలదా
వాఁటపునీవనితలు వద్దనే కాచుకున్నారు
యేఁటికి దొంతులువెట్టే వేడలేనిసుద్దులు ॥ ఆయ ॥

మిక్కిలిజాణతనాలు మెరయించేవానితో
మక్కువై నమానాపతి మారుకొనీనా
వెక్కసపునీగుణాలు వీనుల నిండెను మాకు
చక్కటువేల దిద్దేవు సరుస నీచేఁతలు ॥ ఆయ ॥

ఆనవెట్టి నమ్మించి ఆసకొలిపేనీతోను
దానికి మాబోంట్లు జవదాఁటవచ్చునా
యీనెపాన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కానీలే యే(యీ?)గతి నిఁ(నిం?)డె కరుణ నామీఁదను॥ ఆయ ॥ 72

రేకు 1518 మాళవిగౌళ

ఇందరితో వట్టియెమ్మె లేమిచెప్పేవు
మందలించి వద్దనేమా మారుకొని మిమ్మును ॥ పల్లవి ॥

తచ్చనకాఁ డాతఁడు దాయక పాయక వుండె
ఇచ్చకురాలవు నీవు ఇద్దరు సరే
అచ్చలాన మీలో మీకు నచ్చివచ్చు వలపులు
విచ్చనవిడిఁ బెండ్లాడి వెలయరే యిపుడు ॥ ఇంద ॥

మరిగించనేర్చును మర్మము లంటి యతఁడు
కరగించనేర్తువు కాఁగిట నీవు
పొరుగే మీకిద్దరికి పొందు లిట్టె జరగును
పరగ నొక్కమనసై బతుకరే యిపుడు ॥ఇంద॥

నవ్వనోపు నాతఁడు నయమున నీతోను
రవ్వసేయ నోపుదువు రతుల నీవు
యివ్వల శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నన్ను నేలె
వువ్విళ్లూర సంతసాన నుండరే యిపుడు ॥ఇంద॥ 73

ముఖారి

అంటే ననరాదు నిన్ను నాఅడిసేసె ననేవు
జంటల నీకెరుకగా సన్న సేయనా ॥పల్లవి॥

వాకిట నే నుండఁగానే వడి నిన్ను ధూరఁగానే
ఆకెయింటి కేఁగవా అప్పుడు నీవు
కాకుసేసితి ననేవు గామిడితనా లనేవు
నీకు నీకే యెంచుకొమ్మా నీవోజలు ॥అంటే॥

పేర నేఁ బిలువఁగానే ప్రియములు చెప్పఁగానే
ఆరీతి నాపెతో మాటలాడవా నీవు
యీరసించితి ననేవు యెగ్గువట్టితి ననేవు
తారుకాణ సేసుకొమ్మా తగిలి నీ చేఁతలు ॥అంటే॥

కమ్మర నేఁ జూడఁగానే కవకవ నవ్వఁగానే
నెమ్మిఁ గాఁగిలించవా నీవే ఆపెను
నమ్మించి శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలితివి
సమ్మతించఁ జేసుకొమ్మా సారెకు నీమనసు ॥అంటే॥ 74

లలిత

ఇంతసేసితివి నీవే ఇంటిలోనున్నదమ్మ
  పంత మెంచి చూచితే నాపాటిదా ఆపె ॥పల్లవి॥

అంచెఁ నన్ను రప్పించి అట్టె నే నిలుచుండఁగా
  మంచముపై నాకెతోనే మాటలాడేవు
  పొంచి యందుకుఁగా పువ్వులచెండు వేసితే
  కొంచక తానేల అందుకొనీ నీకె నడుమ ॥ఇంత॥

సన్నలు నాకుఁ జేసి సరి నే నీతో నవ్వఁగా
  చెన్నుమీర నాపెమీఁదఁ జేయి చాఁచేవు
  యెన్నఁ దమ్మితూఁడు నీపై నిందుకుఁగాఁ దాఁకించితే
  ఇన్నిటాఁ దానేల యీపె యెడచొచ్చీ నడుమను ॥ఇంత॥

కంకణము నాకుఁ గట్టి కాఁగిట నే నించఁగాను
  సంకెలేక ఆపెదిక్కు సారెఁ జూచేవు
  అంకెల శ్రీవేంకటేశ అద్దము తెర దీసితే
  ఇంకాఁ దానేల లోని కేతెంచీ నడుమ ॥ఇంత॥ 75

దేశాక్షి

మాకేఁటికి దాఁచేరు మర్మములు మీలోనివి
  మేకొన్నరతులకు మీ మేనులే గుర ॥పల్లవి॥

పొలఁతికి మీకును పొందులైనందుకు మీ—
  సెలవినవ్వులలోనిసిగ్గులే గురి
  మెలుపుఁదమకములు మిక్కుటమైనందుకు
  సొలపుఁగనుసన్నలచూపులే గురి ॥మాకేఁ॥

---

ప్రక్కగీతగల భాగము చిల్లులు పడినది.

యెందును మీతలపోఁత లీడేరినందుకు
కందువ మీమోములకళలే గం(గు?)రి
అందుకొని మీమనసు లట్టె కరఁగినందుకు
చిందేటిమీచెమటలచిత్తడే గురి ॥మాకేఁ॥

వేమరు మీరు వెరచి వెరపుదేరినందుకు
మాముందర మీరాడేమాటలే గురి
యీమేర శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ఆమనివేడుకల కొయ్యారాలే గురి ॥మాకేఁ॥ 76

నాదరామక్రియ

అప్పుడు వద్దని వల పాఁపరాదు
వొప్పుగ నిన్నలమితే వోరువఁగఁ గలవా ॥పల్లవి॥

యీరీతి మీరిద్దరు నేకతములాడుకోఁగా
మేరతో వినవచ్చునా మించి యొకతె
ఆరసి యేల పిలిచే వండకు రమ్మని మమ్ము
చేరవచ్చితే నాస చిమ్మి రేఁచకుండునా ॥అప్పు॥

పరగ నాపె నీవుఁ బవళించివుండఁగాను
వొరిది మిమ్మొవ్వరై నాఁ జూడవచ్చునా
తెరయెత్తి చేయివట్టి తియ్యనేఁటికి మమ్మును
వొరసితేఁ దమకము లుమ్మగిలకుండునా ॥అప్పు॥

కందువ నొకరొకరు కాఁగిలించుకుండఁగాను
అందుకొని తేరకత్తె లంటవచ్చునా
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మందలించితే రతులు మర్మములు ముట్టవా ॥అప్పు॥ 77

బౌళి

అన్నిటాఁ జక్కటులే నీ వాడుకొనేవు
 విన్నవారుఁ గన్నవారు వెస నిన్ను నవ్వరా ॥ పల్లవి ॥

బెరసి నీవాకెమీఁదఁ బెండ్లాడినందుకు
 తరుణి యేమనినానుఁ దగవేకాదా
 గరిమ నీవప్పటిఁ గంకణము గట్టుకరాఁగా
 ఇరవుగాఁ జూచి చూచి యెట్టోరిచె నీకె ॥ అన్ని ॥

కతలుగా బాసికము గట్టుకవచ్చినందుకు
 సతి యేమిసేసినాను సంగతేకాదా
 మితిమీర నాపెఁ దొడమీఁదఁ బెట్టుకవుండఁగా
 మతిలోఁ గాఁతాళించక మానవెట్టువచ్చును ॥ అన్ని ॥

కమ్మటి నాపెను నీవు కాలుదొక్కినందుకు
 కొమ్మ యేమెంచినా నియ్యకోలే కాదా
 ఇమ్ముల శ్రీవేంకటేశ యీపె నిట్టె కూడఁగాను
 నెమ్మది వెఁ(వెం?)గే లేక నిన్నాడవలదా ॥ అన్ని ॥ 78

రేకు 1514 సామంతం

వింటిమి మీకతలెల్లా వీనులపండుగగాను
 ఇంటింటా మీగుణాలెన్నుకొనే రిందరు ॥ పల్లవి ॥

మనసుగరఁగ నీతో మాటలాడనేర్చు నాపె
 వనుపు సేసుక మరి నవ్వనోపును
 పనిమాలినపనికి భ్రమతువు నీవును
 అనిశము మీసుద్దులే ఆడుకొనే రిందరు ॥ వింటి ॥

బత్తిచేసి వద్దనుండి పాదాలు విసుకు నాపె
హత్తి నీకూడిగాలు సేయఁగనోపును
కొత్తకొత్తవలపులే కోరుదువు నీవును
పొత్తుల మీపొందు తలపోసుకొనే రిందరు ॥వింటి॥

తగిలి సారెకు రతిఁ దమిరేఁచగల దాపె
జిగిమీర నీకు బుద్ధిచెప్పనోపును
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
మిగులా మీతగవులే మెచ్చే రిందరు ॥వింటి॥ 79

దేసాళం

చేసినట్టెల్లా నీకుఁ జెల్లెఁగాక
వాసులు పంతులుఁబట్టి వద్దనేమా నిన్నును ॥పల్లవి॥

కన్నుల నిన్నుఁ జూచితే కాయమెల్లాఁ జెమరించె
కన్నెకు నీకునుఁ బొందు గలుగఁబోలు
నన్నుఁజూచి నీవేల నవ్వులు నవ్వే వప్పటి
యెన్నిసేసినా నేరము లెంచేమా నిన్నును ॥చేసి॥

చేకొని యెదుట నుండే సిగ్గులువడీఁ దాను
ఆకెకు నీకును మాట లమరఁబోలు
వాకునఁ బిలిచితేను వంచేవు శిర సప్పటి
కాకుసేసి నీచేఁతలు కాదనేమా నిన్నును ॥చేసి॥

పానుపు చేరి వుండితే భావము గరఁగీ నాపె
నానాఁడే మీకిద్దరికి ననుచఁబోలు
పూని శ్రీవేంకటేశుఁడ పొందితివి నన్నప్పటి
దీనికిఁగా నింతలో సాదించేనా నిన్నును ॥చేసి॥ 80

### పాడి

చెలికత్తెఁ గనక నేఁ జ[1](జె ?)ప్పక పోదు
కలవంటిది వలవు కడమలు సేతురా ॥పల్లవి॥

వువ్విళ్లూరఁ బిలిపించి వూరకే నీ వుండఁగాను
నివ్వెరగుతోడ నాపె నిలుచున్నది
యెవ్వరు మాటలాడించే రిద్దరు సిగ్గువడేరు
పువ్వువంటి(ది)జవ్వనము పొద్దు గడపుదురా ॥చెలి॥

పనివ డింటికి వచ్చి పరాకు సేసుకుండఁగ
కనుదాఁకా మంచముసంగడి నున్నది
యెనయఁగ మిమ్మిద్దరి నెచ్చరించేవా రెవ్వరు
గనివంటిది వేడుక కట్టిపెట్టవలెనా ॥చెలి॥

చేయి కాఁగిటికిఁ జాఁచి చిరునవ్వుతో నుండఁగా
ఆయములు నిన్నంటుచు నాకె వున్నది
యీాయెడ శ్రీవేంకటేశ యిద్దరి మెచ్చు నెవ్వరు
చాయవంటిది రతి రచ్చల వేయవలెనా ॥చెలి॥ 81

### మాళవిగౌళ

చెప్పకువే నీసుద్దులు చెలులతోను
ఇప్పుడిట్టె సవతుల మెంత సేయనేరమే ॥పల్లవి॥

మగఁడు మన్నించఁగాఁనే మంతుకెక్కె నీమాటలు
సగియించకుండేను చవివుట్టీనా
మొగమోట గలుగఁగా ముసిముసినవ్వు వచ్చె
యెగసక్కెలై తేను యెనసీనా పొందులు ॥చెప్ప॥

1. ఇట్లుగాకుండే యతిభంగము.

సరస మాటఁ డాడఁగా సలిగె పనికివచ్చె
పరాకు నేసుకుండితే [1]బాఁతెయ్యానా
పరగఁ గూడరాఁగానే పంతమెల్లా నీడేరె
విరహము రేఁచితేను వేడుక వుట్టీనా ॥చెప్ప॥

శ్రీవేంకటేశుఁడు దొరఁ జేయఁగా నన్నీ నమరె
కైవసము గాకుండితే కాఁకదేరీనా
యీవల నన్నేలఁగానే యిన్నీఁ దారుకాణవచ్చె
భావ మెఱఁగకుండితే పగటు చూపట్టునా ॥చెప్ప॥ 82

### లలిత

మేలు మేలు నీసతిని మెచ్చి రిందరు
యీలాగు నీవే తగుదు విటువంటిదానికి ॥పల్లవి॥

తప్పు కిట్టె చూచితేను తలవంచుకొనవద్దా
కప్పినజవ్వనపుసిగ్గరిదానికి
చిప్పలఁ జెనకితేను చిరునవ్వు నవ్వవద్దా
నెప్పునఁ [2]దెలివిగల నేరుపరిదానికి ॥మేలు॥

యెలమిఁ జేయివేసితే యిచ్చగించి వుండవద్దా
దొరసినయట్టి గుట్టుతోడిదానికి
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి సతినిట్టె
తిరమాయ సిరులు నేదేవులైనదానికి ॥మేలు॥ 83

### ఆహిరినాట

అడ్డమురామైతిమని అట్టె మమ్మేల దూరేవు
వెడ్డువెట్టి నవ్వఁగా నీవేడుకంటా నుంటిమి ॥పల్లవి॥

(1.) బాఁతి+అయ్యీనా. (2.) తెలివి=పుట్టుకతో వచ్చినవివేకము, నేరుపు=అభ్యాసముతో గలిగిన లోకజ్ఞత కావలయును.

తివిరి యొందుండో వచ్చి తిట్లు నిన్నుఁ దిట్టఁగా
వువిద నీదేవులంటా నొదిగుంటిమి
చెవిలో నేకతమాడి చేతఁ జెక్కు లదమఁగా
అవల నీకెతో (నీకేదో?) చుట్టమంటా నుంటిమి ॥ అడ్డ ॥

తొంగిచూచి నీసొమ్ములు తొడిఁబడఁ బెట్టుకోఁగా
అంగనే కర్తగాఁబోలునని వుంటిమి
చెంగటనుండి నీకొప్పు చేచేతఁ దగిలించి
వంగఁదియ్యఁగా నీకు వదినంటా నుంటిమి ॥ అడ్డ ॥

శ్రీవేంకటేశ ఆపె చేరి పాదము దొక్కఁగా
సేవకురాలంటా పొన్పుచెంత నుంటిమి
భావించి నన్నేలితివి పట్టపలమేల్మంగను
అవనిత నిన్నంటగా [1]అఁడుజెట్టైనుంటిమి ॥ అడ్డ ॥ 84

రేకు 1515 భైరవి

ఇచ్చెరిఁగి సేవలు సేయించుకోవదా
ఘచ్చికతోడ నన్ను మన్నించేవాఁడవు ॥ పల్లవి ॥

నిద్దిరించేవేళ నన్ను నీవేల లేపితివి
వొద్దఁ గాచుకున్నసతి యుండఁగాను
అద్దుకొని నాపై బత్తి అంత నీకుఁ గలిగితే
అద్దమరాతిరిదాఁకా నలయించవలెనా ॥ ఇచ్చె ॥

తొడ చరచి నన్నేల అడిగేవు విడెము
అడపమువనిత నీకందియ్యఁగా
కడుఁదమకము నాపైఁ గలవాఁడవై తేను
అడియాసలఁ బెట్టి నన్నలయించవలెనా ॥ ఇచ్చె ॥

1. అఁడుజెట్టి+అని

బలిమిచేసి నన్నెంత పచ్చిచేసి కూడితివి
అల మేల్మంగ నీవురమందు నుండఁగా
యేమి శ్రీవేంకటేశ యిద్దరము నితవై తే
అలవోకగా నన్ను నేఁయించవలెనా ॥ఇచ్చె॥ 85

ముఖారి

నేఁడే యింత సేయకుంటే నింద వాయదు
పోఁడిమితో విన్నవారు పొంచి నవ్వే రిందుకు ॥పల్లవి॥

జాడతో నీతమ్ములము సతి యడుగఁగ వచ్చి
యేడదో యనుచు సందేహించుకొనెను
తోడనే నమ్మికగాను తోడుకవచ్చి యాకెతో
వోడక యాసలువెట్టి వొడఁబరచవయ్యా ॥నేఁడే॥

తెలిలి నీమోవితేనెతీపు చవిగొని ఇంతి
మఱవ్వ తెంగిలో యని మది నెంచెను
తలితోడ నాపెలోనితడఁబాటులెల్లాఁ దీర
గుటియైనబాస చేసి కొంకు దేర్చవయ్యా ॥నేఁడే॥

అంది నీవురము గంద మలమేల్మంగ యలఁది
యెందుఁ దెచ్చితివో యంటా యీసడించీని
ఇందునే శ్రీవేంకటేశ యెరపరికము వాయ
కందువఁ దారుకాణించి కాఁగిలించవయ్యా ॥నేఁడే॥ 86

పాడి

తగు నీకు నిట్టిజాణతనములెల్లా
మిగులా మావంటివారు మెచ్చిరి నిన్నిపుడు ॥పల్లవి॥

పడఁతి విడెమియ్యఁగా పరాకైనవానివలె
చిడుముడితోఁ జన్నులు చేతఁబట్టేవు
జడియ కాపెపయ్యద సారెసారె సోదించేవు
బడి నీవిడెమేమైనా పయ్యదలో నున్నదా ॥తగు॥

ఇంతి కైలా గియ్యఁగాను యెఱఁగనివానివలె
వింతలేక ఆపెవోడి వెసఁ బట్టేవు
పొంతనే యప్పటి నాపెకొఁకముడి విడిచేవు
కాంతవోడిలో నీకుఁ గైదండ వున్నదా ॥తగు॥

కలికి యద్దము చూపఁగా భ్రమసేవానివలె
నిలిచి యాపెచెక్కుల నీడచూచేవు
మలసి శ్రీవేంకటేశ మరిఁ దమకించి కూడే-
వలమేల్మంగచెక్కుల నద్దము లీకున్నదా ॥తగు॥ 87

ఆహిరి

తలఁచుకొనఁగదే యాతనివల్ల నేరమేది
యెలమిఁ దారుకాణలే ఇన్నియుఁగావా ॥పల్లవి॥

పచ్చిపోఁకఁగొని నీగుబ్బ లాతఁడు వేసెనంటా
కొచ్చికొచ్చి నీవేల కోపగించేవే
ముచ్చటగా నీచన్నులు మొలచేయప్పటివేళ
అచ్చముగా నాపోఁకలంతేసివే కావా ॥తలఁ॥

తామరతూఁడున నీచెయి దాఁకించెనంటాను
వేమారు నాతని నెన్నివెంగే లాడేవే
భూమిలో నీకరములు పోలించి చూచితేను
అనుని తామరతూండ్లఅందములే కావా ॥తలఁ॥

తతి నీమెడ ముత్యాలదండ దగిలించెనంటా
మితిమీరినసిగ్గు లేమిటికె నీకు
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
రతిచెమట ముత్యాలరాసులే కావా ॥ తల ॥ 88

వరాళి

ఏకతాన నుంటిరి మీరిద్దరు నిందాఁకాను
కోకతో రారయ్యా మీరు; చూచేను మీరూపులు ॥పల్లవి॥

ఇంతిపాట లిందాఁకా నీడేర వింటివా
చెంత నామేలుకు సంతోసించుకొంటివా
బంతి నుండి యవి నీవు పాటములు గొంటివా
వింతలుగాఁ జెప్పవయ్యా వినేను మీసుద్దులు ॥ ఏక ॥

మగువచేసినసేవ మనసున్నఁ బట్టెనా
తగ నందు లోలుఁడవై తగిలితివా
మగుడి యట్టె నీకు మర్మము గరఁగెనా
వెగటుగా దానతీ వినేను మీసుద్దులు ॥ ఏక ॥

అలమేలుమంగ వురమందు నీకు నిలిచెనా
కలఇకలెల్లా మెచ్చి కైకొంటివా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వెలయ నాకెరుఁగించు వినేను మీసుద్దులు ॥ ఏక ॥ 89

శ్రీరాగం

గుట్టుతోడనున్ననన్ను గొరబేల సేసినే
దిట్టతనము నేఁ జూపితే గయ్యాళి యనఁడా ॥ పల్లవి ॥

సరసమాడినవాఁడు సంగడిఁ గూచుండుఁగాక
సొరిది నామనసెంత సోదించీనే
తెరవేసుకున్న వాఁడు తెచ్చి విడె మిచ్చుఁగాక
అరసి న న్నప్పటి నెం తడుగవచ్చీనే ॥గుట్టు॥

సెలవి నవ్వినవాఁడు సిగ్గులు దేరుచుఁగాక
అలసి తానింకా నేమి అందుకాచీనే
పిలిపించుకొన్న వాఁడు ప్రియమునఁ గూడుఁగాక
వొలిసి నన్నెందాఁక నొడఁబరచీనే ॥గుట్టు॥

చేనకినవాఁ డిట్టె చేరి కాఁగిలించుఁగాక
చనవిచ్చి మీతో నేమి సన్న సేసీనే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నన్ను
తనిసి రతుల నెంత తప్పక చూచీనే ॥గుట్టు॥ 90

రేకు 1516 ఆహిరి

భామతోఁడిపొందు నీకు భాగ్యము గాదా
చేముట్టి సరసమాడి సిగ్గు దేర్చరాదా ॥పల్లవి॥

కలువరేకులవంటికన్నులఁ దేలించి చూచి
మలసి సొలసి నీతో మాటలాడీని
పిలిచి వద్దఁ గూచుండఁబెట్టుకొని కాఁగిట
కలయరాదా యేల కాఁకలు సేసేవు ॥భామ॥

చిగురుఁదీగెలవంటిచేతులనే నీకు మొక్కి
నగినగి నీతోనే నఁటుచూపీని
బిగివాయకుండా నీవు పచ్చడము మీఁదఁ గప్పి
తగవు నెరపరాదా తడవేల సేసేవు ॥భామ॥

పసిడికుండలవంటిపాలిండ్ల నిన్నొరసి
కొసరి వూర్పులఁ దావి కువ్వళించీని
యెసగ శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి యిట్టె
వసమై యుండఁగరాదా పరుసేల సేసేవు ॥ భామ ॥ 91

శంకరాభరణం

అందు కేమిదోసము ఆనతియ్యఁగదవయ్య
యిందరి నీవేలేది యెఱఁగమా యెపుడు ॥ పల్లవి ॥

బోన మాయితముసేసి పొలఁతి విలువఁగాను
ఆనాటినే విడె మడిగేవు
పూని యేడనైనా నీవు బోజనము సేసితివో
యేనెలఁతవిఁ(విం?)దైనా నియ్యకొంటివో ॥ అందు ॥

కంచముపట్టుసేసి కాంత గూచుండు మనఁగా
మంచినీ ళ్లిమ్మనేవు మఱి నాపెనే
అంచెలఁ బిండివంటలే యారగించి వచ్చితివో
పొంచి యెవ్వతైనా వొక్కపొద్దు చెప్పెనో ॥ అందు ॥

కలవెల్లా వడ్డించి కడి యెత్తు మనఁగాను
అలమి మోవితేనియ లడిగేవు
యెలమి శ్రీవేంకటేశ యేకారము నంటితివో
నెలవై నన్నుఁ గూడితి నీకు నిదేప్రియమో ॥ అందు ॥ 92

రామక్రియ

మాముందరఁ దెచ్చి యెంత మట్టుమీర నవ్వేవు
ప్రేమగలితే లోనికిఁ బిలుచుకోరాదా ॥ పల్లవి ॥

నీకు నాకెకును నేఁడు నేస్తమంత గలితేను
కైకొని నీమెడఁ గుచ్చి కట్టుకోరాదా
వాకముగ దొరఁజేయవలసితే నీముందర
కోక వరచి యందు పైఁ గూచుండఁబెట్టరాదా ॥మాము॥

నెలఁతపై మోహము నిలుపరాకుంటేను
సొలసి పయ్యెదలోను చొచ్చుకోరాదా
తలకొన్న యాకెచక్కఁదనము నీకుఁ జాఁతైతే
పొలుపుమీర వర్ణించి పొగడరాదా ॥మాము॥

సుదతికి నీకు నిట్టె చుట్టరికమైతేను
కదిసి యెంగిలిపొత్తు గలయరాదా
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
పొదిగే వాపెను నీవీఁపున నిలుపరాదా ॥మాముం॥ 93

కాంబోది

రావయ్యా ఇఁకనైనా రమణి వేఁడుకొనీని
వావిరి నీకెతో నింత వాసు లెంచఁదగునా ॥పల్లవి॥

పంతమాడరాదుగాని పచారించి నవ్వవచ్చు
మంతనాన సతికిని మగనితోను
వింతసేయరాదుగాని వెంగెమైనా నాడవచ్చు
చెంతఁ దనమాట చెల్లించేవానితోను ॥రావ॥

సిగ్గుపడరాదుగాని చేరి జంకించఁగవచ్చు
కగ్గక తనపై బత్తిగలవానితోను
వెగ్గళించరాదుగాని వేమారుఁ గొసరవచ్చు
సిగ్గులఁ దన్ను మన్నించేనెరజాణతోను ॥రావ॥

రచ్చఁ బెట్టరాదుగాని రతిఁ బెనఁగఁగవచ్చు
యెచ్చటా నెగ్గుపట్టనియిష్టునితోను
మచ్చరించరాదు గాని మనసు గరఁచవచ్చు
కచ్చుపెట్టికూడే శ్రీవేంకటేశుఁడ నీతోను ॥రావ॥94

నట్టనారాయణి

చూచినవారు నవ్వరా చొప్పులెత్తి నన్నైనా
లాచి నాతోఁడుతను మేలములాడీ యిప్పుడే ॥పల్లవి॥

కొప్పు దువ్వి కొలువులో కొనగోరఁ జెనకీని
చెప్పరే పతికి బుద్ది చెలులాల
చప్పుడుసేయక యెంత సన్నసేసిన మానఁడు
ఇప్పుడు సిగ్గువడఁడు ఇందరిలోఁ దాను ॥చూచి॥

ముట్టి నందరిముందు మొకము దప్పక చూచీ
రట్టుసేయకుమనరే రామలాల
గుట్టుతోఁ బరాకుసేసుకొనినాను యెఱఁగఁడు
[1]కట్టఁగడవా రిందుకు కాకుసేయరా ॥చూచి॥

సరిపాదము దొక్కీని సంగడివారుండఁగాను
తెరవేసుకొమ్మనరే తెరవలాల
ఇరవై శ్రీవేంకటేశుఁ డింకా రతిఁ దనియఁడు
సిరులఆనోదము చెప్పరా దితనికి ॥చూచి॥ 95

బౌళి

పచ్చిదేరె నీపనులు భామలముందరనెల్లా
కచ్చుపెట్టి ఇఁక నీకుఁ గాదన నేమున్నది ॥పల్లవి॥

---

1. ఇందరసున్నవిచార్యము.

వావులు చెప్పుకొంటాను వద్ద నాపె వుండఁగాను
నీ విందరిలోఁ దారుకాణించుకోవద్దా
భావించక నీ వెక్కడో పరాకున నుండితేను
అవిధము నీకు సమ్మతైనట్టేకాదా ॥పచ్చి॥

గుఱుతులు చూపి యాపె కొలువులు సేయఁగాను
పిఱితీసి నీవు తప్పించుకోవద్దా
తఱితో నిప్పుడు మొకదాకిరితో నుండితేను
యెఱిఁగెఱిఁ గిదియెల్లా నియ్యకొంటేకాదా ॥పచ్చి॥

సరసములాడి యాపె చన్నుల నొత్తఁగాను
వరుసతోఁ జేతనంటి వారించవద్దా
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
గరిమ నూరకుండితే కైకొంటేకాదా ॥పచ్చి॥ 96

రేకు 1517 హిజ్జిజి

నీ వెఱఁగనివి లేవు నెరజాణవు
భావించి మీవలపులు పచారించవలెనా ॥పల్లవి॥

పడఁతిచూపులలోనే పదివేలు విన్నపాలు
అడియాలము లన్నియు నందే వున్నవి
అడుగనేఁటికి మమ్ము ఆపె నిట్టె కరుణించు
విడిముడిగా నిఁక విచ్చి చెప్పవలెనా. ॥నీవె॥

లలనవ్వులలోనే లక్షలై నయిచ్చకాలు
కలవెల్లా నందులోనే కానిపించీని
తెలుపనేఁటికి నిన్నుఁ దెఱవను మన్నించు
వెలలేనిసిగ్గులెల్లా వెలియవేవలెనా ॥నీవె॥

కోమలి కాఁగిటిలోనే కోటికోటివినయాలు
ఆముకొని యెంచిచూడ నందే వున్నవి
చేముంచి నేఁటి కాపెను శ్రీవేంకటేశుఁడ యేలు
ప్రేమపురతులు నీతోఁ బేరుకుచ్చవలెనా ॥నీవె॥ 97

లలిత

వద్దనేమా మమ్ముఁ దాను వాసి రేఁచవద్దుగాక
పొద్దొకవింతలుగాను భోగించనీవే ॥పల్లవి॥

తరుణి యిందరిలోనా తనకు ఘాఁతై తేను
సిరుల పీఁట వెట్టి పూజించనీవే
గరిమ నాపెమాటలు కడువేడుకై తేను
వొరసి యేపొద్దుఁ జెవులొగ్గి విననీవే ॥వద్ద॥

పడఁతికిఁ దానిచ్చినబాస మీరరాకుండితే
బడిఁ బెట్టుక తిరిగి బదుకనీవే
అదరి యాపెపై బత్తి ఆఁపరాక వుండితేను
పుడమి నాపెగుణాలు పొగడనీవే ॥వద్ద॥

మదిరాక్షి కాఁగిలి మరిగి తా నుండితేను
కొదలేనిరతులనుఁ గూడనీవే
ఇదె తాను శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గలసె
వదల కీసుద్దు లాపెవద్దఁ జెప్పనీవే ॥వద్ద॥ 98

మధ్యమావతి

ఆతనినేల సాదించే రంగనలాల
చేతికిలోనైనదాఁకా సేవసేసే మిఁకను ॥పల్లవి॥

పతియైనవానికి పట్టరానివలపైనా
సతులు పెక్కయితేనే చౌకలౌను
రతి నందరికిఁ గడురసమైనమోవితేనె
తతిగాక వుండితే నెంతయుఁ జప్పనౌను ॥ అత ॥

కూరిమి చుట్టమైనాను గుట్టువిడి చేపొద్దు
సారె మాటాడితే మొగచాటౌను
కోరి వేడుకతోడ గొనకొన్ననవ్వులు
వేరఁబెట్టుకొంటేనే వెనుఁగాఁక లవును ॥ అత ॥

అంటి వేరొక్కతెపొందు లాసపడేవానికి
వెంటవెంటఁ దిరిగితే వేసటౌను
నంటున నిదివో కూడె నన్ను శ్రీవేంకటేశుఁడు
దంటతనానఁ బైకొంటే తరితీపు లౌను । అత ॥ 99

శ్రీరాగం

పతిమీఁది మోహము పడఁతి కిట్టుండవద్దా
సతతము నీహితవే సారెఁ గోరీఁ దాను ॥ పల్లవి ॥

బలిమిఁ బయ్యదకొంగు పట్టి నీవు దీసితేను
నెలఁతకొప్పువిరులు నీపై రాలెను
అలరి యందుకు మరుఁ డమ్ములు గురిసెనంటా
కలికి భ్రమసి నిన్ను కాఁగిలించుకొనెను ॥ పతి ॥

వొట్టుక నీవావెను వొరసి పెనఁగితేను
తొట్టినమైకప్పురపుదూ(ధూ?)ళి నిన్నంటె
నెట్టనఁ జందురుఁడు వెన్నెలచొక్కు చల్లెనంటా
గట్టిగాఁ దెలియలేక కాఁగిలించుకొనెను ॥ పతి ॥

ఇమ్ముల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే
నెమ్మిఁ జెమటబొట్లు నీమై నిండెను
చిమ్మి యీతఁడు నించినసేసలే పైకొనెనంటా
కమ్మర నచ్చెరువంది కాఁగిలించుకొనెను ॥పతి॥ 100

పళపంజరం

రావయ్యా ఇఁక నేల రవ్వసేసేవు వలపు
కైవసమయినవారిఁ గారించవలదు ॥పల్లవి॥

ఆఁపరానితమితోడ నాపె యెదురుచూడఁగా
మాపుదాఁకాఁ జెలులతో మాటలాడేవు
కాఁపురాలు సేసేమని కాచుకున్న వారి నింత
యేఁపుఁబెట్టితే నిన్ను నెట్టు నమ్మేరిఁకను ॥రావ॥

ప్రేమతోడ నిన్ను నాపె పేరుకొని పిలువఁగా
నామోము దప్పక చూచి నవ్వు నవ్వేవు
కామించివచ్చినయట్టి కాంతల నింత నేసితే
యేమగువలైనాను యెట్టు నమ్మేరిఁకను ॥రావ॥

కమ్మి యలమేలుమంగ కాఁగిలించుకొనఁగాను
చిమ్ముల నీలోనే యేల సిగ్గువడేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
యెమ్మెకాఁడవైతేఁ బరులెట్లు నమ్మేరిఁకను ॥రావ॥ 101

ఆహిరి

చూతువు రావయ్యా నీసుదతి వున్నలాగులు
యీతల విన్నవించఁగ నెవ్వరు నేరుతురు ॥పల్లవి॥

చిత్తమెల్లా నీమీఁద చేతులు చెక్కులమీఁద
కొత్తకొత్తచెమటలు గుబ్బలమీఁద
తత్తరము మదిలోన తా నున్నది తెరలోన
హత్తె నీపై వలపులు అంగన కీరీటిని ॥ చూతు ॥

చెప్పేమాట చెలితోడ చిరునవ్వు సిగ్గుతోడ
దప్పి కప్పురపుమోవి లప్పతోడను
కొప్పుజారెఁ జెంపనంది కోరికె నీతని(ను?)సంది
వుప్పతిల్లీఁ దలపోఁత లువిద కీరీటిని ॥ చూతు ॥

పులకలు నిలువెల్లా పొందికలే కాఁగిలెల్లా
పిలుపుఁబ్రియములే పెదవులెల్లా
కలసితి వింతలోనె కాంతను శ్రీవేంకటేశ
కలిగె వేడుకలెల్లా కలికి కీరీటిని ॥ చూతు ॥ 102

రేకు 1518 సాళంగనాట

ఎడమాటాడించనేల యెమ్మెలఁ బెనఁగనేల
వొడఁబడవలెఁగాక వొక్కటైనవారికి ॥పల్లవి॥

వలపులు మొదలనే వా(వ్రా?)సివున్నవి నుదుళ్ల
చలపాదితనమేల సరసులకు
మొలచినతరితీపు మోవితేనెల నున్నది
యెలయింపు లేఁకనేల యెనసినవారికి ॥ ఎడ ॥

తనివోనికోరికలు [1]దాఁచివున్నవి మతుల
కినియనేఁటికి నెటిఁగినవారికి
నినుపులై పాయములు నిండివున్నవి మేనుల
అనుమానించఁగనేల ఆసగలవారికి ॥ ఎడ ॥

1. 'దాఁగివున్నవి' అనుట కిది వ్యావహారికము కావచ్చును.

పరగినరతులెల్లా పాఁతివున్నవి కాఁగిళ్ల
నెరసులు మరియేల నేర్పరులకు
గరిమ శ్రీవేంకటేశ కలసితి రిద్దరును
పొరపొచ్చా లిఁక నేల పొఁ(బ్రొం?)దైనవారికి ॥ఎడ॥ 103

నాదరామక్రియ

వక్కణించి చూడ మగవాఁడవు నీవై తేనేమి
పక్కన నింతులఁ గంటే పట్టలేవు మనసు ॥పల్లవి॥

మగువ యెవ్వతో తెరమఱఁగునఁ బాడఁగాను
తగిలె నాపెమీఁద నీతలఁపెల్లాను
మొగము చూచితే నెంతమోహింతువో నీవిఁకను
మిగులా నెంచిచూచితే మెత్తన నీమనసు ॥వక్క॥

కామిని యెవ్వతో లోన గాలిపడె గాడించఁగా
కామించి యానందానఁ గరఁగితివి
ఆముకొని మేనుమేను నంటితే నెట్టుండుదువో
దీమసాన మరిగితేఁ దిప్పలేవు మనసు ॥వక్క॥

సతి యెవ్వతో మెలఁగుచాటునఁ జేయిచాఁచఁగా
రతికెక్కి వేడుకల రమించితివి
ఇతవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
గతియని నమ్మితేను గట్టిది నీమనసు ॥వక్క॥ 104

పాడి

గుట్టుతో నే నుండిన నాగుణ మెంచఁడు
ఇట్టె తా నెట్టుండినా నేమి సేయవచ్చునే ॥పల్లవి॥

కొలువులో నే నుండఁగా కొంగువట్టి తీసీని
    చులకఁదనము గాదా చూచేవారికి
బలుదొర తాను సిగ్గువడ నేరకుండితేను
    యెలమిఁ దన్నిందరిలో నేమిసేయవచ్చునే ॥ గుట్టు ॥

బంతినుండి పెండ్లిపాట వాడఁగా నన్నుఁ జెనకీ
    ఇంతయు వెగటుగాదా ఇంటివారికి
పంతగాఁడు తన కెరపరికము లేకుండితే
    ఇంతినైననాకుఁ దను నేమిసేయువచ్చునే ॥ గుట్టు ॥

విందుచెప్పి వడ్డించఁగా వెస నామోవి సోఁకించీ
    అందె నగుఁబాటుగాదా అండవారికి
కందువఁ గూడె శ్రీవేంకటేశుఁడు తానె నన్ను
    ఇందె తెరవేసె నిఁక నేమిసేయవచ్చునే ॥ గుట్టు ॥ 105

సౌరాష్ట్రం

మఱి నీవేమిసేసినా మంచిదేకాక
    ఱలసి నిన్ను మార్కొన చలమా యిది ॥ పల్లవి ॥

చెలరేఁగి నీవు నాచేతికి విడెమియ్యఁగా
    బలిమిఁ బట్టకుండఁగా పంతమా యిది
వెలలేనివేడుకతో విరుల నన్ను వేయఁగా
    మలసి తప్పించుకొను(న?) మదమా ఇది ॥ మఱి ॥

ఆదిగొని నీవు నాఆయములు ముట్టఁగాను
    కాదని చేపట్టితోయ గర్వమా యిది
అదరించి నీవు నన్ను అలుకలు దేర్చఁగాను
    సాదించ నీతోడి మచ్చరమా ఇది ॥ మఱి ॥

నగుతా శ్రీవేంకటేశ నన్ను నీవు గూడఁగాను
యెగసక్కెలాడ నాకు యెమ్మెలా యిది
తగినరతుల నన్నుఁ దనియఁగఁ జేయఁగాను
సొగిసి నేఁ గొసర నాసోదమా యిది ॥మఱి॥ 106

ముఖారి

ఏల రట్టుసేసుకొనే విదె నీవె నీవలపు
వాలాయించక నేఁ దలవంచుకొనరాదా ॥పల్లవి॥

కామినిముఁ(ముం?)జేయి నీవు కైదండ వట్టుకొని
నామోము చూచినందుకు నగరాదా
అముక యాపెదండ నీ కటు చెమట గారఁగా
యేమీననక పరాకై యిట్టుండరాదా ॥ఏల॥

నేరుపుతో నాపెసొమ్ము నీమెడఁ బెట్టుకరాఁగా
నీరెంటెము నీకుఁ గప్పి నే దాఁచరాదా
చేరిచేరి యాపెకుఁగా చిత్తమెల్లాఁ గరఁగఁగా
కోరి యెఱఁగమి సేసుకొని వుండరాదా ॥ఏల॥

కూడికూడి యాపె నీవు కుచ్చి కాఁగిలించుకోఁగా
వేడుకతో నేఁ దెరవేయరాదా
యీడనె శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
తోడనే నీమోవి గుఱుతులు వెట్టరాదా ॥ఏల॥ 107

మాళవిగౌళ

చెల్లుబడిగలనాఁడే చేఁతలిన్నీ నమరును
చల్లఁగా నిప్పుడే నీసలిగె మెఱయవే ॥పల్లవి॥

పచ్చిదేరె సిగ్గులు పట్టరాదు యెగ్గులు
మచ్చిక నాతనితోనే మాటలాడవే
రచ్చకెక్కె గరువము రతి కిదె పరువము
వచ్చినాఁడు పతి నిట్టె వలపించుకోనవే ॥ చెల్లు ॥

వెలసె నీనవ్వులు వెంగే లిఁక దవ్వులు
చలివాసె నిఁక సరసములాడవే
తలకొనెఁ బొందులు దక్కె మోవివిందులు
కలుపుకోలుసేసుక కాఁగిలించుకోనవే ॥ చెల్లు ॥

నెట్టుకొనెఁ జూపులు నిండెఁ దరితీపులు
దట్టమై యీతని కిఁకఁ దమిరేఁచవే
అట్టె శ్రీవేంకటేశుఁ డలమేలుమంగను
గుట్టుపడ నన్నుఁ గూడెఁ గోరి మెచ్చఁగదవే ॥ చెల్లు ॥ 108

రేకు 1519 బౌళి

నీవేల సిగ్గువడేవు నెట్టన నన్నుఁ జూచి
భావించ నీవన్నిటా పంతగాఁడవు ॥పల్లవి॥

తగవులఁబెట్టేనా తారుకాణించవచ్చేనా
జిగి నీవుసేసినచేఁతలకెల్లా
అగడు నేఁ జేసేనా అంతటా నాడుకొనేనా
పగటుతో నీవేమిటాఁ బరగినను ॥నీవే॥

నెరసులు వెదకేనా నిష్ఠూరము వేసేనా
నిరతపుజాణవై ననిమీఁదను
యెరవులుసేసేనా యెగ్గులు నేఁ బట్టేనా
సరస మెవ్వతెతోడ సారె నీవాడినను ॥నీవే॥

చలము సాదించేవా జంకించి పెనఁగేనా
నిలువెల్లాఁ దమిరేఁగి నీవుండినా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
అలమేలుమంగ నింతె అవుఁగాదనేనా ॥ నీవే ॥ 109

నట్టనారాయణి

ఎంత తమకించేవు యేమోయి
మంతనమాడేనంటా మారుమలసేవు ॥ పల్లవి ॥

నిగిడి యలిగితినా నీకు నీవే వేగిరించి
నగనైతినంటా గోరు నాటించేవు
యెగసెక్కేపుదానవా యేమేమో భావించి
మొగము వంచితినంటా ముంగురులంటేవు ॥ ఎంత ॥

చలము సాదించేనా సరి నింతలో నింటికిఁ
బిలువనంటాఁ జన్నులు పిసికేవు
బలిమికత్తెనా నీతో పంతముగ నూరకైనా
పలుకనంటాఁ గొంగువట్టి తీసేవు ॥ ఎంత ॥

వాసితోఁ గాఁగిలించనా వట్టినెపములు వేసి
రాసి యలసితినంటా రవ్వసేసేవు
ఆసల శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
వేసారనంటా నన్ను వేడుకతో మెచ్చేవు ॥ ఎంత ॥ 110

గుజ్జరి

కోపగించుకొనదూ కొసరి నిన్ను దూరదు
వోపికతోఁ, దన కెంతవోరుపో కాని ॥ పల్లవి ॥

చెక్కుటి చేతితోడ సిగ్గువడి జవరాలు
పక్కనఁ జన్నులు నిమ్మపంట వేయఁగా
తక్కక నీమోము చూచి తలవంచుకొనీఁ దాను
మక్కువతోఁ గొనగోర మర్మము లంటఁగను ॥ కో ప ॥

మలఁగుమాటున నుండి మచ్చిక నవ్వీఁ జెలి
చలివాపి నీవు సరసములాడఁగా
వెలయ నీమాట విని వెరగునొందీఁ దాను
తలకొన్న రతులెల్లాఁ దలపించఁగాను ॥ కో ప ॥

ముచ్చటతో నిన్నుఁ గూడి మొక్కీ నలమేలుమంగ
పెచ్చురేఁగి కాఁగిటిలోఁ బెనఁగఁగాను
ఇచ్చగించి శ్రీవేంకటేశ నిన్ను మెచ్చీఁ దాను
నిచ్చలాన మోవితేనె నీ వియ్యఁగాను ॥ కో ప ॥ 111

వరాళి

ఎంత తక్కరిఁ డితని నేమందునే
బంతినే నాకు వలపు పంచిపెట్టీని ॥ పల్లవి ॥

చెలిఁ దాను బాసలుచేసుకోఁగా నే వచ్చితే
కెలన నన్నందుకే సాకిరివెట్టీనే
నిలిచి నే నంతలోనె నివ్వెరగుతో నుండితే
కలుపుకోలుతనాలు గలుగఁజేసీనే ॥ ఎంత ॥

వొక్కపొత్తున నిద్దరు నుండఁగా నే వచ్చితే
చిక్కించు కెంగిలిలో నాచేతులద్దీనే
తక్కక నే మొగమోటఁ దలవంచుకొంటేను
వొక్కటిగాఁ జుట్టరిక మొనరఁ జెప్పీనే ॥ ఎంత ॥

ఆకెఁ దానుఁ గాఁగిట నలరఁగా నే వచ్చితే
కోక నామీఁదఁ గప్పి కొంకుదేర్చినే
ఆకుమడిచిచ్చీ నాపె అలమేలుమంగ నేను
యీకడ శ్రీవేంకటేశుఁ డితఁడే నన్నేలెనే ॥ఎంత॥ 112

సాళంగం

తనంత వచ్చినదెల్లా తరితీపు లేలాను
పెనఁగులాటలమీఁదఁ బ్రియము లౌఁగాక ॥పల్లవి॥

కానుకిచ్చినాపె వద్దఁ గాచుకుండఁగా నెక్కడో—
మానినులతో నీవు మాటలాడేవు
పూనిపట్టి విడెమిచ్చేపొలఁతి యటుండఁగాను
మానక చేయిచాఁచేవు మరొకతెమీఁదను ॥తనం॥

చేరి వుండినాపె నిన్నుఁ జెనకుచు నుండఁగాను
వూరివారిఁ జూచి నీవు వువ్విళ్లూరేవు
కోరి నీకుఁ బాదాలొత్తేకొమ్మ నీతో నవ్వఁగాను
తేరకత్తెలతో నేల తెగడవచ్చేవు ॥తనం॥

కొలువుసేసేయాపె [1]కోరి వేఁడీఁ దగులఁగా-
నలమేల్మంగరతికి నాసపడేవు
యెలమి శ్రీవేంకటేశ ఇందరు నీకుండఁగాను
లవి మోహపుటాపెమేలము మెచ్చేవు ॥తనం॥ 113

దేసాళం

ఆపె వచ్చినప్పు డన్ని నయ్యాఁగాని
వోపుదునా దొరవు నీవొగిఁ గాచుకుండను ॥పల్లవి॥

1. కోరియు, వేఁడుకొనియు అని కాఁబోలు.

పిలిచే వాకెను నీవు ప్రియపడి; నేనైనాఁ
జెలిమారు సేవచేసేఁ జెప్పవయ్యా
అలఁదేనఁ(నం?)టా గంధ మట్టె చేఁబట్టుకున్నాఁడ—
వలరి నావురముపై నందాఁకా దాఁచవయ్యా ॥ఆపె॥

వెదకే వాపెను నీవు; వేడుకతో నే నుందాన
యెదుట; నాపని యానతియ్యవయ్యా
ఇదె విడె మాకెకు మీఁదెత్తుకొన్నాఁడ; వందాఁకా
పొదిగి నాపుక్కిట నిప్పు డుండనీవయ్యా ॥ఆపె॥

చూచే వాపె కెదురు; సుద్దులు నేఁ జెప్పేను
చేచేత నీవెట్టయినాఁ జెనకవయ్యా
యేచి శ్రీవేంకటేశుఁడ యే నలమేలుమంగను
కాచి నన్నేలితివి ఆకాంతమారే నేనయ్యా ॥ఆపె॥ 114

రేకు 1520 శంకరాభరణం

MP3

ఎంత నేరుచుకొన్నది యీచిన్నది
చెంత నుండే నిన్ను నిట్టె చేకొన్నది ॥పల్లవి॥

చిగురుఁబెదవిమీఁదిచిన్నలూ
సగముమాటలతోడిసన్నలూ
నగియేటిసెలవులనయములూ
బిగిసేటికాఁగిటిప్రియములు ॥ఎంత॥

తనివోక చెలులతో తలపోఁతలూ
ననుపు లేపొద్దుమాననిచేఁతలు
పనివడి నీమీఁదిపాటలూ
మొనసి యెప్పుడు నీతో మొగమోటలు ॥ఎంత॥

వద్దనుండి పైఁజల్లీ వలపులు
అద్దుకొనీ రతిలోని యలపులు
వొద్దికై శ్రీవేంకటేశ వొనగూడితి వీకెను
కొద్దిమీరె బింకములు కూడినపొంకములు ॥ఎంత॥ 115

సింధురామక్రియ

చూడ నిట్టున్నది గాని జూటుఁదనమే మేనెల్లా
యీడ నేర్చుకోరాదా యీపెచేత నీవు ॥పల్లవి॥

మనసుమర్మ మెఱుఁగు మాటలాడనేర్చు నాపె
వినరాదా వీనులార వేడుకతోడ
పెనఁగులాడఁగనోపు ప్రియములు చెప్పనోపు
చెనకఁగవలదా నీచేతులకొలఁది ॥చూడ॥

చలిమి బలిమి గద్దు చవులు వుట్టించు నాపె
చెలిమి సేయఁగరాదా సిగ్గువడక
మొలకచన్నుల నొత్తు మొనసి పాదములొత్తు
పిలిచి బుజ్జగించితే పెద్దరికముగాదా ॥చూడ॥

కేరి కేరి నీతో నవ్వు కిందుపడి మొక్కునాపె
సారెకుఁ గూడఁగరాదా సమరతుల
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఆరమణిపొందులు నీ కంకెకెల్లా వచ్చును ॥చూడ॥ 116

సావేరి

ఎంత నన్నుఁ బొగడేవు యెటువలె బుజ్జగించి
వింతదాననా నీకు వినయపుటాలను ॥పల్లవి॥

కోరికతో మగఁడు యేకోమలితో నవ్వినాను
నేరము లెంచనిదే నెలఁత
ఆరజాన తనమేన జీరలు దీయించుకొంటే
గారవించి పచ్చడానఁ గప్పినదే మగువ ॥ ఎంత ॥

వేడుక యేసతిమీఁద విభునికిఁ గలిగినా
తోడుకవచ్చినదే తొయ్యలి
కూడేవేళ యెంతేసియెక్కుడుప్రియాలు చెప్పినా
ఆడుకోక వుండినదే అంగన ॥ ఎంత ॥

పచ్చిగా రమణుఁడు యేపడఁతిఁ బెండ్లాడినాను
ఇచ్చకమై యుండినదే ఇంతి
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిచ్చలు నావంటిదే నీకు దేవులు ॥ ఎంత ॥ 117

## సామంతం

నీకుఁ బోదు నాకుఁ బోదు నీవేల సిగ్గువడేవు
కాకుసేసి నీ మీఁద కాఁతాళించేనా ॥ పల్లవి ॥

యెంత నీవేమిసేసినా ఇచ్చకమాడుదుఁగాక
పంతములాడేనా పతివి నీవు
చెంతఁ జేరకుండితేను చేవట్టి తీతుఁగాక
వింతదానివలె నిన్ను వెంగెములాడేనా ॥నీకుఁ ॥

నీవెంతపరాకై వున్నా నిన్ను నెచ్చరింతుఁగాక
రావంటా నిన్ను దూరేనా రమణుఁడవు
కైవసము గాకుండితే కరుణ వుట్టింతుఁగాక
వేవేలైనా నీకుఁ గడువేసట వుట్టించేనా ॥ నీకుఁ ॥

కడల నీవుండినాను కాఁగిలించుకొందుఁగాక
చిదుముడి పడేనా శ్రీవేంకటేశ
యెడయక మన్నించి యేలితివి నన్ను నేఁడు
తొడిఁబడ నిందరిలో దూరు సేసేనా ॥నీకుఁ॥ 118

నాగవరాళి

తానే తెలుసుకొనీఁ దరుణిలాగు
వీనులలో మనమిట్టె విన్నవించవలెనా ॥పల్లవి॥

చనవుగలదానికి సరసములాడఁజెల్లు
వనుపుగలదానికినవ్వఁ జెల్లు
వినయపుదానికి వేడుకలెలాఁ జెల్లు
మనమేలే యాతనిమర్మము లెత్తఁగను ॥తానే॥

మందెమేళపుదానికి మారుకొనివుండఁజెల్లు
అందగారిదానికి పైయాడఁ జెల్లును
పొందుచేసినదానికి పొగడఁగఁ జెల్లును
మందలించి మన మిట్టె మనుపఁగ వచ్చునా ॥తానే॥

పాయరానిదానికి పంతములాడఁజెల్లు
మాయదారిదానికి మలయఁజెల్లు
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వేయైనా మనమిఁక విడిపించఁగలమా ॥తానే॥ 119

రామక్రియ

చిత్తగించు మోబకేశ శ్రీసతివిలాసములు
ఇత్తలా నత్తలా మీకు నిచ్చకము లాయను ॥పల్లవి॥

యెదురుఁగొండలపైనుండి ఇంతి మోము చూపితేను
అదియే నీకు నిలువుటద్ద మాయను
వదలుఁబయ్యెదలోనివట్రువచన్నులావేళ
కదిసి నీకుఁ జూపినకానుక లాయను ॥చిత్త॥

పొన్నలనీడలలోన పొలఁతి నిన్నుఁ జూడఁగా
సన్నలఁ గప్పురపువసంత మాయను
మన్ననదేవులు నీకై మాటలు నీతో నాడఁగ
వున్నతపుమీరతుల కుంకువ లాయను ॥చిత్త॥

చెంది భవనాశి దాఁటి చేతులు నీపైఁ జాచఁగా
పొందుగా తమ్మివిరులపూజ లాయను
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నాకె గూడఁగా
యెందు చూచినా వేడుక లెక్కు డాయను ॥చిత్త॥ 120

1521 వ రేకునుండి 1530 వ రేకువరకుగల 10 రేకులు లేవు.

రేకు 1531 ధన్నాసి

ఇంతితోడ నీవేల యెదురాడేవు
సంతరించినవాఁడవు చనవియ్యవలెను ॥పల్లవి॥

వలపుగలవానికి వాసు లెంచఁబనిలేదు
చెలు లేమిచెప్పినానుఁ జేయవలెను
కలపుకోలైనచోటఁ గడుబింత సేయరాదు
వొలిసినట్లాను వొడఁబడవలెను ॥ఇంతి॥

మగఁడైనపిమ్మటను మరి యొరవేమిటికి
తగుసతులకు లోనై దక్కవలెను
జగడించరానందుకు చలములు మరియేల
నగినయట్టే నవ్వి ననుచఁగవలెను ॥ఇంతి॥

విడువరాని పొందుకు వేరుచేసుకోఁదగదు
పడఁతులమాట నడపఁగవలెను
యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
వుడివోనివేడుకల వొద్దిక గావలెను ॥ఇంతి॥ 121

శంకరాభరణం

సవతులమైనా నేమి సమ్మతించితిమి నేము
జవళి సరసములు సరి నెంత వేడుకో ॥పల్లవి॥

మాటలాడఁగదవే మనసిచ్చి పతితోను
యేఁటికి సిగ్గులువడే వెవ్వరున్నారు
సూటిగా వినఁగదవే సుద్దులు చెప్పీ నతఁడు
నీటున నెమ్మె నెరప నీతో నెంతవేడుకో ॥సవ॥

జలిసి కూచుండఁగదే సన్నలు సేసీఁ దాను
చిఱునవ్వు నవ్వనేల చిన్నదానవా
నెఱులు దువ్వించుకోవే నేరుతునవీ నితఁడు
తఱితోఁ దొడయెక్కవే తన కెంతవేడుకో ॥సవ॥

ఇట్టె అందుకోవే విడెమిచ్చీ శ్రీవేంకటేశుఁడు
గుట్టు సేయకిఁక నీకు కొంకు దేరెను
నెట్టన నన్నుఁగూడి నీపైఁ జేతులు చాఁచీ
దట్టపుటాసలతోఁ బొందఁగ నెంత వేడుకో ॥సవ॥ 122

బౌళి

ఏమిచెప్పేది నీయాస యెంతకైనా నోపుదువు
ఆముకొన్న నిన్నుఁ జూచి అరుదయ్యీ నాకును ॥పల్లవి॥

సెలవిన వ్వోకతెతో చేసన్న లొకతెతో
ఏమిఁ జేసేవు వలపెందు నున్నది
కొలువు చేసేసతులు కోటానఁగోట్లు
అలరి యెవ్వరి వాఁడ వౌనతియ్యవయ్యా ॥ ఏమి ॥

శిర సొక్కతెతోడపై జిగిఁ బాదా లొక్కతెపై
ఇరవాయ; నీమనసు యేడనున్నది
యిరుమేలా నూడిగపుటింతులు సేనాసేన
యెరవులేక యిందరి నెట్టు మన్నింతువయ్యా ॥ ఏమి ॥

వొక్కతెఁ గాఁగిటఁగూడి వొక్కతె మోవి యానేవు
ఇక్కువై నీభావ మెట్లున్నది
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిక్కము నిఁ(నిం?)తేసి యెట్టు నేర్చుకొంటివయ్యా ॥ ఏమి ॥ 123

గౌళ

నావలె నుండవలదా ననిచి నీతో నవ్వుతా
చేవమీరి పరాకేల చేసుకొనీ నాపె ॥ పల్లవి ॥

చనవిచ్చి నీవు గడుసరసము లాడఁగాను
పనివడి యేల సిగ్గువడీ నాపె
వెనఁగి వెనఁగి నీవు ప్రియములు చెప్పఁగాను
విని [1] వినవెట్టు యేల వెరగందీ నాపె ॥ నావ ॥

వచ్చిగా నీవు చన్నులపైఁ జేయివేయఁగాను
కొచ్చి పయ్యదేల మూసుకొనీ నాపె
కచ్చుపెట్టి నీవు తన్నుఁ గాఁగిలించుకొనఁగాను
పెచ్చువెరిగి తానేల బిగిసీ నాపె ॥ నావ ॥

---

1. 'వినవట్టు' కావలె; లేదా 'వినని + అట్టు.' అనుటకు వ్యావహారికమైన కావలె.

గుట్టున నింటిలో నీవు కొంగువట్టి తియ్యఁగాను
పెట్టరానియానలేల పెట్టీ నాపె
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
చుట్టుక తానేల కూడి సొలసీ నాపె ॥నావ॥ 124

తెలుఁగుఁగాంబోది

కంతుఁ డేమిసేయునమ్మా గరిమ నోచెలులాల
కాంతలకుఁ బతులకు కలసాజ మిదియే ॥పల్లవి॥

పిలుపులే లోలోనఁ బ్రియములు పుట్టించేవి
తలపోఁతలే గడుఁదమిరేఁచేవి
పలుకులనేరుపులే భావాలు గరఁగించేవి
సేవలనవ్వులే చింతలు వాపేవి ॥కంతుఁ॥

తనివోనిచూపులే తరితీపు సేసేవి
ననుపులే పాయనీక నమ్మించేవి
వినయములే నిండువేడుకలు నెరపేవి
చెనకులే వొండొరుల సిగ్గులు ముంచేవి ॥కంతుఁ॥

జడిగొన్నకోరికలె చవులు వొడమించేవి
యెడవాయకుండుటలే యెనయించేవి
అడరి శ్రీవేంకటేశు కలమేలుమంగకును
వుడివోనియాపోదులే వొద్దికలై వుండేవి ॥కంతుఁ॥ 125

కాంబోది

బుద్ధిచెప్పరే పతికి పొలఁతులాల
అద్దుక యిట్టే జలకమాడుతా నుందాననే ॥పల్లవి॥

చెఱఁగుమాసి నేను సిగ్గుతో నుండఁగాను
అఱలేక నన్నితఁ డేలంటవచ్చీనే
నెఱయ మోనముతోడ నిలుచక నే నుండఁగా
మఱియు నన్నితఁడేల మాటలాడించీనే ॥ బుద్ధి॥

పాసివున్నతమకాన పరాకై నే నుండఁగాను
వేసరక విరులను వేసీ నిదేలే
రాసివిరహానఁ గప్పురము మేనఁజల్లుకోఁగా
దోస మెఱఁగక యేల దోసిలొగ్గీనే ॥ బుద్ధి॥

చెలరేఁగి నే మఱుఁగుచీర గట్టుకొనఁగాను
కలసి యిప్పుడే యెట్టు కాఁగిలించీనే
యెలమి శ్రీవేంకటేశుఁ డిటు నేఁ గాచుకుండఁగా
బలిమిసేసి యెంతవచ్చిగాఁ గూడీనే ॥ బుద్ధి ॥ 126

రేకు 1582 ఆహిరి

ఏల లోఁగేవు రాఁగదే యిదివో నీరమణుఁడు
నాలిసేయరాదు గాని నవ్వు నవ్వవచ్చును ॥పల్లవి॥

మచ్చరమే వద్దుగాని మాటలన్నీ నాడవచ్చు
అచ్చముగా మగనితో నంగనలకు
కుచ్చితమే సేయరాదు కోరి జంకించవచ్చు
రచ్చకెక్కవలచినరసికులకు ॥ ఏల ॥

పంతమాడవద్దుగాని పట్టిపెనఁగఁగవచ్చు
వింతలుగా రమణికి విభునితోను
చెంతఁ బాయరాదుగాని సేవలు సేయఁగవచ్చు
సంతసాన మేలమాడేసరసులకు ॥ ఏల ॥

వేసరఁగరాదుగాని వేడుకలు చూపవచ్చు
ఆసపడ్డనాథునితో నతివలకు
చేసూటిగా నిన్ను నేలె శ్రీవేంకటేశ్వరుఁడు
యీసులేదు మీవంటియితవరులకును ॥ఏల॥ 127

బౌళి

ఏమైనా గుణము తా నెఱఁగనిదా
ఆముకొని లోలోఁ దానే ఆలకించీఁగాక ॥పల్లవి॥

సేసవెట్టినవాఁడు నాచేతికిలోనైనవాఁడు
ఆసల నేఁపుదురా అట్టె తాను
వాసిగలదాన నేను వలచినదాన నేను
వేస రొక్కపరియైనా వెంగెమాడేనా ॥ఏమై॥

మనసెఱిఁగినవాఁడు మాట నాకిచ్చినవాఁడు
పెనఁగులాడుదురా బెట్టుగాఁ దాను
చనవు గలదు నాకు సరసము లబ్బె నాకు
తనమీఁద సారెసారెఁ దప్పులెంచేనా ॥ఏమై॥

చెక్కులు నొక్కినవాఁడు సిగ్గులు దేర్చినవాఁడు
కక్కసించి నవ్వుదురా కలసి తాను
ఇక్కువల శ్రీవేంకటేశుఁడు తాఁ గూడె నన్ను
దక్కినాఁడు తను నేఁ బంతము గొనేనా ॥ఏమై॥ 128

ముఖారి

నీవుచేసినచేఁతలు నీమీఁదికే వచ్చె
ఆవేళ నీభాగ్య మిది యాతఁ డేమిచేసునే ॥పల్లవి॥

చనవునఁ బెనఁగఁగా చంటిమీఁద గోరు దాఁకె
కనలి విభునినేల కడు దూరేవే
పొనిఁగి దాఁగఁగఁబోతే బోఁకముడి వెడజారె
యెనలే కాతనివల్ల నెంచ నేర మేదే ॥ నీవు ॥

నంటున నీవు నవ్వఁగా వడుమ నీకొప్పు వీడె
జంటయైనపతినేల జంకించేవే
దంటవై మాటలాడఁగా తమకము కడురేఁగె
వెంటవెంటఁ బతినేల విరుల వేసేవే ॥ నీవు ॥

అండనే కూచుండఁగాను ఆయములెల్లాఁ గరఁగె
నిండు శ్రీవేంకటేశుపై నెపములేలే
దండిగా మోవి ఇచ్చితే తన్నుఁదానే కళదాఁకె
వొండొరులు మీలో మీరు వొరయ నేమిటికే ॥ నీవు ॥ 129

పళవంజరం

అదియునుఁ జూతముగాని ఆనతీవయ్యా
కదిసేవు నాపై బత్తిగలదా నీకు ॥పల్లవి॥

చలపట్టి నాతోను జాణతనా లాడేవు
నెలకొన్న యీమోహము నిజమా నీకు
కలపుకోలు చేసుక కాఁగిలించుకోవచ్చేవు
చెలిమి యీడేర నిఁక సేసేవా నీవు ॥ అది ॥

విడువక నాతోను వేసరక నవ్వేవు
వుడివోకకూడేమన సున్నదా నీకు
అడరి నామొగము నీ వాసపడి చూచేవు
బడిబడి నాతో నీవు పాయక వుండేవా ॥ అది ॥

నమ్మికలెల్లా నొసఁగి నన్నుఁ గడులాలించేవు
నెమ్మది నాయెడ దయ నిండెనా నీకు
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కుమ్మరింపుఁగోర్కి దలకూడెనా నేఁడు ॥ అది ॥ 180

కన్నడగౌళ

ఇందరును వినఁగాను యెంతసిబ్బితె వుఁడునో
మందలించి మంచముపై మాటలాడుకోరాదా ॥ పల్లవి ॥

కాంత యేవిన్నపానకో కాచుకున్నది నీవద్ద
వింతలుగా నాలకించి వినరాదా
అంతవడి లోన నుండి అప్పటి వచ్చేనుగాని.
పొంత నిద్దరును తలపోసుకొనరాదా ॥ ఇంద ॥

లలన యెందుకో నీకు లాచి కొలువులుసేసీ
అలరి యాపను లాపె నడుగరాదా
బలిమి నందాఁకాను పరాకై వుండేముగాని
వెలి నాపె నీవు వెల్లావిరి చేసుకోరాదా ॥ ఇంద ॥

అంగనకాంతు యెంతో ఆసపడీ నీయెదుట
చెంగట నాపెచనవు చెల్లించరాదా
రంగుగ శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
సంగతిగా నవ్వుకొంటా సరి మీరుండరాదా ॥ ఇంద ॥ 181

లలిత

ఎంత నేరుచుకొన్నది యీవనిత
బంతి నీపెచేఁతలకు భ్రమయకుండుదురా ॥ పల్లవి ॥

తొడమీఁదఁ గూచుండి తొయ్యలి నీమోము చూచి
కడుఁ దేలగిలవేసీఁ గనుఁగొనలు
వొడివట్టుకొని నిన్ను వొయ్యారపుమాట లాడి
పెడరేఁచీ వలపులు ప్రియముతో నీకును ॥ఎంత॥

గుట్టున నీతో సొలసి గుబ్బలు నీపై సోఁకించి
అట్టడితనాన జలసీ గోరను
అట్టె మోవి చూపి అరచేతఁ జెక్కునొక్కి
వొట్టియాసలు వుట్టించీ వొద్దికతో నీకును ॥ఎంత॥

పయ్యద నీకుఁ గప్పి బలిమితోఁ గాఁగిలించి
వుయ్యాలమంచ మూఁచీ నుబ్బూఁతలను
ఇయ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నెయ్యానఁ దా రతిసేసీ నేర్పులతో నీకును ॥ఎంత॥ 132

రేకు 1583 లలిత

ఇటువంటిపొందులకు నింతినేల వొరసేవు
సటలకు నవ్వినాను చవిగాకపోదు ॥పల్లవి॥

యెసవెట్టుకొని సతు లెంత పతిఁ దిట్టినాను
కొసరులై తోఁచుఁగాని కోపము రాదు
కసరి చేతికి లోనుగాక పెనఁగితేను
అసమునఁ దరితీపు లౌఁగాక మానదు ॥ఇటు॥

కన్నులను జంకించి కామిను లెట్టలిగినా
సన్నలై తోఁచుఁగాని చలమెక్కదు
కన్నచోట నిన్ను చూపు గాఁడిపారఁ జూచినాను
ఇన్నిటా వలపు రేఁచి యెనయించకుండదు ॥ఇటు॥

అంగనలు గోరగిరి ఆయము లెంతంటివాను
సింగారమే మించుఁగాని చింతెరఁగదు
రంగుగ శ్రీవేంకటేశ రతి నీకె గూడె నిన్ను
సంగడి జాణతనాలు చాయలకే వచ్చును ॥ ఇటు ॥ 133

పాడి

అంకెకాఁడ వోఁగుసూతులౌభళేశ
పొంకమాయ నీసతిపొందు మఱవకుమీ ॥ పల్లవి ॥

తగులనాడినమాట తమితోఁ జూచినచూపు
మగువనేరుపు లివి మఱవకుమీ
చిగురుమోవివిందు సిగ్గుతోడిమురిపెము
నిగిడించినా పెను నీవు మఱవకుమీ ॥ అంకె ॥

నెలవి నవ్వినవ్వు చేతుల మొక్కినమొక్కు
మలయజగందిచేఁత మఱవకుమీ
కొలువులో సరసము గుట్టుతోడిపెనయము
యెలమి నీకెగుణము లిఁక మఱవకుమీ ॥ అంకె ॥

మేనిపై నొత్తినగోరు మిక్కుటపుకాఁగిలి
మాననిచేసినమేలు మఱవకుమీ
పూని శ్రీవేంకటేశుఁడ భోగములవొడఁబాటు
నానాఁడే ఇచ్చినది యెన్నఁడు మరవకుమీ ॥ అంకె ॥ 134

బౌళి

చెలఁగి నీవెట్టుండినాఁ జెల్లదా యెమ్మి(యేమి?)
తల వంచుకొని యేల తగఁ జింతించేవు ॥ పల్లవి ॥

చనవు చేసుకొని సతి నీవద్దఁ గూచుండి
    యెనసి నవ్వితే నీవు యెగ్గుపట్టేవు
ఘనుఁడ వేమిచేసినాఁ గాదనేటివారెవ్వరు
    పనిలేనిపనికేల పక్కన లోఁగేవు ॥చెలఁ॥

కూడేవేళ నీమేనిగుఱుతు లాపె చూచి
    వేడుకతో మెచ్చితేనే వెంగెమనేవు
కోడెకాఁడ నీగుణము కొలఁదికి దిద్దరాదు
    చేడెలముందర నేల సిబ్బితిపడేవు ॥చెలఁ॥

అడియాల మంపఁగానే అంగన వచ్చి చన్నుల
    కడునొత్తితే నేఁ గర్వమనేవు
యెడయక శ్రీవేంకటేశ నీవు మగఁడవు
    బడినే కూడితి వేల బాసలు సేసేవు ॥చెలఁ॥ 135

వసంతం

మాపుదాఁకా విన్నపాలు మరియేఁటికి
    పైపై నీదేవులాటే భాగ్య మింతేకాక ॥పల్లవి॥

వలచినకాంత యీకె వాసు లెంచఁబనిలేదు
    చెలరేఁగి వినయము చేసుటగాని
నిలువెల్లాఁ దమకమే నీతో నెట్టలిగీని
    కలది నీవూడిగమే గతి ఇంతేకాక ॥మాపు॥

తగువైనసతి యీకె తప్పులు వట్టఁగరాదు
    అగపడి ఇచ్చకము లాడుటగాని
మొగమోట దరచాయ మొక్కలాన దూరలేదు
    నిగిడి నీతో నవ్వులే నేరు పింతేకాని ॥మాపు॥

కూడినమానిని యీాపె గుంపెనలు చూపరాదు
వేడుకఁ గాఁగిలిమ్మని వేఁడుటగాని
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నిన్నేమని
జాడతోడ [1]మోవేనుటే సర వింతేకాక ॥మాపు॥ 136

అమరసింధు

ఇదివో నీసుద్దులెల్లా నిటువంటివి
మదమున నీతో మారుమలయఁగఁగలనా ॥పల్లవి॥

తగిలి నీవూడిగపుదానను నే మొక్కితేను
నగుతానే సరసము నాతో నాడేవు
వెగటుగా మాయక్క వింటే నిందు కేమనును
యెగసక్కెఁడవు సంగ తెఱఁగవుగాక ॥ఇది॥

గక్కన నే దూతికను కానుక నీ కిచ్చితేను
చెక్కునొక్కి నామీఁద సేసవెట్టేవు
చక్కఁగా మాయేలికసాని గంటే నేమనును
తక్కరీఁడ వీతగవు దలఁచవుగాక ॥ఇది॥

చెలికత్తె నాపెమారు సేవ నీకుఁ జేసితేను
కలసి శ్రీవేంకటేశ కాఁగిలించేవు
తిలకించి మాయమ్మ దెలిసితే నేమనును
బలిమికాఁడ విదేమీ భావించవు గాక ॥ఇది॥ 137

దేవగాంధారి

అక్కచెల్లెండ్ల మిద్దరమైతే నైతిమిగాక
చక్కఁగా జాణతనాలు సరిదూఁచవచ్చునా ॥పల్లవి॥

---

1. మోవి+అనుట.

యెంతయినా సవతుల(లు?) యీడుకు రావచ్చుఁగాక
వంతు లడుగవచ్చునా వలపు నేఁడు
సంతోసానఁ బతిమోవి చవిగొనవచ్చుఁగాక
బంతిఁ బెట్టుకోవచ్చునా పాయ మెవ్వరికిని ॥ అక్క ॥

రామ లోకచోటఁ గాఁపురము నేయవచ్చుఁగాక
వామి వేయవచ్చునా వాసులు నేఁడు
నాములకొన నాతనితో నవ్వు నవ్వవచ్చుఁగాక
దోమటిగా సిగ్గులెల్ల దొడ్డిఁబెట్టవచ్చునా ॥ అక్క ॥

వొద్దికచుట్టాలు పొందు లోనగూడవచ్చుఁగాక
వద్దనఁగవచ్చునా వావులు నేఁడు
అద్దుక శ్రీవేంకటేశుఁ డలమె నిన్నును నన్ను
గద్దించి వేరుపులెల్లా గాదెఁ బోయవచ్చునా ॥ అక్క ॥ 133

రేకు 1534 దేసాళం

ఓపమయ్యా నే మంతేసిపున్మొడికోలువులకు
చేపట్టి నీ వేలితేను సేవచేసేఁగాని ॥ పల్లవి ॥

నీవు నాపెఁ గూచుండఁగా నే నీకు మొక్కితేను
భావించ సగ మాపెకుఁ బాలురాదా
యీవలను వేరొకతెఇంట నిన్నుఁ బొడగంటే
తావుల నింటేపెకుఁ బెద్దరికమురాదా ॥ ఓప ॥

పొత్తుల నాపె వుండఁగా బువ్వము నేఁ దొడికితే
హత్తినసగమెంగిలి ఆపెది గాదా
బత్తితోడ నే నీకు పచ్చడము గప్పితేను
తత్తరించి ఇందు కాపె తనలోలో నవ్వదా ॥ ఓప ॥

తమ్ములమాపె కిడఁగా తరవాత నేఁ గై కొంటే
ఇమ్ముల ముందువెనక లిందునే కాదా
నెమ్మది శ్రీ వేంకటేశ నీవె కూడితి విద్దరి
కమ్మినమారతులెల్లాఁ గలగంప గాదా ॥ ఓప ॥ 139

రామక్రియ

ఏమి టాసన్న యెఱఁగవేమే నీవు
కామించె నిన్ను నతఁడు కదియవే నీవు ॥ పల్లవి ॥

యేకతాన నున్నవాఁడు యెదురుచూచీ నీకు
ఆకడ నాతనితో మాటాడవే నీవు
మేకొని నిద్రలేచె మెరసి నీవంక చూచె
ఆకులు వక్కలుఁ జేతి కందియ్యవే నీవు ॥ ఏమి ॥

పిలిచినాఁడు నిన్ను ప్రియముచెప్పి నీకు
యెలమితో దోమతెర యెత్తవే నీవు
బలిమిఁ బాదాలు చాఁచె పంతములెల్లా రేఁచె
సులభాన నొల్లనే పిసుకవే నీవు ॥ ఏమి ॥

మనసుపెట్టినాఁడు మరిగివున్నాఁడు నీకు
ననుపుచేసుక కొంత నవ్వవే నీవు
చెనకి సరసమాడె శ్రీవేంకటేశుఁడు గూడె
వొనరి యేపొద్దూఁ బాయకుండవే నీవు ॥ ఏమి ॥ 140

మధ్యమావతి

ఎనసి యాతఁడు మేము నెట్టుంటి మేమి
చొనిపి నీకోరికలు చూచుకొనరాదా ॥ పల్లవి ॥

విచ్చనవిడి నింకాను విన్నపము చేసుకోవే
పచ్చిదేర పతి నొడఁబరచుకోవే
యిచ్చకము చేసి యాసలెల్లా నిప్పించుకోవే
రచ్చలను మావలపు రవ్వసేయవలదు ॥ఎన॥

ననుపున నాతనితో నవ్వులిట్టె నవ్వవే
చనవున నీమోవి చవిచూపవే
పెనఁగులాడి నీవు ప్రియములు నెరపవే
మనసులు సోదించి మమ్మొరయనేఁటికి ॥ఎన॥

కలసి నీ వాతనిఁ గాఁగిలించుకొనవే
వెలి నుండి నీయింటివిందు చెప్పవే
అలరి శ్రీవేంకటేశుఁ డాతఁ డిట్టె నన్ను నేలె
కలికితనాల మరి కాఁతాళించఁదగదు ॥ఎన॥ 141

ఆహిరినాట

కనుఁగొనవయ్యా యీపెగామిడితనములెల్లా
తనకుఁదానే వట్టితమిఁ బొరలీని ॥పల్లవి॥

సందడి నీకాలుదొక్కి సారెసారె నీతో నవ్వి
అందరితో నాడుకొనీ ఆలనంటాను
చెంది నీవు ముడిచివేసినపూవులు ముడిచి
కందువతో మురిసీని కడుదొరనంటాను ॥కనుఁ॥

పాదుకొన నీవద్దిపనులు చేసి యందరి
సాదించీఁ దా నేలికసానినంటాను
సాదువలెఁ బళ్లెముప్రసాదము తా నారగించి
సోదించి కులము చెప్పీఁ జుట్టమనంటాను ॥కనుఁ॥

సరగ నీవుగట్టినపచ్చడపురేకు గట్టి
వరుసకు వచ్చీఁ జనవరినంటాను
యిరవై శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
పరఁదుక కాఁగిలించీఁ బాయలేనంటాను ॥కనుఁ॥ 142

శుద్ధవసంతం

ఎడగొల్లకత్తెవు నిన్నేమి చెప్పేది
అడియాలాలెల్లాఁ జూపే వౌదువే నేర్పరివి ॥పల్లవి॥

సందడిఁ బెండ్లాడినాపె సరసము లాడఁగాను
కందువ నుండినయాపె కాచుకుండఁగా
యెందుఁడో వచ్చి నీవు యీతఁడు నామగఁడంటా
అందరిలోఁ గొంగువట్టే వౌదువే నేర్పరివి ॥ఎడ॥

యెదురువెట్టినయాపె ఇంటికిఁ బిలువఁగాను
మొదల వచ్చినయాపె ముంచి నవ్వఁగా
పొదిగి నీ కితఁడు పొంతనాలు గూడెనంటా
అదనఁ గాఁగిలించేవు అవుదువే నేర్పరివి ॥ఎడ॥

పిలిచితెచ్చినయాపె ప్రియపడి వుండఁగాను
కలసి నాపెను నేనే కలిగుండఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడు నాపొరుగంటా
అలర చెనకఁజూచే వౌదువే నేర్పరివి ॥ఎడ॥ 148

శ్రీరాగం

తలి నింతి యేమెఱుఁగు తనయాసోదమే పెంచీ
నెలవాది వింతట మన్నించవలెఁగాక ॥పల్లవి॥

కొసరి కొసరి నిన్నుఁ గొంగువట్టి తీసితీసి
అసురుసురై చెలి యలసీ నదె
వసముగానిపతిని వంచుకొనఁబో తేను
సుసరమా నీవే దయఁజూడవలెఁగాక ॥ తలి ॥

పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు చెప్పి చెప్పి
చలిమి బలిమితోను జడిసీ నదె
తలఁపుకొలఁదిగాని తగులమిఁ బెనఁగితే—
నలవియౌనా నీవే యాదరింతుగాక ॥ తలి ॥

పొదిగి పొదిగి నీపొందు సేసి కూడి కూడి
సదమదమై సవ్వ చల్లీ నదె
యిదె శ్రీవేంకటేశ నీ వెనసితి విటుగాక
సదరమా యింకా నీవే చనవిత్తుగాక ॥ తలి ॥ 144

రేకు 1535 మాళవి

సతులపట్టుకు నింత చండి సేతురా
తతిగొంటి వెటువంటితగవో నీది ॥పల్లవి॥

మనసు రంజిల్ల నీతో మాటలాడీ నీదేవులు
పనిలేని దిప్పుడేడ పరాకో నీకు
వొనర నప్పటి నీవొడివట్టి తియ్యఁగాను
పెనఁగేవు యెటువంటిబిగువో నీది ॥ సతు ॥

యెరవులేక చేతులెత్తి మొక్కీ నీదేవులు
శిరసు వంచే వెంతసిగ్గో నీకు
గరిమ నీమొగమే కనుఁగొనుచుండఁగాను
తరల వేమిటో యెంతతాలిమో నీకు ॥ సతు ॥

కప్పురము మోవిని(కి?) [illegible]
ముప్పిరిఁ గూడేవు [illegible] నీకు
యిప్పుడే శ్రీవేంకటేశ యీకె నిన్ను మెచ్చఁగాను
చొప్పునఁ గొసరే వెంతానోదమో నీది ॥సతు॥ 145

## నాదరామక్రియ

ఎంత గుట్టుచేసుకొని యిక్కడ నున్నాఁడవు
చెంత నాపె చెప్పినట్టు చేయఁగరాదా ॥పల్లవి॥

తేనెపెదవుల నీతోఁ దెలువ మాటలాడె
కానుకవట్టెను చనుఁగవ నీకును
నానఁబెట్టి సెలవులనవ్వులు నీపైఁ జల్లె
కానిమ్మని యాపెయింటికాడకు రారాదా ॥ఎంత॥

వెస నీకొలువుచేసి వినయములెల్లాఁ జూపె
పొసఁగ నిచ్చకములఁ బొందుచేసెను
సుసరపువలపులఁ జుట్టరికము నెఱపె
కొసరి నాపెవద్దఁ గూచుండరాదా ॥ఎంత॥

మక్కువఁ బాదములొత్తి మర్మములెల్లా రేఁచె
మిక్కిలి రతులఁగూడి మెప్పించెను
చక్కని శ్రీవేంకటేశ సన్నల నొడఁబరచె
చొక్కపునేర్పుల నాపెఁ జొక్కించరాదా ॥ఎంత॥ 146

## రామక్రియ

వట్టివిచారములేల వాదు లడువఁగనేల
రట్టడిపతిని చెలు లిట్టె ర[illegible] ॥పల్లవి॥

ననిచినఁగాని మరి నవ్వు రాదు
పెనఁగులాడినఁగాని ప్రియములేదు
తనిసినఁగాని సంతసముగాదు
చెనకి నప్పుడు గాని సిగ్గు విడదు ॥వట్టి॥

బలిమి చేసినఁగాని పంతము రాదు
కలసినఁగాని లోలో కాఁక దేరదు
తలఁచినఁగాని యట్టె తమి రేఁగదు
వలచినఁగాని గర్వము నిండుకొనదు ॥వట్టి॥

సరసమాడినఁగాని చవి వుట్టదు
యెరవులేకున్నఁగాని యింపుగాదు
ఇరవై శ్రీవేంకటేశుఁ డెనసె నన్నుఁదానె
సరవితో నున్నఁగాని ముచ్చటలెల్లాఁ బాయవు ॥వట్టి॥ 147

## దేసాళం

జాణలై నయట్టివారిజాడ లివి
నాణెమైనపొందు లిటు నడపఁగవలయు ॥పల్లవి॥

తగవు దప్పకుండితే తగులమి యెడయదు
తెగనాడకుండితేను తియ్యదు ప్రేమ
జగడించకుండితేను జారదు చుట్టరికము
బిగివాయకుండితేను భావ మెరవు గాదు ॥జాణ॥

కక్కసించకుండితేను కాఁపురము లీడేరు
వెక్కసము గాకుండితే వేడుక గల్గు
మొక్కలము విడిచితే మునుకొనదు చలము
వొక్కరీతినే వుండితే వుడివోదు ననుపు ॥జాణ॥

వంతాలు

మంత

ఇంతలో

చెంతఁ జేచాఁచ ॥ 148

ఎఱఁగమా నీగుణాలు

మఱవక మమ్ము ॥ పల్లవి ॥

మంతనాన మాపుధా

యెంతలేదు నీయా

చెంతల గోర గిరి

ఇంతటి నీవాసివట్టు ॥ఎఱఁ॥

వనుపున నాతోను వ

పనిపూనినవిరుదుల

చెనకి యెంత దూ

పనుపడ నీపంతాలు ॥ఎఱఁ॥

కడఁగి నన్నుఁ గూడి

యెడయక నీనేర్పు

కడుఁ బెనఁగివాను

బడిబడి నీపొందు ఎఱఁ॥ 149

చూపవయ్యా నా

పైపై ॥పల్లవి॥

యేపున నీ నిమ్మపండు యిప్పుడె కానుకిచ్చెనో
ఆపెమారుగాఁ జూచే వప్పటినుండి
మోపుచు కన్నుల నురమున కద్దుకొనే విదె
యేపొద్దుఁ దరతీపులు యిట్టుండవలదా ॥చూప॥

యీవేళఁ దామెరపువ్వు యెందు దొరకెనో ఆపె—
చే వట్టినట్టు పట్టి చే వదలవు
తావి చూచే వప్పటిని తలపై నిడుకొనేవు
పూవువంటివల పింత పోదిసేయవలదా ॥చూప॥

వలయపుభరణు లేవల్ల నీకుఁ గలిగెనో
కలికిచన్నులమారు కాఁగిలించేవు
అలరి శ్రీవేంకటేశ అప్పటి నన్నేలితివి
కలపుకో లిటువలెఁ గలుగఁగవలదా ॥చూప॥ 150

రేకు 1536 దేసాళం

అన్నిటా జాణఁడై నాఁడు ఆలను నేను
పన్ని తనచిత్తము పట్ట నెటు నేర్తునే ॥ పల్లవి ॥

యిచ్చకమాడఁగవలె ఇంతులకుఁ బతితోను
పచ్చిగా నవ్వఁగవలె పైకొనవలె
మచ్చరించరాదు మరి మంకులు చూపఁగరాదు
నిచ్చఁ దనపొందుసేయ నే నెట్టు నేర్తునే ॥ అన్ని ॥

వూడిగము సేయవలె వొద్దికతో విభునికి
వేడుక సేయఁగవలె విడె మీవలె
పాడిపంతా లెంచరాదు బలిమిఁ దోయఁగరాదు
జాడమీరి తను నెట్టు జరయఁగనేర్తునే ॥ అన్ని ॥

చెనక(గవలె

చెన(గవ

గునియ(గ

మనసిచ్చి నన్ను న్ని॥ 151

నీపతి బత్తిగల(డు

దాపుగ నామాట ॥పల్లవి॥

సరసములాడుచే

శిరసు వంచుకొ

గరిమ నవ్వు మి

సరిచూడవే వల ॥నీప॥

చెప్పరానివినయాతే

తప్పక చూచు

వుప్పతిల్లు( తెన

తిప్పరానికాంత ॥నీప॥

మొగములు చూచు

బగివాయకుండు

అగపడి నిన్ను

మగనికి నీకు నీ ॥నీప॥ 152

వింటివా నామా

వంటు నీ పల్లవి

కలసి మెలసి నీవు కడులాలించకుంటేను
నెలకొన్న నేరమి నీవొళ్లిదే అందురు ॥వింటి॥

మదిలోన నీకెంతమరిగినదో కాని
పొదిగి పొదిగి నీతో పొందుసేసీని
అదెరిఁగి నీవిప్పు డాకెఁ గూడకుండితేను
గుదిగొన్న [1]మేలాన కూళతన మందురు ॥వింటి॥

యెనసి ఇంతి నీరతి(ని) యెట్టు గూడితివో కాని
తనిసి తనిసి నిన్నుఁ దగ మెచ్చీని
ఘనుఁడ శ్రీవేంకటేశ కరుణ యింతగాకున్న
చనవరితనానకు చపచపనందురు ॥వింటి॥ 158

మాళవిశ్రీ

చెలులము నిన్నేమి సేయఁగలము
నెలఁత భాగ్యములెల్లా నీవల్ల నున్నవి ॥పల్లవి॥

యిందుముఖితో సరస మెంత మీరి యాడినాను
అందుకు నిన్నోఁగాదని ఆడవచ్చునా
మందలించి వలపులు మట్టుపెట్ట వసగాదు
యెందును యీపె కాఁపుర మిదె నీచే నున్నది ॥చెలు॥

వనితను నీ వెట్టు వడి నెలయించినాను
పెనఁగి చాయలకు రప్పించఁగలమా
మనసులో తమకము మానుపఁగ నెట్టువచ్చు
వినయాన యీపె మొక్కు వెస నీపై నున్నది ॥చెలు॥

1. మేలు+న. మేలాన=మేలుతో(ప్రేమతో)అనియా? అట్లైనచో, 'న' పరమైనపుడు 'ము' వర్ణాంతమూ అకారోపధమూ కాని 'మేలు'కు దీర్ఘమెట్లు? మేలము+న ఐనచో అర్థమంతగ సరిపోదేమో? గుడిగొన్న 'మేలున' కావచ్చునా?

నతి...
రతు...
తరితో శ్రీవేంకటేశ తగులు మానవరాదు
నతమై యీపెకోర్కి నీచనవున నున్నది ॥ చెలు ॥

శుద్ధదేశి

ఎంత వేగిరకాఁడ వేమయ్యా నీవు
చెంత నూరకుండఁగానే సేసలు చల్లేవు ॥ పల్లవి ॥

నెలవి నవ్వులతోడ సిగ్గువడి వుండఁగానే
బలిమి నాపెచన్నులు పట్టితీసేవు
నిలువుఁదమకమున నివ్వెర గందఁగానే
కొలఁదిమీరఁగను గక్కునఁ జెనకేవు ॥ ఎంత ॥

తగు నీపై తలపోఁత తలఁచుకుండఁగానే
చిగురుఁబెదవి యాని చిమ్మిరేఁచేవు
మొగము చూచి నీపై మోహములు నెరపఁగా
బిగువుఁగాఁగిట నొత్తి పిప్పిసేసేవు ॥ ఎంత ॥

ముద్దులు గునిసి నీతో ముచ్చటలాడఁగానే
అద్దుకొని రతికేలి నలయించేవు
గద్దించి శ్రీవేంకటేశ కన్నుల మొక్కఁగానే
పెద్దరికానను సారెఁ బెనఁగులాడేవు ॥ ఎంత ॥ 155

వరాళి

మఱచితివేమో కాక మగువలనెల్లాఁ జూచి
మెఱయఁగ నీచేఁతలు మెచ్చనా నేను ॥ పల్లవి ॥

నెప్పున [illegible]న్వ్యేయుముని
అప్పుడే చెలిచే [illegible]య్యయించనా నీకు
కొప్పు దువ్వుకొంటాను కుందనపు మేడమీఁద
చిప్పిలుమోవిని సన్న సేయనా నీకు ॥మఱి॥

మనసులో పొఁ(పొం?)దులు మరి యెచ్చరికగాను
మునుకొని చేతులెత్తి మొక్కనా నీకు
పొనుగకుండా నిన్ను పువ్వులచెండున వేసి
నినుపుగా తమి యెలా నించనా నీకు ॥మఱి॥

పాటించి నాచన్నులు పయ్యద జారఁగ(గఁ?)దీసి
సూటిగఁ గానుకగాను చూపనా నీకు
యీటున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గాఁటపునామేలు తారుకాణించనా నీకు ॥మఱి॥ 156

రేకు 1587 సామంతం

అటువంటిది గాకుంటే ఆఁటదందురా
సటలెల్లా నెరపిని చాటిచెప్పఁదగును ॥పల్లవి॥

వుద్దండపుమాట లాడి వువిద చన్నుల నొత్తి
అద్దుకొని నీ కిట్టె ప్రియాలు చెప్పిని
సుద్దు లెంతనేర్చునో సూటిగా ని న్నిట్లానే
తిద్దుకొనె కాఁగిటికి దేవులు గాఁదగును ॥అటు॥

కాతరించి వొడివట్టి కామిని లోనికిఁదీసి
చేత ని న్నాయము లంటి చెక్కు నొక్కని
యేతు లెంతవేడుకో ఇటువలె నీముందర
ఆతుమగాఁ జెప్పి చూపీ ఆకె పీకుఁ దగును ॥అటు॥

సాదువలె నిన్నుఁ బిల్చి సతి మోవి గంటినేసి
పాదాలకు మొక్కి నీకుఁ బంతమిచ్చీని
పోదితో శ్రీవేంకటేశ బూపతిచెరువుకాడ
ఆదిగొని నిన్నుఁ గూడె ఆకె నీకుఁ దగును ॥ అటు 157

## మాళవి

లకిమమ్మ కాఁగిలిచ్చి లావుల మెచ్చీ
సకలము మేలు సరసము లాడరయ్యా ॥ పల్లవి॥

కొండలపడవనీడ(?) కోరిన చెంచులవాడ
వుండి నవ్వే వౌనయ్యా వువిదతోడ
నిండెనుః వలపు లాడ నీమో మాకె చూడ
పెండిలి మీకిద్దరికిఁ బెనగొనీనయ్యా ॥ లకి ॥

గొప్పమాఁకులకోన [1]కురినేటి నిచ్చవాన
వుప్పతిల్లి చేయివేసే వువిదమేన
చిప్పిలీఁ బెమటసోన సిగ్గులు లోలో నాన
కప్పెను మీ కిద్దరికిఁ గడుమోహాలయ్యా ॥ లకి ॥

భవనాశియేటిదండ పడఁతికోర్కులు నిండ
జవళి నీవద్ద నుండ సంగడిఁ బండ
తివిరి శ్రీవేంకటాద్రి సుగ్రీవ నారసింహా
వివరించ నిద్దరికి వేడుకాయ నయ్యా ॥ లకి ॥ 158

## బౌళి

నంటునఁ గనకగిరి నారసింహా
వెంట వెంట నాకుఁగానే వేడుకపడేవు ॥ పల్లవి॥

---

1. 'నిచ్చకురినేటివాన' అనుట సహజము.

చేముట్టి [illegible]గ్గు విచారించక
నామేను చెనకేవు నడుమ నీవు
కామినులు వసంతము కడు నీపైఁ జల్లరాఁగా
ప్రేమ నాపయ్యెదలోనఁ బెనఁగి దాఁగేవు ॥నంటు॥

వొద్దనుండి చెలులెల్లా నూడిగాలు సేయఁగానే
అద్దుక నాతో నవ్వే వప్పటి నీవు
వుద్దండాన మేనవారు వొడివట్టి తియ్యఁగానే
గద్దరితనాన నన్నుఁ గాఁగిలించుకొనేవు ॥నంటు॥

సంగతి విచారించక సరిఁ బొరుగువారింట
యెంగిలిసేసేవు మోవి ఇప్పుడే నీవు
చెంగట శ్రీవేంకటేశ జిగిఁ బేరటాండ్లు చూడ
చెంగలించి నామీఁద సేసలువెట్టేవు ॥నంటు॥ 159

రీతిగౌళ

ఏమయ్యా వేడుకకాని కేడ దోసము
వేమారు నీదేవులకై విన్నవించేఁగాక ॥పల్లవి॥

[1]సంగడించి మాటాడుతాఁ జవి చూచితివి మోవి
యెంగిలని చూడవద్దా యింతిని నేను
వెంగలితనానఁ దొల్లి వెన్నలుమఁ బాలును
దొంగిలినవాఁ డవి దూరుకు నోడేవా ॥ఏమ॥

సముకాన నవ్వుతానే సరిఁ గాఁగిలించితివి
చెమటని చూడవద్దా చిప్పిలి మేన
గుమితానఁ జల్లలమ్మేగొల్లతలనేలిన—
తమకి వంతేసిదొరతనాలు చూచేవా ॥ఏమ॥

1. సంగడి, సంగడములపై వచ్చిన నామధాతువు కాబోలు.

ఆదరించి వేఁడుకొంటా నకు[illegible]
పాదాలు దాఁకి నిబ్బితిపడఁగవద్దా
కాదనక [1]దధిభాండు(డ?)గంపకిం దీఁగినవాఁడ—
వీదెస శ్రీవేంకటేశ యిందుకుఁ గొంకేవా ॥ఏమ॥ 160

నీలాంబరి

మగనికి నాలికిని మర్మము లివి
తగిలి పాయకుండితే తమకము రేఁగును ॥పల్లవి॥

పచ్చిమాఁట లాడితేనే భావములు గరఁగును
యిచ్చకము సేసితేనే యింపు వుట్టును
కొచ్చి కొచ్చి కొసరితే గురుతౌఁ జుట్టరికము
వచ్చినట్టే వచ్చితేను వాడికలు గలుగు ॥మగ॥

వినయము చూపితేనే వెగ్గళించు మోహము
మనసు లెనసితేనే మన్నన లెక్కు
తనువులు సోఁకితేనే తడఁబడుఁ గోరికలు
ననిచి పైకొంటేనే నవ్వులెల్లా వచ్చును ॥మగ॥

కలపుకోలు గలితే కాఁపురము లొనరును
తలఁపు సరిదాఁకితే తగులుఁ గాంతు
యెలమి శ్రీవేంకటేశ యింతి నేలితివి నీవు
చలివాయఁ గూడితేనే చవులౌను రతులు ॥మగ॥ 161

శంకరాభరణం

ఇంకా నేల చలము యేమి సేయఁగలము
అంకెకు వచ్చెను అధరామృత ఫలము ॥పల్లవి॥

---

1. 'దధిభాండు' స్వతంత్రముగ తత్సమించినరూపమా? పొరపాటు వ్రాతయా? ఇట్టి దుష్టసమాసము శివాఙ్మయమున దోసములు గావు.

కలికి వనాలనేడఁ గదు నీ కెదురుచూడ
కులుకునవ్వులతోడఁ గొప్ప వీడ
చెలులెల్లాఁ జూచేరు జిగిఁ గౌను లసియాడ
బలిమిఁ జేకొనవయ్యా బత్తితోఁ గూడ ॥ఇంకా॥

సతి నీపాదాలు మెట్ట చన్నులు నీవు ముట్ట
తతి నిన్ను నిదె దిట్టతనాలఁ దిట్ట
అతివలు సొలసేరు అంగాలఁ జెమట దొట్ట
సతతము మెచ్చవయ్యా జాణలు చేపట్ట ॥ఇంకా॥

జలజాక్షి నీపక్క సరసముల వే చొక్క
తలపోసీఁ దనచక్కఁదనాలు నిక్క
అలి శ్రీవేంకటేశ నీలలన నీకు మొక్క
కలకాల మేలు మిక్కడ రతికెక్క ॥ఇంకా॥ 162

రేకు 1538 ఆహిరి

నాకుఁ గానవచ్చీ నీనటనలెల్లా
నీకుఁ జూడ నన్నియును నేరుపులై యున్నవి ॥పల్లవి॥

తలఁకొని నాదిక్కు తప్పక చూచేవు గాని
తలఁపులో వేరొకతె తగిలున్నది
మలసి నిజాలకును మాటలు నాడేవుగాని
యెలమి నీకోరికలు యెక్కడనో వున్నవి ॥నాకుఁ॥

నడుమ నూరకె నాతో నవ్వులు నవ్వేవు గాని
అడరినవలపు విఁ(విం?)తై వున్నది
జడిగొని నాపైఁ జేయి చాఁచఁగ వచ్చేవుగాని
చిడుముడితమి వలసినచోట నున్నది ॥నాకుఁ॥

గట్టిగా నీకాయము నాకాఁగిట ...
చుట్టరికములెల్లాఁ జుట్టుకొన్నది
నెట్టన శ్రీవేంకటేశ నీవు వన్నెలతిగాని
రట్టడిపంతాలు రతి నిట్టె పాయకున్నవి ॥నాకుఁ॥ 163

## మాళవిగౌళ

వట్టిసటలు సేసేవు వద్దికి రమ్మనుచును
పట్టి నేఁ బెనఁగితేను పరాకు మానేవా ॥పల్లవి॥

మన్ననగలసతితో మాటలు నీవాడఁగాను
విన్నపము నేఁ జేసితే వినేవా నీవు
సన్నలా చాయలా నాపె సరి నెలయించఁగాను
యెన్నికానుక లిచ్చినా యిక్కడ చూచేవా ॥వట్టి॥

పిలిచితెచ్చినాపెతో బెరసి నీవు నవ్వఁగా
కలయ నే వచ్చితే కాఁగిలించేవా
నిలుచుండి కొలువున నిన్నాపె యెలయించఁగా
వలపు నేఁ జల్లితేను వసమయ్యేవా ॥వట్టి॥

జంటఁ గూచుండినఇంతిచన్నులు నీవు ముట్టఁగా
ఇంటికి రమ్మంటే నీ కితవయ్యీనా
అంటి నన్నుఁ గూడితివి అంతలో శ్రీవేంకటేశ
వొంటి నెంతజంకించినా వొడఁబడేవా ॥వట్టి॥ 164

## దేసాళం

నీకొలఁదివారలా యీనెలఁతలెల్లా
నీకు నిదె చాలుగాదా నిమ్మలాన నుండవే ॥పల్లవి॥

ఏల నివ్వెర గందేవే ఇంతులనెల్లాఁ జూచి
ఆలరిఁ డీతని కెంద రాండ్లంటాను
జాలిఁబడ నేమిటికి సవతులతోనెల్లా
నాలిసేయ కాతఁడు నవ్వీ నంటాను ॥నీకొ॥

ఏమిటికి యేఁకరేవే యెవ్వరైనా నీతనితో
ఆముకొని సరసము లాడేరంటాను
మోము శిర సేలూఁచేవే మునుకొని దేవుళ్లకు
వోముక యీతఁడు విడె లొసఁగీనరంటాను ॥నీకొ॥

అదేల ముక్కుపై వేలంటుకొనేవే ఇందరు
ఇదె యీతనిపొత్తున నెనసేరంటా
అదన శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నునేలె
పదరకువే యీతఁడు పచ్చిదేరీ నంటాను ॥నీకొ॥ 165

కాంబోది

అప్పటి తారుకాణ లౌనో కావో
తప్పక యీగురుతులు తలఁచుకో నీవు ॥పల్లవి॥

ఇందాఁకా మాటలాడె యెరవులేక నీతో
యెందుండి వచ్చె నాపె యేమో నీకు
మందలించి యావేళనే మరి నొక సోద్యము
అందుకొంటి వీడెము ఆపెచేత నీవు ॥అప్ప॥

కామించి చెక్కులు నొక్కి కదుఁ బాదాలకు మొక్కి
యేమిటికి వీడుకొనె నీపె నిన్ను
దీమసాన నప్పటిని తేటపడె వేరొకటి
కోమలపుమోవి చవిగొంటివి సారెకును ॥అప్ప॥

నన్నతే సేసీ(సె?) నాపె న[illegible]
యెన్నిక లెట్టివి కూట మెన్నఁ డబ్బెను
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పన్ని రతిఁ జొక్కితి వాపడఁతిసేఁతలకు ॥ అప్ప ॥ 166

బౌళిరామక్రియ

మగువరో యీగతినే మగని వలపించవే
జిగి మఱవకుమీ నేఁ జెప్పినయీబుద్ధులు ॥పల్లవి॥

మనసు లెనసితేను మాటలెల్లాఁ జవులౌను
ననుపు గలిగితేను నవ్వులు వచ్చు
చనవు మెరసితేను సంగాతము లీడేను
వినయము చూపితే వేడుకలౌఁ బొందులు ॥ మగు ॥

అడియాసలు మించితే ఆయములు గరఁగును
యెడవాయకుండితేను హెచ్చు లంకెలు
వుడివోనిప్రేమలైతే వౌనరుఁ దలపోఁతలు
అడరుఁ జుట్టరికములైతే నింపు లెసఁగు ॥ మగు ॥

విచ్చన విళ్లైతేను వెలయుఁ దమకములు
ముచ్చటలు నెరపితే ముంచుఁ గళలు
ఇచ్చట శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నింతలోనె
వచ్చిదేరఁ జెనకితిఁ బరగును రతులు ॥ మగు ॥ 167

పాడి

రచ్చలోఁ బెనఁగుదురా రామలతోడ
యిచ్చెరిఁగి కలసితే నింతులు వలతురు ॥ పల్లవి ॥

యిక్కడనేల చెనకి నింటికి రమ్మనవే
చెక్కు నొక్కి తనసేవ చేసే నేను
మొక్కళపుఁదనమేలే మొగవాఁడైనవానికి
కక్కసించకుండితేనే కాంతలు వలతురు ॥రచ్చ॥

డిగ్గనఁ గొంగేల పట్టి తెరవేయుమనవే
బగ్గన నొంటినే వోడఁబరచే నేను
వెగ్గళించనేఁటికే వేడుక గలవానికి
సిగ్గుతోడ నుండితేనే చెలులు వలతురు ॥రచ్చ॥

చన్నులేల పిసికేఁ బచ్చడము గప్పుమనవే
విన్నవించి వేడుక గావించే నేను
అన్నిటా శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
సన్నలఁ దా నవ్వితేనే సతులు వలతురు ॥రచ్చ॥ 168

రేకు 1539 ముఖారి

ఆనతియ్యవయ్యా నాకు నాసుద్దులు
తానకమై ఇందాఁకాఁ దలపోసుకొంటిని ॥పల్లవి॥

చెలఁగి నిన్నాపె చూచి సెలవుల నవ్వఁగాను
తెలియక నిన్నడిగేఁ దెల్లమిగాను
బలిమి నప్పటి నాపెపైఁ జేఁఇవేయఁగాను
నిలుచుండి నాలోనే నివ్వెర గందితిని ॥ఆన॥

సారెసారె నాపె నీతో సన్నలు సేయఁగాను
కారణాలు విచారించేఁ గడగడల
మేరమీరి నీతో మరి మేలము లాడఁగాను
ఆరితినే సంతోసించే నందుకే నేను ॥ఆన॥

గక్కన నాపె నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
చొక్కి పొంతనాలు చూచె సొరిది నేఁడు
ఇక్కడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
వెక్కులాగుల నిందుకే ప్రియమందె నిపుడు ॥ఆన॥ 169

కేదారగౌళ

ఏమి చెప్పేది నీభాగ్య మిన్నిటా రమణుఁడ
దోమటి మిమ్ముఁ జూచి సంతోసమాయ నాకు ॥పల్లవి॥

మొక్కలానఁ దనచనుమొనలు నీవీఁపు సోఁక
చిక్కుదీసీ నీనెరులు చెలియ
వెక్కసపుఁ గొప్పులోని విరులు నీపై రాల
నిక్కి కుంచెవేసీని నీపైఁ గేలు చాఁచి ॥ఏమి॥

కందువతోఁ దొడాఁ దొడాఁ గదియ నీవద్ద నుండి
గందము పూసీ నీకుఁ గలికి
చిందెటిచెమటనీటిచిత్తడి నీమేన నంట
చెంది సొమ్ములెల్లాఁ బెట్టి సింగారించీ నీకును ॥ఏమి॥

చలువమోవితీపువాసన నీముక్కున నిండ
తిలకము నీకు దిద్దీఁ దెలవ
కలసితి నన్ను శ్రీవేంకటేశ బేఁటెరాయ
అలమీఁ గాఁగిట నాపె నాయములు గరఁగా ॥ఏమి॥ 170

పాడి

తేరిచూడు మిదివో నీదేవులదిక్కు
సారెసారెఁ దనమోవిచవులు చూపీని ॥పల్లవి॥

పొంచి నీమోము చూచీ పొలఁతి యిల
వంచి సిగ్గులు పచరించీ నదె
పెంచీ నాసలుఁ గడుఁ బ్రేమమున లోలో
నించీ నెలవుఁ గను నిండునగవులు ॥తేరి॥

సొలసి మాఁటలాడీ సుదతి నీతోఁ
గలసిమెలసి యాడి యలసీ నదె
మలసీ నీముందరను మంతనానను అట్టె
వలసినట్ల నీపై వలపు చల్లీని ॥తేరి॥

పొంది నీకాఁగిటను పూఁబోఁణి
చిందీఁ జెమట లంది యంది
చెందితి విటు నన్ను శ్రీవేంకటేశ్వర
సందినుండి తాను చనవు సేసీని ॥తేరి॥ 171

సామంతం

ఇంత వొలపఁడపాతి వెళ్లితివి
బంతినే నామీఁదఁ గడుబత్తిసేసే వీపుడు ॥పల్లవి॥

వేడుకతో నేకతాన విన్నవించిననామాట—
లాడుకొంటివా అపుడే ఆకెతోడను
వీడెము నే నిచ్చినది వెస నాకెవొడిఁ బెట్టి
యీడ నామొగము చూచే వేమిగట్టుకొంటివి ॥ఇంత॥

యేపున నీవురమున నిటు నే మెత్తినకస్తూ—
రాపెకుఁ బెట్టితివా అపుడే నీవు
మాపుదాఁకాను ఇంటిలో మగువఁ బెట్టుక్కవుండి
యీపొద్దు నన్నంటవచ్చే వేమనేది నిన్నును ॥ఇంత॥

ప్రేమమున నీతో నేను పెండ్లాడినగురుతు
కామినికిఁ జూపితివా కానుకగాను
ఆముకొని శ్రీవేంకటాధిప నన్నేలితివి
దోమటి నిద్దరికిఁ గాంతుఁడ వైతి విపుడు ॥ ఇంత ॥ 172

కాంబోది

ఏమిచెప్పేరే యెమ్మె లెందాఁకా మాతో
వేమరు నవ్వినదే వేడుకసరసము ॥పల్లవి॥

పగటున వనితలు పదివేలుఁ గలిగినా
మగఁడు చేపట్టినదే మరి దేవులు
తగిలి యన్నిటా వేగుదాఁకా నొడఁబరచినా
అగపడి చెల్లుబడియైనదే మాట ॥ ఏమి ॥

కొలువులు సేసి యెంత కూరిములు గొసరినా
పిలుపు గలిగినదే ప్రియము
కలపుగోలున నెంత కాఁపురము సేసినాను
సలిగెతోడిదే సతమైనమన్నన ॥ ఏమి ॥

జమళిపొంతనాలు సారె నెంత గూడినాను
తమిగలిగినదే తగులాయము
గుమిగా నిన్ను నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
సమరతివిభవాలే చవులకుఁ జవులు ॥ ఏమి ॥ 173

దేవగాంధారి

ఇంకనేల నిన్ను నేరా లెంచ నేను
కొంకుదేరి లోఁగితేను కూళతనము ॥పల్లవి॥

మచ్చిక గలిగితేను మంచిమాఁట లాడవలె
కుచ్చితము నెరపితే కూళతనము
యిచ్చకమే వలసితే యెరవు లేకుండవలె
కొచ్చి కొచ్చి కొసరితే కూళతనము ॥ ఇంక ॥

పొందు లోనగూడితేను భోగించి చొక్కఁగవలె
గొంది నలుగఁగఁబోతే కూళతనము
చందములైతే సరసములాడవలె హెచ్చు—
కుందులు వెదకఁబోతే కూళతనము ॥ ఇంక ॥

నెట్టనఁ గూడేవేళ నేరుపు చూపఁగవలె
గుటు చేసుకుండితేను కూళతనము
అటుగా శ్రీవేంకటేశ యిట్టె నన్నేలితివి రా—
కొట్టు లిఁక నెగ్గులంటే కూళతనము ॥ ఇంక ॥ 174

రేకు 1540 లలిత

వాకిట నందరుండఁగా వడిగా లోనికి నేఁగి
యేకతాన నున్నపతి నెట్టు చెనకితివే ॥ పల్లవి ॥

పాయక విభునివద్దఁ బాదము లొత్తితివా
ఆయములు గరఁగెనా అట్టె నీకు
యీాయెడ వినవేడుకయ్యీ నింకా నాతోఁ జెప్పవే
చేయి మీఁదాయ నిఁక సిగ్గుపడనేఁటికి ॥ వాకి ॥

మనసారా నాతనితో మాట నీ వాడితివా
తనివిఁ బొందితివా తాలిమితోడ
నినుఁ జూచి వెరగయ్యీ నిలువవే నాముందర
చనవరవైతివి సట లిఁక నేఁటికి ॥ వాకి ॥

శ్రీ వేంకటేశ్వరుసేవలెల్లాఁ జేసితివా
నీవలపు లీడేరెనా నిమ్మలాననను
యీవల నన్నితఁ డేలె నిట్టె కనుఁగొనవే
నీవే సవతి వై తివి నేఁడు లోఁగనేఁటికే ॥ వా ॥ 175

మంగళకౌసిక

ఎటువంటి జాణవై తి విదివో నీవు
తటుకన నవ్వినవ్వి తనియ వాసోదమా ॥ పల్లవి ॥

అంగవించి నాచేత నందరూ వినఁగాను
వెంగెము లాడించుకొనువేడుకా నీకు
కొంగువట్టితియ్యఁగాను కోపగించి నే నిన్ను
జంగిలి తిట్టు దిట్టితే సంతోసమా నీకు ॥ ఎటు ॥

వెనుకొని నీకొప్పువీడినందాకా నాచే
పెనఁగులాడించుకొనుప్రియమా నీకు
కొనగోరు సోఁకి నీమై కుమ్మెలు నాటఁగా
చెనకించుకొన నంత సింగారమా నీకు ॥ ఎటు ॥

దిట్టవై నాచేతను తేనెగారేనీమోవి
ఇట్టె గంటిసేయించుకో యితవా నీకు
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
గుట్టుతోడ నింతసేయఁ గోరికా నీకు ॥ ఎటు ॥ 176

ఆహిరి

ఏల సిగ్గులువడేవు యేమిటికి లోఁగేవు
కాలుదొక్కఁగా నిన్నుఁ గాదుకూడదనేమా ॥ పల్లవి ॥

ననుపు సేసుక నాతో నవ్వులు నవ్వేవాఁడవు
వానరఁ బొందుసేయఁగా వొద్దనేమా
తనివోక దిష్టించి తగులఁ జూచేవాఁడవు
పెనఁగులాడఁగాను తప్పించుకొనేమా ॥ఏల॥

మక్కువలు చూపి మోపి మాటలాడేటివాఁడవు
పక్కకు రాఁగాను చేపట్టకుండేమా
అక్కరతో నాకు నింత ఆసపడేటివాఁడవు
ఇక్కువ లంటఁగా నీకు నెదురాడేమా ॥ఏల॥

చలపట్టి నామోవి చవులడిగే వాఁడవు
మలసి పెంటాడఁగాను మారుకొనేమా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నమ్ము నేఁడు
వెలయ మన్నించఁగాను వింతగాఁ జూచేమా ॥ఏల॥ 177

శుద్ధవసంతం

అన్నిటాను కడుజాట వౌదువే నీవు
సన్న లాతఁడు చేసితే జంకించేవు నీవు ॥పల్లవి॥

కాటుకకన్నులఁ జూచి కడుసొలసిసొలసి
మాటాడనేతువౌనే మగనితోను
నీటున నప్పటినుండి నిన్నాతఁడు వేఁడుకోఁగా
పాటించి నీ వెంతవోడఁబరచేవే కమ్మటి ॥అన్ని॥

జవ్వనపుసింగారము సారెసారెఁ గురియుచు
నవ్వున నవ్వనేరుతువే నాథునితోను
పువ్వుల నాతఁడు నిన్ను పూఁచిపూఁచి వేయఁగాను
మువ్వంకా నొడ్డించుకొంటా మొక్కేవేమే నీవు ॥అన్ని॥

వెలలేనివలపులు వేమారుఁ జల్లి రతులఁ
గలయనేర్తువే శ్రీవేంకటేశుతోను
చెలరేఁగి చెలరేఁగి సేసలాతఁడు వెట్టఁగా
నిలిచి యిచ్చక మెంత నెరపేవే నీవు ॥ అన్ని ॥ 178

కాంబోది

ఇట్టుండవలదా యిద్దరికి సంతోషాలు
మట్టుమీరి తలపోఁత మఱవలే రెపుడు ॥ పల్లవి ॥

యెన్నటిపొందులో కాని యీకెకు నాతనికిని
సన్నలా చాయలా మోవి చవిగొనేరు
ఇన్నిటాను పొంతనాలు యెట్టు గూడెనో కాని
పన్నినతమకములఁ బాసి వుండలేరు ॥ ఇట్టుం ॥

తగుల మెట్టిదో కాని తనకునుఁ దనకును
పగటున మోములు తప్పకచూచేరు
మొగి నోఁచిననోములు మున్నిటి వెట్టివో కాని
నగవులే పెంచక మానఁగజాల రిదివో ॥ ఇట్టుం ॥

వేడు కెట్టిదో కాని శ్రీవేంకటేశ్వరు కింతికి
వోడక రతికళల నుల్లసించేరు
కూడిననేరుపు లెంత గురులు సోఁకెనో కాని
జోడయినకాఁగిలి యెచ్చోటా విడువరు ॥ ఇట్టుం ॥ 179

భైరవి

నీ కింతయేలె వెఱపు నీకు మగఁ డాతఁడు
చేకొని నీచనవెల్లాఁ జెల్లించుకోరాదా ॥పల్లవి॥

చీటికి మాటికి నీవు సిగ్గులు వడేవుగాని
నాటుకొనఁ బతితోను నగరాదా
కూటమి గోరి సంగడిఁ గూచుండ లోఁగేవుగాని
కోటలేక కుచముల నొరయరాదా ॥నీకి॥

చనవులా మనవులా సాదించవచ్చేవుగాని
మనసిచ్చి యాతనితో మాటాడరాదా
తనియక మోవి చూచి దప్పులుదేరేవుగాని
వినయానఁ దములము వేఁడుకోరాదా ॥నీకి॥

అలపులా సొలపులా ఆయాలు ముట్టేవుగాని
పిలిచి శ్రీవేంకటేశుఁ బెండ్లాడరాదా
బలిమి నన్నిటా నొడఁబరచుకొంటివిగాని
మలసి రతుల నిట్టె మన్నించుకోరాదా ॥నీకి॥ 180

రేకు 1541 రామక్రియ

చూచేవారికెల్లాను చూడఁ గొత్తలు
యేచినమీమహిమలు యేమిచెప్పే దపుడు ॥పల్లవి॥

గందము నీవు చల్లఁగా కాంత సరసమాడఁగా
చందమాయ మీచేఁతలు సరికి బేసి
విందు నీ కాపె చెప్పఁగా వెస నీ వియ్యకొనఁగా
ఇందరిలో మీసంతోసా లేమి చెప్పే దపుడు ॥చూచే॥

ఆయములు నీవంటఁగా ఆపె నవ్వులు నవ్వఁగా
చాయకు వచ్చె వలపు సాటికి బేటి
కాయ మాపె వొరయఁగా కన్నుల నీవు చొక్కఁగా
యీయెడ వినోదము లేమి చెప్పే దపుడు ॥చూచే॥

సరుగ నీవు గూడఁగా చన్నుల నాపె వొత్తఁగా
ఇరవాయ సమరతు లీడుకు నీడు
సరి శ్రీవేంకటేశ్వర సన్నలు మీలోఁ జేయఁగా
యెరవులే దెరిఁగితి మేమి చెప్పే దపుడు ॥చూచే॥ 181

దేసాళం

ఎంతరాజసము చూపే వీకె యెదుట
చెంతలనే మమ్మును చిమ్మిరేఁతురా ॥పల్లవి॥

కొండలెక్కి [1]నీకుఁ జనుఁగొండలు చూపీ మారు—
గొండవైనుండిన[2]నీకుఁ గోమలి
రెండుచేతులుఁ జాఁచి కూరిమి నందు కొనరాదా
అండనున్నలకిమమ్మ నలఇంతురా ॥ఎంత॥

పండుండి నీకు మోవిపండు చూపి యెలఇంచీ
పండువెన్నెలబయట పడఁతి
[3]నిండునీవదనమున నిక్కించి చేకొనరాదా
మెండైనలకిమమ్మతో మేకుసేతురా ॥ఎంత॥

కొనబుఁదనాన గోరికొన చూపీ పెండ్లిసేసు—
కొనవలెనని నీకుఁ గోమలి
యెనసితివి శ్రీవేంకటేశ నీ వౌభళేశుఁడ—
ననరాదా లకిమమ్మ కటు మాటదాఁతురా ॥ఎంత॥ 182

1. 2. ఇవివునరుక్తములు. ఇట్టి వీవాఙ్మయమున నక్కడక్కడ గలవు.
3. 'వీనిండువదనమున' అనుట సహజము.

## మాళవి

నన్ను నేలినాఁ డితఁడు [1]నరసింహుఁడు
అన్నిటాను జాణఁడు [2]ప్రహ్లాదనారసింహుఁడు ॥పల్లవి॥

నగవులవఁడుగదె నరసింహుఁడు
వెగటులేనివాఁడు వీరనరసింహుఁడు
నగముపై నున్నవాఁడు నరసింహుఁడు
అగపడె మనకుఁ బ్రహ్లాదనరసింహుఁడు ॥నన్ను॥

ననవిలుతునితండ్రి నరసింహుఁడు
కనకపుకాళ(సె?)వాఁడు [3]గజనరసింహుఁడు
ననుపుపొందులు సేసేనరసింహుఁడు
అనిశముఁ బాయఁడు ప్రహ్లాదనరసింహుఁడు ॥నన్ను॥

నాతో సరసమాడీ నరసింహుఁడు। నా—
చేతికి నుంగర మిచ్చె శ్రీనరసింహుఁడు
యేతుల శ్రీవేంకటాద్రి నిదే యహోబలమున
ఆతుమలోఁ బాయఁడు ప్రహ్లాదనరసింహుఁడు ॥నన్ను॥ 188

## సామంతం

ఊరకె వున్నాఁ డదె వోపిక చూపఁగవద్దా
నేరుపున నామాట నిజపట్టుఁగాని ॥పల్లవి॥

---

1. 'నరసింహ్వుఁడు' అనియే రేకుపాఠము.
2. 'ప్రంహ్లాద, అనియే రేకు పాఠము.
3. గొప్ప అనుభాయార్థములో 'గజ' అనువిశేషణ మక్కడక్కడ ఈవాఙ్మయమున గలదు. 'గజదొంగ, ఇత్యాదివ్యవహారము దీనికి కారణము కావచ్చును,

సరసమాడేటివాఁడు సంగడికి రావలదా
    సొరిది నాగోరిలావు చూచుఁగాని
పొరుగున నున్నవాఁడు పోరచి యడుగవద్దా
    సరుస నామోవితీపు చవిచూచుఁగాని ॥ఊర॥

యెమ్మెలుసేసేటివాఁడు యెదుటనే వుండవద్దా
    కమ్మటి నాచేఁతలెల్లాఁ గనుఁగొనుఁగాని
దిమ్మరీఁ డయినవాఁడు తిరుగ మాటాడవద్దా
    దొమ్మి నాగబ్బితనము తోడ వినుఁగాని ॥ఊర॥

కలసి కూడేటివాఁడు కాఁగిలించుకొనవద్దా
    తిలకించి నావలపు తెలుసుఁగాని
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
    బలిమిఁ బెనఁగవద్దా పచ్చిదేరుఁగాని ॥ఊర॥ 184

బౌళి

ఎంచుకొమ్మా నీకునీవే యీతగవులు
    మంచితనానఁ జెలిని మన్నించవయ్యా ॥పల్లవి॥

వంతులకు వాసులకు వనితలు పొలసితే
    పంతమాడిరంటా యెగ్గుపట్టఁదగునా
వింతలుగాఁ దీగెలు వసంతకాలానఁ జిగురు
    యెంతపెంచినా నందు కిచ్చగించవలదా ॥ఎంచు॥

ననుపైనరమణులు నవ్వులెంత నవ్వినాను
    ఘనగర్వములంటాను కాదందురా
యెనసి వానకాలాన యేరులు మించిపారితే
    యెనలేనివేడుకతో నీఁదులాడవలదా ॥ఎంచు॥

రతివేళ వనితలు రాఁపు నిన్నుఁ జేసితేను
తతిగొని నీవూఁ గడుఁదమకింతురా
అతి [1]నాఁడుఁగోవిలలు చెలఁగి యెంత వుండినా
సతమై శ్రీవేంకటేశ సారె వినవలదా ॥ఎంచు॥ 185

మాళవి

మాపుదాఁకా మాటలేల మాతోఁ జాల
పైపై నున్నది నీపై నిదెవోలా ॥పల్లవి॥

చెలిఁ గొంగువట్టి తీసి చేయిమీదఁ జేయివేసి
యెలమి వలపురేఁచే వెగపోసి
మెలుపునఁ జందురుఁడు మీమీఁద వెన్నెల గాసీ
కలయరాదా విభుఁడ కలికిని డాసి ॥మాపు॥

మగువయిల్లు చొచ్చి మచ్చికలఁ జనవిచ్చి
నగవులు నవ్వేవు నడుమఁ గొచ్చి
పగటున వలరాచబలము పౌఁజులై వచ్చీ
జగడము మానరాదా జవరాలి మెచ్చి ॥మాపు॥

రమణిఁ గాఁగిటఁ గూడి రతులనే వసివాడి
తమితో మన్నించితివి తగు నీవాడి
సమమై శ్రీవేఁకటేశ చల్లగాలి విసరాడీ
చెమట లార్చుకోరాదా సిగ్గులువీడి ॥మాపు॥ 186

రేకు 1542 రామక్రియ

నేమా విన్నవించితిమి నీచిత్తము
కామినిభావము చూచి కరుణించు మిఁకను ॥పల్లవి॥

---

1. ఆడుకోవిలలకు కూతలో ప్రశస్తిలేదు. "పుంస్కోకిలో యన్మధురం చుకూజ" ఇత్యాదిగ మహాకవికాళిదాసవచనములు, ఇక్కడ, నాయికల కుపమానముగ శబ్దేతరవిషయమున ఆడుకోకిలను వాడినట్లున్నది.

అడియాసఁ గొంతవద్దు అట్టె నీవు వచ్చేవనే—
తడఁబాటుతోడిచింత గొంతవొద్దు
యెదమాట లాడించే ఇంకాఁ బొద్దు [1]జరపే
బడలెఁ జెలియ ఇఁకఁ బట్టలేదు మనసు ॥నేమా॥

వేడుకలఁ గొంతవొద్దు వెస నీకెదురుచూచి
కూడేనని తమితోడఁ గొంతవొద్దు
పాడుచు నీపైఁ బాటలఁ బలుమారు వొద్దు వుచ్చె
వోడక గుట్టున నుండి వోర్వలేదు తాపము ॥నేమా॥

వినుకలిఁ గొంతవొద్దు వేగ నీవు మన్నించి చే—
కొని కాఁగిలించఁగాను కొంతవొద్దు
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలో నీకెను
తనిసె నిన్నిటా నిఁకఁ దడవదు నేరమి ॥నేమా॥ 187

మాళవిగౌళ

ఇంకా నేమి గడమే ఇంతిరో నీకు
అంకెఁను పతివురమందు నిలిచితివే ॥పల్లవి॥

ఆతని నీసొమ్ముగాను అన్నిటాను నోమితివే
కాతరాన నిందులకే కాచితివౌనే
చేతులెత్తి మొక్కి చేకొంటివే మనసు
యీతల నీవును మాయీడుకు వచ్చితివే ॥ఇంకా॥

నిక్కి తానే వలపులు నీసొమ్ము సేసుకొంటివే
దక్కఁగొని మగనితోఁ దతిగొంటివే
వెక్కసాన నిట్టె వెంటవెంటఁ దగిలితివే
నెక్కొని మావలె నన్నీ నేరుచుకొంటివే ॥ఇంకా॥

1. 'జరుపుదువు—జరపెదవు' రూపముల 'వు' వర్ణములోపించి 'జరపుదు—జరపెదు' అయినట్లే, వ్యావహారికమైన 'జరపేవు' 'జరపే' రూపము.

పొంచి శ్రీవేంకటేశుకే పొంతనాలు గూడితివే
కొంచక ఆసలకెల్లా గురియైతివే
యెంచఁగ నీతఁడే మమ్ము నేలినవాఁడు ఇంతలోనే
పంచల మాకుఁగా విన్నపములూఁ జేసితివే ॥ఇంకా॥ 188

సౌరాష్ట్రం

ఏమి నెఱఁగనికన్నె నింతసేతురా
కామిని వనుచు నెట్టు కనుగొనవచ్చునే ॥పల్లవి॥

నేరుపుననే వచ్చి నీకుఁ గలవలపెల్ల
దారకానఁ దోడాపెకుఁ దగిలించితి
పోరచిగా నీతోను పొందుసేసేవారికెల్లా
యేరీతి సేతువో నిన్ను నెట్టు నమ్మవచ్చునే ॥ఏమి॥

మంచిమాటలెల్లా నాడి మగువను నీమగని—
కంచముపొత్తుకు నెట్టు కలపితివే
పొంచి నీచుట్టరికానఁ బొరలేటివారికెల్లా
యెంచుకొని మఱి యింకా నేమిసేతువో ॥ఏమి॥

చే పట్టుకొని వచ్చి శ్రీవేంకటేశ్వరునిఁ
దోవ రాకుండాఁ బాదము దొక్కించితివి
వావిరి నీపొరుగులవారినెల్లా నీతనితో
చేవమీరి పెండ్లిండ్లు సేతువమ్మా యిపుడూ ॥ఏమి॥ 189

కురంజి

మఱి యేఁటివిన్నపాలు మాపుదాఁకాను
నెఱతనాన మొక్కఁగా నీచిత్త మిఁకను ॥పల్లవి॥

వేమారు నే వేఁడుకోఁగా వెలువు దెలిసె నీకు
గామిడి వైతివి నిన్నుఁ గరఁగించేనా
దోమటిపతులతో నే [1]దోసిటిపాలపెండ్లి
నీమీఁదఁ జల్లఁగా నీచిత్త మిఁకను ॥మఱి॥

సరసములాడు(డఁ?)గాను చలివానె నీ కిన్నిటా
గొరబైతి వెందుకైనాఁ గొంకఁజూచేవా
దొరసవతులలోన తోడుగూడఁ జెనకఁగా
నిరతిమేటి విన్నిటా నీచిత్త మిఁకను ॥మఱి॥

గక్కన నిన్నుఁ గూడఁగా కందువలెల్లాఁ దెలిసె
యెక్కువైతి విన్నిటా నీ వెరవయ్యేవా
మక్కువ శ్రీవేంకటేశ మన్ననదేవుళ్లలో
నిక్కపుమేలు గంటి నీ చిత్త మిఁకను ॥మఱి॥ 190

నాదరామక్రియ

ఎంత దంటతనమయ్యా యీయింతికి
బంతిని యితవేకాక బలిమి చూపీనా ॥పల్లవి॥

కెలయుచు నింతి నీతో కేరికేరి నవ్వీనా
సెలవులమీఁదనే చిందుఁగాక
చెలరేఁగి చెలరేఁగి చేయిచాఁచి పెనఁగినా
కొలఁదివాఁడి కొనగోరి వాఁ(వ్రాఁ?)తగాక ॥ఎంత॥

బిరుదులు పచరించి బెట్టిమాఁట లాడినా
వొరయుచుఁ బెదవుల నొయ్యనేకాక
సరసములాడుతాను సంగడిఁ గూచుండినా
వురముమీఁద నెక్కి వుండుగాక ॥ఎంత॥

1. 'దోసిటిపెండ్లిపాలు' అనుటమేలు. దోసిటి పెండ్లిపాలు=దోసిలి నించుకొన్న పెండ్లి తలఁబ్రాలు కావచ్చు. అవి చల్లుట కర్తవ్యము. లేక, దోసిటిపాల=దోసెడు తలఁబ్రాలుగల; పెండ్లిన్=వివాహమందు అనికావచ్చు.

సిగ్గులు విడిచి నిన్నుఁ జెయివట్టి తీసినా
వొగ్గి నీపాదాలసేవ నొనరుఁగాక
నిగ్గుల శ్రీ వేంకటేశ నీవు నాపెఁ గూడితివి
వెగ్గళించి లోఁగినా వియ్యమందీఁగాక ॥ఎంత॥ 191

వరాళి

మూలనున్న వారినేల ముంగిట వేసేవు; నిన్ను
తాలిమితోఁ దడవితే తడవరాదా ॥ పల్లవి ॥

కొసువంచినయాపెఁ జెనకేవు సారెసారె
వరుస నీతో నవ్వవచ్చెనా నేఁడు
మరిగి నే నుండఁగా మరి కొంగువట్టేవు
అరుదుగ సరసము లాడవచ్చెనా ॥మూల॥

పంతముతోనున్న యాపెఁ బలికించవచ్చేవు
వంతులకు ముచ్చటాడవచ్చెనా నీతో
చింతతోడ నుండఁగాను చెక్కులు నొక్కేవు నీవు
కాంత నీతోఁ బెనఁగఁగవచ్చెనా ॥మూల॥

ఆకుమడిచియ్యఁగా నట్టె కాఁగిలించితివి
యీకడ మందెమేళాన కిటు వచ్చెనా
చేకొని మన్నించితివి శ్రీవేంకటేశ్వర
దాకొని నిన్నిందాఁకాఁ దమకించవచ్చెనా ॥మూల॥ 192

రేకు 1543 ముఖారి

ఇంతికి నీకుఁ దగవు లివివో చెప్పేము నేము
రంతు సేయరాదుగాని రవ్వసేయవచ్చును ॥పల్లవి॥

తెగనాడరాదుగాని తేనెగారే మోవి నిన్ను
తెగడి తెగడి ఇట్టె తిట్టవచ్చును
నగవద్దుగాని నీనటనలు పచారించి
వెగటులేకుండాను వెంగమాడవచ్చును ॥అంతి॥

జంకించరాదుగాని సతికి నీతిరుమేను
అంకించి కొసగోర నంటవచ్చును
మంకు చూపవద్దుగాని మనసిచ్చి యన్నిటాను
కంకినేసి రతులను కాఁగిలించవచ్చును ॥అంతి॥

వేసరుకోరాదుగాని వేడుకతో నిన్నుఁగూడి
ఆసచూపి సన్నలు సేయఁగవచ్చును
యీసు లేక వద్దుగాని యిట్టె శ్రీవేంకటేశ
సేసవెట్టి కూడెఁ జెలి చేరి మెచ్చవచ్చును ॥అంతి॥ 193

నాదరామక్రియ

ఎప్పుడును నీవోజలేల మానేవు
చిప్పిలు వలపు లింత చిమ్మిరేఁచెఁగాక ॥పల్లవి॥

చలవాదివాఁడవౌత సారెకు నే నెఱఁగనా
బలుతమకానఁ గొంగువట్టితిఁగాక
పిలిచితే నీవెప్పుడు బిగిసేది యెఱఁగనా
పెలుచుఁదమకమునఁ బేరుకొంటిఁగాక ॥ఎప్పు॥

మాయదారివాఁడవౌత మఱసి నే నెఱఁగనా
నాయము నడపేవంటా నమ్మితిఁగాక
చేయి మీఁదవేసితేనే చిక్కలోఁగే దెఱఁగనా
ఆయము లంటి సరసమాడితిఁగాక ॥ఎప్పు॥

వేడుకకాఁడవా(వౌ?)త వెస నే నెఱఁగనా
పాడితో నే నీకు మొక్కి పైకొంటిఁగాక
యీడనే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
జాడ దప్పేవా నేనే ఆరసితిఁగాక ॥ఎప్పు 194

### హిజ్జిజి

ఈయింతివల్ల నేరమి ఇంచుకంతైన నున్నదా
చేయి చాఁచఁగా నీతో సిగ్గువడరాదా ॥పల్లవి॥

చెలి నిన్నుఁ దప్పకచూచెనంటానే తగిలేవు
సొలసి నీవు దిట్టఁగాఁ జూడవద్దా
నలిరేఁగి నీతోను నవ్వెనంటాఁ బైకొనేవు
గిలిగించఁగాఁ గిలకిల నవ్వరాదా ॥ఈయిం॥

సతి మాటలాడెనంటా సారెసారెఁ బొదిగేవు
కత చెప్పఁగా మాయగత వద్దా
తతితో జంకించెనంటా తమకించఁజూచేవు
రతి మర్మ మంటఁగా బిరాన జంకించరాదా ॥ఈయిం॥

కాంత నీకు మొక్కెనంటా కాఁగిలించి కూడితివి
పంతపుఁబతికి మొక్కఁ బాడిగాదా
ఎంతైనా శ్రీవేంకటేశ ఇద్దరి కిద్దరే సరి
యింత నీవు మన్నించితే యియ్యకొనవలదా ॥ఈయిం॥ 195

### గుజ్జరి

ఏమయ్యా పాడిపంతా లెఱఁగనివా నీవు
నేమముతో నిద్దరుకు నీకు సరిగారా ॥పల్లవి॥

పనివడి యాపె నీతో పంతములెల్లా నాడఁగా
వొనరి యాపె నీతో నూరకుండునా
చనవుచేసుక యాపె సంగడిఁ గూచుండఁగాను
వెనకదిక్కున నీకె వేరె కూచుండునా ॥ఏమ॥

చెంతనుండి యాపె నీకు సేవలెల్లాఁ జేయఁగాను
ఇంత నంతఁ గొలువులు యీకె సేసునా
మంతనాన ఆపె నీమర్మము లంటఁగాను
వింతకతలు చెప్పునా వెలఁది యీకె ॥ఏమ॥

పొత్తుల రతుల నాకె భోగించఁగా. నీకు
బత్తులే సేసునా పైపై నీకె
కొత్తగా శ్రీవేంకటేశ కూడె నాకె నిన్నుఁ దొల్లె—
వుత్తలపువేడుకల నురమెక్కె నీకె ॥ఏమ॥ 196

కేదారగౌళ

పురుషవిరహా మిదె పొలఁతి నీమగనికి
గరిమతో నిండుకొనెఁ గాఁగిలించఁగదవే ॥పల్లవి॥

పెలుచుఁదనాన నీవు పెడచేత మొక్కినదే
తలఁచుక రమణుఁడు తమకించునే
కలకల నవ్వుతా కన్నులఁ జూచినదే
చెలరేఁగి అండనున్నచెలులకుఁ జెప్పునే ॥పురు॥

మందె మేళమున నీవు మాటలాడినవి యెల్ల
అంది కలవరించేటియప్పు డాడునే
ఇందమంటాఁ గప్పవిడెమిచ్చినయలవాటున
చెంది యిట్టె సారెసారెఁ జేయి చాఁచునే ॥పురు॥

చెక్కు నొక్కి యేకతానఁ జెనకి కూడినందుకే
చొక్కుచు నానందాన సుముఖుఁడౌనె
ఇక్కడ శ్రీవేంకటేశు నెనసితి వింతలోనె
యెక్కువ నిందాఁకాను యెదురులు చూచెనే ॥పురు॥ 197

పాడి

ఇదివో నీమగఁ డున్నాఁ డిఁక నెన్నఁడే
పదివేలకు నీమేలు పచారించవలదా ॥పల్లవి॥

జక్కవలు చన్నులట చకోరాలు కన్నులట
యెక్కువతో మురియక యేల మానేవే
చెక్కులే యద్దములట చిగురు మోవియట
తెక్కసమై నీ వింత విఱ్ఱవీఁగవలదా ॥ఇది॥

అలులు నీకురులట అంబుజము మొగమట
యెలమి నెమ్మేలు చూప కేల మానేవే
పులినపుఁబిరుఁదట తిలపుష్పనాస వట
మెలఁగి నీ వింతేసి మితిమీరవలదా ॥ఇది॥

నెమ్మది లతాంగివట [1] నిత్యజవ్వనివీవట
యిమ్ముల నిరాజసము లిఁక నెన్నఁడే
చిమ్ముచు నీనాయకుఁడు శ్రీవేంకటేశుఁడు గూడె
పమ్ముచు నీవన్నెలిట్టె పచరించవలదా ॥ఇది॥ 198

రేకు 1544 ఆహిరి

కన్నె ముద్దరాలు నీతో గట్టివాయితనముదా
సన్నల చాయలనే చలపాదిఁ జేతురా ॥పల్లవి॥

---

1. 'నిత్యజవ్వనివి' ఇది విరుద్ధసమాసము. ఇట్టి చిల్లరదోషముల కీ వాఙ్మయ-
మున పట్టింపులేదు.

సిగ్గువడి లోలోనే శిరసు వంచుకోఁగానే
వెగ్గళించి చెలినేల వేఁడుకొనేవు
వొగ్గుచుఁ జేతుల సారె నొడ్డుకొంటాఁ దిట్టఁగానే
బగ్గనఁ బోఁకముడి పట్టి విడిచేవు ॥కన్నె॥

మొక్కుచుఁ బయ్యదకొంగు ముసుఁగువెట్టుకోఁగానే
గుక్కక చన్నులమీఁద గోర గీరేవు
పక్కన నీదువురము పాదమునఁ జిమ్మఁగానే
అక్కున నదిమి సతిఆయా లంటేవు ॥కన్నె॥

అద్దలించి జంకించి ఆనలెల్లాఁ బెట్టఁగాను
వుద్దండాన మోవిఁ గెంపు లొనరించేవు
సుద్దుల శ్రీవేంకటేశ సుదతిఁ గూడితి విట్టె
కొద్దిమీరఁ గూడినాను కోరకఁ దనియవు ॥కన్నె॥ 199

దేసాళం

సేయనీవే అతఁడిట్టె సేసినంతాను
కాయకపుఁ బ్రియములు గట్టిపడీనా ॥పల్లవి॥

వెక్కసా లాడకువే నాయకునితోను
నిక్కి వంకలు దిద్దఁగ నీవసమా
కక్కసానఁ బెట్టకువే ఘనుని నీవు
పక్కనఁ దలపోఁతలు పాటివచ్చీనా ॥సేయ॥

వెరుసులు వట్టకువే నీవతనిని
దొరతనము వంచఁగ దోఁటి గలదా
పెరరేఁచకువే యీఁకఁ బ్రియములెల్ల
తెర మరుగుండఁగానే తేటతెల్లమవునా ॥సేయ॥

కొంగువట్టి తియ్యకువే గురిగా నీవు
ఇంగిలిసరసములు చవి వుట్టినా
కంగు వాయ శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
అంగడినవ్వులలోనే ఆస మానీనా ॥ సేయ॥ 200

సాళంగనాట

ఏల పూసుకవచ్చేవు యింతేసి నీవు
వేలికొనఁ బెనఁగఁగా విదిలించరాదా ॥పల్లవి॥

కూరిమిగలదానవు కొంగువట్టె నాతఁడు
నేరమి నన్నే లెంచేవే నీవు సారెకు
భారపుగుబ్బలమీఁదిపయ్యద దీసి నన్ను
గోరు దియ్యఁగా నాతనిఁ గోరి తిట్టరాదా ॥ఏల॥

పట్టపుదేవులవు నీపతి నాతో మాఁటాడితే
అట్టుచేసే వీడ నన్నూఱకే నీవు
మెట్టిపట్టు కాతఁడు మేనవావి వయిమోవ
చుట్టి కాఁగిలించఁగాను సూడువట్టరాదా ॥ఏల॥

యిచ్చకురాలవు నాకు నితఁడు విడె మియ్యఁగా
కొచ్చికొచ్చి వెంగెములే కుప్పవెట్టేవు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడఁగాను
పచ్చిరతులఁ జొక్కించి పంతమాడరాదా ॥ఏల॥ 201

లలిత

నీపంతము లీడేరె నేరుపరి వౌదువయ్యా
ఆపనులు నాకుఁ జెప్పి ఆలిఁ జేసుకొఁటివి ॥పల్లవి॥

చలముగలవారికి సాదించరానిదేమి
చెలులుగలవారికి సిగ్గులేవి
మలసి మలసి నాతో మంతనము లాడియాడి
అలరి వలపురేఁచి ఆలిఁ జేసుకొంటివి ॥ నీవం ॥

వేసరనివారికి వెగ్గళ మేమున్నది
ఆసలుగలవారికి నలపులేవి
వాసితోను నీవు మావాకిటనే కాచుకుండి
అసుద్దులు చెప్పి చెప్పి ఆలిఁ జేసుకొంటివి ॥ నీవం ॥

కాలిమిగలవారికి తగులని వేమున్నవి
యేలినవారికి నడ్డ మేమున్నది
యీలాగుల శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడి
ఆలాగులనే నేఁడు ఆలిఁ జేసుకొంటివి ॥నీవం॥ 202

సంధురామక్రియ

వేళొకయాఁటదై తే వేసరు నీపొందులకు
ఆఱడి కోర్తువు నీవు ఆసోద మెట్టిదో ॥పల్లవి॥

చనవుచేసుక నిన్ను చన్నులనే వొత్తితి
మనసురా నవ్వునవ్వి మర్మమంటితి
పెనఁగి రతులనే బెండుపడఁ జేసితి
తనియ వెంతైన నీతమక మదెట్టిదో ॥ వేళొ ॥

పెదవితేనె లాని పిప్పిసేసితి నీమోవి
పదరి పచ్చిమాఁటల భ్రమయించితి
గుదిగొన్నచూపులనే కొచ్చికొచ్చి చొక్కించితి
మదము దిగవు నీమగతన మెట్టిదో ॥ వేళొ ॥

వూడిగాలు చేసిచేసి వొడలెల్లానిమిరితి
వాడికకూటములను వలపించితి
యీడనె శ్రీవేంకటేశ యిం(యిం?)త నిన్నుఁ గొసరితి
వోడ వెం(వెం?)తయినా నీవోపికింకా నెట్టిదో ॥వేఁడొ॥ 203

తెలుఁగుఁ గాంబోది

చూడరే యెంతపగటు సుదతులాలా
వాడవారా తమలోనివంక లొత్తేవారు ॥పల్లవి॥

మగనికి నాలికి మాఁటపలుకైతేను
తగవులు దిద్దేవారు దండచెలులా
యెగసక్కెలకు తామే యెంతమేరమీరినా
అగపడి నేమెల్లా నడ్డాలు వచ్చేమా ॥చూడ॥

తనకు నాపెకు లోలో తమకాలు రేఁగితేను
చనవున మెచ్చేవారు సఖులా
చెనకుచుఁ దమంతనే సిగ్గులఁ బొరలఁగాను
పెనఁగి నేము రతికిఁ బెడరేఁచేవారమా ॥చూడ॥

తావా మరదలుఁ గూడి పరవశమందఁగాను
యీవలఁ బొరుగువారు యెచ్చరించేరా
శ్రీవేంకటేశ్వరుఁడే చేరి మమ్ముఁ దమ్ముఁ నేలె
వేవేలకయినాను విడనాడేమా ॥చూడ॥ 204

రేకు 1545 ఆహిరినాట

పట్టకు నీవంతేసి బలిమిసేసి
తిట్టపెట్టి నీవు దిద్దినదానఁగానా ॥పల్లవి॥

సన్నలేల సేసేవు సారెకు నీవు నాతో
కన్నదే కాదా నీతో కాఁపురమెల్లా
చన్నులేల యంటేవు సతులముందర నెల్లా
పిన్ననాఁటనుండి నీవు పెంచినవే కావా ॥ పట్ట ॥

నగవులేల నగేవు నయగారితనముల
మొగము చూచి నీకు మొక్కితిఁగాదా
జిగి విడెమేలిచ్చేవు చెలఁగి నీతములను
పొగరుల నున్నది నాపుక్కిటనే కాదా ॥ పట్ట ॥

వాసలేల సేసేవు పలుమారు నిఁకా నీవు
సేసలు వెట్టినది నాశిరసే కాదా
వాసితో శ్రీవేంకటేశ్వర నన్నుఁ గూడితివి
ఆసపడినది నాయంగ మిదే కాదా ॥ పట్ట ॥ 205

సాళంగనాట

తక్కినవారికెలాఁ దరితీపు లందురు
మిక్కుటపుసరసము మీలో నమరును ॥ పల్లవి ॥

తగునమ్మ యిన్నిటాను తరుణి నీకాతనికి
నగవమ్మ యాతనితో ననుపునను
జిగి మీరొక్కరొకరు సేసినట్టెల్లాఁ జెల్లె
మిగులా మీవొద్దికలు మీలో నమరును ॥ తక్క ॥

కూడెనమ్మ సంసారము కోమలి మీయిద్దరికి
చూడవమ్మ ఆతనిపై సొలపుఁజూపు
తోడునీడలవలెను దొరకె మీవయసులు
మేడెపుమీరతులివి మీలో నమరును ॥ తక్క ॥

పండెనమ్మ వలపులు పడఁతి మీకోర్కులకు
వుండవమ్మ యీతనివొద్దనే నీవు
అండనే శ్రీవేంకటేశునంకెలే నీయంకెలాయ
మెండగుమీకూటములు మీలో నమరును ॥తక్క॥ 206

## లలిత

ఎవ్వరితో గొడవేల యిదుమలఁబడనేల
రవ్వగా నీసతిఁగూడి రాజ్యమేలవయ్యా ॥పల్లవి॥

నిండునిదా(ధా?)నమువంటినెలఁత యెదుటనదె
కొండలవంటిగొప్పకుచము లవె
వెండిఁబైఁడి[1] వంటివేడుకప్రియము లవె
వుండవయ్య యీకెపద్ద నొక్కమవసునను ॥ఎవ్వ॥

వసంతకాలమువంటి వాలినజవ్వన మదె
ముసరుఁదేనెవంటిమోవి యదె
పసనిముత్తేలవంటి పైపైసిగ్గులు నవె
రసికుఁడ విన్నిటాను రమియించవయ్యా ॥ఎవ్వ॥

చవులవిందులవంటిసరసపుమాఁటలవె
కవగూడేయటువంటి కాఁగిళ్లవె
యివల శ్రీవేంకటేశ యిద్దరూ నెనసితిర
పవళించి యిట్లానే పాయకుండవయ్యా ॥ఎవ్వ॥ 207

## పాడి

ఏమేమి సేయఁగాను ఇంకా నేమేమి వుట్టునో
నేమముతో నుండేనయ్య నేరుతునా నేను ॥పల్లవి॥

1. వంటి వలెను దేదము లేదా?

సారెకును నవ్వఁగాను చలములు రేఁగెను
మేరమీరి మొక్కఁగాను మించెఁ బంతము
వేరుకొని పిలువఁగా విగిసే వింతటిలోనె
వూరకుండేనయ్యా నీతో వోపుదునా నేను ॥ఏమే॥

వేడుకతో మాటాడఁగ వెంగెము లందులో నుండె
వాడికెకు గదిసితే వాసివుట్టెను
వూడిగాలు నేసితేను వొద్దికఁ గాలు దాఁకెను
జాడతో నుండేనయ్యా సాదించఁగలనా ॥ఏమే॥

తప్పకచూడఁగాను తమకములెల్లా నిండె
కప్పురాన వేసితేను కళదాఁకెను
ఇప్పుడు శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
మెప్పించి వుండేనయ్యా మేరమీరేదాననా ॥ఏమే॥ 208

రామక్రియ

ఎంతలేదు నాయాస యేమి చెప్పేను
పంతమున నీవల్ల బతుకెల్లాఁ గలది ॥పల్లవి॥

నీచిత్తము నామీఁద నిజముగాఁ జారితేను
మేచిననావలపెల్లా నీదేరును
పూచినపూవులలోన పూఁపలు బలువైతేనే
కాచినకాపెల్లా నట్టె కడుఫలియించును ॥ఎంత॥

చనవిచ్చి నీవు నాతో సరసములాడితేనే
యెనసిననాసేవ లీడేరును
వెనుకొన్నసంపదలు వెంటవెంటఁ దిరిగితే
యెనలేనిరాజసము లింతా నీడేరును ॥ఎంత॥

సేసవెట్టినట్టి(ట్టి?)నీవు చెప్పినట్టు సేసితేను
వేసరనినా కాఁగిలి వేడుకతౌను
యీసులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
లాసి నీటికొలఁదే లలితోఁ దామెరలూ ॥ఎంత॥ 209

## ఆహిరినాట

ఏమిసేసితినయ్యా నీవింత యగడుసేసేవు
ఆమనివలపులెల్లా నంగడి వేసేవు ॥పల్లవి॥

నవ్వులకు నీతోను నంటుమాఁట లాడితేను
రవ్వగాఁ జెప్పేవు తోడిరమణులతో
పువ్విళ్లూర నీమోవి నూరేతేనె లానితేను
అవ్వల నాపలుసోఁకులని చూపేవు ॥ఏమి॥

పూని యెలుకకుఁ జేయి బుజముపై వేసితేను
మేను గోరుసోఁకెనంటా మిట్టిపడేవు
దాని కేమనుచు నిన్నుఁ దప్పక చూచితేను
పేనిపట్టి సిగ్గులతో బెట్టి నవ్వేవు ॥ఏమి॥

కడుమెరమెచ్చులకు కాఁగిలించుకొంటేను
అడపముసతి విడె మందిమ్మనేవు
యెడయక శ్రీవేంకటేశ నీకు మొక్కితేను
తోడఁబడఁ దెరవేసి దొమ్మిసేసేవు ॥ఏమి॥ 210

రేకు 1546

## హిజ్జిజి

నిజమునుఁ గల్లయు నీమేననే వున్నది
బుజము చూపుమా నీబొంకు లేక నేఁటికి ॥పల్లవి॥

సాదించేవు మాటల చలపాదితనమేల
లేదా నీకాపెపొందు లేలే నీవు
వాదించే వప్పటి నాతో వనితలెల్లా వినఁగా
సాదవా నీవేమైనా సట లింకా నేఁటికి ॥నిజ॥

ఆడేవు నీయాచారాలు అంత దోసాలేఁటికి
చూడవా నీ వాపెదిక్కు సూటిగా నేఁడు
వోడక తగవాడేవు వూరివా రెఱిఁగినపనికి
జాడ దప్పనివాడవా సట లింకా నేఁటికి ॥నిజ॥

కలకల నవ్వేవు గట్టువాయితనమేల
వలవవా ఆపెకు వంతుల నీవు
యెలమి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
చలివాసితి విన్నిటాను సట లింకా నేఁటికి ॥నిజ॥ 211

కేదారగౌళ

నన్నేల యెచ్చరించేరే నాకు మఱపు గలదా
పన్ని యింతమంత్రానకు పదరఁగనేలే ॥పల్లవి॥

కందువ లంటినప్పుడే గక్కనఁ జెనకేఁగాక
సందడిలో వలపులు చల్లనేలే
విందువలెఁ బిలిచితే వేడుక నూఁకొనేఁగాక
అందరివలెనే మాట లట్టె యాడనేలే ॥నన్నే॥

వలెనన్నప్పుడు నేనే వచ్చేఁగాక వద్దికి
కొలువులోపలఁ బతిఁ గొసరనేలే
నెలకొన్నప్పుడే తనసేరుపులు మెచ్చేఁగాక
పొలసితేఁ బేరుకొని పొగడగనేలే ॥నన్నే॥

నగినప్పుడే మేలు నాఁటుఁ బొడగనేఁగాక
మొగము వంచుకుండఁగా మొక్కనేలే
పగటున శ్రీవేంకటపతి తానే నన్నుఁ గూడె
అగడుసేసి రతుల నలయించనేలే ॥నన్నె॥ 212

నారాయణి

బుద్దెడిగే నిను నేను బోధించనేరుతువు
యిద్దరము నున్నారము యేమందురా ॥పల్లవి॥

పలుమాట లాడితేను బహుభాషి నందువు
మలసి కోపించితేను మంక నందువు
అలిగితే నీతోడి అంకెకత్తె నందువు
యెలమి నీతోడి [1]గాడ కేమిసేతురా ॥బుద్దె॥

కన్నుల జంకించితేను గయ్యాళి నందువు
చన్నుల నే వొత్తితే చలమందువు
సన్నలు చేసితే నీతో సటలు చూపె నందువు
యెన్నిలేవు నీసుద్దు లిటువంటివేరా ॥బుద్దె॥

అట్టె కాఁగిలించుకొంటే ఆసకత్తె నందువు
గుట్టున నూరకుండితే గొంట నందువు
నెట్టుక శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
యిట్టిదివో నీనేరుపు యెదురాడరా ॥బుద్దె॥ 213

అహిరి

ఇంతినేల నేరా లెంచేవు నీవు
జంతలవలెనే నీతో సరసములాడునా ॥పల్లవి॥

1. గాడ, గాఢ శబ్దభవము కావచ్చు. ఎక్కువదనము అర్థము కావచ్చు.

పిలిచి నిన్నొకమాఁటు పేరుకొంట చాలదా
పలుమారు నుతించునా బట్టువలెను
నెలకొని నీవద్ద నిలుచుంట చాలదా
బలిమిఁ బైపడునా పసురమువలెను ॥ఇంతి॥

మొక్కి నీకుఁ జేతులెత్తి మొదలనే చాలదా
దిక్కనఁ బాదాలంటునాఁ దీగెవలెను
గక్కున నిన్నుఁ గన్నులఁ గనుఁగొంట చాలదా
మిక్కుటమై చూచునా మించ లేడు(డి?)వలెను ॥ఇంతి॥

ఇట్టె కాఁగిలించి నిన్ను నెనయుట చాలదా
పట్టి కడు నురుపునా బంతివలెను
గుట్టున శ్రీవేంకటేశ కొంత నవ్వఁ జాలదా
తొట్టి సకిలించునా తురగమువలెను ॥ఇంతి॥ 214

ముఖారి

మంచివాఁడ వౌదువయ్యా మాటలేఁటికి
వంచిననాతురుమెల్ల వదలఁదీసితివి ॥ పల్లవి ॥

వాడిననీమోము చూచి వద్దికి నే వచ్చితేను
పీడెమిచ్చే వంతలోనే వేగిరానను
వోడక దొరవంటాను వుపచారము చూపితే
యీడుగా నామోవెల్లా నెంగిలిసేసితివి ॥మంచి॥

వొంటి నీ వున్నాఁడవంటా వూరకె తోడుండఁగాను
అంటి నన్నుఁ బైకొనేవు అవునయ్య నీవు
జంటైనచుట్టరికాన సహాయము నెరపితే
గెంటక నాచీర గిజిగిజిగాఁ జేసితివి ॥మంచి॥

నిద్దిరింతువోయని నేఁ దొడ్డ చఱచితేను
గద్దించి కాఁగిట నన్నుఁ గలసితివి
అద్దో శ్రీవేంకటేశ అన్నిటా మొగమోడితే
వుద్దండపురతులలో నోలాడించితివి ॥మంచి॥ 215

గౌళ

ఈపాటివాఁడు తాను యిందాఁకా నేమిసేసె
కాపుగా నే నీడ నిట్టె కాచుకుండనా ॥పల్లవి॥

యెలమి నిందాఁకాఁ దా నేడో పరాకై వుండి
తలఁచినప్పుడే తనతమి నామీఁద
వలసినచోటనెల్లా వలపెల్లాఁ జల్లి వచ్చి
పలికినప్పుడే తనబత్తి నామీఁద ॥ఈపా॥

తిన్ననై వూరెల్లాను తిరుగాడివచ్చి నన్నుఁ
గన్నప్పుడే తన కాంతులెల్లాను
చిన్నిమదనమంత్రాలఁ జిక్కివుండి నామాఁటలు
విన్నప్పుడే తనవేడుకెల్లాను ॥ఈపా॥

వాడలో సతులఁ బొందివచ్చి నాకాఁగిటిలోనఁ
గూడి యిప్పుడే చెప్పీ గుట్టు మాకును
యీడనె శ్రీవేంకటేశుఁ డిరవై నామోము చూచి
వాడికె నప్పుడే చూపీ వన్నె మాకును ॥ఈపా॥ 216

రేకు 1547 రీతిగౌళ

ఏమి యీడువెట్టుకొనే వింతికి నీకు
సాములరతుల నీతో సరిదూఁగునయ్యా ॥పల్లవి॥

నీవే మన్నించితేను నెలఁత నీకంటెను
[1]యేవలా వీసమంత యెక్కుడయ్యా
భావించి నీ వాపెపాదాలకు మొక్కితేను
ఆవేళ నేలికసాని యానయ్యా ॥ఏమి॥

నీపాదము చాఁచితేను నెలఁత నీకంటెను
యేపున నిన్ను మోఁచిన దెక్కుడయ్యా
చేపట్టి నీ వాపెచెప్పినట్టు వినేయందు
కోపగించకు నీ కాపె గురువయ్యా ॥ఏమి॥

నీవలపు గలిగితేను నిన్నుఁగూడి చొక్కించీ
యీవిద్యల నన్నిటాను యెక్కుడయ్యా
వోవోయి శ్రీవేంకటేశ వురమెక్కఁగనక నీ—
దేవులు నీపాలింటిదేవరయ్యా ॥ఏమి॥ 217

శంకరాభరణం

ఒడఁబరతురుగాక వొప్పుగా నడచేనని
నడుమఁ గొసరితేను నమ్మునా చెలియా ॥ పల్లవి॥

మనసున నొకటి మాఁటల నొకటిఁ
బెనచి దూరుదురు ప్రియురాండ్లు
ఘనుఁడవు నీవైతే కలవెల్లాఁ జేసివచ్చి
ననుపులు నటించితే నమ్మునా చెలియా ॥ఒడఁ॥

నగవులో నొకటి నటనల నొకటీ
యెగసక్కెలాడుదురు యింతులెల్లా
మగఁడవు నీవైతే మతకానఁ దిరిగాడి
నగరిలో నుంచేను నమ్మునా చెలియా ॥ఒడఁ॥

1. ఆవల—ఈవలవలె 'ఏవలా' కాబోలు. 'ఏవల్లా' కు తెలికరూపమో?

సన్నల నొకటి జంకెనల నొకటిఁ
బన్ని చెనకుదురు పడఁతులెల్లా
వున్నతి శ్రీవేంకటేశ వొనగూడితి వీపెను
నన్ను నమ్మించితే నమ్మునా చెలియా ॥ఒడఁ॥ 218

నాదరామక్రియ

ఇన్నాళ్లవాఁడవై యెనసివుండఁగరాదా
వన్నెలువెట్టుకరాఁగా వడి నవ్వు వచ్చీని ॥పల్లవి॥

మంతనాన నీవు నేనూ మాఁటలాడినట్లానే
పంతమూఁ బాడీ నెఱిఁగి పలుకరాదా
యింతలోనే నీవిట్లా [1]యెవ్వరో మాటలు నేర్చి
వింతబాస లాడఁగాను వేరె నవ్వు వచ్చీని ॥ఇన్నా॥

కఱకరి నిద్దరము కాఁపురము సేసినట్లా
వొఱపు రాజసముతో నుండఁగరాదా
కఱతలజంతలకతలు నేర్చుక వచ్చి
గిఱికొని పొదుగఁగా కేరి నవ్వు వచ్చీని ॥ఇన్నా॥

చేయిముట్టి నీవు నేనూఁ జెనకినయట్లానే
ఆయముఁ బ్రాయ మెఱిఁగి యలమరాదా
యీయెడ శ్రీవేంకటేశ యేడోరతులు నేర్చి
నాయెడ నీవు గూడఁగా నవ్వు వచ్చీని ॥ఇన్నా॥ 219

శుద్ధవసంతం

పిలువవే యీడకు బేసబెల్లియాతని
చిలుపాలు గాఁపించె సిగ్గులెల్లాను ॥పల్లవి॥

1. 'ఎవ్వరిమాటలో' అనుట సహజము. ఎవ్వరిమండియో మాటలు అమవ్యస్తరూపమునకు, సందేహార్థకస్వరముతో కలిపి సమాసముగ వాడుట వీరియలవాటు.

వలవనితో లోలిఁ బెట్టి వట్టిమాటలెల్లా నాడి
తలపోఁతవలపులఁ దమిరేఁచెను
మొలకలనవ్వు నవ్వి మొనగోరికొన వ్రాసి
నిలువు నూరు పండించె నిన్న నెల్లాను ॥పిలు॥

సరసము పైఁజల్లి జాగరాలు సేయింపించి
కరఁగించి మర్మముల కళ లుబ్బించె
తెరవేసి మరఁగున తేనెమోవి యాసచూపి
పరగించె నెమ్మోలెల్లా బలుమేడమీఁదను ॥పిలు॥

కన్నుల సన్నలుసేసి కాయము కాఁగిట నించి
నన్ను నింతగాఁ జేసి నమ్మించెను
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డిపుడు వచ్చి కలసె
విన్నపములెల్లాను వినె నిందాఁకాను ॥పిలు॥ 220

వరాళి

సవతుల మింతే సరుసల నుంటిమి
దవనపువాట్లు తా నెఱుఁగు ॥పల్లవి॥

మగువకుఁ దనకును మాన్పితి జగడము
తగవును ధర్మము తా నెఱుఁగు
పగటు లేఁటివో పంతము లేఁటివో
తగులువిరులే యవి తా నెఱుఁగు ॥సవ॥

విరసపుసొట్లు విడువుమంటి మిటు
తరవాతిపనులు తా నెఱుఁగు
సరసతలో యవి జాణతనములో
తరఁగులుమొరఁగులు తా నెఱుఁగు ॥సవ॥

జమళి నిద్దరిని సంగడిఁ గూర్చితి
తమకము సముకముఁ దా నెఱుఁగు
భ్రమసి శ్రీవేంకటపతి నను నేలెను
తమల మెవ్వరిదో తా నెఱుఁగు ॥సవ॥ 221

దేవగాంధారి

ఎంతకెత్తుకొమ్మనేవు యేమయ్యా వొకమాఁటే
వింతవింతవేడుకలు వెలసేదాననా ॥పల్లవి॥

చాయలకు నీతోను సరిపెనఁగుమనేవు
ఆయములంటేపాటియంతదాననా
పాయపుమదాన నీపడిగెము పట్టేదాన
రాయడించి నిన్నింత రవ్వసేసేదాననా ॥ఎంత॥

ననుపున నీతోను నవ్వులు నవ్వుమనేవు
మునుకొని మందెమేళములదాననా
యెనసిననీమోవియెంగిలి సోఁకినదాన
పనిగొని నిన్నింత పరచేటిదాననా ॥ఎంత॥

కందువఁ గూడుమనేవు కాఁగిటిలోనున్నదాన
అందరిలో పోరచియైనదాననా
విందుల శ్రీవేంకటేశ వేడుక నన్నేలితివి
అంది నీబూవపుదాన నడ్డమాడేదాననా ॥ఎంత॥ 222

రేకు 1548 సామంతం

ఇద్దరిచేఁతలూ సరే ఇంకా నేమనేవే
పెద్దరికమే కలితే పెనఁగవే నీవు ॥పల్లవి॥

వాలుకరెప్పలు నీవు వంచివంచి చూడఁగా
కాలుదొక్కె నందుకేపో ఘనుఁ డితఁడు
వేలుఁగొప్పుతోడ నీవు వెంగెము లాడఁగాను
కోలుముందుగా నిన్నుఁ గోర గీరె నతఁడు ॥ ఇద్ద ॥

పలుమారు నీకునీవే పంతములు నెరపఁగా
చలపట్టి పయ్యదలో చన్నులంటెను
నలువంకఁ జెలరేఁగి నవ్వు నీవు నవ్వఁగాను
తలకొని నీలోనితమి రేఁచె నతఁడు ॥ ఇద్ద ॥

మంతనానఁ జేయిచాఁచి మర్మములు చెనకఁగా
యింతలోనె నీమోవి యెంగిలిసేసె
కాంతవు నీవు చెలరేఁగి కప్పురవిడెమియ్యఁగా
వింతగా నిన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁ డతఁడు ॥ ఇద్ద ॥ 223

వరాళి

నాలాగు నీ వెఱఁగవు నన్ను నౌరసేవు నేఁడు
ఆలాగువాఁడవుగాన అయ్యో నీవు ॥ పల్లవి ॥

చెంగట నీకొక మొక్కు చేరి నేనే మొక్కితేను
వెంగెములై తోఁచెనిదె వేరే నీకు
కంగివనీచేఁత లేమిగలిగినా దాఁచుఁగాక
అంగడి వేతునా అయ్యో నేను ॥ నాలా ॥

చేపట్టి నిన్ను గోరఁ జెనకి సిగ్గువడితే
కోపములై తోఁచెనదే గురిగా నీకు
యేపనులు గలిగినా ఇయ్యకొండుఁగాక నిన్ను
అపాటికే దూరుదునా అయ్యో నేను ॥ నాలా ॥

వలచి కాఁగిట నీతో వడిగాఁ బెనఁగితేను
బలిమియై తోఁచె నిదె పైపై నీకు
కలితేఁ జలము శ్రీవేంకటేశ నీపై నా
అలరి కలతునా అయ్యో నేను ॥నాలా॥ 224

## మాళవిగౌళ

అవి నామీఁదఁ బెట్టకు మప్పటి నీవు
కవగూడ నేర్చితివి కతలుగా నీవు ॥పల్లవి॥

నగితే నేమిఁగాదు నలుగురిలోనాను
తగినమాటలాడు తరమెఱిఁగి
జగతిలో నానాజాతిసతులవంకాఁ బోయి
తెగడనేర్చితి పలుదెఱఁగుల నీవు ॥అవి॥

బత్తైతే నేమిఁగాదు పరు లిందరూ మెచ్చ
యెత్తైనచేఁత సేయి యితవెరిఁగి
సత్తైనగొల్లెతలతో సాములు సేసిసేసి
కొత్తరతులు నేర్చితి గుఱుతుగా నీవు ॥అవి॥

మరిగితే నేమిఁగాదు మావంటివారిలోనెల్లా
నిరతితో మన్నించు నేరు పెరిఁగి
పరగ శ్రీవేంకటేశ పైపైనన్నుఁ గూడితివి
యెరవులు నేర్చితివి యిన్నిచోట్లా నీవు ॥అవి॥ 225

## పాడి

కలగూరా వలపేమి గనముగాఁ గొసరఁగ
పలుకుఁబంతము నొకపాటి గావలదా ॥పల్లవి॥

చలమే ప(ఫ)లమా సారెసారె రమణుఁడు
పిలిచితే రారాదా బిగియనేల
కలయక మానేరా కాఁపిరాలు సేసేవారు
చెలికత్తియలచేతఁ జెప్పించుకొందురా ॥కల॥

చెక్కుచేయే సింగారమా [1] చేరెతఁడు మాటాడఁగా
గక్కన మాటాడరాదా కమ్మటి నీవు
వొక్కటిగాక మానేరా వొడఁబాటుగలవారు
పుక్కటగా వట్టిరాఁపులు సేసుకొందురా ॥కల॥

మంకుఁదనమే వుంకువా మరి శ్రీవేంకటేశుఁడు
సంకెదీర నిన్నుఁ గూడె చన వీరాదా
అంకెగాక మానేరా ఆలుమగఁడైనవారు
సుంకముగార దమలోన సొలయించుకొందురా ॥కల॥ 226

## బౌళి

ఇవియెల్లా మాకేల ఇల్లాండ్లము నేము
అవియెల్లా నెచ్చరించు మాపెకే నీవు ॥పల్లవి॥

[1]వలపుఁ లోపలి హాను లేమిగలిగినా
నెలఁతకు నన్నియును నేరుపవయ్యా
[2]వలుకులలోపలిపాడిపంతములు నట్టే
అలవాటు సేయవయ్యా ఆపెకే నీవు ॥ఇవి॥

వమ్మిన చూపులలోనిపగ లేమిగల్లాను
కొమ్మచేతనే చూపించుకోవయ్యా
యెమ్మెలకు నాతోఁ జెప్పె వింతేసికతలు నేఁడు
అమ్మరో మాకేల చెప్పు మాపెకే నీవు ॥ఇవి॥

1. చేరి + అతఁడు.
2. 'వలపులలోవల' సహజము. 2. 'వలుకులలోవల' సహజము.

మంతనపురతులలో మఱఁగు లేమిగల్లాను
యింతికి నీ వుపదేశ మియ్యవయ్యా
చెంతల శ్రీవేంకటేశ చేరి నన్నుఁ గూడితివి
అంతటాను బాసనేయు మాపెకే నీవు ॥ఇవి॥ 227

శంకరాభరణం

దీకొని నిన్నిటు తిట్టుదురుగాక
బాకలుగా మరి పొగడేరా ॥పల్లవి॥

నీతో సరసము నేర్చినవారికి
యేతులు నమరును యెట్టయినా
పోతరంపువెడపొరుగుగొల్లెతలు
నీతులవినయము నెరపేరా ॥దీకొ॥

సూడిదె నవ్వులు చుట్టపువారికి
యీడుగఁ జెల్లును యెట్టయినా
దూడల యావులదొడ్డివనిత లిటు
పాడిపంతమునఁ బలికేరా ॥దీకొ॥

సందడిరతు లివి చదివినవారికి
యెందునుఁ దెలుసును యెట్టయినా
అందపు శ్రీవేంకటాధిప మంకులు
విందులఁ గలయక విడిచేరా ॥దీకొ॥ 228

రేకు 1549 గుజ్జరి

మమ్మేల పొగడేవు మాఁటిమాఁటికి
చిమ్ముచు మాతోడిపొందు సేసేదేకాక ॥పల్లవి॥

చెయ్యారా నేము సేసేసేవ లేమి వున్నవి
ఇయ్యకొని నీవు మమ్ము నేలేదే కాక
[1]వేయై(వెయ్యే?)నా నేము సేసేవిన్నపము లేమున్నవి
వొయ్యనే చనవిచ్చి వొద్దికొటగాక ॥మమ్మే॥

పైపై నేము సేసేబత్తు లేమి వున్నవి
వోపి నీవు మావద్ద నుండేదే కాక
యేపొద్దు మావినయము లెంచ నేమి వున్నవి
కాపాడి మాపాలిటఁ గలిగేదే కాక ॥మమ్మే॥

కందువ నేము గూడి కరఁగించే దేమున్నది
అంది నీవు భోగించే దదియే కాక
యిందరిలో శ్రీవేంకటేశ నన్నేనసితివి
మందలించ నేమున్నది మరుగుటే కాక ॥మమ్మే॥ 229

రామక్రియ

ఎవ్వ రెట్లుండిరేమి యింతిదిక్కు ఆడవయ్యా
నివ్వటిల్ల నానవెట్టీ నేరుపుతో నదివో ॥పల్లవి॥

తటి నాపె గెల్చుదాఁకాఁ దగవులు చెప్పవయ్యా
గుటిగాఁగ నిన్నే యాపె కోరి వచ్చెను
యెటుకతో నీదాక్షిణ్య మిఁదులోనే వున్నదయ్యా
మొఱఁగుచు నట్టే నీమోము చూచీ నదివో ॥ఎవ్వ॥

అతివకు సంతోసమౌనట్టే మాటాడవయ్యా
కొతుకక సాకిరులు గోరీ నిన్నే
తతితోడ నాపెనే పెద్దరికము సేయవయ్యా
అతిశయముగ నిన్నే ఆసపడీ నదివో ॥ఎవ్వ॥

1. ప్రాసభంగము.

అంగన గెలిచితి వనవయ్యా వొక్కమాఁటే
బెంగవలెఁ గోరివచ్చి పెనఁగీ నీతో
సంగతి శ్రీవేంకటేశ సరిగాఁ జేసితివయ్యా
కొంగువట్టి మమ్మిద్దరిఁ గూడితి విల్లిదివో ॥ ఎవ్వ ॥ 280

వరాళి

పెళ్లిచెట్టు మందుగాదు పెరిగియెంతవుండినా
పల్లదాన నే నీకు బాఁతైతి నిపుడా ॥ పల్లవి ॥

సరసమాడేటివారు సంగడినే వుండఁగాను
తరవాత మాతో జాణతనా లాడేవు
కెరలినవారు కుచగిరుల నిన్నొత్తఁగాను
వెరసుగానేల వుండవింట వేసేవు నన్ను ॥ పెళ్లి ॥

వాడికసతులు వచ్చి వసమై నీ కుండఁగాను
యీడనున్నమమ్ము నీవు యెలయించేవు
తోడఁబెండ్లాడేవారు దొమ్మి నిన్నుఁ జేయఁగాను
వీడె మిమ్మనుచు నన్ను వేసరించేవు ॥ పెళ్లి ॥

కందువకు [1]వచ్చివారు కడలనే వుండఁగాను
అంది నన్నుఁ గాఁగిలించి అట్టె కూడేవు
చెందినవా రుండఁగాను శ్రీవేంకటేశ నన్ను
మందలించి పైకొని మన్నించేవూ ॥ పెళ్లి ॥ 281

ముఖారి

ఇంతబాఁతిపడేవానినేల మాకుఁ [2]దక్కరించ
చెంత నిదే [3]వెన్నచిట్టిఁ జిట్టేఁడేసి వలపు ॥ పల్లవి ॥

---

1. క్రమమునుబట్టి 'వచ్చేవారు' కావలె.
2. 'తక్కరి' శబ్దముపై 'నామధాతువా? 3 వెన్న చిట్టితో చిట్టెడు ఇత్యాదిగ తక్కిన వన్నియు నూహింపవచ్చు.

చేలకొంగు వట్టితి సిగ్గువడఁగా మానము
వాలుకరెప్పలు వంచివంచి చూచేవు
ఆఁదొడ్డివారము నే మంతేసి యెఱఁగము
వాలదుత్త దుత్తఁడేసి పట్టవయ్యా వలపు ॥ ఇంత ॥

పెల్లుగఁ జేతులు పాపి పెనఁగఁగానే గుబ్బలు
కొల్లలుగాఁ జేతఁబట్టి గోర గీరేవు
గొల్లెతల మెఱఁగము గొప్పజాణతనములు
చల్లదుబ్బ దుబ్బేఁడేసి చల్లేము వలపు ॥ ఇంత ॥

కాయపుమదము గారఁగానే శ్రీవేంకటేశ
సోయగానఁ గూడి మరీ సోదించేవు
నేయమ్మేవారము నవ్వనేరము పోసే మిదే
చేయి చాఁచు పెర్గుచిప్పఁ చిప్పఁడేసి వలపు ॥ ఇంత ॥ 282

దేసాళం

ఇందుకేమి దోసమా యెగ్గులెంచే వింతలోనె
పొందునేసినట్టివారు భోగింతురుగాక ॥ పల్లవి ॥

సిగ్గులు వడుదురా సేవలు సేసేవారు
వెగ్గళించి నీపైఁ జేయివేతురుగాక
వొగ్గి వూరకుండుదురా వొద్దనుండినట్టివారు
అగ్గలపుసరసము లాడుదురుగాక ॥ ఇందు ॥

మాఁటలాడకుండుదురా మనసులు గన్నవారు
యేఁటికైనా నిన్ను నేరా లెంతురుగాక
నీటు చూపకుండుదురా నీసరిఁ గూచున్నవారు
మేఁటిరతులను మితిమీరుదురుగాక ॥ ఇందు ॥

అలమి కూడకుందురా ఆయములంటినవారు
చలపట్టి పాదములు చాఁతురుగాక
యెలమి శ్రీవేంకటేశ ఇద్దరిఁ గూడితి పిట్టె
పొలసి నేర్పులు తోడు చూపుదురుగాక ॥ఇందు॥ 283

భైరవి

ఆనతియ్యవయ్యా నాతో నామేలు వినే నేను
తానకమై ఇన్నిటాను తనివి నొందించెనా ॥పల్లవి॥

మొక్కలాన నేఁడు నీమోమునఁ గళలు నిండె
చెక్కులు నొక్కెనా ఆపె నేదదేర్చెనా
చిక్కనిచెమటలతో చిందువందై వున్నాఁడవు
కక్కసించి మరి వట్టె కాలుదొక్కెనా ॥ఆన॥

నవకపుసెలవులనవ్వు వెన్నెలలు గాసీ
చవి చూపెనా మోవి; చాఁచెనా చేయి
అవల నీ వల్లాఁ జూచి అలసేవు నీలోనే
ఇవలఁ గాఁగిటిలోనే సాముసేయించెనా ॥ఆన॥

చిత్తగించి నన్నుఁ జూచి సిగ్గులువడే విదే
పొత్తు గుడిపించెనా భోగించెనా
యిత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
హత్తించెనా పొందు అట్టె యిందు వచ్చెనా ॥ఆన॥ 284

రేకు 1550 శుద్ధవసంతం

వెనకటివలె నిఁక వేసరేనా నీతో
అనువుగా నీచెప్పినట్టు సేసేమయ్యా ॥పల్లవి॥

మానినులఅలుకలు మాటలాడుదాఁకానే
నానినచలములెల్లా నవ్వుదాఁకానే
యేనెపము లేదు మమ్ము నెంతేసి వేఁడుకొనేవు
ఆనుకొని నీచెప్పినట్టు సేసేమయ్యా ॥వెన॥

సిగ్గులు గక్కన నీవు చేయి చాఁచినందాఁకానే
యెగ్గులు మఁతనమున నెనయుదాఁకా
వొగ్గుచు మ మ్మిందుకుఁగా వూరడించే వింతేసి
అగ్గలము నీచెప్పినట్టు సేసేమయ్యా ॥వెన॥

కడమ లేమిగల్లాను కన్నులఁ జూచుదాఁకానే
జడియులెల్లా మేలు చల్లుదాఁకానే
కడఁగి శ్రీవేంకటేశ కలసితి వింతేసి
అడరి నీవు చెప్పినట్టే సేసేమయ్యా ॥వెన॥ 285

శ్రీరాగం

చెలి యింతనేసెనంటా చిమిడేవు విరహాన
తలఁపులకాఁకలలో తగుల నేది ॥పల్లవి॥

చక్కెరమోవిమీఁదిసరసపుమాటలలో
యెక్కువతక్కువమాట లెంచ నేవి
గుక్కక కలువరేకులవంటిచూపులలో
పిక్కటిల్లి గుండెదాఁకి బెదర నేది ॥చెలి॥

జలజపుమొగడలచన్నులవొత్తులలోన
[1]నులివచ్చిగా నాఁటి నొవ్వఁగ నేది
చెలరేఁగి చిగురుల చేగోరి చెనకులలో
నలువంక మర్మములు నాఁటఁగ నేవి ॥చెలి॥

1. నులి+వచ్చి.

బత్తితో నీకాఁగిటిపరవశములలోన
తత్తరపుగయ్యాళితనము లేవి
యిత్తల శ్రీవేంకటేశ యింతి నన్ను నెనసెను
మత్తిలి విరహ మిఁక మలసినా నేది ॥చెలి॥ 236

## మాళవిగౌళ

ఏలోయి మమ్ము నీవు యెంతగాఁ జూచేవు నేఁడు
యీలాగు భ్రమసేయెడల మానేము ॥పల్లవి॥

మనసువచ్చినసతి మాట నీతో నాడఁగాను
పనిలేనిపని నీతోఁ బలికేమా
కనుసన్నలనే మాతోఁ గాఁపురాలు సేసేవు
కొనచీఁకటిమోహపుఁగూళలమా నేము ॥ఏలో॥

బత్తిగలయాపె నీతోఁ బైకొని పెనఁగఁగా
హత్తి నీతో సరసము లాడేమా
పొత్తులమన్నన లిట్టె పొరలించేవు మామీఁద
మొత్తమిగా నిన్ను నంట మూఢులమా ॥ఏలో॥

ఆరీతి నాపె నిన్ను నట్టె కాఁగిలించఁగాను
మేరలు మీరి నీతో మేకు చూపేమా
యీరీతి శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి
మోరతోపు లిఁకఁ జేయ [1]ములుచలమా ॥ఏలో॥ 237

## సామంతం

కడుదూరకురే మీరు ఘనుఁ డాతఁడు
కడమతమక మెల్లాఁ గానవచ్చీ నిపుడు ॥పల్లవి॥

1. ములుచలు: మూఢులు

సెలవి నవ్వినవాఁడు చేయి చాఁచకుండునా
పిలువనేలే తానే ప్రేమనేసీని
పలుకనట్టే వుండు బత్తి నాపైఁ గలఁడు
నళువులవలపులు సన్నల నెఱఁగనా ॥కడు॥

కన్నులఁ జూచినవాఁడు కాతరించకుండునా
వన్ని యెచ్చరించకురే పైకొనీఁ దానే
మిన్నక పరాకైనా మన్నన నాకే వొసఁగు
కన్నెరికపుమదము కంటే నెఱఁగనా ॥కడు॥

కదిసి కూచున్నవాఁడు కాఁగిలించకుండునా
వదరకురే కూడి వాసయిచ్చీని
ఇదివో శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నిన్నిటాను
పెదవిపై గుఱుతులు పెట్టె నాఁ డెఱఁగనా ॥కడు॥ 288

సాళంగనాట

తమకాన నున్నవాఁడు దండ నాతఁడు
సమరతులకుఁ జేయి చాఁచరాదా యిపుడు ॥పల్లవి॥

కత లేమిచెప్పేవే కాంతునితో వేగినంతా
రతులకుఁ దెరవేయరాదా యిఁక
పతిగా నేమినవ్వేవే పలుమారు నతనితో
యితవుగా బాగా లొత్తియ్యరాదా ఇపుడు ॥తమ॥

శ్రమల నేల పెట్టేవే బడిబడి నెందాఁకా
జమళి నీవే ముందు చనవీరాదా
అమరె నేమి చూచేవే ఆతనిది కృవ్పటిని
క్రమముగాఁ గాఁగిలించు గక్కన నీ విపుడు ॥తమ॥

చెక్కులేమి నొక్కేవే శ్రీవేంకటేశ్వరుని
దక్కఁగూడితి వీమేలు తలఁతుగాక
మక్కువల నిఁకనేమి మర్మాలు సోదించేవే
చికఁగా సరసములు చిమ్మఁగదే యిపుడు ॥తమ॥ 239

బౌళి

నిగుట్టు చెఱుచనేల నేఁడు మాకు
వేగిరించ కింకా నీవేడుకే యెఱుఁగు ॥పల్లవి॥

పంతము నీ వాడఁగాను పకపక నవ్వు వచ్చె—
నంత వాఁడ వౌదువయ్యా అందుకేమి
బంతినే యిందరిలోనాఁ బడితళించముగాని
మంతనాన నీచేఁత నీమనసే యెఱుఁగు ॥నిగు॥

వట్టియాచారాలఁబోఁగా వడి నాకు సిగ్గు వచ్చె
యెట్టైనా నీకుఁ జెల్లు నేలయ్య్యా
రట్టుసేయఁగాని నే నిట్టే; రచ్చలో నంత—
మట్టుతేనిమర్మాలు నీమనసే యెఱుఁగు ॥నిగు॥

తమకించి కూడఁగాను తారుకాణలెల్లా వచ్చె
సముకాన నంతవద్దు సటలేలయ్యా
అమరె శ్రీవేంకటేశ అట్టె మారుకు మారేల
మమకారము నాపై నీమనసే యెఱుఁగు ॥నిగు॥240

రేకు 1551 వరాళి

నీవుగోరినట్టె యాయ నేఁ డాపెవలన నీకు
చేవదేరి వలపులు చిమ్మిరేఁగెనా ॥పల్లవి॥

వలపేఁ డాపలాను వడిగాఁ గొసరె నిన్ను
చెలియవిన్నపములు చెవి సోఁకెనా
కలికితనములెల్లా కన్నులనే నీపై నించె
సొలపుఁజూపులు నీలో సూటిఁ బారెనా ॥నీవు॥

మొగము విచ్చివిచ్చి ముందుకలుగనె నవ్వె
మగువసరసములు మతిఁ బట్టెనా
చిగురుమోవితేనె చిప్పిల విందులు వెట్టె
తగిలి నీవేడుకలు తనివోందెనా ॥నీవు॥

కప్పుగబాగాలు నీకు గక్కనఁ జేరి యందిచ్చె
చెప్పరానికానికలు చేకూరెనా
ఇప్పుడు శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
అప్పణ గలిగెనా ఆపె వేఁడుకొంటివా ॥నీవు॥ 241

## సౌరాష్ట్రం

ఎందుకైనాఁ దానే వచ్చి నేమిసేతునే
యిందరివాఁడూఁ దానే యేమిసేతునే ॥పల్లవి॥

గద్దరి సవతులము కాఁతాకాన నుండఁగాను
యిద్దరి నొక్కటిసేసీ నేమిసేతునే
పెద్దరికాన నొట్టుపెట్టుకుండఁగా నిదె
వద్దన్నాఁ బొత్తులఁబెట్టీ వడి నేమిసేతునే ॥ఎందు॥

చయ్యాటపుమాటలు సారెసారె నాడఁగాను
యియ్యకోళ్లుగాఁ జెప్పీ నేమిసేతునే
కయ్యములు వద్దంటా గక్కనఁ బ్రియాలు చెప్పి
ఇయ్యరానికాసలెల్లా నిచ్చీ నేమిసేతునే ॥ఎందు॥

మరిగి మాఁటునేసుక మామాఇండ్ల నుండఁగా
ఇరుమేలాఁ బెట్టుకొనీ నేమిసేతునే
అరుదై శ్రీవేంకటేశుఁ డక్కచెల్లెండ్లము మ—
మ్మిగవుగాఁ బెండ్లాడె నేమిసేతునే ॥ఎందు॥ 242

పాడి

దొర మోహించఁజూచితే తుదమొద లెరఁగఁడు
ఇర వెక్కడౌతాఁ గాన విస్సిరో వయసా ॥పల్లవి॥

చక్కని ఇంతి నీమోము సారెసారెఁ జూచిచూచి
చెక్కు[1]నొక్కి వలపులఁ జిమ్మిరేఁగేవు
యెక్కువసతులు వద్ద నెవ్వరుంటా నెఱఁగవు
యెక్కడ వోయ సిగ్గు లిస్సిరో వయసా ॥దొర॥

చన్నులు గదలఁగాను సతి నీతో నవ్వితేను
చెన్నుమీరఁ గరఁగుతాఁ జెమరించేవు
అన్నిటా నీచేఁతలకు నాడేవారి నెఱఁగవు
యెన్నటికి నీబుద్ది ఇస్సిరో వయసా ॥దొర॥

మురిపానఁ జెలి నీతో ముద్దులమాట లాడితే
సరుగఁ గాఁగిటఁ గూడి చనవిచ్చేవు
గరిమ శ్రీవేంకటేశు గంభీర మెఱఁగవు
యెరవైతి విందాఁకా నిస్సిరో వయసా ॥దొర॥ 243

ఆహిరి

ఇంతి నీదేవులు నీవు యెంతసేసినాఁ జెల్లు
మంతు కెక్కితివి నీకు మరియేల వెఱపు ॥పల్లవి॥

1. ఈ 'నొక్కి' హేత్వర్థమున వాడినట్లు స్వాంతముగా నున్నది. తక్కినచరణములు సాక్షి.

వలవనిజాగు సేయవద్దుగాక మాతోను
తెలిపి చెప్పితేనేపో దేవరవు
చెలి నేఁపి ఇంత రట్టుసేయవద్దుగాక నీవు
నెలకొ నేమిసేసినా నీకేమి వెలవు ॥ఇంతి॥

వట్టినవ్వులెల్లా నవ్వవద్దుగాక ఆపె నిట్టె
తిట్టితే నీవేపో దేవరవు
చుట్టపువరుసనే సూడువెనఁగఁగవద్దు
పట్టి నీపిడికిటిలోఁ బెట్టు యేల వెలపు ॥ఇంతి॥

నాలిమాఁటలాడి కల్లనమ్మికలు వద్దుగాక
తేలించకున్న నీవే దేవరవు
యీలీల శ్రీవేంకటేశ యెనసితి వీలేమను
తాలిమితో మేలాయఁ దగ దిఁక వలపు ॥ఇంతి॥ 244

నాదరామక్రియ

ఇప్పుడు వేగిరమేలే ఇంతి నీకు
తప్పులెల్లా మాని పతి తానే వలచును ॥పల్లవి॥

నెయ్యము గలుగుచోట నెరుసు లేమిగల్లాను
కయ్యము లడువనేల కాంతలకు
వొయ్యనే ఆరమణుని కూడిగాలు సేయఁగాను
కొయ్యతనాలెల్లా మాని కూరిములు సేసును ॥ఇప్పు॥

చేతికి లోనైనయెడ సిలుగు లేమి పుట్టినా
కాతరించి దూరనేల కాంతలకు
ఆతుమైనయాతని నన్నిటాఁ బొదుగఁగాను
యేతులకుఁ దాఁ దానే యిరవై నిలుచును ॥ఇప్పు॥

చనవు గలిగినందు సారెఁ బరాకై నాను
కనలి తిట్టఁగనేల కాంతలకు
యెనసి శ్రీవేంకటేశు నిచ్చలో నిట్టె వుండఁగా
మనసున బత్తిగల్గి మన్నించు నిచటా ॥ఇప్పు॥ 245

కాఁబోది

కాంత యేమిసేసునే ఘనుఁడు తానేకాక
చెంతలఁ దనకే మరిఁ జేత మొక్కవలదా ॥పల్లవి॥

చలపట్టి తానే యెచ్చరికలు సేయఁగాను
యెలమి నాపెకుఁ బంతా లేల మానీనే
నెలకొని తా నింతేసి నేరుపులు నేరుపఁగా
బలిమిమెరసి యింత ప్రౌఢ గాఁదగదా ॥కాంత॥

పొరుగున నుండి తానే పోదులెల్లాఁ జేయఁగాను
అరసి మేరలుమీర కాపె తక్కునా
పెర రేఁచి తాను నట్టే వేఁడుకొని వుండఁగాను
విరసముగాక వెల్లవిరులు గావలదా ॥కాంత॥

వద్ద నుండి తా నేఁడు వంకలెల్ల నొత్తఁగాను
అద్దుకొని ఆపె మాటలాడఁదగదా
ఇద్దరి శ్రీవేంకటేశుఁ డిటు మమ్ముఁ గూడఁగాను
వొద్దికై సవతులెల్లా నొక్కటి గావలదా ॥కాంత॥ 246

రేకు 1552 ముఖారి

ముంచుకొంటే పొందులెల్లా మొగచాటౌనో యేమో
పెంచేవు వేడుకలు పెనఁగువడఁగను ॥పల్లవి॥

గిలిగించే విటు నన్నుఁ గేరికేరి నవ్వుమని
పలుమారు నవ్వితేను పాటివలదా
చలి వాసి మొక్కనంటా జంకించే వప్పటిని
చలి వాసితే వలపు చప్పనేకాదా ॥ముంచు॥

పెడరేఁచేవు సిగ్గులు బెట్టి కాఁగిలించుమని
కడుఁ గాఁగిలించితేను కాఁక వుట్టదా
విడువక కొసరేవు వింతచూపు చూడుమని
చిడుముడిఁ జూచితేను చిత్తము నోనాఁటదా ॥ముంచు॥

నేరిపే వొక్కటొక్కటే నెయ్యపుమాటాడుమని
మారు మాటాడఁగఁబోతే మంకు రేఁగదా
యీరీతి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
గారవించే వివియెల్లా ఘనతలుగావా ॥ముంచు॥ 247

శుద్ధదేశి

కాఁకల యెప్పటనుండి కాచుకున్నదో
మూఁక మొక్కులెల్లాను మొక్కీ నిదె నీకును ॥పల్లవి॥

తమకించి రావంటాఁ దగ నీతో నలిగితే
క్రమ మెఱిఁగి తానేల కదిసీ నాపె
అమరఁగ నఁ(నం?)తలో నిన్నట్టె కాఁగిలించుకొంటే
చెమటచేతులఁ దాను సేవసేసీ నీకును ॥కాఁక॥

దిక్కుల నీచేఁతలకు తిట్లు నేఁ దిట్టితేను
యెక్కువఁ దాఁ జెవిలోన నిచ్చలాడీని
అక్కర నందుకుఁగాను అట్టె నేఁ బొదిగితే
మక్కువతో సారె నాకుమడిచిచ్చీ నీకును ॥కాఁక॥

నీవిచ్చినచనవున నీమోవి యానితేను
కావరాన ముట్టి వూడిగాలు సేసీని
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె మునుc గిడుకొం(కొం?)టే
ఆవలc దా మఱcదల నన్నుకొన్నీ నీకును ॥ కాcక ॥ 248

శంకరాభరణం

ఆసోదకాcడవై యంటితివి ముందే
వేసర కెట్లా వేగిరించేవయ్యా ॥ పల్లవి ॥
మందగొల్లెతలు మాcటలాడే రదే
యెందరి కుత్తర మిచ్చేవయ్యా
విందులు వెట్టేరు వేవేలు మోవుల
యెందుకని వొగ్గేవేమయ్యా నీవు ॥ ఆసో ॥
నీరాణివాసాలు నీకు మోహించిరి
యేరీతిc జనవు లిచ్చేవయ్యా
కోరి యప్పటిని కొంగులు వట్టిరి
మేరతో నెట్ల మెప్పించేవయ్యా ॥ ఆసో ॥
పట్టపుదేవుళ్లు పైకొని రిప్పుడే
యెట్టొడcబరచే వేమయ్యా
యిట్టె శ్రీవేంకటేశ నన్నేలితి
అట్టడి విందుకు దిట్టవయ్యా ॥ ఆసో ॥ 249

వరాళి

ఆతcడే యెఱుcగునూ అన్నిసుద్దులు
చేతిలోనిదాననని చెప్పరే విభునికి ॥ పల్లవి ॥

దయగలవానికిఁ దప్పులెంచఁ జోటులేదు
ప్రియపడేవానికి బిగియరాదు
వయగారివానిమతి నాఁటదు నిష్టూరము
క్రియ గూడఁ దనకు మొక్కితి ననరే ॥అతఁ॥

తగులైనవానికి దండనుండి పాయరాదు
నగేవానికి బొంతనాలు గలవు
మొగమోడేవానిపై మోయ దపరాధము
అగపడితిఁ దనకు నాల ననరే ॥అతఁ॥

యేలినవానికి [1] నేమెట్టున్నాఁ దనకుఁబోధు
లాలించేవానికి మొక్కలము దగదు
యీలీల శ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడె
వేళావేళలఁ దన్ను వేఁడుకొంటి ననరే ॥అతఁ॥ 250

సాళంగనాట

ఎక్కడ పరాకు నీకు నెఱఁగరాదా
నిక్కము వలపించేయెన్నికలెల్లా నున్నవి ॥పల్లవి॥

చెప్పఁబూఁచీ సిగ్గు లాపె చెవి యొగ్గరాదా
తప్ప కిట్టె కాఁగిలించేతమి వున్నది
చిప్పిల నేఁటికి దీరిఁ జేయి చాఁచరాదా
వుప్పతిల్లఁ గరఁగించేవుద్యోగ మున్నది ॥ఎక్క॥

తేనెమోవి యియ్యఁబూఁచీఁ దెరవేయరాదా
ఆనించి నిన్ను మెప్పించేఆస లున్నవి
నానవేసీ సరసము నవ్వు నవ్వరాదా
తానకమై నినుఁబొఁ(బొం?)దేతలపోఁత లున్నవి ॥ఎక్క॥

1. ఏమి + ఎట్టు + ఉన్నాన్.

ప్రేమ రతిఁ గూడఁబూఁచీఁ బిలువఁగరాదా
నీమనసురప్పించేనేరు పున్నది
యీమేర శ్రీవేంకటేశ యెనసితివి నన్ను నీ—
వామగువఁ గూడితివి ఆగుఱుతు లున్నవి ॥ఎక్క॥ 251

దేసాళం

వయసు మొయిలువంటిది వట్టిజాగేల
ప్రియము చేకొనరాదా పెరరేఁచీ నతఁడు ॥పల్లవి॥

చలపాదితనమేల సంగడిఁ గూచుండవే
చెలువుఁడు నీకొంగు చేరి పట్టీని
బలిమిఁ బెనఁగనేల పనులకు లోఁగావే
తెలిపి చెప్పి మాటల తీపు చల్లీని ॥వయ॥

గొప్పరాఁగతనమేల కోరి విడెమియ్యవే
చిప్పిలఁగ వేఁడుకొని చేయొగ్గీని
ముప్పిరి సిగ్గిఁకనేల మోమెత్తి చూడఁగరాదా
వుప్పతిల్ల నవ్వునవ్వి వొడివట్టీ నిదివో ॥వయ॥

రట్టడితనములేల పట్టికూడి చొక్కరాదా
యిట్టె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను
గుట్టుసేసుకొననేల కూటమి మెచ్చఁగరాదా
నెట్టన నీ కిన్నియును నేరపీ నొద్దికలు ॥వయ॥ 252

రేకు 1553 గౌళ

తోలుబొమ్మలము నీవే తొడరి యాడింతుగాక
యీలీల నుండిననేము యేమిసేతుమయ్యా ॥పల్లవి॥

నేరుపు గలిగికా నీతో మాటాడుట
కూరిమి గలిగికాం కొసరుటా
సారమెఱఁగనియట్టి చప్పని వారము నేము
యీరీతి నూరకుండక యేమిసేతుమయ్యా ॥తో॥

నీమన సెఱిఁగికా నిన్నుఁ గరఁగించుట
నేమ మెఱిఁగితేఁగా నిన్నుఁ బొందుటా
చేముట్టి పెనఁగలేనిసిగ్గరి వారము నేము
యీమేర నుందుముగాక యేమిసేతుమయ్యా ॥తో॥

చనవరులమైకా సందులెల్లాఁ జేకొనుట
ఘనులమైతేఁగా కైకొనుటా
యెనసితివి శ్రీవేంకటేశ మమ్ము మన్నించి
యినుమడై [1] యుందుం(దుము?)కాక యేమిసేతుమయ్యా ॥తో॥ 258

బౌళి

నీవే బుద్దిచెప్పవయ్యా నేననఁ దగవుగాదు
వావాత నింతేసి వతరఁ జేసితివి ॥పల్లవి॥

నంటుసేసుకొని నీతో నయమున నే నవ్వి
గొంటరియాపె యేల కోపగించీని
బంటుబంటుతనమా పడితాళించవచ్చీని
దంటఁ జేసితివి నీవే తరుణి నింతేసి ॥నీవే॥

చాయసేసుకొని నీతో సరసములాడితేను
ఆయము లేలెత్తీని అప్పటిఁ దాను
మాయలేల సేసీని మందు మంత్రవాదివలె
గాయగంటి సేసితివి కలికి నింతేసి ॥నీవే॥

1. 'ఉందుముకాక' అనుటకు 'ఉందుంకాక' అనురూపము నేటి వ్యావహారిక రూపమువలెనున్నది. ఈవాఙ్మయమునకిది యపురూపమే. వ్రాయసకానిపని గావచ్చు.

చవిచేసుకొని నిన్ను స(సం?)గతిగాఁ గూడితేను
 అవణించి తానేల ఆసచూపిని
యివల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
 అవళి నన్ను సాపె సరవి సేసితివి ॥నీవే॥ 254

ఆహిర

నీ వింతేసి నేర్చితివి నీపతిని వలపించ
 కావరము రేఁచేది నీకనుమూపే చెలియా ॥పల్లవి॥

చక్కనినీవిభునికి చలము వుట్టించేదెల్లా
 చెక్కుచేతితోడినీసిగ్గులే యమ్మా
అక్కజమై మీఁదమీఁద నాసలు వుట్టించేవి
 మొక్కులు మొక్కేనీమురిపెమే చెలియా ॥నీవిం॥

మచ్చికపతికి నీమర్మములు గరఁచేవి
 మెచ్చులనీకుచముల మెఱుఁగే చెలీ
యిచ్చట నిన్ను మరిగి యెందునుఁ బాయనీనిది
 యిచ్చకపుమాఁటల నీయితవులే చెలియా ॥నీవిం॥

శ్రీవేంకటేశ్వరునిచిత్తము రప్పించేది
 ఆవేళ నీరతులే అలమేల్మంగ
భావించి కాఁగిటఁ గూడి పంతము లిప్పించేవి
 నీవేడుకలరతినేరుపులే చెలియా ॥నీవిం॥ 255

సామంతం

ఏల దూరే నేల కొంకే నేల వోలలువేసేని
 చాలుఁ జాలదని నే జరసేనటే ॥పల్లవి॥

సిగ్గరితనముననే చేరి వుండేదానఁగాక
 నిగ్గులఁ దనతో నేను నిష్ఠూరినటే
వొగ్గుచు మానాపతినై వోరుచుకుండుదుఁగాక
 వెగ్గళించి తనతోను వేసరించేనటే ॥ఏల॥

ఇలువరుస యెంచుక యిచ్చలో మెలఁగేఁగాక
 చలములు తనతోను సాదించేనటే
వెలలేనివినయాలు వేవేలు చెప్పుదుఁగాక
 పలుమారు నాడరానిసంత మాడుదునటే ॥ఏల॥

యిల్లాలితనముననే యెనసి వుండుదుఁగాక
 మల్లాడి తనతో మారుమలతునటే
ఇల్లిదె శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
 వొల్లనే యప్పటిఁ దను నొరసేనటే ॥ఏల॥ 256

శుద్ధవసంతం

అందరివల్లా నీవే ఆరడయ్యేవనికాక
 పందెమడిచినయట్టు పట్టియ్య నోపనా ॥పల్లవి॥

నవ్వులకు నొకమాటు నన్ను నీవు చెనకితే
 రవ్వలు సేసిరి నీరమణులెల్లా
జవ్వను లిందరిలోనా సాదులా తా మేమైనా
 పువ్వకవూచె ననుచు పురిఁ జాటనోపనా ॥అంద॥

మచ్చికతో నీవు నేఁడు మాయింటికి వచ్చితేను
 పచ్చిసేసేరు నీతొంటిపడఁతులెల్లా
నిచ్చనిచ్చా నీవిద్యలు నేరనివారా తాము
 గచ్చుల తమగు ట్టంగడి వేయనోపనా ॥అంద॥

కందువతో నీవు నన్నుఁ గాఁగిలించి కూడితేను
నిందలు గట్టేరు యీ నెలఁతలెల్లా
అందపు శ్రీవేంకటేశ ఆఁడ్లు గారా తాము నీకు
మందగొల్లెతలనెల్లా మర్మాలెత్తనోపనా ॥అంద॥ 257

దేసాళం

నీజాడ లన్నియు నే నెఱఁగనా। నీవు
వోజలు రెండుచోట్లా నొనరించే విపుడు ॥ పల్లవి ॥

కాయకపు నవ్వులకు(ను?) కడుఁ జల్లేవు మామీఁద
ఆయమైనమనసు నీ కావెమీఁదనే
చాయలు సన్నలు నిందు సారెసారెఁ జూపేది
చేయిమీఁదుగా నాకెఁ జేసేటిచేఁతలు ॥నీజా॥

ఇచ్చకపుమాటలను యెలయించేవు మమ్ము
[1]నిచ్చళవుసరసము నెరపే వందు
లచ్చనలకొనగోరు లలి మోపేవు మామీఁద
ముచ్చటఁ గాఁగిలినిండా ముంచియెత్తే వాపెను ॥నీజా॥

పోరచికూటములఁ బొందితివి మమ్మును
నేరుపులరతులెల్లా నించితి వాడ
యీరీతి శ్రీవేంకటాద్రి నిటు గోవిందరాజవై
కూరిమి రెంటాఁ బెంచి కొసర నందేఁటికి ॥నీజా॥ 258

రేకు 1554 ఆహిరి

నిన్నుఁ బొందినవారికి నేరమి యేది
సన్నల నందుకైనాను చన వియ్యవలదా ॥ పల్లవి ॥

1. నిచ్చళము—నిశ్చలశబ్దభవము. 'ణిచ్చల' ప్రాకృతము.

అంగన నీకుఁ జేసినయపరాధ మేమీ లేదు
చెంగి చెంగి రాకుండఁ జెల్లునా నీకు
వుంగరాలవేళ్లనే వొడివట్టి తీసె నిన్ను
సంగతది దలఁచైనా చనవియ్యవలదా ॥నిన్నుఁ॥

సతి నీతో నలిగినసడి యించుకా లేదు
తతిఁ బరాకులు సేయఁదగునా నీకు
పతివంటా వేఁడుకొనీ పలుమారు చెక్కునొక్కి
సతమై యీమేలెంచి చనవియ్యరాదా ॥నిన్నుఁ॥

చెలి నిన్ను నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడవని
యెలమి నీవలసేదె యెన్నికా నీకు
పలుమారు నీకు మొక్కి బాసలెల్లఁ జేకొనె
చలములు మాని యిట్టె చనవియ్యవలదా ॥నిన్నుఁ॥ 259

ముఖారి

చెలియ దానే నిన్నుఁ జేరవచ్చెను
బలువుఁడ వౌదువు పంతగాఁడ వౌదువు ॥పల్లవి॥

దవ్వులమండిననిన్ను దగ్గర రమ్మనుచును
జవ్వని పువ్వుల వేసి సన్న సేసెను
అవ్వల నీవే మరునమ్ములంటా నొద్దుకొని
పవ్వళించే విట్టే యింతిపానుపుమీఁదను ॥చెలి॥

ఆకడిమోమైననిన్ను నట్టె తన్నుఁ జూడుమని
యీకాంత కప్రాన వేసి యెచ్చరించెను
మేకొని చంద్రునిచలిమిణుఁగురులని తోసి
చేకొని చంద్రగావిచీర గప్పుకొంటివి ॥చెలి॥

భ్రమసివుండిన నన్నుఁ బట్టి తన్నుఁ గూడుమని
గుమితాన నవ్వు నవ్వి గోర నూఁదెను
నెమకి శ్రీవేంకటేశ నీభాగ్యచిహ్నాలని
కమలాక్షిని రతుల గక్కఁన గూడితివి ॥చెలి॥ 260

భైరవి

ఇందుకేపో మోనమున నేమీ ననకున్నదాన
ముందుముందే చెనకితే మొగచాటై వుందును ॥పల్లవి॥

పిలిచితేరానివానిఁ బెనఁగులాటకుఁ దొచ్చి
బలిమిసేయఁగఁబోతే పసురువేసు
నిలిచి మాటాడకుంటే నేరుపులు పచరించి
చలము సాదించఁబోతే చవిదప్పును ॥ఇందు॥

మొక్కితేఁ జూడనివాని మొగమెదుటనే వుండి
పుక్కట నవ్వు నవ్వితే పులుసువేసు
[1]అక(క్క?)రెరఁగకుండఁగా నాయము లంటియంటి
చెక్కులు నొక్కఁగఁబోతే సెలవు లేదు ॥ఇందు॥

కాఁగిట నలసేవానిఁ గరఁగించఁబోతేను
వీఁగుచు నొగరొగరై వెగటువేసు
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
మాఁగిన మోవియ్యకుంటే మందువేసును ॥ఇందు॥ 261

దేసాళం

ఇంతి గుణసాధ్యురాలు యిటువలెఁ జేతురా
వంతులకు వచ్చినట్టె వచ్చుటగాక ॥పల్లవి॥

1. ప్రాసభంగము.

పెద్దరికానఁ దెలియ పీఁటమీఁదఁ గూచుండఁగా
గద్దరితనాన నీవు కాఁతాళించేవు
కొద్దిమీరఁ జిన్నఁబుచ్చుకొని మోము వంచె నీ—
వుద్దండపుజంకెనల కోరుచునా యాకె ॥ఇంతి॥

సిగ్గరితనానఁ జెక్కు చేతఁ బెట్టుకుండఁగా
బగ్గడితనాన నీవు పదరుదురా
వెగ్గళించలేక తానే వెలవెలఁ బుచ్చుకొనె
కగ్గునీబింకములకుఁ గలదా యీకె ॥ఇంతి॥

గోలయై పానుపుమీఁద గుట్టున నట్టె వుండఁగా
వేలరివై కాఁగిట బిగియించేవు
లాలించి శ్రీవేంకటేశ లలన నిన్నుఁ గలసె
నీలావరితనానకు నేరుచునా యీకె ॥ఇంతి॥ 262

శంకరాభరణం

అన్ని మెచ్చయ్యీని అందుకేమే
నిన్నటిసుద్దులు నే నెఱఁగనా ॥పల్లవి॥

చలము నెరపేసాదవే నీవు
చెలులతో నేమి చెప్పేవే
ములుచతనపుముద్దరాలవే
నెలఁతరో నిన్ను నే నెఱఁగనా ॥అన్ని॥

చక్కనినవ్వులసానరాయివే
మిక్కిలి యేల నమ్మించేవే
చిక్కనిసిగ్గులచింతకాయవే
నిక్కపునీసుద్ది నే నెఱఁగనా ॥అన్ని॥

తెగనిమాటలతేనెవే నీవు
మొగము చూచేల మొక్కేవే
నగి శ్రీవేంకటోన్నతుఁడు నన్నేలె
నిగిడి నీగుట్టు నే నెఱఁగనా ॥అన్ని॥ 263

తెలుఁగుఁగాంబోది

ఏమోయి నన్ను నేరాలెంచఁగ దోసముగాదా
రామను నాతోడిదేల రావోయి నీవు ॥పల్లవి॥

పిలువనా మాయింటికి ప్రియము చెప్పనా
సొలసి వూరకే దూరి చూచేవుగాక
వెలయ నీతో నవ్వనా విడెము చేతి కియ్యనా
చలములు పైపై నే సాదించేవుగాక ॥ఏమో॥

కొంగువట్టితియ్యనా కూరిములు నించనా
పంగించి యేలో యెగ్గువట్టేవుగాక
సంగతిగా మొక్కనా సరసములాడనా
జంగిలివేసా లిటు చల్లేవుగాక ॥ఏమో॥

బలిమిఁ బైకొనవా పట్టి కాఁగిలించనా
అలసితివేమో గోర నంటేవుగాక
అలరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
తలపించనా రతిఁ దనియవుగాక ॥ఏమో॥ 264

రేకు 1555 శంకరాభరణం

కల దీయింతికి గర్వాలు। యెత్తి
పొలసీ నీపుట్టుపూర్వాలు ॥పల్లవి॥

విడువ దె(దొ?)త్తె నా దుస్సీ నీ—
పడఁతి నీమీఁద పంతాలు
బడిబడి నీపై నట్టె చాఁపీని
కొడిమచూపులకొంతాలు

క్రియగూడ నిన్నుఁ గిందుమీఁదు సేసీ
ప్రియురాలిఁ జూడు బీరాలు
రయమున నీరతికేళిలోనే
నియతి నిన్నెంచీ నేరాలు

కలసి నిన్నిట్టె కాఁగిట ముట్టీని
అలమేలుమంగ ఆయాలు
యెలమి శ్రీవేంకటేశ సరసాన
తలఁగక యాడీ దాయాలు

సాళంగనాట

అందు కేమయ్యా నే నడ్డమాడేనా
చెంది వద్దనేనా చెనకేవు రతికి

పగటున నన్ను నేల పైకొని వేఁడుకొనేవు
నగుత యెఱఁగనా నాతో నీవు
జగడాలదాననా చనవరికాంతను
తగవు నే నెఱఁగనా తగిలేవు రతికి

చెలిమిసేసి నన్ను చెక్కునొక్కే వప్పటిని
వలచు లెఱఁగనా వడి నా(నీ?)కును
చలము సాదించేనా సలిగె గలదానను
తలఁపు నే నెఱఁగనా దగ్గరేవు రతికి

కన్ను సన్నలనే చూచి కాఁగిటఁ బెనఁగే విదె
మన్నించే దెఱఁగనా మంతనానను
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పన్ని కూడే దెఱఁగనా పదరేవు రతికి ॥అందు॥ 266

## నాదరామక్రియ

ఇన్నియు నిందే వున్నవి యెఱుఁగుకో నీకు నీవే
నిన్ను నేమీ నననేల నీచిత్త మిఁకను ॥పల్లవి॥

పలుకఁబోతే నీతో పంతములై తోఁచీని
కలఁగి వూరకుంటేను గర్వ మయ్యీని
సొలపులు నెరపితే సూడువట్టినట్టయ్యీని
నెలకొని వుండే నేను నీచిత్త మిఁకను ॥ఇన్ని॥

నగఁబోతే నీతోను నాఁటకమై తోఁచీని
పగటు చూపఁగబోతే బలిమయ్యీని
మొగమిచ్చ లాఁడబోతే మొఱఁగులై నిలిచీని
నిగిడి నే నుండఁగాను నీచిత్త మిఁకను ॥ఇన్ని॥

తప్పక కొంగువట్టితే దంటతనమై తోఁచీని
రెప్పలెత్తి చూడఁబోతే రేసువుట్టీని
అప్పుడ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నెప్పునఁ గూడితి మిది నీచిత్త మిఁకను ॥ఇన్ని॥ 267

## పాడి

ఎందాఁకానే సిగ్గు లెవ్వరికి నెలవే
కందువ నీనేర్పులకు కడమగాదా ॥పల్లవి॥

పట్టరాదు ముట్టరాదు బలిమినే పెనఁగేవు
　　యెట్టివే నీకుచములు యెందు కెక్కేనే
　　గుట్టునఁ బయ్యదలోన గూఁట వేసుకుండఁగాను
　　తొట్టుకున్నపాయానకు దోసమురాదా ॥ఎందాఁ॥

చెప్పరాదు చూపరాదు చిమ్మిరేఁగి తిట్టేవు
　　ముప్పిరి నీమొలనూలు మూలదాఁచేవా
　　వుప్పతిల్లుమానము వొడిఁ బట్టుకుండఁగాను
　　అప్పుడే కన్నెరికాన [1]కావతి రాదా ॥ఎందాఁ॥

నగరాదు తెగరాదు నంటునఁ గాఁగిలించేవు
　　చిగురు నీమోవితేనె చిందనేఁటికే
　　జిగి నలమేల్మంగవు శ్రీవేంకటేశుఁడ నేను
　　తగులైతి మింపులకుఁ దగవేకదా ॥ఎందాఁ॥ 268

వరాళి

ఎంత రాతిమననే యింతిరో నీది
　　ఇంత నిన్ను వేఁడుకొనే దిది చూడవలదా ॥పల్లవి॥

బత్తిసేసి మాటాడఁగాఁ బదరకువే పతితో
　　చిత్తగించి వినరాదా చెలియ నీవు
　　హత్తి నిన్నుఁ జాసెనంటా నదె చూచేవుగాని
　　యెత్తినచేతుల మొక్కేటిది చూడవలదా ॥ఎంత॥

చనవిచ్చి నవ్వఁగాను జంకించకువే నీవు
　　కనువిచ్చి చూడరాదా ఘాతలేఁటికి
　　మునుపనే రాఁడంటా మొరఁగే చూచేవుగాని
　　యెనసి పంతమిచ్చిన దిది చూడవలదా ॥ఎంత॥

---

1. 'ఆవదకు' ఆపతి అని మాండలికవ్యవహార మీనాటికిని గలదు.

నిన్ను నిట్టె కూడఁగాను నివ్వెర గందకువే
మన్నించరాదా ఇఁక మచ్చికాయను
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
యిన్నికతోఁ గలసితి రిది చూడవలదా ॥ఎంత॥ 269

బౌళి

సతు లిందరితోడాను సాములు సేసేనీతో
మతకాన నేమెట్టు మాటాడేమయ్యా ॥పల్లవి॥

విన్నవించఁగానే నీవు వేగిరించే వింతలోనే
సన్నలు సేయఁగానే సాదించేవు
కన్నుల మొక్కఁగానే కరఁగించే వప్పటిని
యిన్నిటా నీకుత్తరువు లెట్టు చెప్పేమయ్యా ॥సతు॥

దగ్గరఁ గూచుండఁగానే తమకించే వింతలోనే
సిగ్గులు వడఁగానే చెనకేవు
వొగ్గి విడెమియ్యఁగానే వొడివట్టే వప్పటిని
యెగ్గుదీర నూడిగము లెట్టు నేసేమయ్యా ॥సతు॥

సెలవుల నవ్వఁగానే చెక్కు నొక్కే వింతలోనే
తలఁచఁగానే కాఁగిటఁ దగిలితివి
అలమేలుమంగను నే నట్టె శ్రీవేంకటేశుఁడ
యెలమి నన్నేలితివి యెట్టు మెచ్చేమయ్యా ॥సతు॥ 270

రేకు 1556 లలిత

ఏఁటికి దాఁచే వింద రెరఁగినపను లివి
నీటుతో నానతియ్యవయ్య నీవు నాతోను ॥పల్లవి॥

గక్కన నవ్వు నవ్వి కానుకిచ్చె నీ కాపె
 యెక్కడి సుద్దులయ్యా ఇద్దరికిని
 మొక్కుమొక్కి చెవిలోన ముచ్చట విన్నవించెను
 నిక్క మాన తియ్యవయ్యా నీవు నాతోను ॥పం॥

సళుపుఁజూపు చూచి సన్న సేసె నీకాపె
 మెలుపు లెట్టివయ్యా మీలోనను
 పిలిచి పేరుకొని పెదవులు గదలించె
 నిలి చాన తియ్యవయ్యా నీవు నాతోను ॥పం॥

కొంగువట్టి తీసి నీకు గురుతులు దలఁపించె
 సంగ తెటువంటిదయ్యా సరుస మీకు
 అంగపు శ్రీవేంకటేశ అలమేలుమంగను నే
 యింగిత మాన తీవయ్యా యిట్టె నాతోను ॥పం॥ 271

## మంగళకౌసిక

సిగ్గువిడిచి పనులు సేతురా నీవు
 వెగ్గళించి యీచేఁతకే వెలఁది చెప్పించెను ॥పల్లవి॥

చెంతనుండి యాపె నీకు చేతులెత్తి మొక్కితేను
 వంతులకుఁ జేసేవు వంచన నీవు
 వింతవారు చూచితేను వెస నిన్ను నవ్వరా
 యెంతటిది యిది యని యింతి నాడుకొనరా ॥సిగ్గు॥

పైకొని యాపె నీపై పదములు వాడితేను
 ఆకడ నాపెపై పా(ప?)దా లట్టె వాడేవు
 దాకొని పొరుగువారు తగ వింటేనే నవ్వరా
 కాకు సేయించిననీకాంత నాడుకొనరా ॥సిగ్గు॥

అలమేల్మంగ నీపాదా లంటఁ గట్టుకొంటేను
పిలిచి యాపె నురానఁ బెట్టుకొంటివి
కలసి శ్రీవేంకటేశ కన్నవారే నవ్వరా
బలువురా లిదియని భామ నాడుకోరా ॥సిగ్గు॥ 272

బౌళి

అందుకే నేనూ నట్టే అందాలు సేసుకొంటి
ఇందుముఖుల బెల్లించ నెన్నఁడు నేరిచెనే ॥పల్లవి॥

చలమున సాదించగా చన విచ్చినవాఁడాయ
సెలవిఁ దిట్టితే నవ్వులు సేసుకొనీని
పలుక కూరకుండితే భావము గరఁగె ననీ
యెలమి నిన్నేసివిద్య లెన్నఁడు నేరిచెనే ॥అందు॥

జంకించితే నాకుఁ దాను సన్న సేసినవాఁడాయ
కంకిగ వెంగెమాడితే కత సేసీని
బింకాన నేఁ జూచితేను ప్రియము సేసుకొనీని
ఇంకా మానఁడు మెచ్చి నెన్నఁడు నేరిచెనే ॥అందు॥

వెనఁగితే నంతలోనే బెరసినవాఁడాయ
గనముగా మొక్కితేను కాఁగిలించీని
మనసిచ్చి యలమేలుమంగను నేనేకనక
యెనసె శ్రీవేంకటేశుఁ డెన్నఁడు నేరిచెనే ॥అందు॥ 273

శ్రీరాగం

[1]ఏమని చెప్పుదమమ్మ యీతనిసౌభాగ్యము
కోమలపుజవ్వనము గురుతై నట్టుండె ॥పల్లవి॥

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది.

వొట్టుచుఁ గప్పురకాపు వూడిగపువారెల్ల
అట్టై దేవునికి నలఁదఁగాను
దట్టముగ మంచితెల్లఁదా మెరపూవునను
ముట్టి అవయవముల(లు?) మొలచినట్టుండె ॥ఏమ॥

తనివొంది గిన్నెలతోఁ దట్టుపుణుఁగులు దెచ్చి
పానుపొంద[illegible]దిరుమేనఁ బుయ్యఁగాను
వనివడి గొప్ప నిడుపాటినే రేడుఁబండు
కనుపట్ట పురుషాకారమైనట్టుండె ॥ఏమ॥

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁ డనెడి పుప్పొడిరాశి
వెలయ మరుఁడు ముద్రవేసినయట్టుండె ॥ఏమ॥ 274

సామంతం

ఎవ్వరెక్కుడో మీఇద్దరిలోన
జవ్వనమే పైఁజల్లి సాదించె నిన్నును ॥పల్లవి॥

తెలిఁగన్నులవాఁడవు తేటమాటలవాఁడవు
వలవకుందురా నీకు వనితలెల్లా
చలమరికాంత యాకె చనవుగలది యాకె
మొలకనవ్వులనే మోహింపించె నిన్నును ॥ఎవ్వ॥

ఇచ్చకపువాఁడవు ఇన్నిటాను జాణవు
మెచ్చకుందురా నిన్ను మెలుఁతలెల్లా
నిచ్చపెండ్లికూఁతు రాపె నెయ్యము సేసిన దాపె
పెచ్చురేఁగి ఇంపుల మెప్పించె నిదె నిన్నును ॥ఎవ్వ॥

నేస చల్లేవాఁడవు శ్రీవేంకటేశుఁడవు
ఆసపడకుందురా అంగనలెల్లా
వేసర నలమేల్మంగ [1]వివరి యన్నిటా నాపె
వాసిఁ గూడి యాసలలో వడి ముంచె నిన్నును ॥ఎప్ప॥ 275

పాడి

వట్టి నిష్ఠూరమే ఇంతే వద్దే యింత
నిట్టచూపు చూచితేనే నీకుఁ జాలు వచ్చీనా ॥ పల్లవి ॥

పగటులు సారెసారెఁ బచరించి మాకు నీవు
తగవు లేమిచెప్పేవే తరుణి నేఁడు
వొాగి మంచితనాననే వొాలపజా లాడేవు
నిగిడి యీకూటమిలో నీకుఁ జాలు వచ్చీనా ॥వట్టి॥

నెఱతనములు చూపి నీవు మాఇద్దరిలోనా
వొఱగులు దిద్దేవు వువిద నీవు
కఱకటి నిచ్చలాడి కలయవేసేవు నిన్ను
నెఱమానవులలోన నీకుఁ జాలు వచ్చీనా ॥వట్టి॥

అలమేలుమంగను నే నాతఁడు శ్రీవేంకటేశుఁ—
[2]డలుకలఁ దిద్దితివి అవునే నీవు
కలగొన మొక్కించి కాఁగిలించితి విట్టె
నెలకొన్న యీవేడుక నీకుఁ జాలు వచ్చీనా ॥వట్టి॥ 276

రేకు 1557 ఆహిరి

ఇద్దరిమోహరసము లేరులై పారఁజొచ్చె
నిద్దురవోకున్న వాఁడు నీరమణుఁడు ॥ పల్లవి ॥

---

1. వివరి—వివరముగ తెలిసినది?
2. అలకలు కావచ్చు. తిద్దు—దిద్దు రూపము శివాఙ్మయమున గలవు.

సెలవి నవ్వినవవ్వు చెక్కులవెంటఁ గారఁగాను
చెలి యేల పెట్టితివే చెక్కునఁ జేయి
జలజలఁ జెమటలు చెక్కులవెంటఁ గారఁగా
నిలిచి చూచీ నదె నీరమణుఁడు ॥ఇద్ద॥

మురిపెపుజవ్వనము మొనచన్నులఁ గారఁగా
శిరసేల వంచేవే చెల్లఁబో నీవు
నిరతపుటాసలు నిలువెల్లాఁ గారఁగాను
నెరపీని సరసాలు నీరమణుఁడు ॥ఇద్ద॥

పిలుపు నీమాటలలో ప్రియమెల్లాఁ గారఁగాను
అలమేలుమంగవు యేమనేవే నీవు
ఇల శ్రీవేంకటేశుఁడు ఇదె ని న్నురముమీఁద
నిలిపె ముద్దుగారఁగా నీరమణుఁడు ॥ఇద్ద॥ 277

వరాళి

నేరుపుతో నీదాననై నిందుకుండేను
వోరికొల్లు గొట్ట ని న్నోపమయ్యా ॥పల్లవి॥

వాపికి రేఁచుక తిట్టి వంగివంగి మొక్కఁబట్టె
యీసుల నీతోడివాదులేలయ్యా మాకు
చేసూటి నీతోఁ బెనఁగి చెక్కులు నొక్కఁగఁబట్టె
వోసరించి నిన్నోరయనోపమయ్యా ॥ నేరు ॥

కన్నులను జంకించి కడువేఁడుకొనఁబట్టె
యెన్నిక నీతో నలుగనేలయ్యా మాకు
పన్ని నీతో మచ్చరించి పంతములియ్యఁగఁబట్టె
వున్నతితో మాట మీరనోపమయ్యా ॥ నేరు ॥

చలము సాదించఁబోయి చవులు చూపఁబట్టె
ఔలమి నిను గద్దించనేలయ్యా మాకు
అలమేలుమంగను నే నదె శ్రీవేంకటేశుఁడ
వొలిసి కూడితిఁ జాయనోపమయ్యా ॥ నేరు ॥ 278

పాడి

ఏమి నేరుతునే నేను ఇన్నిటాఁ దాఁ దేరినాఁడు
సాములుసేయఁ దనతో సరిదాననటవే ॥ పల్లవి ॥

సరసానఁ దా నన్ను సన్న సేసి పిలిచితే
ఒరసి నేను గోర నంటననటవే
పొరిఁబొరిఁ దా నన్ను బొమ్మల జంకించితేను
సరిగా నేను చలము సాదించనటవే ॥ ఏమి ॥

కోరి బెట్టిమాటలను కూరిమిఁ దాఁ గొసరితే
తేరకొన నేఁ దన్నుఁ దిట్టననటవే
బీరమునఁ గొంగువట్టి పెనఁగి తాఁ బైకొంచే
తారుకాణగాఁ జన్నులఁ దాఁకించననటవే ॥ ఏమి ॥

తలయెత్తి తా నన్నుఁ దప్పక చూచితేను
మెలుపుఁగన్నుల నవ్వి మీరననటవే
అలమేలుమంగ నేఁ దా నట్టె శ్రీవేంకటేశుఁడు
కలసె నిందుకుఁ దన్ను గద్దింతుననటవే ॥ ఏమి ॥ 279

భైరవి

మగువ నేమీ నెఱఁగ మన్నించవయ్యా
అగడుసేసి నన్ను ఆయాలంటవలెనా ॥ పల్లవి ॥

వాలుకచూపులు నీపై వంచఁజాలనంటినంటా
యేల నీవు నాశిర సెత్తేవయ్యా
కాలు దాఁకీనంటా నిన్నుఁ గదిసి కూచుండఁజాల
పాలించి పయ్యదకొంగు పట్టి తియ్యవలెనా ॥ మగు ॥

సారెకు నెలవి నవ్వఁజాల భ్రమసేవంటా
కేరడాన యేల గిలిగించేవయ్యా
దూరనేల నిన్నంటా తొడఁగి మాటాడఁజాల
మేర నుండవయ్యా మందెమేళ మింత వలెనా ॥ మగు ॥

గక్కనఁ బెనఁగఁజాలఁ గడునలసేవంటా
ఇక్కువఁ గూడితిరతి యింకా వలెనా
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
దక్కితివి నాపైని తమకము వలెనా ॥ మగు ॥ 280

### దేసాళం

[1] ఇన్నిటిమూలము యీతనిరూపు
యెన్నఁగ నుపములకు నిరవైనట్లుండె ॥ పల్లవి ॥

కమలనాభునికిఁ గప్పురకాపు మేన
సముచితముగఁ బైపైఁ జాతినపుడు
అమృతము దచ్చేవేళ అట్టె మేనఁ దుంపురులు
తమితోడ నిండుకొని దట్టమైనట్టుండె ॥ ఇన్ని ॥

దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను
చేవమీర నించి సేవసేసేయపుడు
వేవేలుగా యమునలో వేమారు నీఁదులాడఁగా
కావిరి కాళిమ నిండాఁ గప్పినయట్లుండె ॥ ఇన్ని ॥

1. ఇది అధ్యాత్మకీర్తనల చాయలోనిది. ఈపాటా, 274 వ పాటా, " ఒకపరి కొకపరికొయ్యారమై " అనుపాటకు మూలముగనున్నవి.

అలమేలుమంగతోడ నట్టై శ్రీవేంకటపతి—
కెలమి సొమ్ముపెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడఁగా గుబ్బలమీఁదఁ
గలపనపెల్లా వచ్చి కమ్ముకొన్నట్లుండె ॥ఇన్ని॥ 281

పాడి

అంటి నిన్నుఁ బాయలేని దాపెతలనే వేగెనా
వెంటవెంటఁ దిరుగరా వెలఁదులెల్లాను ॥పల్లవి॥

తలకొని నీమోము తప్పక చూచితేను
వలవరా యెటువంటివనితలైనా
సెలవుల నేపాకైనా చిరునవ్వు నవ్వితేను
మొలవవా పులకలు మోవులకొలఁదులు ॥అంటి॥

చనవున నీతోను సరసములాడితేను
మనసులు గరఁగరా మగువలెల్లా
యెనసి నీతోఁగన యేపాటి మాటాడినాను
తనుఁదానె కాఁగిళ్ల తగులుకోకుండువా ॥అంటి॥

నివ్వటిల్లుతమకాన నీమేను సోఁకితేను
నివ్వెరగుఁ బొందరా నెలఁతలెల్లా
రవ్వగా శ్రీవేంకటేశ రతి నలమేలుమంగ
యివ్వలఁ గూడినందుకు హెచ్చవా వేడుకలు ॥అంటి 282

రేకు 1558 హిజ్జిజి

ఎవ్వరిది నేరుపో [1]యీ యింతినీలోనను
జవ్వనపుమదము సాదించె నిన్నును ॥పల్లవి॥

1. ఈయింతిలోన, నీలోనను అనియర్థము గావలె.

నిక్కి నిక్కి చూపులనే నీమనసు గరఁగించె
చక్కెరమోవి చూపి చల్లె వలపు
చెక్కు నొక్కి బుజ్జగించి సిగ్గులు దేరిచె నీపె
పక్కన రేపల్లెలోనబాలుఁడై ననిన్నును ॥ఎవ్వ॥

నెలవుల నవ్వులనే చెమటలు వుట్టించె
పొలసి ఇచ్చకములఁ బులకింపించె
నెలకొన విడెమిచ్చి నిండురతులకుఁ దీసె
బలిమి యశోదయింట బాలుఁడై ననిన్నును ॥ఎవ్వ॥

మంతనానకుఁ బిలిచి మరిగించె నిన్ను నిట్టె
పంతపుఁజేఁతలనే పచ్చిసేసెను
యింతలో శ్రీవేంకటేశ యెనసె నలమేల్మంగ
బంటినే ఆవులఁ గాచేబాలుఁడై ననిన్నును ॥ఎవ్వ॥ 288

## ముఖారి

కంటివిగా వోయి నీకాంతలసుద్ది
దంటతనములఁ దామూఁ దమకించేరు ॥పల్లవి॥

నిన్నుఁ జూచేపరాకున నివ్వెరగై నేనుండఁగా
నన్నలు నేసుకొనేరు సవతులెల్ల
యెన్నికె నీచేఁతలకు యిచ్చగించి నే నుండఁగా
అన్నిటాఁ దామేమిటికి నబ్బురపడేరు ॥కంటి॥

అంతలో నీమాటలే ఆలకించి నే వినఁగా
ఇంతేసిగుజగుజలేల తమకు
ఇంతలో నే నీకు విడెమియ్యఁగాఁ జూచి చూచి
వింతగా నప్పటినేల వెంగెమాడేరు ॥కంటి॥

యేకతము లాడుతా నే నిట్టె వద్ద నుండఁగా
కాకుసేసి తామేల కాఁతాళించేరు
కైకొని శ్రీవేంకటేశ కాఁగిట నే నుండఁగాను
మేకొని తామేటికి మెచ్చు మెచ్చేరు ॥కంటి॥ 284

లలిత

కోరికలు కొనసాగె గోవిందరాజ mp3
మేరమీర ఇట్లానే మెరసితివా ॥పల్లవి॥

బాలుఁడవై రేపల్లెలోఁ బాలుదాగేవేళ
యీలీలనే పవళించి యిరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లెత లూఁచి పాడఁగా
ఆలకించి విని పాట లవధరించితివా ॥కోరి॥

కొంచక మధురలోనఁ గుబ్జఇంట నీలాగుల
మంచాలపైఁ బవళించి మరిగితివా
చంచులద్వారకలోన సత్యభామతోడమీఁద
ముంచి యీరీతి నొరగి ముచ్చటలాడితివా ॥కోరి॥

పదియారువేలింతులపాలిండ్లు తలగడలై
పొదల నిటువలెనే భోగించితివా
యెదుట శ్రీవేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదిరించక శ్రీభూమినీళలఁ గూడితివా ॥కోరి॥ 285

సామంతం

దేవరవు గావా నీవు తెమలి యీపనులకు
కావరపువనితలు కదిసితేఁ జాలును ॥పల్లవి॥

చెక్కులఁ గళలు మించె చేతులఁ జెమట నిండె
చొక్కపుఁజూపుల నాపె చూచితే నీకు
నిక్కఁ బులకలు మేన నిద్దుర జారెఁ గన్నుల
పక్కన నాపె నీకుఁ బాదా లొత్తితేను ॥దేవ॥

సెలవుల నవ్వు వచ్చెఁ జెంగలించె మోమెల్లా
సొలపుమాటల నాపె సోఁకనాడితే
నిలువెల్లా ముదమందె నెగడెఁ గోరిక మది
చలి వాయ మోవి యాపె చవిచూపఁగాను ॥దేవ॥

చేరె నీకుఁ దమకము సిగ్గులు లోలో నణఁగె
కూరిమి నాపె నిన్నుఁ గూడఁగాను
యీరీతి శ్రీవేంకటేశ ఇంపులాయ రతులెల్లా
గారవించి యాపె నిన్నుఁ గైకొనఁగాను ॥దేవ॥ 286

ఆహిరి

ఇంతలోనే వేగిరముతేఁటికి నీకు
చెంతల నీపెచనవే చెల్లింతువుగాక ॥పల్లవి॥

నగుతా నాడినమాట నాయముఁ బెట్టుదురా
జిగి నీయింతిని ముద్దుసేతురుగాక
నిగిడి సొలసేమాట నేరములు సేతురా
మెగమోడి ఆపెకు మొక్కు టింతేకాక ॥ఇంత॥

సరసమాడినమాట చలము సాదింతురా
సిరుల నన్నిట పెద్దసేతురుగాక
దొరతనపుమాటకు దొమ్మి సీవు సేతురా
సురతపుమర్మములు సూచించుటగాక ॥ఇంత॥

వేడుక కాడినమాట వెంగెములు సేతురా
కూడి చనవులుగఁ జేసుకొందురుగాక
యీడనె శ్రీవేంకటేశ యెనసెని న్నీపెమాట
చూడఁజూడ నియ్యకొని చొక్కు టింతేకాక ॥ఇంత॥ 287

కాంబోది

ఆకెచక్కఁదనము చూ చ్చైపై నీవు భ్రమసితి
దాకొని చనవు లిచ్చి దండకు రారాదా ॥పల్లవి॥

చెక్కుల చెమట గార చేతులెత్తి మొక్కీ నాపె
యెక్కడ పరాకై చూచే వేమయ్య్యా నీవు
మొక్కలపుతేనె గార మోవినే విందులు చెప్పీ
ఇక్కువ నీ వెరిఁగి యియ్యకొనరాదా ॥ఆకె॥

కరఁగి కరఁగి చూచి కన్నులనే మేలు చల్లి
మరిగీ నీకేమిటికి మంతనములు
శిరసువంచి నవ్వుల సిగ్గులకానుక లిచ్చీ
సరసతలను చేయిచాఁచఁగరాదా ॥ఆకె॥

ఆయములు సోఁకించి అట్టె కాఁగిట నించీ
పాయపుమదాన, నేల పలుక విట్టె
చాయల శ్రీవేంకటేశ సతి నిన్ను దక్కఁగొనె
దాయివెట్టి రతులెల్లా తలఁచుకోరాదా ॥ఆకె॥ 288

రేకు 1559 రీతిగౌళ

మగవానితో నింత మంకు గలదా
వొగరులు మానవే వోయమ్మ నీవు ॥పల్లవి॥

వారివీరిమీఁదఁ బెట్టి వల్లెవాటుఁబయ్యదతో
వేరెవేరేనేరుపుల వెంగెమాడేవు
నీరమణుఁ డానలెల్లా నీతోఁ బెట్టుకొనీ
వూరకుండఁబట్టదలె వోయమ్మ నీకు ॥మగ॥

పొరుగుకాంతలఁ జూపి పొందుగాఁ జేతులువట్టి
తరవు వారిపైఁ దోసి తమిరేఁచేవు
గరిమ వాతఁడై తేను గక్కన నిన్ను ముట్టీని
వొరయ నింతయేఁటికే వోయమ్మ నీకు ॥మగ॥

మేరమీరి వూడిగవువారిమీఁద నింద గట్టి
గారవించి ఆతనినే కాఁగిలించేవు
అరయ దూరుదురలె అట్టె శ్రీవేంకటేశ్వరు
వూరటలేక కూడి వోయమ్మ నీవు. ॥మగ॥ 289

నారాయణి

గుట్టుగలవాఁడవంటాఁ గోరి నమ్మివుంటిమి
రట్టుసేతురా ఇంత ఇట్టె రమణులను ॥పల్లవి॥

మంతనాన నీమోవిపై మచ్చికఁ జేసినచేఁత
యెంత వెల్లవిరిసేసే విందరిలోన
చెంతల మనసుగరఁచినచెమటలెల్లాను
పంతానఁ గాలువలుగాఁ బారింతురా ॥గుట్టు॥

చలువై నరతిలోనిసాములరహస్యములు
వెలి నిట్టూర్పులుగాను వెళ్లవేతురా
తలఁపులోపలిమేలు తగిలినచొక్కులెల్లా
తెలిఁగన్నులయందునే దిష్టము చూపుదురా ॥గుట్టు॥

గక్కనఁ గూడినయట్టి కాఁగిటిలో సిగ్గులెల్ల
మిక్కిలి సెలవులను మెరయింతురా
ఇక్కడ శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
తక్కక యాసోదానఁ దమకింతురా ॥గుట్టు॥ 290

### ముఖారి

ముందే యెఱఁగవలె మోచివచ్చేపనులు
చెంది చేయిముంచితేను సిగ్గులేద నుండును ॥పల్లవి॥

వలదేలే చలము వనితకు నింతేసి
కలయక పోరాదు కాంతునితోను
పిలిచీ నాతఁడై తేను బిగిసేవు నీవై తే
బలిమి సేసితే మరి పంతమేడ నుండునే ॥ముందే॥

మంకుఁదన మేఁటికే మానినికి నింతేసి
అంకెకు రాకుండేవా ఆతనితోను
వంకలాడీ నాతఁడై తే వాదించేవు నీవై తే
సంకెలేక పెనఁగితే చలమేడ నుండునే ॥ముందే॥

ఆరితేరి రవ్వలేలే అంగనకు నింతేసి
మారు నవ్వక మానేవా మగనితోను
యీరీతి శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడె
గోరగీరి చెనకితే గుట్టు లేడ నుండునే ॥ముందే॥ 291

### భల్లాటి

ఇదివో నీసరసము యీఁతలు మోఁతలు నాయ
నదులాయఁ గరఁగులు నవ్వు లేఁటికయ్యా ॥పల్లవి॥

వాడిపట్టి పెనఁగితే వుబిదకుచ్చుల పీడె
తొడిఁబడఁ బట్టఁబోతే తురుము జారె
నిడుపులై ముంచుకొంటే నెరులే ముసుఁగాయ
నడుమఁ జిక్కె సిగ్గులు నవ్వు లేఁటికయ్యా ॥ఇది॥

మునుపఁ జెనకఁబోతే ముంగిటికెక్కెఁ జన్నులు
పొనిఁగితే మీఁదఁ గప్పె పువ్వుదండలు
మనసున నెంచ నవే మఱఁగులతెర ఆయ
ననుపు కిందుమీఁదాయ నవ్వు లేఁటికయ్యా ॥ఇది॥

మలసి కాఁగిలించితే మనసు లేకములాయ
తెలిసి పొందితే మోవిఁ దేనె గారెను
కలసితి రిద్దరును గక్కన శ్రీవేంకటేశ
నలినలి ఆయ రతి నవ్వు లేఁటికయ్యా ॥ఇది॥ 292

## ముఖారి

కన్నవారినెల్లాఁ గూడి కతలఁ గరచితివి
నిన్ను దూరఁ బనిలేదు నీపాపమా ॥పల్లవి॥

పలికి సారెసారెకు బాసలు సేసేవు నాతో
నెలఁత నీ కివియెల్లా నేరుపఁబోలు
మొలచినగుణముతో మునుపటివలె నుంటే
నెలకొని నాతోను నిజమాడవా ॥కన్న॥

మొదలనే నీవు నాకు మొక్కులు మొక్కవచ్చేవు
సుదతి నీకు చేసూటి చూపఁగఁబోలు
చెదరక నీమనసు చేతికి లోనై వుండితే
సదరాన నీ వింత చంచలింతువా ॥కన్న॥

కనుఁగొని బలిమినే కాఁగిలించవచ్చేవు
వనిత నిన్నిటులానే వంచుకోఁబోలు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
ఇనుమడిబుద్ధులు నీ వెఱఁగనివా ॥కన్ను॥ 293

నాదరామక్రియ

రతికెక్కెఁ బనులు నీరప మాయను
మతకరినీమాటకు మారాడకుండఁగను ॥పల్లవి॥

నాతో నీవు నవ్వి నవ్వి నయగారితనాలనే
కాతరించి యంతలోనే కాఁగిలించేవు
నీతు లెఱుఁగుదువు నీనేరుపు మంచిదిగాదా
చేతికి లోనైనవారు సేన గలుగఁగను ॥రతి॥

చెక్కులు మెల్లనే నొక్కి సిగ్గులెల్లా విడిపించి
మొక్కలాన దగ్గరి నామోవి యానేవు
వొక్కపొత్తు గలసె నీవోపిక మంచిదిగాదా
అక్కరతో సతులు నీయంకెకు రాఁగాను ॥రతి॥

బేసబెల్లితనమున పీఁటమీఁదఁ గూచుండి
సేసవెట్టి పెండ్లాడి చిమ్మిరేఁచేవు
వాసితో శ్రీవేంకటేశ వైపుగ నన్నేలితివి
యీసరిత మావంటివా రింపులు చల్లఁగను ॥రతి॥ 294

రేకు 1560 దేవగాంధారి

ఇదివో నీవు సేసినయెమ్మెలు
గుదుళులాయ మోవిమీఁదికుమ్మెలు ॥పల్లవి॥

కన్నులఁ జూచినప్పటి కాఁకలు
అన్నిటాఁ జెలికిఁ గొమరాఁకలు
విన్నవించుదాఁకా విట్టివీఁకలు
మున్నాడిఁ బులకలమూఁకలు ॥ ఇది ॥

చెక్కుల నీవుసేసినచేఁతలు
మొక్కలపుసవతుల మోఁతలు
యిక్కువవలపులెల్లా యీఁతలు
పుక్కిటిబంటితలపోఁతలు ॥ ఇది ॥

సుదతిఁ బెట్టిన నీచొక్కులు
చెదరనిరతులలో చిక్కులు
యిదివో శ్రీవేంకటేశ యిద్దరి మిమ్ముఁ గూడించె
మొదల నాపెచేతిమొక్కులు ॥ ఇది ॥ 295

శంకరాభరణం

ఆయాలు దొరలివచ్చినందులోననే
చాయలా సన్నలా సిగ్గు చల్లితేనే చాలదా ॥ పల్లవి ॥

తాలిమిగలవారికి తమకించ నేఁటికి
చాలుకొని వచ్చితేనే చాలదటవే
వేళగాచేవారికి వెక్కసము లేఁటికి
సోలగిలఁ జెక్కుచేతఁ జూచినదే చాలదా ॥ ఆయా ॥

నేరుపుగలవారికి నీటుచూప నేఁటికి
మేరతో దగ్గరనుండే మేలుగాదటే
దారకపువారికి దంటతనా లేఁటికి
చేరవచ్చి బుద్ధులెల్లాఁ జెప్పితేనే చాలదా ॥ ఆయా ॥

సరసులై నవారికి సాదించనేఁటికి
ధర నిచ్చకమాడుచే తగదటవే
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నన్నిందుకొరకె
సరిత లెఁగి మోవి చవిగొంటే చాలదా ॥ఆయా॥ 296

ఆహిరి

ఏల నాకు నానలిచ్చే వెందాఁకాను
వాలాయించి నీపొందు వాడికాయను ॥పల్లవి॥

ముయ్యంచున నీవు నాకు మోహించినమోహమెల్లా
తియ్యని నీమోవియందే దిష్టమాయను
ఇయ్యెడ నీవు నాకు నిచ్చేటిచనవులెల్ల
చయ్యన నీనవ్వులనే సతమాయను ॥ఏల॥

మచ్చికతో నీవు నన్ను మన్నించే మన్ననలెల్లా
కొచ్చి చూచేచూపులనే గురుతాయను
తచ్చి నీవాసంది తగులాయములెల్లాను
హెచ్చినసరసముల నిరవాయను ॥ఏల॥

ఇట్టై నీవు నన్ను నెడయనిబాసలెల్లా
నెట్టుకొన్నరతులలో నిజమాయను
గట్టిగా శ్రీవేంకటేశ కలసిననీకూటమి
వొట్టిన యిచ్చకముల నుఁ(నుం?)కువాయను ॥ఏల॥ 297

వరాళి

ఎటువంటిదానవే యెన్నటికే మొగమోట
పటుగలి నీ కతఁడు పంతమియ్యఁగాను ॥పల్లవి॥

తలవంచనేమిటికే తరుణి నీనాయకుఁడు
పిలిచి నీచేయివట్టి పెనఁగఁగాను
చలము లింకా మరియు సాదించనేమిటికె
వెలలేనివేడుకల వేఁడుకొనఁగాను ॥ఎటు॥

చింతించ నేమిటికె చెక్కు చేతనుఁ జేర్చి
పొంత నాతఁడు నిన్నుఁ బొదుగఁగాను
ఇంత బిగువేమిటికే యెదుటనే నిలుచుండి
మంతనమున నిన్ను మన్నించఁగాను ॥ఎటు॥

సిగ్గులివి యేమిటికే శ్రీ వేంకటేశ్వరుఁడు
అగ్గమై కాఁగిటవే అలమఁగాను
యెగ్గు లేమిటికె నేఁ డిచట సంతోసముతో
వెగ్గళపురతులలో వెలయించఁగాను ॥ఎటు॥ 298

మాళవిగౌళ

ఆయనాయ నందుకేమీ ఆసోద మెఁ(మెం?)తైనఁ గద్దు
చేయి చాఁచి యింకానేల చెనకేవు నీవు ॥పల్లవి॥

యెప్పటివాఁడవేకావా యెన్నిబాసలు సేసినా
మెప్పించి మమ్మెట్లా నమ్మించేవు నీవు
కుప్పళించి యెట్టనుండే కుంకుమ కస్తూరవునా
చిప్పిల మమ్మేల యిఁత చెనకేవు నీవు ॥ఆయ॥

యెన్నఁబోతే నీవేకావా యెంతపొందుసేసినాను
ఇన్నిటా మాకెట్ల నీ వింపుసేసేవు
కన్నులకుఁ దెల్లనుండే గంధవొడి కప్రమౌనా
చెన్ను మీర నింకానేల చెనకేవు నీవు ॥ఆయ॥

యెంగిలై నసీవే కావా యెంత రతిఁ గూడినాను
సంగతిగా మాకు నెట్టు చలిసేసేవు
సంగడి శ్రీవేంకటేశ జవ్వాది పుణుఁగవునా
చెంగట నున్నాఁడవేల చెనకేవు నీవు ॥ఆయ॥ 299

నాట

తిట్టితే నేమిసేతువు దేవరవైనా నైతివి
గట్టువాయతనమునఁ గాలుదొక్కేవు ॥పల్లవి॥

చయ్యనఁ బరాకుమీఁద సకులతో మాటాడఁగా
పయ్యదకొంగు వట్టి భ్రమయించేవు
వుయ్యాలమంచముపై వూరకే వినోదించఁగ
గయ్యాళితనాన వచ్చి కాఁగిలించేవు ॥తిట్టి॥

వెలయఁగఁ గొనగోళ్ల వీణె వాయించఁగాను
మలసి యదరిపాటు మర్మమంటేవు
పొలుపుమిగుల నేను పువ్వులు ముడుచుకోఁగా
కెలవుఁజేతల నేమి గిలిగించేవు ॥తిట్టి॥

ఇదివో ముచ్చటతో నే నేకతాన నుండఁగాను
కదిసి రతులఁ గూడి కరఁగించేవు
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చెదరక మొక్కఁగాను చెక్కునొక్కేవు ॥తిట్టి॥ 300

రేకు 1561 రామక్రియ

సవతుల మింతేనేము సటలకు లోనయ్యేమా
రవళితో నేము మిమ్ము రవ్వసేసేమా ॥పల్లవి॥

యీకడ నాకడాను యెదురుబడి బాసలు
ఆకెకు నీకే తగు నందు కేమయ్యా
సాకిరులేల పెట్టేవు సతు లెఱఁగినపనే
దీకొని మీగుణములు తిప్పవచ్చేమా ॥సవ॥

మతకాన మీలోనిమారుకుమారు నవ్వులు
అతివకు నీకే తగు నందు కేమయ్యా
చతురతేమిచూపేవు చల్లఁగా నన్నీఁ గంటిమి
కతకారిమీసుద్దులు కాదనఁగలమా ॥సవ॥

ముందు వెనకలఁ గూడేముయికిముయిరతులు
అందములే ఇద్దరికి నందు కేమయ్యా
సందడి శ్రీవేంకటేశ సరిగాఁ గూడితి మమ్ము
సందెమాడి మిమ్ము నేము పచ్చి సేసేమా ॥సవ॥ 801

హిందోళం

ఇంతయేలే దోసమూ ఇన్నిటా ఘనుఁడు దాను
అంతలో నాకాళ్లేల అంటవచ్చీని ॥పల్లవి॥

మచ్చరము మానితినే మంకులు విడిచితినే
చెచ్చెర నీచెప్పినట్టు సేసేనే
ఇచ్చకములాడేనే ఇంక నేమీ నననే
ఇచ్చట నాకేల పంతా లియ్యవచ్చీనే ॥ఇంత॥

చలములు మానితినే జవదాఁటనే ఇఁక
పలికినట్టే నేనూఁ బలికేనే
వలపు గానుకిచ్చేనే వాదు లడువనే ఇఁక
బలవంతమున నేల బాసలిచ్చీనే ॥ఇంత॥

జిప్పు లిఁకఁ బట్టనే తనమాట గాదననే
ఈప్పుడూఁ దనమన్నన లియ్యకొనేనే
వొప్పుగా (శ్రీ)వేంకటేశుఁ డొనగూడె నన్ను నిట్టె
యిప్పుడే యెంగిలిమో వేలడిగినే ॥ఇంత॥ 802

ముఖారి

ఇంకనేల వెలుపులు యిన్నిటాను చలివాసె
సంకెలేక బొమలనే జంకించీ నిఁకనూ ॥పల్లవి॥

సతికి మాఁటలాడఁగ చనవు లిచ్చితివి
యితవై సేవకు వేళ లిచ్చితివి
వెతదీర నాపెకు విచ్చనవిడాయ నిఁక
మితిమీర నేముందర మెరసీ నిన్నిటాను ॥ఇంక॥

అంగన నవ్వులు నవ్వ ఆసలు వెట్టితివి
చెంగట సలిగెలెల్లాఁ జెల్లించితివి
అంగవించినరతుల నాపె రపమాయ నిఁక
సింగారాన రాజ్యముసేసీ నీవద్దనూ ॥ఇంక॥

మగున నిన్నుఁ జెనక మన్నించితి విప్పు డిట్టె
పొగరురతులఁ గూడి బోధించితివి
నిగిడి (శ్రీ)వేంకటేశ నేఁడాపెపంతము వచ్చె
పగటున మమ్మిట్టే బతికించీ నిఁకనూ ॥ఇంక॥ 803

కాంబోది

నీకు నాకు నొకఁడే నెయ్యమైననాయకుఁడు
కోకలాయఁ బొంపులెల్లా కోలి ఇఁక నేఁటికే ॥పల్లవి॥

---

(శ్రీ)గీతగల యక్షరము చిలుమెక్కినది. (శ్రీ)గీతలుగలయక్షరము లరిగి స్పష్టమగుట లేదు.

తమకించనేఁటికే తలపోఁతలెల్లాను
సముకాననే తేరీ సవతి వింతే
చెమటచేతుల మనచేతు లితఁడె పట్టె
భ్రమసితి మీతనికి పంతా లిఁక నేఁటికే ॥నీకు॥

కాతరించనేఁటికే కావలసినపనులు
ఆతనివల్లనే తేరీ ఆండ్ల మింతే
యేతులమాటలనే యిద్దరిని బుజ్జగించె
ఆతుమలు దనిసితి మార డిఁక నేఁటికే ॥నీకు॥

వేగిరించనేఁటికే వేడుకపడేవేలా
భోగములోనే తేరీఁ దోఁబుట్ల మింతే
యీగతి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నన్నుఁ గూడె
బాగుగాఁ జొక్కితి మిఁక పలునవ్వు లేఁటికే ॥నీకు॥ 304

ధన్నాసి

కాంతలచేత నిన్నిటా కాయగావఁబోలు మేను
యెఁ(యెం?)తైనాఁ బంకించఁడు ఉచ్చగించీ నందుకే ॥పల్లవి॥

సరస మెంతాడినాను సమ్మతించీ నన్నిటికి
వెరవఁ డెందుకైనాను వేడుకకాఁడు
గోరబులుగా గోర కుమ్మెలువో నూఁదినాను
పెరరేఁచి సారెసారె ప్రియపడీ నందుకే ॥కాంత॥

నవ్వు లెన్ని నవ్వినాను నను పేసుకొనీని
వువ్విళ్లూరి జడియఁ డుబ్బరికాఁడు
కువ్వలుగా నురమున కుచములు దాఁకించినా
రవ్వలై సిగ్గుపడఁడు రతికెక్కీ నందుకే ॥కాంత॥

కాఁగిలెట్టు బిగించినా కరఁగీ లోలోననె
వీఁగక నన్నిట్టె కూడె వేగిరకాఁడు
చేఁగదేర్పినాను మోవి శ్రీవేంకటేశ్వరుఁడు
మాఁగనీఁడు వలపులు మన్నించీ నందుకే ॥ కాంత ॥ 805

వరాళి

ఏఁటికి వేగిరించేరే యెఱుఁగనిదాననే
కూటమి గలుగుదాఁకాఁ గొసరరాదు ॥పల్లవి॥

బిలువుఁడయినయట్టిపతితోడ సతులకు
చలము సాదించరాదు జంకించరాదు
వలవకతొలుతనే వాడికగాఁ బేరుకొని
పిలువఁగరాదు మరి బిగియారాదు ॥ఏఁటి॥

వెక్కసమయినయట్టివేడుక కాని నంత
కక్కసించరాదు మఱి కరఁచారాదు
నిక్కిచూడకుండఁగాను నేరుపులు వచరించి
పెక్కుమాట లాడరాదు పెనఁగారాదు ॥ఏఁటి॥

చేఁతికిలోనై నయట్టిశ్రీవేంకటేశ్వరుని
[1]కాతరించరాదు మరి కాదనారాదు
యీతఁడే నన్నిటు గూడి ఇచ్చకుఁడై వుండఁగాను
యేతులు నెరపరాదు యెలయించారాదు ॥ఏఁటి॥ 806

రేకు 1562 సౌరాష్ట్రం

కొండవంటిదొర దాను గోవిందరాజు।తన—
గుండె రాయిగాదా తొల్లి గోవిందరాజు ॥పల్లవి॥

1. కాతరించు=భయపెట్టు కావచ్చు.

చేరి తనపాదాలు చేకొని పిసుకఁగానే
కూరిములు గొసరిని గోవిందరాజు
నేరుపుతోఁ జెప్పినట్టె నేము నిట్టె సేయఁగానే
[1]గోరిచీని వలపులు గోవిందరాజు ॥కొండ॥

చప్పుడు గాకుండాను సరసములాడితేను
కుప్పళించి పెంజెమట గోవిందరాజు
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కఁగాను వచ్చిదేర
గొప్పగొప్పమాటలాడీ గోవిందరాజు ॥కొండ॥

గరిమల నిద్దరముఁ గాఁగిలించుకొంటేను
కురిసీ మోవితేనెలు గోవిందరాజు
ఇరవై శ్రీవేంకటేశుఁ డితఁడే నేము గూడితే
గొరబుసేసీఁ జన్నులు గోవిందరాజు ॥కొండ॥ 307

మాళవి

తల దడిసినపుడే చలి వాసెను
చెలరేఁగుటేకాక సిగ్గువడేవా ॥పల్లవి॥

గొల్లెతలు నీవును గోకులములో నుండి
అల్లిఁ దామెరలవలె నల్లుకొంటివి
వెల్లవిరిగా నే నెంత వెంగెము లాడినాను
చెల్లుబడులేకాక సిగ్గువడేవా ॥తల॥

అగడుగ మరియుఁ బదారువేలసతులతో
తగుఁదీగెలు మాఁకులై తగిలితివి
తగదని నే నెంత తప్పులు నిన్నెంచినాను
జిగిమీరుటువుగాక సిగ్గువడేవా ॥తల॥

1. గోరుచు=కొంచెము కొంచెముగ గోకిగోకి చేర్చుట. మాండలికము. బాధపడుట కూడా కలదు.

తావించఁగా నీ వప్పటిఁ బట్టపుదేవుల్లతోడ
పూవునుఁ బిష్పాడిమై పొందితివి
యీవల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చేవదేర నే నవ్వితే సిగ్గువడేవా ॥తల॥ 308

దేశాక్షి

ఎంత చులుకఁగఁ జూచే వేమయ్య నీవు
కాంత నీపై వలపులు [1]గడ్డెము వేసీనా ॥పల్లవి॥

చనవు గలుగఁగాను సారెకుఁ గొసరీ నింతి
మనసు నీకు రాకున్న మాటలాడీనా
చెనక రాఁగా నీచేతులు దాఁ బట్టెఁగాక
వెనవెనకకుఁ బోతే వెన్నడించీనా ॥ఎంత॥

సమ్మతించి నీవుండఁగా సరసమాడె నీపె
కొమ్మ నీకు వేసలైతే గోర గీరీనా
రమ్మనఁగా నీతొడపై రమణి గూచుండెఁగాక
వుమ్మడి నీ వూరకుండే వొద్దికి వచ్చీనా ॥ఎంత॥

కందువకు నీవు రాఁగాఁ గాఁగిలించుకొనెఁ జెలి
పొందు నీకు లేకుండితే భోగించీనా
విందుగా మోవియ్యఁగా శ్రీవేంకటేశ కూడెఁ గాక
సందడిఁ బరాకైతే చలపట్టీనా ॥ఎంత॥ 309

కన్నడగౌళ

ఎగ్గులుఁ దప్పులు నెంచనేఁటికే నాకు
అగ్గలమై తనమేలు ఆతుమలో నుండును ॥పల్లవి॥

---

1. గడ్డెము=ఖడ్గాయము.

వెలి నెవ్వతెవద్ద వేడుకతో నుండినాను
తలఁపులోనే వుండుఁ దా నాకును
పలుకు లెవ్వరితోడఁ బలుకుతా నుండినాను
చెలఁగి తనమాట నాచెవి సోఁకి వుండును ॥ఎగ్గు॥

నంటున నెవ్వరితోడ నవ్వులు దా నవ్వినాను
అంటి నామోమునఁ గట్టినట్టే వుండును
దంటతనాన నెందెందు తప్పక తాఁ జూచినాను
సొంటులు సోదించి నన్నుఁ జూచినట్లే వుండును ॥ఎగ్గు॥

గక్కన నేకాఁ(కాం?)తలఁ గాఁగిలించి కూడినాను
ఇక్కడ నన్నుఁ గూడిన ట్టింపై వుండును
యెక్కువ శ్రీవేంకటేశుఁ డిట్లైె నన్ను నేలినాఁడు
తక్కక సంతోసము దక్కినట్టె వుండును ॥ఎగ్గు॥ 810

పాడి

విన్నవించవలె నీకు వేడుకఁ దొలుదొలుతే
యెన్నికనేసేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥పల్లవి॥

నీవు మాటలాడినట్టె నేనూ మాటలాడితేను
తావిబెల్లములోఁ బంచదార చల్లుట
వోవరిలో నే నిందుకు వుప్పనిచప్పనితిట్లు
యీావల నే నాడేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥

మొక్కిన నీమొక్కులకు ముంచి నేనూ మొక్కితేను
మక్కళించి అల్లులుఁ దామర లల్లుట
చిక్కుదీరఁ గొనగోళ్ల చిమ్మిరేఁచి కొంత గొంత
ఇక్కువ లంటేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥

సిగ్గులమీఁద సిగ్గులు చేరి నేనూ నెరపితే
వొగ్గి ముత్యాలును వజ్రాలు నర్పించుట
అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
తగ్గక గర్వించేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు ॥విన్న॥ 311

బౌళి

మే మెఱఁగ మిటమీఁద మీకే తెలుసును
అముకొన్నసుద్దులెల్ల ఆపె నడుగవయ్యా ॥పల్లవి॥

చేరఁడేసికన్నులచెలి నిన్ను నడిగెను
వూరకే జాణతనాలే వొరశాడిని
కేరడపునవ్వులతో కేలెత్తి మొక్కె నీకు
ఆరసిఁ గడమసుద్దు లాపె నడుగవయ్యా ॥మేమె॥

కొండలంతలుచన్నులకొమ్మ నిన్ను వెదకెను
దుండగపుమాటల దూకుచుండెను
పండుమోవితేనెలాపె పంతములు నెరపెను
అండ నేమిటికో కాని ఆపె నడుగవయ్యా ॥మేమె॥

చక్కనివనిత నీపైఁ జల్లె వలపులెల్లాను
పిక్కటిల్లు ప్రేమములు పెంచి పొగడె
ఇక్కువెఱిఁగి శ్రీవేంకటేశ నీవు గూడితివి
అక్కజపుమేలెల్లా ఆపె నడుగవయ్యా ॥మేమె॥ 312

రేకు 1563 సామంతం

ఇదివో నీవెఱఁగవు యెంతటి దనేవు ఆపె
సదరాననే యన్నిటాఁ జలము సాదించెను ॥పల్లవి॥

తేటపడ నింతి నిన్ను తిట్టు దిట్టదుగాని
[1]గాటారింపుమాటలనే కల్లలాడెను
పాటించి ని న్నిందరిలో పంతము గొనదుగాని
చీటికి మాటికిఁ బంపు సేయించుకొనెను ॥ఇది॥

చేయి చాఁచి నీమీఁదఁ జెనక దింతేకాని
ఆయము లంటుతానే అలయించెను
రాయడించి నిన్ను నిట్టె రవ్వసేయదనికాని
చాయలనే నీమోవి చప్పఁజేసెను ॥ఇది॥

మెలుపున నీతోను మితిమీర దింతేకాని
కెలసి రతులనెల్లాఁ గిందుపరచె
కలసితి విటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
తొలుతనే యాపె నిన్ను దుష్టుఁ జేసెను ॥ఇది॥ 313

పళవంజరం

వేవేలకు మాకు నిఁక వెలిపఁగఁ బనిలేదు
సేవలు నే మేమైనాఁ జేతుము నీకిఁకను ॥పల్లవి॥

తాలిమిగలవాఁడవు తరుణులెల్లా నాడేటి—
మేలములకెల్లా నీమే నోరుచును
చాలుకొని చిన్ననాఁడు సాముసేసినదియెల్లా
పాలుమాలకుండా నేఁడు ఫలియించెను ॥వేవే॥

ధీరుఁడ వౌదువు నీవు తెరవలాడే వెంగేల—
మారుమాటలకెల్లా నీమన సోర్చును
దూరుగాఁగ శిశుపాలు తుచ్ఛపుమాటలచేత
వారివీరిలోన నలవాటుసేసుకొంటివి ॥వేవే॥

1. గాటారించు=ప్రకరణముతో ఊరించు కావచ్చు.

బలువుడ వౌదువు భామల చన్నులు మోవ
పలుమారు నీజవ్వనపాయ మోర్చును
అలమేల్మంగ నేలితి వందుకే శ్రీవేంకటేశ
తలఁప గోవర్ధనమందరము లెత్తితివి ॥వేవే॥ 314

బౌళి

అట్టే కాని నారాదా అదియుఁ జూతువుగాని
ముట్టి నాచన్నులి గోరు మోపఁగా నోపుదువా ॥పల్లవి॥

మగిడి మగిడి నాతో మాటలాడవచ్చేవు
తగవుకు వచ్చేవా తప్పక నీవు
యెగసక్కెలకు నాతో నేలాటములాడేవు
నగవులు నిజాలకు నవ్వఁగనోపుదువా ॥అట్టే॥

మొనసి నాతోను సాములు సేయఁజూచేవు
పెనఁగులాడ వచ్చేవా పిరి దూరి
ననుపులు సేసుకొని నన్ను నీవు గొసరేవు
చనవున నిట్లానే సరి దూఁగఁగలవా ॥అట్టే॥

కలసి మెలసి నన్నుఁ గాఁగిలించఁజూచేవు
బలిమి చూప వచ్చేవా పలురతుల
అలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చలపట్టి యేలితివి జవదాఁటేవా ॥అట్టే॥ 315

వేళావళి

సేసినవారికి మరి సేసినంతే పుణ్యము
దోసము లేదు నాయందు దూరకుమీ ఇఁకను ॥పల్లవి॥

ఆదిగొని రమణుఁడు అంగనలతో నవ్వఁగా
సాదుఁదన మెక్కడిది సవతులకు
యేదెస వేసవియైతే యెండలు గాయకుండునా
తోదోపున మమ్ము నీవు దూరకుమీ ఇఁకను ॥సేసి॥

వాలికాఁడై మగవాఁడు నానాదిక్కులు దొక్కఁగా
గోలతన మెక్కడిది కోమలులకు
వేళఁ జంద్రోదయమైతే వెన్నెల గాయకుండునా
తోలితోలి మమ్ము నీవు దూరకుమీ ఇఁకను ॥సేసి॥

ఆనుక శ్రీవేంకటేశ అన్నిగతులుఁ జెప్పఁగా
మౌన మిపు డెక్కడిది మాకెల్లాను
కానీలే పూచేవనము కాయలు గాయకుండునా
తూనికతోఁ గూడితివి దూరకుమీ ఇఁకను ॥సేసి॥ 816

## లలిత

నీకెప్పుడు నీవోజ నాకైతే నావోజ
చేకొని యీరెండూను చెల్లు నిదే మనకు ॥పల్లవి॥

యేమగువలమాట కెంత నీవు లోనైనా
నీమాటలోనిదాన నే నెప్పుడు
చేముట్టి నీ వెవ్వరిచేఁ జెనకించుకొనినాను
ఆముక నీచేతికి లోనైనదాన నేను ॥నీకె॥

వంటున నేయింతులతో నవ్వులు నీవు నవ్వినా
గొంటరి నీనవ్వులకు గురి నేను
ఇంటింట నీవెవ్వరికి యిచ్చకములు సేసినా
జంటైననీ కిచ్చకము జరపుదు నేను ॥నీకె॥

కందువ నీ వేసతులకాఁగిటి కాసపడినా
అంది నాయాసలు నీపై నంటింతును
ఇందరి(శ్రీ)వేంకటేశ యెనసి నన్నేలితివి
పొందుసేసి నీతోను భోగించితి నేను ॥సీకె॥ 317

### దేవగాంధారి

పట్టరానివయసుతో బలిమి సేసేముగాక
యెట్టు నేఁడు బాఁతిరైయె రితరులు నీకు ॥పల్లవి॥

భామినిమాటలెల్ల పంచమవేదము నీకు
ప్రేమపుమోవితేనె పెండ్లివిందులు
సాముసేసేటిగరిడి సతమైనకాఁగిలి
యేమిటికి మాటలాడే వెవ్వరితో నీవు ॥పట్ట॥

అంగనతోడి సరస మంకెల రాజ్యపదవి
సంగడినవ్వులు నీజన్మఫలము
ముంగిటినిధానాలు మొనగోరి సరసాలు
యెంగిలివలపులేల యెవ్వరితో నీకు ॥పట్ట॥

కాంతపురమె నీకు కందువ సింహాసనము
పంతపుకూటములే పట్టబద్ధము
ఇంతలో (శ్రీ)వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యెంత కెంత సడ్డయేల యెవ్వరితో నీకు ॥పట్ట॥ 318

రేకు 1564

### బౌళి

ఎటువంటివాఁడవయ్యా ఇదేమయ్యా
ఘటసల నన్నేల గయ్యాళిఁ జేసేవు ॥పల్లవి॥

కోరి ఇంటిలోనినన్ను కొలువులోనికిఁ బిల్చి
సారె ఇందరిలో సరసములాడేవు
వూరకే గుట్టుతోడనుండేనాచన్నుఁ మీఁద
జీరలుగా గోర గీరి సిగ్గు విడిపించేవు ॥ఎటు॥

వూడిగము సేసేనన్ను వొగిఁ దొడపై నిడుక
తోడుతోడ నీ విట్టే దొరఁ జేసేవు
వాడినమోవితోడుత వంచిన నాశిర సెత్తి
యీడుజోడు లెంచ కిట్టె యెంగిలిసేసేవు ॥ఎటు॥

మానాపతిమైననన్ను మరి పెండ్లిచవికలో
కానిమ్మని సేసవెట్టి కాఁగిలించేవు
యీనయమున శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పూని ఇట్టె మన్నించి భోగించేవు ॥ఎటు॥ 3-9

సామంతం

చాలవా నీమన్ననలు సముకాన నివె మాకు
కేలు చాఁచి కొసరేనా కిమ్ముల నింకాను ॥పల్లవి॥

ఆదిగొని నీవు నాతో నట్టె యేల పెనఁగేవు
కాదంటినా నీతో పొందు కలకాలము
పోదితో నప్పటినేల పొదిగి వేఁడుకొనేవు
సాదించేనా నీతో చలము లింకాను ॥చాల॥

గుట్టుతోడ నీవేల కొంగువట్టి తీసేవు
వెట్టిచుట్టాలమా నిన్ను వేసరించను
బట్టబయట నింతేల పైపైఁ దమకించేవు
తట్టి నామనసు నీకుఁ దాఁచేనా ఇంకాను ॥చాల॥

కందువ లాలించి యేల కాఁగిట బిగించేవు
నింద లెంచి తప్పు మోఁపి నిన్ను మీ రేనా
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అందుకొలుజాణతనా లాడేనా ఇంకాను ॥చాలా॥ 320

## దేసాళం

నన్నుఁ జూచి నీవేమి నవ్వేవిఁక
సన్నలఁ జాయల నీకు జయమాయనే ॥పల్లవి॥

వేలివుంగర మిచ్చెను విభుఁడు నీ కిప్పు డిట్టె
యేలవమ్మ సవతుల నిందరి నిఁక
పాలించేఁ గ్రపజాగాలు పలుమారు నింతలోనె
[1]చాలుకొన్నకాంతలను సాదించవే ॥నన్నుఁ॥

బల్లిదుఁడు సరిగద్దెపైఁ గూచుండఁబెట్టుకొనె
చెల్లెండ్లకుఁ బనులు చెప్పఁ గదవే
అల్లదె నీతో నవ్వి అనమిచ్చె నీ కిన్నిటా
చెల్లు మాచే వూడిగాలు సేయించుకోవే ॥నన్నుఁ॥

శ్రీవేంకటేశుఁడు నీచేయి వట్టి పెండ్లాడె
లావులఁ బట్టపుదేవులవు గావే
యీవల నా కాఁగిటను యీతఁ డిరవయినాఁడు
కైవశమై మాకెల్లాఁ గర్తవైతివే ॥నన్నుఁ॥ 321

## ఆహిరి

నీవల్ల దోసము లేదు నేనే వయోమదమున
సేవలు సేయక గుట్టు సేసితిఁగాని ॥పల్లవి॥

1. చాలుకొన్న=బారులు తీరిన కావలెను.

చనవెల్లా నిచ్చితివి సముకాన నీవు నా—
మనసులోనిదే కడుమంకుగాని
పెనఁగితి వింతేసి ప్రియపడి, నేనే నీకు
చెనకఁజాలక బిగిసితిఁగాని ॥నీవ॥

సిగ్గులెల్లఁ దేర్చితివి చేయి వట్టి నీవైతే
వెగ్గళించి విదిలించి వేసితిఁగాని
దగ్గరి పొదిగితివి తమకాన నన్ను నిట్టె
కగ్గుదేరి వూరకె కైకోనైతిఁగాని ॥నీవ॥

ఆదరించి కూడితివి అన్నిటా శ్రీవేంకటేశ
ఆదిగొని పంతాలు నే నాడితిఁగాని
నీదయెల్లా నించితివి నిండా నాపై నిట్టె
సాదించి వేడుక నిన్ను జట్టిగొంటిఁగాని ॥నీవ॥ 322

నాదరామక్రియ

బుద్ధిచెప్పవయ్యా నీవు పొరుగులవారికెల్ల
పొద్దు వోదా అటువంటి పొలఁతులకెల్లను ॥పల్లవి॥

చెంగట నీకు నేను సేవ చేసుకుండఁగాను
యెంగిలిరతి[1]కెవ్వతానేల వచ్చీని
కంగులేక నీవు నేను కాఁపిరము సేయఁగాను
అంగడిజాణతనాల కదేమి గారణము ॥బుద్ధి॥

ప్రేమముతో నీపెండ్లిపీఁటపై నేఁ గూచుండఁగ
సామజయానలేల సన్న సేసేరు
దీమసాన నీపట్టపుదేవులనై వుండఁగాను
ఆమనిపచ్చలవల పదేమి గారణము ॥బుద్ధి॥

1. ఎవ్వతెయున్+ఏల=ఎవ్వతానేల, వ్యావహారికపదసంధి

శ్రీవేంకటేశ నీచేయి నేఁ బట్టుకుండఁగా
వేవేల కెవ్వరికేల వేగిరములు
కైవశమై నీవు నన్నుఁ గలసి మెచ్చు మెచ్చఁగా
ఆవలివారినవ్వు లదేమి గారణము ॥బుద్ధి॥ 323

రామక్రియ

ఊరకుండుమనవే వొద్దు వొద్దు వేగిరము
వేరఁబెట్టుకొంటి నింతే ప్రియమైనవలపు ॥పల్లవి॥

తా నాకు మేలువాఁడు తనకు నే మేలుదాన
ఆనలు వెట్టఁగనేఁటి కందరిలోన
నే నెఱఁగనా తననిజము లన్నియును
నానఁబెట్టుకొంటి నింతే నవ్వులకు వలపు ॥ఊర॥

సేసవెట్టినాఁడు తాను చేఇ వట్టి పెండ్లాడితి
బాసలు సేయఁగనేలే పలుమారును
ఆసపడ్డదాన నేను అన్నిటా జాణ తాను
రాసిచేసుకొంటి నింతే రవ్వయినవలపు ॥ఊర॥

అట్టె శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
పట్టి పెనఁగఁగనేలే పంతము లిచ్చి
నెట్టన తా నన్నుఁ గూడె నేర మెవ్వరందు లేదు
గట్టిసేసుకొంటి నింతే కందువైనవలపు ॥ఊర॥ 324

రేకు 1565 ఆహిరి

నీవే దయదలఁచేవు నేను వేగిరించనేల
యేవిధాననైనా నీకు నిచ్చలాడేనా ॥పల్లవి॥

బలిమి సేయఁగనోప పంతములాడఁగనోప
వలపు నీపైఁ జల్లి వద్ద నుండేను
చలము సాదించనోప సారె వేసరించనోప
యొలమి నీకుఁ జేతులెత్తి మొక్కేను ॥నీవే॥

నేరము లెంచఁగనోప నెపములు వేయనోప
మేరతోడనే నవ్వి మెచ్చే నిన్ను
కేరడా లాడఁగనోప కెలసి జంకించనోప
కూరిమి గొసరి నీకొలువు సేసేను ॥నీవే॥

సిగ్గులు వడఁగనోప చింతించ మరియోప
యొగ్గులేక నిన్నుఁ గూడి ఇరవయ్యేను
అగ్గలమై శ్రీవేంకటాధిప నన్నేలితివి
వొగ్గి నీమాటలకెల్లా నూఁకొనేను ॥నీవే॥ 325

సాళంగం

ఇంచుకంత సిబ్బితి లేదేమే నీకు
కొంచక యొలయింతురా కొలువులో విభుని ॥పల్లవి॥

కలసేయుప్పటివేళ కాఁగిలించుకొంటగాక
మలసి చమకింతురా మగవానితో
పిలిచినప్పటివేళ ప్రియాలు సేతురుగాక
బలుములు చూపుదురా పఁ(పం?)తగానితోను ॥ఇంచు॥

చేయి చాఁచినప్పుడే సేవలు సేతురుగాక
రాయడులు సేతురా రమణునితో
ఆయములంటినవేళే అంకెకు పత్తురుగాక
కాయమ మలఇంతురా ఘనుఁడైనవానిని ॥ఇంచు॥

రతిసమయమునసే రచన చూపుటగాక
కతలు చెప్పుదురా కాంతునితో
ఇతవై శ్రీవేంకటేశుఁ డితఁడే నిన్నుఁ గూడె
తతిఁ గొసరుదురా తనకిచ్చువానిని ॥ఇంచు॥ 326

శ్రీరాగం

విన్నపము వినవయ్యా వేసరుకోకువయ్యా
వెన్న లారగించవయ్యా వెస నున్న నుండును(?) ॥పల్లవి॥

కొప్పు జారెఁగదవయ్యా కోనతిరువెంగళప్ప
ఇప్పుడే యెవ్వతె నిన్ను నింత సేసెను
పిప్పి సేసి మోవి ప్రియానసే తేనె లాని (నె?)
కప్పురము వేసుకొమ్మీ దప్పిగొనకుండును ॥విన్న॥

గోరు మేన నున్నదయ్యా కోనతిరువెంగళప్ప
యీరీతి నిన్ను నెవ్వతె ఇంత సేసెను
సారెకుఁ జెమరింపించె చన్నుల నొత్తి మేను
కోరి విసరింపుకొమ్మీ కొంచి నానకుండును ॥విన్న॥

కూడెఁగదయ్యా కళలు కోనతిరువెంగళప్ప
యీడనే యెవ్వతె నిన్ను ఇంత సేసెను
వేడుకతో నేలితి శ్రీవేంకటేశుఁడవే నన్ను
విడెము సేసి నాకిమ్మీ వేసటగాకుండును ॥విన్న॥ 327

సామంతం

ఇంతలో విచారము లిట్టుండెను
పంతాలు దున్నకముందే పంట పండెను ॥పల్లవి॥

చండి హిరణ్యాక్షునితోడ సరసములాడఁగా
అండనుండేచెలి మారుగొండ లెక్కెను
కొండుకపాయాన నొంటి గుహలోఁ గూచుండఁగాను
దుండగము సేసేవంటా తొడ యెక్కెను ॥ఇంత॥

పాడితోఁ బగర గెల్చి పారుపత్యాలు సేయఁగా
యీడనే సరిగద్దె నెదురెక్కెను
యీడులేనిదొరవై యెడ మిచ్చుకుండఁగాను
తోడివారికంటే ముందు తొడ యెక్కెను ॥ఇంత॥

వెల్లవిరిఁ [1]బ్రహ్లాదునివినుతులు వినఁగాను
వొల్లనే సంతతము నీవుర మెక్కెను
అల్లదె శ్రీవేంకటేశ అహోబలాన నుండఁగా
తొల్లిటిసీలకిమ్మ్మ తొడ యెక్కెను ॥ఇంత॥ 328

దేసాళం

అప్పటి నవ్వేవు ప్రహ్లాదవరదా
అప్పసపుకాంతల ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

కన్న విన్న సతులెల్లా కంకి సేసినా నోర్చితి—
వన్నిటా శాంతుఁడవు ప్రహ్లాదవరదా
న న్నొడఁబరచనేల నయగారిమాటల ని—
వన్నట్టే ఆయను ప్రహ్లాదవరదా ॥అప్ప॥

లాసుక యెంగిలిమోవులకు నోరు దెరచేవు
ఆసోదకాఁడవయ్యా ప్రహ్లాదవరదా
రాసికెక్కి నాచెవిలో రహస్య మానతిచ్చేవు
ఆసుద్దు లెఱఁగనా ప్రహ్లాదవరదా ॥ అప్ప ॥

1. 'ప్రహ్లాద' అనియే అంతటా రేకు.

చెం(చెం?)ది యహోబలమున శ్రీవేంకటాద్రిమీఁద
అంది పెండ్లాడితివి ప్రహ్లాదవరదా
మందెమేళమున నిన్ను మచ్చికతోఁ గొసరంతే
అందాల మెచ్చితివి ప్రహ్లాదవరదా ॥అప్ప॥ 329

లలిత

ఏల దాఁచేరు వలపు లిందరు నెరిఁగినదే
వాలాయించినపనికి వాసివంతు లున్నవా ॥పల్లవి॥

సిగ్గువడనేమిటికి చేతికి లోనై వున్నది
అగ్గలము నవ్వరాదా ఆపెతోను
వెగ్గళించి మాముందర వేసాలు చేసేవుగాక
అగ్గమై యేకతవేళ నడ్డాఁకలున్నవా ॥ఏల॥

తలవంచనేమిటికి తారుకాణై వున్నది
సొలసి నీకాంతదీరఁ జూడఁగరాదా
కొలువులోపలఁగాఁగా గుట్టు నెరపేవుగాక
మెలఁగి పానుపుమీఁద మితిమీర లున్నవా ॥ఏల॥

ఆన దాఁచనేఁటికి ఆయము సోఁకివున్నది
సేసవెట్టి కూడరాదా శ్రీవేంకటేశ
దోసము లేదంటాఁగా దొమ్మి నిందరిఁ గూడితి
లాసినయారతివేళలను పంతాలున్నవా ॥ఏల॥ 330

రేకు 1566 భూపాళం

నీ వెఱఁగనిదా యేమి నేనెంత విన్నవించే
కైవళమై వుండఁగానే గయ్యాళిఁ జేసేవు ॥పల్లవి॥

నగితేను నీతోను నఁటు నటించఁగవద్దా
మొగము చూచితేను మొక్కవద్దా
పగటునఁ బేరుకొంటే పైపై మూఁకొనవద్దా
వెగటున మమ్మేల వీరిడిఁ జేసేవు ॥ నీవె ॥

[1]మన్నించితే నీతోను మాటలాడనైనవద్దా
కన్నుసన్నలు చేసితే కరఁగవద్దా
చన్నులు నీ వంటఁగాను జంకించనైనవద్దా
ఇన్నిటా మమ్మిందుకేల యెడ్డలఁ జేసేవు ॥ నీవె ॥

చెనకఁగ నీతోను చెలిమి సేయఁగవద్దా
పెనఁగితే నించుకంత విగియవద్దా
యెనసితివి శ్రీవేంకటేశ చమ్మటూరిలోన
తనియక మమ్మునేల దఁటలఁ జేసేవు ॥ నీవె ॥ 381

ధన్నాసి

రావే యెక్కడిసుద్ది రాఁపునేతురా పతిని
సేవలు చిత్తమురాను సేయఁగదవే ॥ పల్లవి ॥

చిగురులోపలిచేఁగ చిత్తములోపలికాంత
మొగములోఁ గళలై మొలచెఁగదే
యెగసక్కెమాడెనటె యెఱఁగనటె నేను
మగనితో నలుకలు మానఁగదవే ॥ రావే ॥

పాలమీఁదిమీఁగడ పాయములోనిమదము
జాలువారీఁ జెమటలై చన్నులఁ గదే
యేల నీతోఁ జలమటె యిచ్చక మెఱఁగనటె
కాలుదొక్కి వుండఁగాను కాఁతాళించనేఁటికే ॥ రావే ॥

1. 'మన్నించితే నీతోను' అనుకారకము సరిపడినట్లు తోచదు. పాటమొదటి చరణము-నుండి కూడ 'నీవు' అధ్యాహార్యము, 'నీవు మన్నించితే' ఇత్యాది.

కనకములోనివన్నె కాఁగిటిలోనిప్రియము
కనుచూపువేడుకలై కలిగెఁగదే
యెనసె శ్రీవేంకటేశుఁ డిద్దరికిఁ జెలిఁగదే
నను పై మీరలై మీలో నవ్వఁగదరే ॥రావే॥ 332

ముఖారి

ఆఁటదాని కోపవా అంతేసి నీవు
యీటువెట్టి సలిగె నీ విచ్చినదేకాదా ॥పల్లవి॥

చలములేనిమగువ సాదించ నోపునా
వలెనని యాపె నీతో వాదించీఁగాక
బలిమి లేకుండేను పంతమాడనోపునా
కలుగఁగానే నిన్ను గద్దించెఁగాక ॥ఆఁట॥

నేరుపులేనిమగువ నీతో పొందునేసునా
చేరి యందుకొరకె చెనకీఁగాక
బీరములేసియాపె పెనఁగఁగనోపునా
ధీరత సాజముగాన దీకొనెఁగాక ॥ఆఁట॥

నసుపులేనిమగువ నవ్వ నీతో నోపునా
వొనరఁగానే చన్నుల నొత్తీఁగాక
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వెనక కిఁ(కిం?)దుకే యాపె విడె మిచ్చెఁగాక ॥ఆఁట॥ 333

సాళంగనాట

మారుమాట లాడకు రే మగుడ నాతనితోను
చేరి చెప్పినట్టెల్లాఁ జేసే నేను ॥పల్లవి॥

చలపాదితనమే సాజమైనవాఁడు
వలచితే విడుచునా వనితలను
వెలుచుఁదనాలకెల్ల వెంటపట్టయినవాఁడు
వొలిసి విరహాన కోరువఁగలఁడా ॥మారు॥

వుద్దండపుచేఁతలకే వొడిగట్టినవాఁడు
గద్దించితే మానునా కాంతలనెల్ల
వొద్దువొద్దు మాయలచే వోదికాఁడయినవాఁడు
అద్దుకొన్నప్రియాలెల్లా నాడి వొందకుండునా ॥మారు॥

తమకమే వొకరూపై తనివినొందనివాఁడు
జమళిఁ గూడకుండునా సతులఁ గంటే
అమర శ్రీవేంకటేశుఁ డన్నిటా నన్ను నేలె
సమమోహములు పైపైఁ జల్లుకొనవలదా ॥మారు॥ 834

దేసాళం

అందరి నడుగవయ్యా అదేమని
సందడి నొకరొకరు సన్నలు సేసేరు ॥పల్లవి॥

పలుమారు నీవు నాకు బాసలెల్లాఁ జేయఁగాను
నలువంకల సతులు నవ్వేరు నిన్ను
కలయ నాగుబ్బలపై గంధము వూయఁగాను
చలివాసి తామేల జాణతనా లాడేరు ॥అంద॥

అట్టె నీవు విడెమిచ్చి ఆసలు చూపఁగాను
దిట్టతనమున నదె తిట్టేరు నిన్ను
గుట్టున నీవు నాకు కొప్పు దువ్వి ముడువఁగా
పొట్టఁబొరుగున నుండి పొగడ వచ్చేరు ॥అంద॥

గక్కన నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగాను
చొక్కుచు సోలుచు వచ్చి చుట్టా లయ్యేరు
చికిలివి కడపలో శ్రీవేంకటేశ్వర నాకు
ముక్కునతో నీదిక్కు మగిడి మాచేరు ॥అంద॥ 835

## హిందోళవసంతం

వింతదాననా నేను వేమరు నింతసేయను
అంతరంగమే నేను అడ్డమాడ ననవే ॥పల్లవి॥

తలపోఁతలేకావా తమకములు రేఁచేవి
చలములేకావా మతి సాదింపించేవి
నిలువు మొక్కులేకావా నివ్వెరగుఁ బొందించేవి
అలసితి నన్నిటాను అంతకోపననవే ॥వింత॥

సిగ్గరితనమేకాదా చేతికి లోనుసేసేది
కగ్గనినవ్వులేకావా కాఁక రేఁచేవి
వొగ్గినమాఁటలేకావా వొడివట్టి తీయించేవి
అగ్గమై వుండాన నీఁక నంతకోపననవే ॥వింత॥

కందువ చూపులేకావా కాఁగిటఁ బెనఁగించేవి
సందడి వలపేకాదా చవిసేసేది
యిందుకె శ్రీవేంకటేశుఁ డింటికి విచ్చేసి కూడె
అందమాయ వేఁడుకొనీ నంతకోపననవే ॥వింత॥ 836

రేకు 1567 ## శంకరాభరణం

ఔనయ్యా మరి యడుగనేఁటికి
నాని వయసులు నయము లెచ్చె ॥పల్లవి॥

కొలువులోపల కొమ్మ మాఁటాడితే
నిలువెల్లా నిదె నీకుఁ జెమరించె
చెలు లది చూచి సిగ్గులు పడిరి
చలివాసె నేఁడు జంటవలపు ॥ఔన॥

సరసము నీతో సతి యాడితేను
గోరజాయ నీమెయి గోరిచెనకులు
పొరుగువారెల్ల పోరచి చూచిరి
తెర దీసె నిదె తెగ నాసలు ॥ఔన॥

కాఁగిటిలో నిన్ను కాంత గూడితేను
మాఁగి నీమోవి మంచితేనె చిందె
ఆఁగిరి శ్రీవేంకటాధిప సవతులె
యేఁగుఁబెండ్లి సేసె నీడనే రతులు ॥ఔన॥ 337

### కన్నడగౌళ

మన్నించుమనవే మమ్మేల పైకొనుమనీ
చన్నుల నొత్తఁగాను చలము లెట్లుండునో ॥పల్లవి॥

తప్పక తనుఁ జూచితే తనువెల్లాఁ జెమరించె
యిప్పుడే మేలమాడితే నెట్లుండునో
చిప్పిల వొద్దికి రాఁగా సిగ్గులెల్లా వెడజారె
తప్పి చేయి దాఁకితేను తమకా లెట్లుండునో ॥మన్నిం॥

మంచిమాఁటలాడితేను మనసెల్లా వెరగందె
యించుక కొంగు వట్టితే యెట్లుండునో
వంచనతో నొరసితే వలపులు చిమ్మిరేఁగె
కంచముపొత్తుకు రాఁగా కాంతు లెట్లుండునో ॥మన్నిం॥

సెలవి నవ్వు నవ్వితే చెక్కులెల్లాఁ బులకించె
యెలమిఁ గాఁగిలించితే నెట్టుండునో
అలరి శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
బలిమి సేయఁగఁ బోతే పంతము లెట్టుండునో ॥మన్నిం॥ 338

పాడి

ఇద్దరు నిద్దరే మరి యెరవులేల
వొద్దికలై లోలోన వొనరుటగాక ॥పల్లవి॥

చెలిమి సేసినమీఁద సిగ్గువడఁదగునా
కలసి కూడేటితమకములే కాక
వలపు గలిగి తలవంచుకోఁదగునా
సొలసి యట్టె యెదురుచూచుటలే కాక ॥ఇద్ద॥

సరసమాడినమీఁద జగడము దగునా
తరితీపులకు లోనై దక్కుటగాక
గొరబై వొలవుకొని కొంకు మరి తగునా
తెరదీసి వొద్దికలై దీకొనుటే కాక ॥ఇద్ద॥

కాఁగిలించుకొన్నమీఁదఁ గపటము దగునా
ఆఁగినమోవులవిందు లందుటగాక
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁ డిదె నిన్నుఁ గూడె
తోఁగుఁజెమటలతోడ తొలఁకుటగాక ॥ఇద్ద॥ 339

నాదరామక్రియ

ఏలే యిందరిలోనా యెమ్మెలేఁటికే
నీలోనివలపులు నే మెఱఁగమా ॥పల్లవి॥

తలవంచుకొనకువే తరుణి
చలములు పతితోడ జాకెలఁ బోసేవా
బలిమిఁ బెనఁగకువే పలుమారును
వలవనిబిగువులు వడ్డి కిచ్చేవా ॥ఏతే॥

వంతములాడకువే పడఁతి
సంతతపుమాఁటలసంత పెట్టేవా
యింతేసినవ్వుల నలయించకువే
బంతినే యెగసక్క్యాలపైరు వి త్తేవా ॥ఏతే॥

వేసాలు చూపకువే వెలఁదీ
పాసినకాఁకలపొందు పచరించేవా
యీసరి శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
ఆస మోవితేనెవిందు లడ్డముదోసేవా ॥ఏతే॥ 340

నట్టనారాయణి

మగవాని కలుకేల మగువలతో
చిగిరించె వలపులు చింతలేఁటికయ్యా ॥పల్లవి॥

దొంతరమాఁటలాడేది దొరకొని దూరేది
కాంతలము మా కెపుడు కలసాజమే
యెంత కెంతనుచు నీవు యెగ్గులువట్టేవు నేఁడు
వింతదానఁ గాను నాకు విడె మియ్యవయ్యా ॥మగ॥

తేరకొనఁ జూచేది తిట్టూరకే తిట్టేది
కోరి వచ్చి పైకొన్నమాగుణము లివి
యేరీతివాఁడవు నీవు యెన్నటి కెన్నటిసుద్ది
అరయ నీకు మొక్కే నండకు రావయ్యా ॥మగ॥

కందువకుఁ దీసేది కాఁకలెల్లాఁ జల్లేది
అందిపొందేమారతిఅంగము లివి
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను. నేలితివి
ముందుముందే నాకు మోవి యియ్యవయ్యా ॥మగ॥ 341

మంగళకౌశిక

గుట్టుతోడివారినేల రట్టు సేసేవు
జట్టిగొని కొసరఁగ సన్నెఱఁగవు ॥పల్లవి॥

కొమ్మ నిన్నుఁ జూచిచూచి కొప్పు దువ్వుకొనుటెల్లా
రమ్మనుటగాదా యేల రంతు సేసేవు
కమ్మర నప్పటి నీకతల కూరకుండుట
సమ్మతించుటగాదా సన్నెఱఁగవు ॥గుట్టు॥

చెలియ నీమొగమై సిగ్గువడుటెల్లాను
కలసేకొరకే కాదా కాఁతాళించేవు
పొలయుట నీముందర పొందు సేసేనని నీతో
చలపట్టుటగాదా సన్నెఱఁగవు ॥గుట్టు॥

సతి నీసంగడినుండి సరసమాడుటెల్లాను
రతికిఁ దీసుట గాదా రావా(పా?)డేవు
యితవై శ్రీవేంకటేశ యీకె యిట్టె నిన్నుఁ గూడె
చతురత లివిగావా సన్నెఱఁగవు ॥గుట్టు॥ 342

రేకు 1568 రామక్రియ

వట్టిజోలికిఁ బిలువవద్దు గాని
వట్టినవలపులెల్లాఁ బంచిపెట్టేవా ॥పల్లవి॥

కందువ నాతఁడు నిన్నుఁ గలుపల వేసితేను
యిందుముఖుల మొగము లేమి చూచేవే
పొందులకుఁ దోడువచ్చి పూఁచి పెనఁగేరుగాని
పందెము గెల్చినరతి పంచిపెట్టేవా ॥వట్టి॥

కూరిమి నాతఁడు నిన్నుఁ గొలువులోఁ దిట్టితేను
వారిజాతులకు నేల వడిఁ జెప్పేవు
సారె నతనిని మారు సాదించేరు గాని, వావి
పౌరకామినుల కెల్లాఁ బంచిపెట్టేవా ॥వట్టి॥

సంగతి నాతఁడు నీచన్నులంటి కూడితేను
సంగడిచెలుల కేల సన్న సేసేవు
చెంగట శ్రీవేంకటేశుఁ జెనకేరుగాని మేలు
పంగించక చెలులకు పంచిపెట్టేవా ॥వట్టి॥ 343

ఖుఖారి

ఇదె నీకు లాభము యెంచి చూచుకొంటేను
పదాలు వాడే నేను; భ్రమయించ కిఁకను ॥పల్లవి॥

పంత మెంత లేదు నీతో పలుమారు నాడుకొంటే
అంత నిన్ను మీర దోసమనికాక
కాంతల నాతోఁ జెప్పకు కాఁకలు వుట్టించకు
సంతోసాన నున్నదాన సమ్మతించి నేను ॥ఇదె॥

నేరుపెంత లేదు నీపై నిందలెల్లా మోపితేను
ఆరితిఁ జేయ దోసమనికాక
వారి వీరిఁ జూపకు వాసులు వుట్టించకు
కోరికతో నున్నదాన గుట్టుసేసి నేను ॥ఇదె॥

చలమెంత లేదు నీతో సారెసారెఁ జూపితేను
అలుగుంచఁ గడుదోసమని కాక
యెలమి శ్రీవేంకటేశ యెరవు సేయకు నన్ను
కలసి [1]నే నున్నదాన కాలమెల్లా [2]నేను ॥ఇదె॥ 344

## బౌళి

అట్టె ఇయ్యకోలు గొంటే నన్నియును మంచిదవును
అట్టడితనాల నేల గుట్టు సేసేవు ॥పల్లవి॥

చనవు మెరసి యాపె సంగడిఁ గూచుండేను
చెనకీనంటా నీవు సిగ్గుపడేవు
మనసు నొవ్వకుండా మాటలు నిన్నాడితేను
యెనలేనివెంగే లందు యేల పట్టేవు ॥అట్టె॥

తగులు గలిగి యాపె తలచుగా నవ్వితేను
యెగసక్కాలంటా నేల యెగ్గుపట్టేవు
మొగము చూచినందుకు ముద్దుటుంగర మిమ్మంటే
అగడాయఁ బనులంటా ఆనలు వెట్టేవు ॥అట్టె॥

ఘనమోహముతో నాపె కాఁగిలించుకొంటేను
తనువు సోదించె నంటాఁ దల వంచేవు
యెనసె శ్రీవేంకటేశ యిచ్చకము నీకుఁ జేసె
కనుచొక్కి మెచ్చి మెచ్చి కప్పుర మిచ్చేవు ॥అట్టె॥ 345

## మధ్యమావతి

ఎవ్వరిఁ గాదనఁగల వేమి సేసినాఁ జెల్లు
ఇవ్వల నాకు బాసలేల సేసేవయ్యా ॥పల్లవి॥

---

1. 2– ఈ పునరుక్తు లక్కడక్కడ గలవు. 'కలసియే యున్నదాన' అమట మేలేమో?

వరుసకు వచ్చినట్టి వనితలెల్లా నీకు
అరుదుగ మందెమేళా లాయనయ్యా
పొరుగున నుండేయట్టిపొలఁతులందరూను
మురిపేననాఁడే పెద్ద మొగమోట మయ్యా ॥ఎవ్వ॥

కొలువున నుండి నట్టికోమలు లందరును
సలిగెలఁ బెనఁగేదే సాజమయ్యా
పలువూడిగాలు సేసేభామల కందరికి
చలివాసి కూడేది [1]మజ్జాతి నీకు నయ్యా ॥ఎవ్వ॥

యెదమాట లాడేటి ఇంతులకెల్లా నీవు
కడలేనిరతులకుఁ గాణాచయ్యా
అడరి శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెడయనిచుట్టరిక మిది నాకునయ్యా ॥ఎవ్వ॥ 346

రీతిగౌళ

ఏల దూరేరే మీరు యింతులాల రమణుని
వేళ గాచుకుండితేను వేడుకేకదే ॥పల్లవి॥

నగకుండితే నేమాయ నాతితోడ వద్దనుండి
మగనిసేవ సేసితే మంచిదేకదే
జగడించితే నేమాయ సమ్మతించి వెనకను
మిగులా మేలమాడితే మేలేకదే ॥ఏల॥

మొక్కకుండితే నేమాయ ముందువెనకై నాను
మక్కువ మోము చూచితే మంచిదేకదే
కక్కసించితే నేమాయ కప్పురము చేతికిచ్చి
మిక్కిలి పెనఁగినాను మేలేకదే ॥ఏల॥

---

1. మజ్జాతి=ప్రకరణముతో వంచన గావచ్చు.

ఆడకుండితే నేమాయ అందగారిమాటలు
మాడలురాలేజంకెలు మంచిదేకదే
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనె యీపెఁ గూడె
మేడెపురతికూటమి మేలేకదే ॥ఏల॥ 347

శంకరాభరణం

ఏఁటికి భ్రమసేవే యెదురుబడి
చాటీఁ గొసరులు చన వియ్యవయ్యా ॥పల్లవి॥

సిగ్గరితనమున చిదుముడిఁ జేతులు
వొగ్గి విడెఁ(డెం?)బొసఁగవయ్యా
నిగ్గుల నూరక నిలుచున్నది చెలి
బగ్గున నీతోడపయి నిలుపవయ్యా ॥ఏఁటి॥

కొమరెతనంబునఁ గొంకుచుఁ బిలిచీ
ప్రమదంబున నిటు పలుకవయ్యా
చెమటమేనితో సెలవుల నవ్వీని
అమరఁగఁ గాఁగిట నంకించవయ్యా ॥ఏఁటి॥

వాసితనంబున వంచినశిరసున
సేసలు వెట్టీఁ జెనకవయ్యా
ఆసల శ్రీవేంకటాధిప కలసితి
యీసిరులతోనే యేలవయ్యా ॥ఏఁటి॥ 348

రేకు 1569 ముఖారి

కలది గలట్టె యీడు కాదనేమా
నిలుకడైనపనికి నీకేల వెఱవ ॥పల్లవి॥

సానఁబట్టకు చూపులు సాదించెనఁటా నాపై
అనలు వెట్టకు మరి అది దోసము
నానఁబెట్ట కంతేసి నవ్వులు నా మోము చూచి
నే నేమఁ(మం?)టిని నిన్ను నీకేల వెఱపు ॥కల॥

కోపగించ కంత నీవు కొచ్చికొచ్చి యడిగితే
పైపై సాకిరి యేల బయలయ్యీని
మోపుగట్ట కంత నీవు మొక్కులు యేకత మవునా
నీపంతము లీడేరె నీకేల వెఱవు ॥కల॥

వేగిరించ కంత నిన్ను వింతలుగాఁ బొగడితే
సాగఁబెట్టకు కొంకులు చవులు గావు
బాగుగా శ్రీవేంకటేశ పంతాన నన్నేలితివి
నీగుణము చక్కనాయ నీకేల వెఱవు ॥కల॥ 349

## సాళంగనాట

వద్దు రావయ్యా యేల వానులకుఁ బెనఁగేవు
యిద్దరూ నిట్లా నుండే యేమనఁగఁగలము ॥పల్లవి॥

చాయలకు వచ్చి సతి సరసములాడఁగాను
యీయెడఁ బరాకు నీవేల సేసేవు
చేయిపట్టు కిందాఁకా చెలిని వేఁడుకొంటిమి
చాయల వేఁడుకో నీతో సారె నిఁ(నిం?)కా వలెనా ॥వద్దు॥

యెట్టకేల కాపె నీతో నిటు మాటలాడఁగాను
గుట్టుతోడ నీవేల కొంకఁజూచేవు
మట్టున నిందాఁకా నా పెమంకులు దెలిపితిమి
తిట్టపెట్టి నీమంకు తెలుపఁగవలెనా ॥వద్దు॥

తమకించి ఆపె నిన్నుఁ దగిలి కాఁగిలించఁగా
చెమటమేనితోడ సిగ్గులువదేవు
అమర శ్రీవేంకటేశ ఆపె నింతకుఁ దెచ్చితిమి
వుమురుకూటపునిన్ను నొడఁబరచేదా ॥వద్దు॥ 350

బౌళి

ఎగ్గో తప్పో నే నెఱఁగనయ్యా
సిగ్గు విడిపించఁగాను చెక్కు నొక్కితి ॥ పల్లవి ॥

చనవు గలుగఁగాను సారెసారెఁ బెనఁగితి
ననుపు గలుగఁగాను నవ్వితిని
కనుఁగొని చూడఁగాను కదిసి కూచుండితి
మనసు నీ వియ్యఁగాను మాటలాడితి ॥ఎగ్గో॥

సన్నలు సేయఁగాను సరసములాడితి
చన్నుల గోరొత్తఁగాను సమ్మతించితి
మన్నించి నీ వంటఁగాను మంతనాన కియ్యకొంటి
యెన్నిక నీవు సేయఁగా నిరవైతిని ॥ఎగ్గో॥

కలసి మెలఁకుండఁగాఁ గాఁపురము సేసితి
చలివాయ నీమోవి చవిగొంటిని
యెలమి శ్రీవేంకటేశ యిప్పుడూనుఁ గూడితివి
తెలుపఁగ నీపట్టపుదేవుల నేనైతిని ॥ఎగ్గో॥ 351

కురంజి

అనరాదు తన్ను నేమీ నందరిలోన
చనవున సారెసారె జాణనా లేఁటికే ॥ పల్లవి ॥

నగనేలే తనకూ నాతోఁ బతి చెనకితే
యెగసక్కె లాఁటదాని కేల మానునే
మగనాలింతే తాను మానాపతితనము
తగుఁగాక యిటువంటిదంటతనమేఁటికే ॥అన॥

సన్న లేలే తనకూ సరస మాతఁ డాడితే
యెన్నికలు సవతుల కేల మానునే
చిన్నది యింతే తాను సిగ్గులు వడుతా నిట్టె
మన్ననతో నుండుఁగాక మందటాడనేఁటికే ॥అన॥

మాటలేలే తనకూ మమ్మాతఁడు గూడితేను
యీటువెట్టేది చెల్లెండ్ల కేల మానునే
పాటించి శ్రీవేంకటాద్రిపతి యిట్టె నన్ను నేలె
నాటివలె నుండుఁగాక నన్ను మీరనేఁటికే ॥అన॥ 352

ద్రావిళభైరవి

కూరిమి గొసరితేనే కోపగించీనా
మేరమీర నెగ్గు లేవి మీలోనను ॥పల్లవి॥

పంతముగొనీనా పతివి నీయడాటాన
యింతికి నీమొగమోట మెఁ(మెం?)త్తైనాఁ గద్దు
యింతలో నేల లోఁగేవు యీమాట విని యాపె
చింతతోఁ జేయెత్తి మొక్కి సిబ్బితిపడీని ॥కూరి॥

తగవుకుఁ దీసీనా తరుణి నీసుద్దులకు
మిగులఁ బ్రియములు నీమీఁదనే కద్దు
మగువ నేలంపేవు మనసు గరఁగి యాపె
తగినకానిక లంపి తమక మందీని ॥కూరి॥

వాసివంతు లెంచినా వలపులో కతలకు
సేసలు నీమీఁదఁ బెట్టి చెలిమి సేసీ
ఆసల శ్రీవేంకటేశ అంతలోఁ గూడితి వీపె
తాసువలెఁ దులఁదూఁగి తనివిఁ బొందీని ॥కూరి॥ 353

నారాయణి

ఏమని యాడుకొందురో యెప్పటితనసతులు
వేమరు నీపనులకు వింతదాననా ॥పల్లవి॥

తముల ముమియఁగాను తానేమి చూచీనే
చెమరించఁగానేల చేత నంటీనే
అమరకున్నఁ బయ్యాద అదేల చక్కఁబెట్టీనే
తమకించ నే నంతటిదాననా ॥ఏమ॥

పువ్వులు ముడుచుకోఁగా పొంచి చేయేల చాఁచీనే
నవ్వఁగా నేమిటికి సన్నలు నేసీనే
పవ్వళించితినంటాను పయినేల వొరగీనే
తవ్వేవు రతుల కంతటిదాననా ॥ఏమ॥

సురటి విసరుకోఁగా సొరిది కేల వచ్చీనే
కరఁగితేఁ దానేల కాఁగిలించీనే
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నిట్టె నన్నుఁ దానె
తరవాతిపనుల కంతటిదాననా ॥ఏమ॥ 354

రేకు 1570 కాంబోది

నే నెఱఁగఁ జెప్పరే నెలఁతలాల
తానే వేసాలు సేసీఁ దగవా యిది ॥పల్లవి॥

సొలసి సొలసి తన్ను సుద్దులు నే నడిగితే
వెలలేని నవ్వు నవ్వీ వెంగెమూ యిది
వలెవలెనని నేను వద్ద నిట్టె కూచుండితే
తలఁకుచు లోఁగిని తప్పా యిది ॥నేనె॥

పచ్చియైన తనమోవి పలుమారుఁ బొగడితే
యిచ్చగించఁ డెఁ(డెం?)తైన యెగ్గా యిది
అచ్చపుటలపు దీర నట్టె పన్నీరు చల్లితే
నెచ్చెలులదిక్కు చూచీ నేరమా యిది ॥నేనె॥

ఇడిగొన్నరతులలో సరసములాడితేను
వెడవెడగాఁ గొంకీ వెగటా యిది
యెడయక శ్రీవేంకటేశ్వరు నేఁ గూడితేను
బడివాయఁ డేపొద్దుఁ బంతమా యిది ॥నేనె॥ 355

గుండక్రియ

ఇదివో నాగుణము; యెంతకు నేరవు నీవు
పొదిగే నెంతవడైనా పొద్దువోదు నాకు ॥పల్లవి॥

చేరి నీవు నాకెంత చెప్పినట్టు సేయకున్నా
వూరకై యిచ్చకపునో రూరకుండదు
ఆరీతి బుద్ధులుచెప్ప నందరూఁ గలరు నీకు
పోరాడనేమిటికి పొద్దువోదు నాకు ॥ఇది॥

యీవల నాచెనకులు ఇయ్యకోలు గాకుండినా
సేవసేసేనాచేతులు సిగ్గువడవు
వావితో సరసమాడేవారే నీకు నూరెల్లా
పూవులు నీకు ముడిచేఁ బొద్దువోదు నాకు ॥ఇది॥

కందువ నీ విట్టే నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
విందుల నాయాసలు వీడుపడవు
సందడి శ్రీవేంకటేశ సారె నన్నుఁ గూడితివి
పొందుసుఁ దనియ నేను పొద్దువోదు నాకు ॥ఇది॥ 356

గుజ్జరి

ఏమిసేసినాఁ దగు ఇట్టె నీకును
కామినులై తేఁజాలు కై కొలుపవత్తురు ॥పల్లవి॥

చెల్లుబడిగా సుద్దులుచెలులతోఁ జెప్పేవు
కల్లలై ననీమాటలు కాదనేరా
మల్లాడి అలిగినమావంటివారినై తే
పల్లదాన నిట్టె వొడఁబరతురుగాక ॥ఏమి॥

అందాలుగానిపనులు అమరించే వప్పటిని
పొందుగా నీచేఁతలు పోఁదో సేరా
సందడలోఁ జెనకినసరసపుమమ్మునై తే
యిందమని పంతములు ఇప్పింతురుగాక ॥ఏమి॥

తగవంటా నీమేలే తారుకాణించే విదిగో
వెగటని నీవిద్యలు విచారించేరా
అగపడి శ్రీవేంకటాధీశ కూడితివి
మొగమోడేమాచేతనే మొక్కింతురుగాక ॥ఏమి॥ 357

వరాళి

ఇంకనేలే వేగిరము యెదుటనే వున్నవాఁడు
సంకెలు దీరినందుకు చలమే గురి ॥పల్లవి॥

తానే వచ్చీఁగాని తరవులు వెట్టకురే
నానినవలపులకు నవ్వే గురి
ఆనలు వెట్టఁగనేల అన్నియును నెరుఁగును
తానకమైనందుకు తాలిమే గురి ॥ ఇంక ॥

చెప్పినట్టు సేసీఁగాని చేయివట్టి తియ్యకురే
ముప్పిరిఁ గాంతలకును మొక్కులే గురి
తప్పులువట్టఁగనేల తమక మెప్పుడుఁ గద్దు
చిప్పిలుఁబొందులకును సిగ్గులే గురి ॥ ఇంక ॥

గక్కున మన్నించీఁగాని కాఁతాళించి దూరకురే
చొక్కినకరఁగులకు చూపులే గురి
యెక్కువ శ్రీవేంకటేశుఁ డీడ నన్నంటుక కూడె
దక్కి నావాఁడైనందుకు తను విదే గురి ॥ ఇంక ॥ ౬౯౪

హిందోళం

ఎటువంటివాఁడవయ్యా యెఱఁగవా నీవేమైనా
సటకానివలెనే సన్నలు సేతురా ॥ పల్లవి ॥

జవ్వనభారముచేత జడిసేటికోమలిని
రవ్వలు సేతురా రాదంటాను
నవ్వుచు సంతసముతో నగరిలో నుండఁగాను
పవ్వళించి నీవీడఁ బంతములాడుదురా ॥ ఎటు ॥

నిచ్చలపువలపున నివ్వెరగుతో నుండఁగా
పచ్చిగాఁ దిట్టుదురా పలుకదంటా
మచ్చికమగువలతో మాటలాడుచుండఁగాను
అచ్చముగా నీవువచ్చి ఆయము లంటుదురా ॥ ఎటు ॥

కలసి తమకమునఁ గరఁగుచునుండఁగాను
ములుగోరు నాటింతురా మొక్కదంటాను
అలరి శ్రీవేంకటేశ అన్నిటా నేలుకొంటివి
వెలలేనిరతులను వేసాలు నేతురా ॥ఎటు॥ 359

పాడి

ఎంత నేసే వేమోయి యెఱఁగరా ఇందరును
[1]చింతకాయకజ్జాయమై చిప్పిలీఁ దమకము ॥పల్లవి॥

పలికి యెవ్వరినైన భ్రమయించ నేరవా
వెలఁదుల నమ్మించ నీవిద్యగాదా
పలుమారు మాతోనేల బాసలు సేయవచ్చేవు
నెలవినవ్వులలోనే చేఁగలెక్కె నిజము ॥ఎంత॥

చేయిచ్చి వాడవారిని చిక్కించుకోనోపవా
చాయలు సేసుక మెచ్చ జాణవుగావా
కాయకపుననువేల కలయఁగఁబెట్టేవు
తోయరానివావులనే దొడ్డిఁ జిక్కె వలపు ॥ఎంత॥

సేసవెట్టి ఇంతులనుఁ జేరి పెండ్లాడఁ గొంకేవా
వాసులు రేఁచఁగ దేవరవు గావా
ఆసల శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
బేసబెల్లిరతులలోఁ బెంటలాయఁ గళలు ॥ఎంత॥ 360

1. 'చింతకాయకజ్జాయము' గొజ్జగ పిసికిన చింతపండు రసములో, ఉప్పు కారము వగైరా లుంచి, పుల్లలకంటించి యెండించి, రుచిరువిగ చిఱుకుట నేడును కలదు. దీనినే చింతకజ్జాయ మంటారు. సులభసాధ్య మనునర్థములో ప్రయోగింతురు, "చింతకాయలకజ్జాయముతోయము" పాండు-6-214.

రేకు 1571 పళవంజరం

అప్పుడు దామే కూడి రంతరంగా లెనసి
దప్పితోడ రమణుఁడు తమకించీ నిపుడు ॥పల్లవి॥

మొనగోరివాఁ(వ్రాఁ?)తతోడ మోమువంచి యాపె నీతో
యెనలేక మాటలాడీ నెంతవ్వదైన
పెనఁగి తాఁ గూడదు పిరితీసివుండలేదు
మనవి నిద్దరికేడ మాటలాడఁగదరే ॥అప్పు॥

కిందిచూపులతోడను కెరలుచుఁ జెమరించి
అందిచ్చీ విడెము పతి కప్పటనుండి
పొందులకుఁ బెనఁగదు పొలయక మానదు
చందముల నిద్దరికి సంతస్సము సేయరే ॥అప్పు॥

నెలవినవ్వులతోడఁ జెక్కులెల్లాఁ బులకించె
కలసి కాఁగిలించీఁ గాంతుల నీకె
యెఃమి శ్రీవేంకటేశుఁ డీపె నిట్టె యేలెను
చలివాసె లోలోనే చనవు లిప్పించరే ॥అప్పు॥ 361

ఆహిరి

ఎవ్వరిఁ బోలుదు నేను యేఁటికి శాఁతి
నవ్వుచు నాపైనేల ననుపు చల్లేవు ॥పల్లవి॥

చెలిమిసేసేవారలు సేనాసేన లుండఁగా
యెలమి నాపయ్యెద నీవేల పట్టేవు
తలపోఁత లిందరిపై తగులై వుండఁగాను
చెలఁగి నారూపమేల చిత్తానఁ బెట్టేవు ॥ఎవ్వ॥

కానుకలిచ్చేటివారు కలసి నీకుండఁగాను
ఆనుక నాచన్నుల అందుకొనేవు
వీనులు చెలులు సేసేవిన్నపాలు వినఁగాను
మానక నాతోనేల మాటలాడేవు ॥ఎవ్వ॥

కూరిమి సేసేటివారు కొంగువట్టుకుండఁగాను
గారవించి నన్ను నేల కాఁగిలించేవు
యీరీతి శ్రీవేంకటేశ [1]ఇన్ని నింపులై వుండఁగా
మేరమీరి ఇంతయేల మెచ్చులు మెచ్చేవు ॥ఎవ్వ॥ 362

బళహంస

మీకుమీరే వొకటైతే మేలుగాక
యీకడాకడివారెల్లా యెనయించఁగలరా ॥పల్లవి॥

జగడములెల్లాఁ బాసె సతితో మాటలాడఁగా
నగవులు వొడమెను నంటుసేయఁగా
చిగిరించె వలపులు సిగ్గులు విడువఁగాను
పొగరులచెలులెల్లా బుద్దిచెప్పఁగలరా ॥మీకు॥

ఆయములు గరఁగెను అట్టె తప్పకచూడఁగా
చేయిఁజేఁత మీఁదాయ చెనకఁగాను
కాయము లుప్పొంగెను కందువలఁ బెనఁగఁగా
చాయవాటుసతులెల్ల జంటసేయఁగలరా ॥మీకు॥

తమకములు రేఁగెను తలఁపు లొక్కటిగాఁగా
జమళికూటము లబ్బె చలపట్టఁగా
అమర శ్రీవేంకటేశ ఆపె నీవూఁ బొందితిరి
కొమరెవనితలెల్లఁ గొంకు దీర్పఁగలరా ॥మీకు॥ 363

1. 'ఇన్నియున్ + ఇంపులు' లో 'యు' లోపించినరూపము కావచ్చు.

ఆరిబి

అటువంటివారమే అందరము
తటుకన మమ్ము నేల తగ వడిగేవు ॥పల్లవి॥

సాదై యుండి యాపెను సవతులకని వెట్టి
సెదదేర్చి గయ్యాళిగఁ జేసితివి
సాదించి బొమ్మల నిన్ను జంకించక మానునా
దాదాత మమ్ము నేల తగ వడిగేవు ॥అటు॥

యేనెపమెఱఁగనాపె నెగ్గులెంచ నేరిపి
నానాట నిందరికి మొనవెట్టితివి
సానఁబట్టిన చూపుల సాదించవలదా నిన్ను
దానికిఁగా మమ్ము నేల తగ వడిగేవు ॥అటు॥

పీఁటపైఁ బెండ్లియాపెఁ బెద్దరికా లిచ్చి కూడి
మేఁటి కాంతల మాటలు మీరించితివి
గాఁటపు శ్రీ వేంకటేశ కత గరచె నన్నిటా
తాటించి మమ్మేల యిఁకఁ దగ వడిగేవు ॥అటు॥ 364

వేళావళి

మానుమంటే మీమాటకు మానఁబోయీనా
మోనాన నూరకుండరే ముద్దుగారీ వీఁడు ॥పల్లవి॥

వేడుకపడి వీఁడు వెన్నలు దొంగిలనీరే
వాడలవాడల నట్టే వలవనీరే
కోడెకాఁడై తిరిగీని కొంగులు వట్టఁగనీరే
జాడలెఱిఁగినయట్టిసాదుఁగొయ్య వీఁడు ॥మాను॥

చనవు మెరసీనేమో చన్నులు ముట్టఁగనీరే
తనియఁడేమో కాఁగిటఁ దగులనీరే
చెనకీనేమో మీపై చేతులు చాఁచఁగనీరే
ననిచివుండరే మీరు ననగొంటు వీఁడు ॥మాను॥

ఆసపడీనేమో తేనె కధరము లంటనీరే
పాసివుండఁజాలఁడేమో పైకొననీరే
వేసరక మిమ్మేలె శ్రీవేంకటాద్రికృష్ణుఁ డిదె
అసుద్దులెల్లా మెచ్చరే అగడీఁడు వీఁడు ॥మాను॥ 365

ఆహిరి

మమ్మునేల దూరేవే మాఁటిమాఁటికి
చిమ్మి యిట్టె చెనకఁగ సిగ్గువడఁగలమా ॥పల్లవి॥

వలసినట్టెల్లా నీవు వరము లిప్పించుకోవే
యెలమి సవతుల నీ వేలేవంటా
కలిగినట్టెల్లా నీవు కాఁపిరాలు సేయవే
వలచి నీయింటికి వచ్చినవిభునిని ॥మమ్ము॥

పెక్కుమారు లట్టె నీవు ప్రియాలు చెప్పించుకోవే
వెక్కసపుబొమ్మలతో వెలసేనంటా
మొక్కులు మొక్కించుకొని మోహములు చల్లవే
పిక్కటిల్లుఁదమకాన పెండ్లాడినవానిని ॥మమ్ము॥

పంతమువచ్చినట్టెల్లా పనులు సేయించుకోవే
చెంతల నీచెప్పినట్టె సేసేనంటా
యింతలో శ్రీవేంకటేశుఁ డీడ నిట్టె నన్నుఁ గూడె
వంతులు వెట్టవే నీవు వద్దనున్నవానిని ॥మమ్ము॥ 366

రేకు 1572 శుద్ధదేశి

తేలే వేసాలమాటలే యాఁడ నప్పటిని
పేరితనాలు నీతోఁ బెంచవచ్చేమా ॥పల్లవి॥

వున్నతి నేఁ గదిమితే వొడ్డించుకొనేవు నా-
చన్నులమొనలు నిన్ను సాదించీనా
నన్నలుసేసి తేనె జడిసే వంతటిలోనే
కన్నులకేటలు నిన్నుఁ గరఁగించీనా ॥తేలే॥

కేలెత్తి మొక్కితేను కెరలి యాన వెట్టేవు
వాలారుగోళ్లు నిన్ను వంచుకొనీనా
మేలములాడితేనే మెత్తనై వసివాడేవు
యేల మాఁటలు మర్మము లెత్తిపెట్టీనా ॥తేలే॥

యిక్కువ లంటితేను యిట్టె నన్ను దూరేవు
గక్కన కాఁగిలి నిన్నుఁ గట్టివేసీనా
తక్కక శ్రీవేంకటేశ తగిలి నన్నేలితివి
పెక్కులై నరతులెల్లా పెడరేఁచీనా ॥తేలే॥ 367

సింధురామక్రియ

ననవంటియాఁటదాని నలఁగించవొద్దయ్యా
మనసునఁ గలిగితే మన్నించేవుగాక ॥పల్లవి॥

సిగ్గులు నీమీఁద వేసి చెలి యూరకుండఁగాను
వొగ్గుచు నవ్వుమంటాను వొడివట్టేవు
నిగ్గులఁ గన్నెలనెల్లా నీవిట్లాఁ జేసితివా
బగ్గున మొగసక్కెలఁ బైకొనేవుగాక ॥నన॥

పంతము నీకప్పగించి పరాకున నుండఁగాను
    కాంతను గోరఁ జెనకి కరఁగించేవు
పొంత కొత్తజవ్వనులఁ బొందితివా ఇట్లానే
    బంతి రాజసాన రట్టుపరచేవుగాక ॥నన॥

కందువ కాఁగిటఁ గూడి కళదేరుచుండఁగాను
    అందుకొని మెచ్చుమంటా ఆనవెట్టేవు
పందెపు శ్రీవేంకటేశ పడుచులెడ యిట్టే యా—
    సందడి నీగజరులు చల్లేవుగాక ॥నన॥ 338

బౌళ

నీకే తెలుసునయ్యా నే మేమనేము నిన్ను
    రాకపోకతరితీపు రసముగారీనా ॥పల్లవి॥

కాంతతోడ వేరొకతెకతలెల్లాఁ జెప్పిచెప్పి
    బంతినే సారెకునుఁ గోపాలు రేఁచేవు
ఇంతేసి నీవు సేయఁగా యీపె నిన్నుఁ దిట్టఁగాను
    చెంతనున్న వలపులు చిగిరించెనా ॥నీకే॥

వువిదకు నీసతులవుంగరాలు చూపిచూపి
    కవకవ నవ్వుచుఁ గాఁకలు రఁ(రేఁ)చేవు
చవి నీవు వుట్టింపఁగా సతి నీతోఁ జెనఁగఁగా
    నవకపువయసులు ననలొత్తెనా ॥నీకే॥

యీసతికి వాడవారియాడులెలాఁ బెట్టిపెట్టి
    ఆస వుట్టించి కాఁగిట నానింపించేవు
బాసల శ్రీవేంకటేశ పైకొనఁగా నిద్దరికి
    పాసికూడినరతులు పంట వండెనా ॥నీకే॥ 339

భైరవి

తనకే తెలుసునే తఱవాతిమాఁటలు
చనవరినై యుంటే జాణతన మవుఁగా ॥పల్లవి॥

రచ్చలఁ దన్నుఁ బొగడి రవకత్తె నేనైతినే
యిచ్చకమే ఆడియాడి ఇట్లయితినే
పచ్చిగాఁ గొసరితేనే పంతగత్తె నైతినే
నెచ్చెలులవలె నుంటే నేరమేమి కాదుగా ॥తన॥

తనుఁ గొంగువట్టితీసి దంటదాన నైతినే
యెనసి మొక్కులు మొక్కి యిట్లయితినే
కనువిచ్చి చూచితేనే గట్టువాయ నైతినే
తనయంత నేనుంటే తప్పులేమీ లేవుగా ॥తన॥

అంది యిట్టె కాఁగిలించి ఆసకత్తె నైతినే
యిందుకు రమ్మనఁగానే యిట్లయితినే
ముందె శ్రీవేంకటేశుఁడు మోహమున నన్నుఁ గూడె
యిందరివలెనే వుంటే యెుగసక్కే లవుఁగా ॥తన॥ 370

ముఖారి

ఇందరూ నెరిఁగినందు కింత యేఁటికే
అందమైననీగుణము లవి నాకు వింతా ॥పల్లవి॥

సరసమాడేవారితో జగడా లడువనేల
తరవాత నాడేజాణతనాలేకాక
తెరమఱుఁగుకు రమ్మా తెట్టఁదెరువుననేల
గొరబైనమాటలెలా గుదిగుచ్చవలెనా ॥ఇంద॥

సేసవెట్టేవారితో సిగ్గునఁ బెనఁగనేల
వాసులతోడ శిరసువంచుటగాక
యీసరుసఁ గూచుండుమా యీడానాడాఁ బంతమేల
బాసలు సేసినవెల్లా బచారించవలెనా ॥ఇంద॥

పొందుసేసేవారితో బూటకా లేమినేల
సందుకొని రతికిఁ జేతు చాఁచుటగాక
ముందె శ్రీవేంకటేశ మోహాన నన్నేలితివి
సందడివిడే లిట్టె సారెఁ బట్టవలెనా ॥ఇంద॥ 371

గౌళ

అందుకు నేమోపము ఆపె నడుగుమనవే
సందడించి ఇందుకుఁగా చలమేఁటికనవే ॥పల్లవి॥

వుప్పటించవలదు వూడిగపువారి నింత
చెప్పినవెల్లాఁ దనకు సేయమా నేము
కుప్పించి మమ్ము నిట్టె కొంగువట్టి తియ్యఁగాను
ఇప్పుడు మాయేలికెసా నేమైననదా ॥అందు॥

సిగ్గువాపవలదు చెలికత్తెలము నేము
వొగ్గుచు నేపొద్దు వొద్దనుండేవారము
అగ్గలపుసరసా లట్టెమాతో నాడఁగాను
నిగ్గుల మమ్మంపినాపె నేరములు వేయదా ॥అందు॥

ఇంతసేయవలదు ఇద్దరివారము నేము
వింతలేక తమకెల్ల విశ్వాసులము
బంతి శ్రీవేంకటేశుఁడు పైకొని నన్నుఁ గూడఁగా
యింతకుఁ గర్తయినాపె యెగసక్కే లాడదా ॥అందు॥372

రేకు 1573 ముఖారి

నీతలనే వేగెనచే నెలఁత యీసుదులు
ఆతని ననేవుగాక ఆఁడువారు కరవా ॥పల్లవి॥

పనిగలయప్పుడే వంతములెల్లా నాడేది
పెనఁగవచ్చితే నట్టెబిగిసేది
చెనకఁజూచినవేళే చేరి జాస లడిగేది
వొనరఁ దుచ్చపువారివోజ లింతేకా ॥నీత॥

నగవచ్చినప్పుడే నంటుకొనఁ దిట్టేది
మొగము చూచినంతనే ముణిఁచేది
తగిలి వెనుకొంటేనే తరితీపు సేసేది
జగతిఁ జిత్తిణివారిసాజ మింతేకా ॥నీత॥

రతికిఁ దీసినప్పుడే రాజసము చూపేది
తతి వచ్చితేనే లోలోఁ దమకించేది
యితఁడె శ్రీవేంకటేశుఁ డిందరి మనలఁ గూడె
మితిమీరేది కాంతలమేకు లింతేకా ॥నీత॥373

కుంతలవరాళి

మాతో [1]నింతేశాల మందెమేళము
కాతరానఁ దిట్టవయ్యా గయ్యాళుల నీవు ॥పల్లవి॥

చలివాసి నీతోను సరసములాడేమా
మలసేమా మానాపతిమగువలము
కెలసి కెలసి నీవే కేరికేరి నవ్వవయ్యా
పిలిచేనీరట్టడిప్రియురాండ్లలోను ॥మాతో॥

---

1. ఇంతేని + ఏల.

పచ్చిసేసి నీపైని పంతములు నెరపేమా
యిచ్చకములాడేయట్టియింతులము
కుచ్చికుచ్చి నీకునీవే కొంగువట్టి తియ్యవయ్యా
[1]మచ్చరించేనీకాఁగిటిమంకుగొల్లెతలమా ॥మాతో॥

వాసలిమ్మంటా నిన్ను బలుములు సేసేమా
సేసవెట్టి పెండ్లాడినచెలులము
ఆసల శ్రీవేంకటేశ అంకెలఁ బెనకవయ్యా
రాసి నీతోఁ బెనఁగేటిరాఁగవనితలను ॥మాతో॥ 374

లలిత

ఇంక నేమనేము నిన్ను ఇచ్చకమాడేముగాక
[2]అంకె వచ్చెఁ బనులెల్లా అవునయ్యా ॥పల్లవి॥

సేయరానిసేఁతలెల్లాఁ జేసివచ్చి మాతోను
చాయలకు మొరఁగేవు చతురుఁడవు
పాయపువాఁడవు తొల్లె బలుదొర వందుమీఁద
చేయి మీఁదాయ నీకుఁ జెల్లునయ్యా ॥ఇంక॥

నగరానినవ్వు లాడ నగి వచ్చి మావొద్ద
సగము పంచిపెట్టేవు చతురుఁడవు
మొగమోడుదువు తొల్లె మోహా మెక్కు డందుమీఁద
చిగిరించెఁ దమకము చెల్లునయ్యా ॥ఇంక॥

మొక్కరానిమొక్కు లాడ మొక్కి శ్రీవేంకటేశుఁడ
చక్కటిల్లు చెప్పేవు చతురుఁడవు
చిక్కితివి నాకుఁ దొల్లె శ్రీపతి వందుమీఁదట
చెక్కులెల్లాఁ జెమరించెఁ జెల్లునయ్యా ॥ఇంక॥ 375

---

1. 'నీకాఁగిట మచ్చరించేమంకుగొల్లెతలు' అనుట సహజము, ప్రాసనిర్బంధము కాఁబోలు. 2. 'అంకెకు' కాఁబోలు.

బౌళి

ఆఁటదాన వవుదువే అందరిలోన
మాటలు నీతో నాడి మరిఁగేదే ॥పల్లవి॥

[1]కన్నుల నీ నవ్వులకు కలికినీచేఁతలకు
వన్నెల నీరమణుఁడు వలచెఁగదే
[2]చన్నుల నీమొనలకు చవుల నీమోవికి
పన్నినకాఁకలతోడ బాఁతిపడీఁగదవే ॥ఆఁట॥

బిత్తరినీచూపులకు పిరుఁదుబిగువులకు
బత్తినేసి వాయలేక పైకొనీఁగదే
గుత్తపుపాదములకు గొప్పతురుమునకు
మత్తిలి యేపొద్దును మరులాయఁగదవే ॥ఆఁట॥

కందువనీకాఁగిటికి గళకాంతులకును
అందుక శ్రీవేంకటేశుఁ డలమెఁగదే
పొందులజవ్వనానకు భోగపురతులకును
ముందుముందే లోలుఁడై మొక్కెఁగదె ॥ఆఁట॥ 376

రామక్రియ

ఎవ్వరివాఁడవు నీవు యిద్దరిఁ దోయఁగరాదు
పవ్వళించవయ్యా ఇటె వాపము రాకుండాను ॥పల్లవి॥

పాదపుటందెలు మ్రోయ పడఁతి నిన్నుఁ గంటానే
ఆదిగొని వచ్చె నీపై ఆస యెట్టిదో
ఆదెస వేరొకతె నిన్నట్టె యింటికి రమ్మంటా
గోదిలి కొసరుచును కొంగువట్టి తీసెను ॥ఎవ్వ॥

---

1. 'నీ కన్నులనవ్వు' అనుట సహజము. 2. 'నీచమ్మలమొన'అనుట సహజము. ఇంచుమించు ఈపాటంతా ఇట్టిపమాసాలే.

కదలుఁగుచాలతోడ గందముఁ గస్తూరి నీకు
సుదతి అందిచ్చె నెంత చుట్టరికమో
అదనెరిఁగి వొకతె అట్టె పూవు లియ్యవచ్చి
చెదరకుండాఁ బట్టి చేతులపై మొక్కెను ॥ఎవ్వ॥

తొరలిపట్టె నొకతె తురుముచెదర నిన్ను
గరిమ శ్రీవేంకటేశ కదలుమని
బెరసి నాబోఁటి దిట్టె ప్రియముననఁ బెనఁగెను
మురిపేనఁ గూడితిని మొగమోడవలసె ॥ఎవ్వ॥ 377

వరాళి

[1]మగవాఁడై తేనే సిగ్గు మానవలెనా
యెగసక్కె మవ్వ. బని యింటికి రారాదా ॥పల్లవి॥

యెందుకైనా నవ్వేవారి నెఱఁగవు తమకించి
పందెము వేయఁగానే పట్టేవు చేయి
విందువేడుకకానికి వెసలఁబెట్టినకత
యిందులోనే నెరపనేల యింటికి రారాదా ॥మగ॥

సొరది సొరణగండ్లఁ జూచేవారి నెఱఁగవు
సరిబేసి వట్టుమంటే చన్నులంటేవు
గరిమఁ బట్టినదే కందిగురుమన్న కత
ఇరవు చూపనేల ఇంటికి రారాదా ॥మగ॥

అనుక శ్రీవేంకటేశ ఆడేవారి నెఱఁగవు
కానుకలిచ్చేవేళనే కాఁగిలించేవు
మోనమున నిందరిలో ముట్టితే మాయాయఁ గత
యీనవ్వులలోఁ గంటిమి ఇంటికి రారాదా ॥మగ॥ 378

1. ఈపాటలో ప్రతిచరణమునందున మూడవపాదముపలుకుబడి స్పష్టమగుట లేదు.

రేకు 1574 గుండక్రియ

ఎదుట నున్నది యీపె యెడమాటలాడే నేను
యెదఁ గపటము మాని యేమనేవయ్యా ॥పల్లవి॥

చెలిమిసేయ నేరక సిగ్గులువడీ నింతి
పలుకనేరక నిన్నుఁ జూడీ నిదె
వలపుచల్లనేరక వద్దనే కాచుకున్నది
యెలమి నిందుకు మరి యేమనేవయ్యా ॥ఎదు॥

వొత్తి పిలువనేరక వొడివట్టుకొనీ నింతి
బత్తులు సేయనేరక పైకొనీ నిదె
తత్తరించనేరక తప్పకచూచీ నట్టె
యెత్తినమదాన మరి యేమనేవయ్యా ॥ఎదు॥

కతలు చెప్పనేరక కాఁగిలించుకొనీ నింతి
మతకములు నేరక మలసీ నిదె
రతుల శ్రీవేంకటేశ రమించితి వీపె నిట్టె
యితవాయ నీకు మరి యేమనేవయ్యా ॥ఎదు॥ 379

మేఘరంజి

చూచి చూచి మేమే తన్ను సూడులువట్టేముగాక
యేచి అందరిలోఁ దనయెన్నిక గాదా ॥పల్లవి॥

సతమాయఁ బతిపొందు సలిగెలన్నియుఁ జెల్లె
వెతదీరెఁ దనకు గర్వించవలదా
జతనాన మెల్లనే సంగడిఁ గూచుండఁజొచ్చె
అతివేడుకలు తన కవునేకాదా ॥చూచి॥

చెక్కులఁ గళలు నిండె సిగ్గులు నవ్వులఁ దేరె
    వెక్కసమై తాను విఱ్ఱవీఁగవలదా
వక్కణతో సవతులవరుసవంతుకుఁ జొచ్చె
    మిక్కుటమై తనచేయి మీఁదేకాదా ॥చూచి॥

చేవదేరెఁ గెమ్మోవి శిరసు(క్రుమ్ముడి జారె
    దేవులాయఁ దన కిదె దిష్టముగాదా
శ్రీవేంకటేశ్వరుఁడు చేరికూడె నిందరని
    కైవసమాయఁ బనులు ఘనురాలెకాదా ॥చూచి॥ 380

## తోండ

పెండిలిపీఁట యెక్కి బిగియనేల
    వండి వండనట్లాయ వట్టిప్రియాలనవే ॥పల్లవి॥

వేడుకకు వెలలేదు వెన్నెలకు గురిలేదు
    వీడె మిప్పించవే మోవివిందులాయను
యీడనే వుందాన నేను యెఱుఁగు నిన్నిఁ దాను
    కూడుమనఁగదే వాసి గోడపైపెసున్నము ॥పెండి॥

సూరియునిఁ జూడరాదు చుక్కలెల్లా నెంచరాదు
    పోరచి వెట్టించవే వొత్తు గలసె
కూరిమిసేసితి నేను కొంగువట్టినాఁడు తాను
    కోరుకోనీవే సిగ్గు గోనెమీఁది తాడు ॥పెండి॥

వావి గడిగితేఁ బోదు వల పొల్లనంటేఁ బోదు
    సేవలు సేయించవే చెలిమి గూడె
కైవశము నేను శ్రీవేంకటేశ్వరుఁడు తాను
    తావించనీవే మేలు పాలమీఁది మీఁగడ ॥పెండి॥ 381

మాళవిగౌళ

తెలుసుకొనేవు నీవు దినదినగతులను
సొలసితే నావంటిసులభము లున్నవా ॥పల్లవి॥

చనవరికాంతవల్ల సళుపుఁజూపులేకాక
పెనఁగఁబోతే నందుఁ బ్రియమున్నదా
ననుపైనకాంతవల్ల నగవే మిక్కిలిగాక
తనివోనిరతులలో దప్పిదేరనున్నదా ॥తెలు॥

జారకాంతవల్ల పొందుచవి వేగిరమేకాక
కోరినట్టెల్లా నుండ కూడనున్నదా
తేరవచ్చేకాంతవల్ల తీరుకుఁ దేనేకాక
పోరచి [1]నంకెకురాను భోగించ నున్నదా ॥తెలు॥

కొత్తయినకాంతవల్ల కొంకులు సిగ్గులుఁగాక
హత్తి సుసరాన రతి యందనున్నదా
ఇత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెత్తినసంతోసము నీ కిటువలె నున్నదా ॥తెలు॥382

ఆందోళి

ఇందరెరిఁగినపని యేల బాసలుసేసేవు
ముందుముందే ఆపెకు మొక్కవయ్య నీవు ॥పల్లవి॥

నగుతా నీవేకాదా నాతో మాటలాడఁగ
అగప డల్లంతనుండి [2]ఆపెఁ జూచెను
యెగసక్కెలు సేయక యేల మానీ నీఁక నేఁడు
మొగమోడేయట్టుగాను మొక్కవయ్యా నీవు ॥ఇంద॥

1. అంకెకు వచ్చుటకు—భోగించుటకు కాబోలు.
2. 'ఆపెయున్' లో 'యు'లోపించినరూపము కావచ్చు.

సమ్మతించి నీవు నేను చదురంగమాడఁగాను
యెమ్మెల కెరుకసేసి యెత్తు చెప్పెను
కమ్మి నిన్నుఁ దిట్టుటకు కారణ మిదేకాదా
ముమ్మాటికి సెలవు మొక్కవయ్య నీవు ॥ఇంద॥

యెలమి నీవును నేను ఇంటిలోఁ గూచుండఁగాను
తలుపు దెరచి యాపె తానే వచ్చెను
చెలఁగి పొందవలదా శ్రీవేంకటేశ్వర నిన్ను
ములువాఁడిగోరు సోఁక మొక్కవయ్య నీవు ॥ఇంద॥ 383

బౌళి

ఎంతవేగిరకాఁడవు యేమోయి
దొంతివేసా లిట్టె వెన్నెతోడఁ బెట్టరా ॥పల్లవి॥

చెక్కులు నొక్కితేనే చివుకనఁ గసరేవు
మొక్కితేనే బూతులను ముంచి తిట్టేవు
పక్కన నవ్వఁగానే పైకొని పంతమాడేవు
మొక్కళము వెన్నతోఁ బాముచుఁ బెట్టిరా ॥ఎంత॥

మొగము చూచితేనే మొనగోరఁ జెనకేవు
యెగసక్కెలాడితేనే యెమ్మెచూపేవు
పగటునఁ బెనఁగితే పట్టి సాములుసేసేవు
బిగువులు తోడంటి పేరఁబెట్టిరా ॥ఎంత॥

కదిసి పైకొంచేనే కరఁగి లోనయ్యేవు
పొదిగితేఁ గాఁగిలించి భోగించేవు
యిదిగో శ్రీవేంకటేశ యింతాఁ గలయఁగొనేవు
మదములన్నియును వుమ్మడిఁ బెట్టిరా ॥ఎంత॥ 384

రేకు 1575 ధన్నాసి

ఇద్దరికిఁ దెరవు ఊఁ గిదే కలది
వుద్దండాలకుఁ బెనఁగకుండవయ్యా నీవు ॥పల్లవి॥

సతులకుఁ జలము జవ్వనపుఁబోలము
తతి వలపులకు నుత్తమఫలము
పతికిఁ బతిగా నీవు పంతమాడ నింతయేల
రతుల గడివోకుండా రావయ్యా నీవు ॥ఇద్ద॥

చెలులకు మతిపట్టు చిత్తజునిచేపట్టు
బలులై (వై?)నఆసలకుఁ బాయనిమెట్టు
మలసి ఇందుకుఁగాను మారుకొన నీకేల
కొలఁది మిగులనుఁ జేకొనవయ్యా ప్రియము ॥ఇద్ద॥

వనితలకు మంకులు వాసులకెల్లా నంకెలు
వెనకముందరికి వేవేలు లంకెలు
ఘనుఁడ శ్రీవేంకటేశ గక్కనఁ గూడితి విట్టె
ననుపుసేసుక యిట్టె నవ్వవయ్యా నీవు ॥ఇద్ద॥ ౮౮౫

పాడి

మగవాఁడట తనఇచ్చట(లు?) మూర్కుకొనేనా; ఇందుకు
చిగిరించెను జవ్వన మీఁకఁ జెల్లుననరె తనకు ॥పల్లవి॥

అడిగితినా తను బాసలు అపుడే యేఁటికిఁ జేసీ
నొడిగితినా నేనే మాటలు నూఁటికి నొకటైనా
విడువఁడు కొంగెంతైనా వేసరుకొన్నా మానఁడు
చిడుముడిబుద్ధులు చెప్పరె చెలులాల మీరైనా ॥మగ॥

యేమాయనే తనసుద్దుల కెదురాడే వారెవ్వరు
కాముకునికి సత్యంబులు గలవా యెందైనా
చేముట్టిచ్చి విడెము సిగ్గులువడవా నెరఁగఁడు
యేమందునే మీరైనా నింటికి రమ్మనఁగదరే ॥మగ॥

మఱఁగేఁటికి విచ్చనవిడి మాన్యం బిచ్చితిఁ జేఁతలు
తఱితోడనే మన్నించీఁ దాఁదానే నన్ను
కఱితల శ్రీవేంకటపతి గక్కన నన్నిటు గూడెను
మెఱయఁగఁ బొగడరే ఇంతట మీరైనా నితని ॥మగ॥ 386

లలిత

ఇప్పటనుండి నేల యే నిన్ను వేసరించ
అప్పుడు చెప్పేనీకు నందపునాబుద్దులు ॥పల్లవి॥

నామాటలే నీకు నంటునఁ జవాయనా
కామినులమాటలెల్లఁ గాద నేవు
చేముట్టిననా సేవ చిత్తానకు వచ్చెనా
కామించినసేవలెల్లా కడకుఁ దోసేవు ॥ఇప్ప॥

నాతోడినవ్వే నీకు నయములై వుండెనా
ఆతలివారినవ్వులందుఁ జొరవు
యీతల నేనే నీకు నితవరినైతినా
యేతులవారినవ్వు లియ్యకొనే(న?)వు ॥ఇప్ప॥

నిక్కము నాకూటములే నీకుఁ బ్రియమాయనా
అక్కడిసవతులపొం దాసపడవు
వెక్కాని శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
వెక్కసపువారిఁ జూచి వెరగునొందేవు ॥ఇప్ప॥ 387

దేసాళం

చెల్లునయ్య నీవుసేసేచేఁత లన్నియు
కల్లగాదు మొక్కే నీకు కాంతుఁ రేఁగఁగాను ॥పల్లవి॥

యెగసక్కేలాడక నీవేమిసేతువయ్య మమ్ముఁ
జిగురుఁగై దువ యిఁత సేయఁగాను
నగరెక్కుకొని నీవు నవ్వు నవ్వవలదా
పగటుమాజవ్వనము పసురులెక్కించఁగా ॥చెల్లు॥

మానముపైఁ దిట్టక మరి యెన్నఁడయ్యా నీవు
పూనిననావలపు లుప్పొంగఁగాను
దానికేమి నీవు నాతోఁ దతిగొనవలదా
మోనాన నాచూపు నీపై ముడిగొనఁగా ॥చెల్లు॥

ఇట్టె నన్నుఁ గాఁగిలించకేల వూరకుండేవయ్యా
జట్టినాకోర్కులు కొనసాగఁగాను
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి మంచెములో
బెట్టగురుతులు నాలోఁ బెనగొనఁగా ॥చెల్లు॥ 888

ఆహిరి

ఇంచుకా నోరువఁజుమ్మీ యేమైనా నంటివిగాని
అంచెల నావద్దనే యాతనిఁ దిట్టేవు ॥పల్లవి॥

ఆడినమాట కుత్తర మట్టె ఇయ్యవలెఁగాక
యీాడ వచ్చి యాతనినేల దూరేవే
వాడలో నే నాతనికి వలపులసతినంటా
తోడనే నాముందర నేతులు నెరపేవు ॥ఇంచు॥

నవ్వినందు కాతనితో నవ్వు నవ్వవలెఁగాక
 రవ్వగా నాతోనేల రంతుసేసేవే
నివ్వటిల్ల నాతనికి నేనే చుట్టమనంటా
 కువ్వగా నాముందరనే కోపాలు చూపేవు ॥ఇంచు॥

చేసినచేఁత కతనిఁ జేసి చూపవలెఁగాక
 వాసితో మాఇంటికేల వచ్చి చూచేవే
ఆసల శ్రీవేంకటేశుకు పట్టపుదేవులనంటా
 మోసదీర నాముందర మొక్కులు మొక్కేవు ॥ఇంచు॥ 389

భైరవి

మేలుమే తారౌర మెచ్చితిర నే నిన్ను
 ఆలించి మన్నించు మన్నిటా నన్ను ॥పల్లవి॥

అలుకలకు మూలమా ఆయంబులఁ దేది
 చలములకు మూలమా సరియాఁకలు
పలుకులకు మూలమా పైకొనుచు నవ్వేది
 నెలవులకు మూలమా నివ్వెరగులు ॥మేలు॥

జంకెలకు మూలమా చనవు లిటు మెరసేది
 మంకులకు మూలమా మచ్చరములు
లంకెలకు మూలమా లావుననే పెనఁగేది
 అంకెరతిమూలమా అడియాసలు ॥మేలు॥

కూడుటకు మూలమా గుట్టుతోఁ గొసరేది
 వాడికకు మూలమా వసమౌటలు
యీడనె శ్రీవేంకటేశ నను నేలితివి
 జోడౌట మూలమా చూపులప్రియములు ॥మేలు॥ 390

రేకు 1576 సామంతం

చల మింతేకాక మమ్ము సారెసారెఁ బోదిగేది
వలెనంటే లోకములో వనితలు లేరా ॥పల్లవి॥

అలిగినవారితోడ నల్లి పెనఁగనేల
వెలయాండ్రు మరిలేరా వీదివీదుల
పలుకనివారినేల పలికించే వప్పటిని
కెలసేసతులు నీకుఁ గెలన లేరా ॥చల॥

వూరకున్ననారి నింత వొడివట్టి తియ్యనేల
ఆరితేరినచెలు లవ్వల లేరా
సారె నింటికాంతలను చలము సాదించనేల
తేర కాడుమగువలు దేశములో లేరా ॥చల॥

అలసియుండినవారి నాసలఁబెట్టఁగనేల
పిలిచేయింతులు లేరా పెక్కుచోట్ల
బలిమి శ్రీవేంకటేశ పైకొని నన్నేలితివి
వలచిననన్నువంటివారు నీకు లేరా ॥చల॥ 391

శంకరాభరణం

ఇంతికి నికును వాసి యీపాటి నున్నది
యెంతకు నోపవు నీవు యేమనేము నిన్నును ॥పల్లవి॥

చెక్కునఁ జేయివెట్టుక సిగ్గులువడీ నాపె
నెక్కొని సారె నాడేటినీమాఁటలకు
పక్కన నీవైతే నవ్వుఁబాట్లకు వెరవవు
వెక్కసాన వీవిచ్చనవీళ్లాయ వలపు ॥ఇంతి॥

నంటునఁ దలవంచుక నవ్వులు నవ్వీ నాపె
అంటిముట్టి చెనకి(కే?) నీయానోదాలకు
గొంటుపడి నీకైతే గుట్టించుకంతా లేదు
వెంటలై పైపైఁ బెచ్చువెరిగీ నీవయసు ॥ఇంతి॥

తెరమఱఁగున నుండి దిష్టించిచూచీ నాపె
సరసములాడేనిసరితలకు
గరిమ శ్రీవేంకటేశ కలసితి వాపె నిట్టె
యెరవులు లేక నీకు విరవాయ మనసు ॥ఇంతి॥ 392

నాదరామక్రియ

ఇంకానేల వెఱపు యీఁతకు లోఁతున్నదా
వంకలొత్తి చక్కఁజేయ వద్ద నే నుందానను ॥పల్లవి॥

చెలరేఁగి నీవింత సిగ్గులువడుదురా
వెలుచమాటల నాపె పిలువఁగాను
తలవంచుకొకువయ్యా కలసాజమే ఇది
చెలువ లెవ్వరేమనినాఁ జెప్పే నే నుత్తరము ॥ఇంకా॥

పక్కన నీవింతలోనే పరాకులు సేతురా
తెక్కుల నీకొంగువట్టి తియ్యఁగాను
తక్క కేమి నవ్వేవయ్యా తగిలెఁ దొల్లె మనసు
చిక్కినవారికినెల్లాఁ జెప్పే నే నుత్తరము ॥ఇంకా॥

సారె నీవింతలో సన్నలు సేయుదురా
గారవించి కాఁగిటఁ గలయఁగాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితి విఁ(విం?)దర నిట్టె
చేరి నీకు నాకెకును చెప్పే నే నుత్తరము ॥ఇంకా॥ 393

వరాళి

ఇప్పుడే చెప్పఁగవలె నెదలోనఁ గలమాట
తప్పకుండా బాసగొని తగిలేఁజుమ్మీ ॥పల్లవి॥

వద్దనవచ్చునా నిన్ను వడిఁ గొంగువట్టఁగాను
వొద్దిక మాటాడ కూరకుండుదుఁగాక
బద్దుల నీ విదిగాక పానుపుపైకిరమ్మంటే
పెద్దరికమన్నా [1]నను పెనఁగేఁజుమ్మీ ॥ఇప్పు॥

కోపించవచ్చునా నిన్ను కొసరి మేలమాడితే
వోపినట్టె వొద్ద నిలుచుందుఁగాక
కైపుల నీ విదిగాక కాఁగిలించుకొమ్మంటే
పైపైఁ దగదన్నా నను పదరుదుఁజుమ్మీ ॥ఇప్పు॥

తిట్టఁగవచ్చునా నిన్ను తేజాన నన్నుఁ గూడితే
యిట్టె శ్రీవేంకటేశ యెనతుఁగాక
రట్టుసేసి యిదిగాక గుట్టున నవ్వేనంటే
ఒట్లు యిదియన్నా నను దీకొందుఁజుమ్మీ ॥ఇప్పు॥ 394

దేసాళం

ఏల కోపగించుకొనే విందుకుఁగాను
తాలిమి నీమతి కిది తనివిగాదా ॥పల్లవి॥

జంగిలిసతుల నిన్ను సారెసారెఁ గూడఁగట్టి
వెంగేలు నే నాడితేను వేడుకగాదా
అంగజముద్రలు నీపై నట్టె నెలకొనెనంటే
అంగడిఁ బెద్దరికము అది నీకుఁ గాదా ॥ఏల॥

1. అన్నాన్+అను. అంతటా ఇట్లే.

కందువై నవలపులకతలలో నిన్నుఁ గూర్చి
ఇందరితోఁ జెప్పితేను ఇంపులుగావా
దిందుపడె నూరివారిలిట్లు నీకుఁ జెప్పితే(?)
విందుల నీవీనులకు వింతలుగావా ॥ఏల॥

ఆయాలంటా(ట?) సందడిలో నాఁడువారి నంటించితే
[1]పాయపునీమదానకు బలిమిగాదా
యీయెడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
లాయపురతులు నీకు లక్షణాలుగావా ॥ఏల॥ 395

గౌళ

నీవల్లనే వచ్చె నిది నే నింత నేరుతునా
చేవల్లకు వచ్చితేను శిరసెందుకు మోఁచునో ॥పల్లవి॥

చేరి నీవు చెనకఁగా సిగ్గు నేఁ బడఁగలనా
మారుకుమారు సేయక మానవచ్చునా
గోరు దాఁకించితినంటా కొసరుచుఁ దిట్టేవు
యీరీతి నీతో పొందు యేమి సేఇంచునో ॥నీవ॥

మాటలు నీవాడఁగాను మౌనము నాకుఁ గలదా
యీటుకు నేఁ బెనఁగక యెట్టు మానుదు
వాఁటమై నవ్వితినంటా వద్ది కిట్టె దగ్గరేవు
చాటి నీతో సరసము చవులెంతసేసునో ॥నీవ॥

కొంకక నీవు గూడఁగాను గుట్టు నేఁ జేయనున్నదా
అంకెల నిట్టె కాఁగిట నలరితిని
ఇంకా శ్రీవేంకటేశ యెంతకెంత జరసేవు
లంకెలసమరతుల లావు లెంతవచ్చునో ॥నీవ॥ 396

1. 'నీపాయపుమదానకు' అనుట సహజము.

రేకు 1577 గౌళ

అప్పటి నామీఁదనే యపరాధాలా
తప్పులు మోపఁగరాదా తగిలి నీమీఁదను ॥పల్లవి॥

అప్పుడు నీవాడినట్టియామాటలే నాకుఁ
జెప్పరాదా చెలులతోఁ జెలరేఁగి
ముప్పిరి నీమేననున్నమూఁకచంద్రవంకలెల్ల
రెప్పలెత్తి చూడరాదా రేసుదీర నాకును ॥అప్ప॥

[1]సేసినట్టితొల్లిటినీసేఁతలు నాకడితాన
వ్రాసుకొనరాదా యేమి వహికెక్కను
మాసీమాయనియట్టి మచ్చములు నీకుండఁగా
వేసరక నవ్వరాదా వెతదీర నాకును ॥అప్ప॥

కలిగిననీగుణాలే కాంతలతో మెచ్చిమెచ్చి
తలపోసుకొనరాదా తమితోడను
యెలమి శ్రీవేంకటేశ యిప్పుడిట్టె కూడితివి
చలము సాదించరాదా సమరతి నాకును ॥అప్ప॥ 397

సామంతం

ఏమిసేయవచ్చు నీవే యిందరికి గురైతివి
కామించినవారికి మగఁడవు గావయ్యా ॥పల్లవి॥

తడవుగాఁ జూచేయట్టితరుణులచూపులకు
యెడయక నీరూపము యెంగిలాయను
కడుగుకొంటేఁ బోదు కాంతలలోపలిబిడ్డు
వడిగా వారిచన్నులఁ దుడుచుకోవయ్యా ॥ఏమి॥

---

1. 'తొల్లిసేసినట్టిసేఁతలు' అనుట సహజము.

తలపోసేకాంతలచిత్తములకు నీయయసు
కలగఁ(గం?)పై పడిగముగతి యాయను
వెలఁచితేఁ బోదు మరి వేడుకలు మెఱుఁగెక్కు
చెలఁగి వారిమోవులఁ జికిలిసేయవయ్యా ॥ఏమి॥

దోమటినీదేవుళ్లకందుపలకాఁగిళ్లకు
ప్రేమ నీవురము పెండ్లిపీఁటాయను
ఆమని శ్రీవేంకటేశ అంటు వోదు పొరలితే
వామిగా నన్నుఁగూడితి వారిఁ బిలువవయ్యా ॥ఏమి॥ 898

దేశాక్షి

మేనవారినేల మేకులు వేసేవు
ఆనలు వెట్టకు ఆయాలంటి ॥పల్లవి॥

కూరిమిగొసరి కొంగేల పట్టేవు
ఆరితిఁ బెనఁగకు మంతేసి
వూరకే పొందఁగా నొద్దంటినా నేను
సారెకుఁ దూరకు చండసేసి ॥మేన॥

యెలయించి మాతో నేఁటికి నవ్వేవు
అలయించకుమీ అంతేసి
పలుకఁగా నీతో పంతాన నుంటినా
చలము చూపకు జాగుసేసి ॥మేన॥

యెనసి మాకొప్పు యేమి జారించేవు
అనువాయఁ బోర కంతేసి
చెనకనైతినా శ్రీవేంకటేశుఁడ
పెనఁగకు మిఁక బెండుసేసి ॥మేన॥ 899

సౌరాష్ట్రం

అంతసేసినట్టిమీఁద ఇంతసేసితే నేమాయ
దొంతినున్నవలపులు దోమటికి రావా ॥పల్లవి॥

తీపున నిండాఁకా నిన్నుఁ దిట్లు దిట్టిననోరు
చేపట్టి నీకుఁ బ్రియాలు చెప్పఁగలేదా
చాపలాన నీమీఁదఁ జాఁచి పెనఁగినచేయి
మోపుచు నొసల నీకు మొక్కనోపదా ॥అంత॥

అలుకలకు గురియై అవ్వలి మోమైనమోము
పెలుచుమోవులు విందుపెట్టఁగలేదా
మొలకపాయములను మొనచూపినచన్నులు
గిలిగింతరతులను కిందుపడనోపవా ॥అంత॥

సారెసారె సణఁగుల జంకించినట్టికన్నులు
నారుకొన్న వేడుకల నవ్వఁదగదా
యీరీతి శ్రీవేంకటేశ యింతి నీవురము యెక్కి
నేరుపులరతులను నిన్నిట్టె మెప్పించదా ॥అంత॥ 400

గుజ్జరి

నే నెంత వోరుచుకొన్న నీ వెఱఁగవు
కానీరా అందుకేమి కడఁబడెనా ॥పల్లవి॥

చలపాదితనమా సారె పైఁబడవచ్చేవు
నిలుచుండఁగానే నానీడ దొక్కేవు
బలిమి వేరొకతై తే పంతమున నీచేఁతకు
తలవట్టి తీసి నోటఁ దమ్మ పెట్టదా ॥నేనెం॥

గటువాయతనమా కాలు మీఁద వేసేవు
గట్టినాచన్నుల చిప్పగతు లాడేవు
రట్టడివైయున్నదైతే యిట్లై నిన్నుఁ జెప్పరాని—
తిట్టు దిట్టి కళలంటి దిమ్ము రేఁచదా ॥నేనెం॥

కతకారితనమా కాలు మీఁద వేసేవు
రతిలో శ్రీవేంకటేశ రాయడించేవు
ఋతరులైతే నిన్ను యీచేఁతకు కొంగువట్టి
బతిమి నానలువెట్టి పంతములు గొనదా ॥నేనెం॥ 401

కాంబోది

నీచేఁతలోనిదాన నిన్ను వేఁడుకొనే నిదె
కాచెఁ బూచెఁ గోరికలు కలపకు సిగ్గులు ॥పల్లవి॥

నవ్వులు నే నవ్వితేను నన్నేల యానవెట్టేవు
చివ్వన మతిలోమాఁట చెప్పుమనుచును
వువ్విళ్లూరించకుమంత వొద్దు దోసము లేదను
జవ్వనము సరిదాఁకె సాదించకు చలము ॥నీచేఁ॥

సరసములాడితేను సరిఁ గొంగేల పట్టేవు
తరవాతఁ గొనగోరు దాఁకెననుచు
గొరబు సేయకు మమ్ము గుట్టున నుండఁగనిమ్ము
దొరతనము లిడేరె తొక్కకు నాపాదము ॥నీచేఁ॥

మొగము నేఁ జూచితేను మొక్కలేల మొక్కేవు
పగటుఁ గూరిములు పైఁబారె ననుచు
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
బిగువుఁగాఁగిలి నిట్టె పిసుకకు చన్నులు ॥నీచేఁ॥ 402

రేకు 1578 భల్లాటి

నీనేరుపు చూతము నిండుసాము సేతము
పూని చెక్కులను గోర పొందుగాఁ వ్రాతము ॥పల్లవి॥

కప్పురవిడెము దేవే కై దండ నాకు నీవే
దప్పిదేరిచేఁ గాని దగ్గరి రావే
తప్పకేమిచూచేవే తాలిమెల్లాఁ దెచ్చుకోవే
వొప్పుగ పూవులవాటు వొడ్డుకోవే ॥నీనే॥

గందము నాకుఁ బూయవే కరము పైవేయవే
అందుకేమి నాచెప్పినట్టు సేయవే
అంది చన్నుల రాయవే ఆస వెన్నెల గాయవే
గొందినున్న నీపయ్యెదకొంగు దియ్యవే ॥నీనే॥

కమ్మి కాఁగిట నించవే కడుసిగ్గులు దించవే
తమ్మిలమిడిలి నీకఁ దలవంచవే
కమ్మర శ్రీవేంకటాద్రిఘనుఁడ నన్నేలితివి
రమ్మనుచు; నాతోడిరతి పెంచవే ॥నీనే॥ 408

గామక్రియ

అందుకేమి దోసమా అన్నియు నే నెఱఁగనా
చెందివున్న దాన నెట్టుసేసినాఁ జేయవయ్యా ॥పల్లవి॥

పిలిచితేనే పతులు పెనఁగఁగఁజూతురు
అలిగితే మొక్కుదురు అతివలకు
కలయఁగఁజూచితేను కడుఁ గిందుపరతురు
చలము సాదించితేను చనవిత్తురు ॥అందు॥

నగితేనే సారెసారె నాలిసేయఁజూతురు
పగచాటితే నట్టె పైకొందురు
తగుల మాటాడితేను తప్పు లెంచఁజూతురు
మొగము చూచి తిట్టితే మోహింతురు ॥అందు॥

వలపు పైఁజల్లితేను [1]పట్టారడిఁ బెట్టుదురు
అలరి సిగ్గున నుంటే ఆసగింతురు
కలసితి విటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
యిలలో మనపొందుల కిందరును మెత్తురు ॥అందు॥404

ఆహిరి

నీవే యానతీరాదా వీనుల నే వినేఁగాని
మావంటివారికి మాటయేదయ్యా ॥పల్లవి॥

కన్నులఁ దిట్టితే నీపై కాఁతాళ మందువు
చన్నుల నొత్తితే నీతో చలమందువు
యెన్నిచూచితే నీపొందు యెందుకైనా వచ్చునిఁక
కన్నెలైనవారికెల్లా గతి యేదయ్యా ॥నీవే॥

వచ్చిరాకవుండితే వాసికత్తె యందువు
చొచ్చి మాటాడితేనే యాసోదమందువు
రచ్చలవేసితే నీకత [2]రంటికిని గురియౌను
మచ్చిక నీలేమలకు మనువేది యిఁకను ॥నీవే॥

1. పట్టి+అరడిన్.
2. 'రండు' రెండుకు రూపాంతరము కావచ్చు. ఔపవిభక్తికము. చూ: 417 పాట 20 వసంపుటము 'రెడ్డి-రడ్డి' కూడ అంతే. "రడ్డులు నడచిరి పురస్సరద్వార్యము గా" పాండురంగమాహాత్మ్యము:- 3-75.

నెమ్మది నూరకుండితే నేర దిది యందువు
కమ్మరఁ గొంగువట్టితే గయ్యాళందువు
ఇమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సమ్మతించేచెలులకు చనవేది యిఁకను ॥నీవే॥ 405

మాళవి

ఎందాఁకా బుద్దిచెప్పే విప్పుడు మాకు
ముందరనే వున్నదాన ముట్టుకోకు మమ్మును ॥పల్లవి॥

నేరువరులైనవారు నీతోఁ బొందుసేసేరు
నేరనివారు గలితే నిండుకుండేరు
దూరనేల పోరనేల తొల్లె నీయింటిలోన
సారె జరయకు నన్ను జారుఁగొప్పుదానను ॥ఎందాఁ॥

పాయరానియట్టివారు భ్రమసి లోనయ్యేరు
చాయపాటువారెల్లా చక్కనుండేరు
రాయడేల రంతులేల రతికెక్కి పానుపుపై
చేయి చెక్కునఁ బెట్టుక సిగ్గుతో నుండానను ॥ఎందాఁ॥

మునుపవచ్చినవారు మొక్కలానఁ గూడేరు
వెనకవచ్చినవారు వేరే కూడేరు
యెనసితివి శ్రీవేంకటేశ యింతలోనె నన్ను
తనిసి నే నున్నదాన తక్కించకు మిఁకను ॥ఎందాఁ॥ 406

రామక్రియ

ఏల లేదనేవు నాతో యిట్టె మచ్చము లుండఁగా
పోలించి యాపె నిన్ను బొంకుమనఁబోలును ॥పల్లవి॥

అదె నీపాదాల నంటె నతివకస్తూరిబొట్టు
మొదల నీకేమిటికో మొక్కఁబోలును
కుదురుగుబ్బలమీఁదికుంకుమ నీమేన నంటె
కదిసి నీవుర మిట్టె కాఁగిలించఁబోలును ॥పల॥

వంచినశిరసుపై వాడుఁబూవులెల్లా రాలె
కొంచక రతుల నిన్నుఁ గూడఁబోలును
నించినసీచెక్కులపై నెరసెఁ దమ్ములమటు
మంచులకళలు రేఁగ చుంబించఁబోలును ॥పల॥

వొళ్లఁబూసినపసుపు వొద్దిక నీమేన నంటె
చెల్లుబడి నీతో సాము సేయఁబోలును
యెల్లగా శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చల్లఁగా నీకు వావె సన్న సేయఁబోలును ॥పల॥ 407

శంకరాభరణం

ఇంతట నున్నార మిదియె చాలును
యెంతసేసినా నెఱఁగేవా ॥ పల్లవి ॥

వాలుకచూపులు వసమై యాకెకు
కేలుచాఁచి తమకించేవు
యేలాగుల నే మెట్లఁ బొదిగినా
మేలుమేలనుచు మెచ్చేవా ॥ఇంత॥

పలుకుఁదేనెలకు భ్రమసి యాపెకును
వలచి నీశిరసు వంచేవు
పిలిచి నే మిపుడు ప్రియములు చెప్పిన
తలఁపులోపలను తగిలీనా(లేవా?) ॥ఇంత॥

నిండుఁగాఁగిటను నిలిచి యాపెతో
అండనె సరసములాడేవు
పండె శ్రీవేంకటపతి నాభాగ్యము
దండిగఁ గూడితి తనిసేవా ॥ఇంత॥ 408

రేకు 1579 శుద్ధవసంతం

ఏఁటికిఁ గొంకేవు నీవు యెవ్వరున్నా రీడను
నాఁటుకొన్న మోహములు నడపరాదా ॥పల్లవి॥

వాలుకచూపులయాపె వంచివంచి మాటాడఁగా
నాలిసేసి నీవేల నవ్వే వీడ
బేలవై; యేకతానకుఁ బిలిచి మాటాడరాదా
యీలాగుల మీకోరిక లీడేరీఁగాని ॥ఏఁటి॥

చనుమొనలు చూపుచు సరసములాడఁగాను
నినుపునిట్టూర్పులేల నించే వీడ
మనసు గరఁగెఁ దొల్లె మన్నించి కూడఁగరాదా
వెనకటిసిగ్గురె(లె?)ల్లా వీడీఁగాని ॥ఏఁటి॥

పంతము నెరపి కొంగువట్టి యాపె దియ్యఁగాను
చెంత నాపైఁ జేయిదాఁచి చెనకే వీడ
వంతుకు శ్రీవేంకటేశ వడి నన్ను నేలితివి
చింత వాపరాదా తానే సెలవిచ్చీఁగాని ॥ఏఁటి॥ 409

ఆహిరి

మంకుఁదన మేదే నాకు మగువలాల
అంకెకుఁ దా నెట్టు చెప్పె నట్టుసేసెనే ॥పల్లవి॥

కపటమున్న దా నాకుఁ గడునెంతై నాఁ దనపై
అపుడే మరచితి నే నట్టికోపము
వుపమలఁ దా నేఁటికి నొడఁబరచీనే నన్ను
తపముతో నున్న దాన తనకొరకే ॥మంకు॥

చలము సాదించేనంటే సారెసారెఁ దనతోను
చెలఁగి తనవోజలు చెప్పితి నింతే
పలుమారుఁ దా నేఁటికి పంతము లిచ్చీ నాకు
వలచి యెప్పుడుఁ దనవసమై యుందానను ॥మంకు॥

కాదనేనంటే తన్ను కాఁగిలించి కూడె నన్ను
సోదించి చూచితి నాఁడే సొంపులెల్లాను
యీదెస శ్రీవేంకటేశుఁ డింతగా మన్నించె నన్ను
మోదముతో నున్న దాన మొదలనుండియును ॥మంకు॥ 410

## పాడి

ఏఁటిమాటలాడేవు యేల దూరేవు
నీటులు మెరసెనా నేఁడు మాచెలి ॥పల్లవి॥

ననుపుగలుగుచోట నవ్వే నింతేకాని నిన్ను
వనిత కెగసక్కెమా వడి నీతోను
పెనఁగులాటవేళ కొనగో రంటించెఁగాక
నినుఁ బగసాదించెనా నేఁడు మాచెలి ॥ఏఁటి॥

పట్టి మేనవావిచోట బలువు మెరసెఁగాక
రట్టుసేసునా రామ ఇట్టె నిన్నింత
చుట్టమవంటా నిన్ను సొలసె నింతేకాక
తిట్టులు నిన్నుఁ దిట్టునా తెగి మాచెలి ॥ఏఁటి॥

కూటమిగలుగుచోట గురుతులు నించేఁగాక
యీటునఁ బచ్చిసేసునా యింతి నిన్నును
గాఁటాన శ్రీవేంకటేశ కాఁగిలించేఁగాక యీపె
నాఁటిమాఁట కింతసేసునా మాచెలి ॥పఁటి॥ 411

కాంబోది

ఇందరికి దిష్టము యీపనులు
సందడించీ లోలోన సకలమర్మములు ॥పల్లవి॥

మనసే మర్మము మచ్చికలకెల్లాను
తనుసోఁకులే మర్మము తనివికిని
చెనకులే మర్మము చెలరేఁగివున్నందుకు
కనుఁగొనరే యిద్దరికతలూఁ గానవచ్చె ॥ఇంద॥

నగవులే మర్మము ననుపులకెల్లాను
మొగమోటమే మర్మము ముదములకు
బిగువులే మర్మము పెడరేఁచేపనులకు
తగవు చెప్పరే వీరితమకము నిండెను ॥ఇంద॥

కోరికలే మర్మము కూటములకెల్లాను
మేరమీరుటే మర్మము మేకులకును
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
తేరుచరే తమమేలు తేటతెల్లమిగను ॥ఇంద॥ 412

సామవరాళి

ఏల వేగిరపడీని యెఱఁగఁడా తానేమి
పోలించి యిందాఁకాఁ దన్ను బోధించవలెనా ॥పల్లవి॥

మనసునఁ గలితేను మరి ఖాససేయనేల
పెనఁగఁ జోటు గలితే ప్రియములేల
తను నమ్మివున్నదాన తగవు దానే యెఱుఁగు
వెనకఁ దగిలి యింక విన్నవించవలెనా ॥ఏల॥

వలపు గలిగితేను వాడవారిసాకిరేల
నిలుకడ గలచోట నేరుపులేల
కలసివుందాన నేను కైకొన్నాఁడు తొల్లె తాను
సొలసి సొలసి యింకాఁ జొక్కించవలెనా ॥ఏల॥

వేడుకకుఁ బెండ్లాడి వేరేవావి చెప్పనేల
యీడుజోడై వున్నచోట యెన్నికలేల
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బునఁ దానే నన్ను
మేడెపురతుల నింకా మెప్పించవలెనా ॥ఏల॥ 418

నారాయణి

ఆతఁడు గలితేఁజాలు అన్నిపనులను మేలే
యీతల నిన్ను జరయనేఁటికమ్మా మాకు ॥ పల్లవి ॥

చలముగలవారిని సమ్మతించఁ జేయరాదు
సలిగెగలవారిని సాదించరాదు
కలిమిగలవారిని కాదుగూడదనరాదు
యెలమి నీతోడివాదు లేఁటికమ్మా మాకు ॥ఆతఁ॥

నాలితో నుండేవారి నవ్వించఁ జేయరాదు
గేలిసేసేవారిని గెంటించరాదు
మేలమాడేవారిని మేరలు మీఱఁగరాదు
యీలీల నిన్ను జంకించనేఁటికమ్మా మాకు ॥ఆతఁ॥

మౌనాననుండేవాఁని మాటలాడించఁగరాదు
నానాగుణము వారి నమ్మించరాదు
పూని శ్రీవేంకటేశుఁడు పొసఁగ నన్నేలె నిదె
యేనెపాలు వేయ నీతోనేఁటికమ్మా మాకు ॥అత॥ 414

రేకు 1580 కేదారగౌళ

ఎందాఁకాఁ గాచుకుండు నేవనిత వచ్చునో
చెందినవుపకారము చేకొనవయ్యా ॥పల్లవి॥

గట్టిచనుఁగవ నిట్టె కానుకియ్యవచ్చె నాపె
చుట్టపువరుసమేలు చూపవచ్చెను
వెట్టదీర మోవితేనె విందుచెప్పవచ్చె నాపె
గుట్టుతోఁ బొడచూపించుకొనఁగదవయ్యా ॥ఎందాఁ॥

చిక్కనిజవ్వనరాజ్యసీమ న(ని?)న్నేలించవచ్చె
పెక్కుత(వ?)లపులు వెదవెట్టవచ్చెను
ఇక్కువనేత్రచకోరా లింపులు చూపఁగవచ్చె
అక్కజాన నన్నిఁ జూచి ఆదరించవయ్యా ॥ఎందాఁ॥

కాఁగిటిసమ్మంధము కలయఁ జెప్పఁగవచ్చె
చేఁగదేర సేవలెల్లఁ జేయవచ్చెను
వీఁగక శ్రీవేంకటేశ వేడుక నన్నేలితివి
ఆఁగి రతిఁ దమకించీ నలపుదేర్పవయ్యా ॥ఎందాఁ॥ 415

హిజ్జిజి

ఎఱఁగనట్టే వున్నాఁడ వేమీ నీవు
నెఱయఁ దెరమఱఁగు నీవే తేరుచుమీ ॥ పల్లవి ॥

నెలఁతలిద్దరసంది నిజము నిన్నుఁ గోరితే
మలకలమలకల మాటలాడేవు
కలది గలట్టె చెప్పు కాఁపురము నిన్ను మోఁచి
తెలిసి కాంతలవాదు తేరుచుమా నీవే ॥ఎఱఁ॥

సవతుల కాంతాలజాడలు నిన్నడిగితే
నవకపుసెలవుల నవ్వు నవ్వేవు
వివరించు తప్పొప్పులు వేడుకలు నీసొమ్మే
తివిరి పాడిపంతాలు తేరుచుమా నీవే ॥ఎఱఁ॥

సరిఁ బెండ్లికూఁతులను సంతముసేయుమంటే
శిరసెత్తి చూచి చూచి సిగ్గువడేవు
నిరతి శ్రీవేంకటేశ నేరుపెల్లా నీవాళ్లిదే
తిరమై నన్నేలితివి తేరుచుమా నీవే ॥ఎఱఁ॥ 416

లలిత

ఎవ్వరెవ్వరితలఁపు లెట్లున్నవో
యివ్వల నాకుఁ దెలియ దేమనేవ(న?)య్యా ॥పల్లవి॥

మచ్చరము గలితేను మనసు లొక్కటిగావు
కుచ్చితము గలితేనే గుణములేదు
తచ్చనలు గలితేను దైవారదు నిజము
యిచ్చట నన్నుఁ జెనకే వేమనేనయ్యా ॥ఎవ్వ॥

వాసివంతులు గలితే వలపు చవివుట్టదు
ఆసలే పెక్కుగలితే [1]ఆతుమారదు
రేసులు గలిగితేను రేపుమాపు నలపులే
యీసరి నన్నుఁ బొదిగేవే మనేనయ్యా ॥ఎవ్వ॥

1. ఆతుమ+ఆరదు.

బిగువు గలిగితేను బీరమెంతటాఁ బోదు
నగవు గలిగితేను ననుపు లవును
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
యెగసక్కెలెల్లాఁ బాసె యేమనేనయ్యా ॥ఎవ్వ॥ 417

తోండి

ఎందు వోయే నేను ఇక్కడనే వున్నదాన
అందుకోలువలపులు అనుచరించరాదా ॥పల్లవి॥

ముప్పిరి మాతో నీవు ముచ్చటలాడవచ్చేవు
కప్పురమిచ్చినయాపె కాచుకుండఁగా
అప్పటి వచ్చినపని అడుగరాదా ఆపెను
చిప్పిల వెనక నన్నుఁ జెనకేవుగాని ॥ఎందు॥

సారెకు నాతో నేమి చదురంగాలాడేవు
కోరివచ్చినాపె వొద్దఁ గూచుండఁగా
సైరణతో నీ వాపెచనవు చెల్లించరాదా
గారవించి మరి నన్నుఁ గదిసేవుగాని ॥ఎందు॥

కందువతో నన్ను నెంత కాఁగిలించుకొనే విటు
సందడిఁ బెండ్లాడి నాపె సన్న సేయఁగా
వొందిలి యాపెను నీవు వొడఁబరచఁగరాదా
ఇందు శ్రీవేంకటేశ నన్నెనసేవుగాని ॥ఎందు॥ 418

దేసాళం

ఆయనాయ నుండవయ్య అన్నిటా నేరుపరివి
పాయము పెచ్చువెరిగీఁ బలుకులలోనను ॥పల్లవి॥

గందపుఁబూఁతబేంట్లు కస్తూరివాట్లు
చిందిచింది రాలిరాలి చిట్లఁజొచ్చె
యెందాఁకా నవ్వు నవ్వే విందరుఁ జూచేరు నిన్ను
చెం(చిం?)దీఁ జెమటలు నీచెక్కులవెంటాను ॥ఆయ॥

మించుఁగొప్పువిరులు మెడనున్న సరులు
పొంచిపొంచి చెదరుచుఁ బొనుఁగఁజొచ్చె
యెంచరానిమాటలెల్ల యెందాఁకా నాదేవు
ముంచీ నిట్టూర్పులు ముక్కునిండాను ॥ఆయ॥

కంకణాలమోఁతలు కాఁగిటిలోఁచేఁతలు
పొంకపుశ్రీవేంకటేశ పొలయఁజొచ్చె
కొంకక నన్నేలితివి గుటెందాఁకాఁ జేసేవు
అంకెలఁ దేనెలుగారీ నధరమునిండను ॥ఆయ॥ 419

బౌళి

నీకు దేవులను నేను నేరమెంచేనా
పైకొని నాయంత వచ్చి బలిమిచూపేనా ॥పల్లవి॥

పక్కన నాతో నీవు పంతములు నెరపినా
నిక్కినిక్కి చూతుఁగాక నిన్ను దూరేనా
వెక్కసపుసతులను వేవేలు దెచ్చినాను
మొక్కులే మొక్కుదుఁగాక ముంచి కోపించేనా ॥నీకు॥

ఆరడిఁబెట్టి నన్నెంత అల్లి మాటలాడినాను
తేరకొనఁ జూతుఁగాక తిట్లు దిట్టేనా
బీరాన మాతో నెంత పెనఁగులాట లాడిన
చేం పొగడుదుఁగాక చిక్కులఁబెట్టేనా ॥నీకు॥

గచ్చులకు నన్ను నెంత కాఁగిట బిగించినాను
పెచ్చువెనఁగుదుఁగాక పిరితీసేనా
ఇచ్చట శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
మచ్చికై వుందుఁగాక మఱచేనా మేలు ॥నీకు॥420

1581నుండి 1590వరకు గల 10రేకులు లేవు.

రేకు 1591 దేవగాంధారి

అన్ని తగవులు నీయందే వున్నవి
యెన్నికవిచారము లేమిటికి నీకు ॥పల్లవి॥

మునుపఁ గప్పురమిచ్చి ముదిత గాచుకుండఁగ
వెనక విడెమిచ్చినవెలఁదితో నవ్వేవు
చెనకేయక్కకంటెను చెల్లెలే ప్రియముగాదా
యెనయఁ బెద్దతనము లెవ్వరికి బాఁతి ॥అన్ని॥

పంతాన సేవసేసేటిపడఁతి పక్కనుండఁగ
చెంతనే మొక్కులు మొక్కెచెలిపైఁ జేయి చాఁచేవు
పొంతనున్నసతికంటె పొరుగాపె చవిగాదు
[1]యెంత నేసేవినయాలు యెవ్వరికి బాఁతి ॥అన్ని॥

సరసమాడేయాపె సంగడినే వుండఁగాను
వొరసి పెనఁగేనన్ను నొగిఁ గూడేవు
గొరబై శ్రీవేంకటేశ కొసరునే మేలుగాదా
యెరవులపాఁతవల పెవ్వరికి బాఁతి ॥అన్ని॥ 421

శుద్ధవసంతం

పడఁతివలపులెల్లా బయటఁబడెను నేఁడు
కడలేనిప్రియముతో కాఁగిలించవయ్యా ॥పల్లవి॥

1. ఎంత=ఎంతగానో అనునర్థమున వాడినట్లుంది.

సతిచెమటలేరులు చన్నులవెంటఁ గారఁగాఁ
దతితో సిగ్గులువడీఁ దా నిన్నుఁ జూచి
మతిలోఁ బరవశాలు మచ్చికలుఁ దొట్టఁగాను
రతిఁ దేలగిలఁ జూచీ రవ్వగా కన్నులను ॥పడఁ॥

చెలియ సంతోసాలు చేరి మోమునఁ దేరఁగా
తలవంచుకొని చూచీ తనదిక్కు
నెలవుల నగవులు చిందుచుఁ జిమ్మిరేఁగఁగా
నిలువుటద్దముదిక్కు నీడలుచూచీని ॥పడఁ॥

అంగన, తమకములు అట్టె పైపైఁ బెనఁగఁగా
కంగులేక చూచీ నీకాఁగిటిదిక్కు
ముంగిట శ్రీవేంకటేశ ముందు నీవు గూడఁగాను
పంగెనలేనిచనవు భావించి చూచీని ॥పడఁ॥ 422

ఆహిరి

అందువంకనైనఁ గొంత అసిఁబోవుఁ దమకము
చందురునివంటిమోము చక్కఁ జూడవయ్యా ॥పల్లవి॥

సముకాన నాపె నిన్ను సారెసారె దూరఁగాను
చెమరించి చెక్కుచేతఁ జింతించేవు
చిమిడీ వలపులెల్ల చిత్తములోనే నీకు
అమర మాటకుమాట లాడవయ్యా ఇఁకను ॥అందు॥

చేరిచేరి సణఁగుల చేతులు పైచాఁచఁగాను
వూరకే తలవంచుక వున్నాఁడవు
పేరుకొని మేనిమీఁద పెనుజవ్వనమదము
వారుకొనె నెలవుల నవ్వవయ్యా ఇఁకను ॥అందు॥

పూవులచెండున వేసి పొందు లావె దెలుపఁగా
శ్రీవేంకటేశ్వర నీవు సిగ్గువడేవు
యీవేళనే కూడితివి యిద్దరిచేసలు నిండె
చేవదేరఁ గతలెల్లాఁ జెప్పవయ్యా యిఁకను ॥అందు॥ 423

ఆహిరినాట

ఊరకే లోనౌదువా వుడబడివారికెల్ల
మేరమీరి యావెనే మెచ్చవలెనయ్యా ॥పల్లవి॥

మెల్లనిమాటలాడి మెలుఁత నిన్ను భ్రమించె
చల్లనినవ్వులు నవ్వి సాదించెను
మొల్లలతురుము చూపి మోహాములు చిమ్మిరేఁచె
చెల్లునయ్యా ఆవె యేమిసేసినాను నిన్నును ॥ఊర॥

సోయగపుచూపు చూచి సుదతి నిన్నుఁ జొక్కించె
ఆయాలు చన్నులనొత్తి ఆసరేఁచెను
పాయపుమదము చిమ్మి భావమెల్లాఁ గరఁగించె
నీయంతవాని నావె నేర్చునయ్యా పొందను ॥ఊర॥

వేవేలు చేఁతలు చేసి వెలఁది నిన్ను మెప్పించె
చేవదేరేరతులను చిక్కించెను
యీవేళ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
ఆవేళ కావె రాజు అవునయ్యా నీకును ॥ఊర॥ 424

వరాళి

ఎవ్వరిముందరఁ జేసే విట్టె వట్టిసటలెల్లా
నివ్వటిల్ల నీవిద్యలు నే నెఱఁగనా ॥పల్లవి॥

మొగమోటలేక యెంతమొక్కలాన నాపె నిన్ను
యెగసక్కెలాడినా నీ కింపులేకావా
తెగువలుమీర నట్టె దిమ్మరితనములను
నగినా నీ కపియెల్లా ననుపేకావా ॥ఎవ్వ॥

బలువుగాఁ దా మెరలఁబట్టి నీమేను దాఁకఁగ
చలమున వేసినాను చవులేకావా
కొలఁదిమీర నీచెక్కు కొనగోరిముద్రలు
వెలయఁగ గీరినాను వేడుకలేకాదా ॥ఎవ్వ॥

గుట్టుతోడ నీవురము గొప్పగొప్పచన్నులను
గట్టిగాఁ దాఁకించిన నీఘనతేకాదా
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మెట్టి యాకె నిన్నేలిన మేలేకాదా ॥ఎవ్వ॥ 425

హిందోళవసంతం

ఎంతచుట్టమో నీకు నిదివో ఆపె
సంతసపువలపుల జడిసీ నాపె ॥పల్లవి॥

తేనెగారేపెదవుల తేటమాఁటలాడీ నాపె
నానఁబెట్టి సెలవుల నవ్వీ నాపె
సానఁబెట్టినచూపులు జళిపించీ నీపై నాపె
మోవముతో బొమ్మలను మొక్కీ నాపె ॥ఎంత॥

నిండుఁజెక్కుటద్దముల నీడలు చూపీ నాపె
గండుఁదుమ్మిదకొప్పుతోఁ గదిమీ నాపె
కొండలవంటిచన్నులకొనలు దాఁకించీ నాపె
మెండుఁజిగురుచేతుల మెచ్చు మెచ్చీ నాపె ॥ఎంత॥

ఆయపుమెఱుఁగుమేన ఆసలురేఁచీ నాపె
పాయపుసిగ్గులచేత భ్రమించీ నాపె
మోయరానిపిఱుఁదుల మురిపెము చూపీ నాపె
యీయెడ శ్రీవేంకటేశ యెనసె నిన్నాపె ॥ఎంత॥ 426

రేకు 1592 దేసాళం

[1]ఓపో అదేడసుద్ది వోళక్క
కోపగించుకొందురటె గొబ్బున [2]నోళక్క ॥పల్లవి॥

చెల్లుబడగలవాఁడు చేతికి విడెమియ్యఁగ
వొల్లనందురటవె వోళక్క
గొల్లదానవంటా నీకొంగువట్టి తియ్యఁగాను
మల్లాడుదురటవే మరియు నోళక్క ॥ఓపో॥

వుద్దండాన నాతఁడు వుబ్బుబ్బి పిలువఁగాను
వొద్దికి రాకుండుదురటె వోళక్క
ముద్దుముద్దువలె నీపై మోహమెల్లాఁ జల్లఁగాను
గద్దించి తిట్టుదురటె కమ్మటి వోళక్క ॥ఓపో॥

ఆరితి చుట్టరికాలు అట్టె నీతోఁ జెప్పఁగాను
వూరకుండుదురటవె వోళక్క
ఆరయ శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడెను
గోర గీరుదురటవె కొసరి వోళక్క ॥ఓపో॥ 427

సాళంగనాట

నీవిభుఁడు గేలిసేసీ నిన్నుఁ జూచి
యీవలఁ దాలిమి లేదు యింతలోనిదానవా ॥పల్లవి॥

---

1. 'ఓ' ఓసిలో శేషభాగముగా హుంకారమునకు ప్రతిగా వాడే 'ఓ'గా కావచ్చు.
2. "ఓవి+అక్క"కు వ్యావహారికము.

శిరసు వంచనేఁటికే సిగ్గువడనేఁటికే
గరిమ నీపతిఁగంటే కళదాఁకెనా
చెరలాట లేఁటికే చెమరించనేఁటికే
సరసములాడితేనే కరఁగితివా ॥నీవి॥

పులకించనేఁటికే పొంచి నివ్వెరగేఁటికే
తలఁపులోనే కూటమి దక్కెనా నీకు
అలయఁగనేఁటికే అసురుసురేఁటికే
నొలపుఁజూపులలోనె సోఁకెనా వలపులు ॥నీవి॥

గుట్టుసేయనేఁటికే కొప్పు వీడనేఁటికే
అట్టె చేయిచాఁచితేనే ఆయనా పొందు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁడు నిన్నుఁ గూడె
ముట్టినపానుపుపైనే ముంచెనా కోరికలు ॥నీవి॥ 428

కాంబోది

[1] ఒక్కమొగనాండ్లకు వోరటు లెందాఁకానే
వెక్కసపుఁబొత్తు గూడి వేడుకతో నుందమే ॥పల్లవి॥

అప్పుడు నేనన్నమాట లన్నియు నోరుచుకోవే
చెప్పిననాప్రియములు చేకొనవే
యెప్పుడూ నక్కచెల్లెండ్ల మేఁటికే మనలో వాదు
కప్పివపొందులతోడ కాఁపురాలు సేతమే ॥ఒక్క॥

మనలో నిఁక సవతిమచ్చరాలు మానుదమే
వొనర బాసలు సేసుకుందుదమే
ననుపుఁజుట్టాలమై నవ్వుతాఁ దెలఁగుదమే
మనసు లొక్కటిగాఁగ మచ్చికలు సేతమే ॥ఒక్క॥

1. ఒక్కమగనికి భార్యలైనవలువురు స్త్రీలు.

యెగ్గులునుఁ దప్పులును యెన్నఁడు నెంచవలదే
వొగ్గి వరుసవంతుల నొద్దికాదమే
సిగ్గుదేర నిన్నూ నన్నూ శ్రీవేంకటేశుఁడు గూడె
తగ్గనియానందాన తనివి నొందుదమే ॥ ఒక్క ॥ 429

ముఖారి

కొలువుసేసేవారము కొరత లెంచఁగలమా
పిలుపు లిద్దరికి మీపెదవుల నున్నవి ॥ పల్లవి ॥

చనుమొనలు దాఁకఁగ జవ్వాది నీ కాపె వూసె
కనుఁగొనలనే చొక్కి కరఁగితివి
చొనిపి మమ్మిఁక నేమిసుద్దులు నీ వడిగేవు
చెనకినచెనకులు చెక్కులపై నున్నవి ॥ కొలు ॥

సొమ్ము సొమ్ముతో రాయఁగ సురటి విసరీ నాపె
కిమ్ములఁ గరఁగి పులకించితివి
మమ్ముఁ జూచి సిగ్గువడ మరి యేమిటికి నీకు
చిమ్మేటినవ్వులు మీపెలవుల నున్నవి ॥ కొలు ॥

పాదముఁబాదము దాఁకఁ బవ్వళించివున్న దాపె
యీదెసఁ గాఁగిట నీవు యెనసితివి
పొదిగా శ్రీవేంకటేశ పొందితివి మమ్ము నిట్టె
మోదపుఁగళలు మీమోములు నిండున్నవి ॥ కొలు ॥ 430

సామవరాళి

ఈఁతకు మిక్కిలి లోఁతు యిఁక లేదు
కాఁతిపడ [1] నేమనఁగా భయమేల నీకు ॥ పల్లవి ॥

---

1. నేము + అనఁగా.

నీమనసు రావలసి నెలఁతఁ దోడితెచ్చితి
యేమి సేయవలెనయ్యా ఇంకా నీకు
కామించి యానతీవయ్యా కడుసిగ్గువడనేల
నేమెల్లాఁ గలుగఁగాను నీ కేమిగడమ ॥ ఈఁత ॥

వేడుకలు గావలసి విడె లిద్దరి కిచ్చితి
వోడక సేయించుకో వో యుచితా లింక
చూడరాదా నాదిక్కు సూటిగా మఱఁగులేల
వూడిగము నేఁ జేయఁగా వొదుగ నీకేల ॥ ఈఁత ॥

కూటమి మీకు వలసి గొబ్బునఁ దెర వేసితి
యేఁటికి నెరపరికా లింకా నీకు
నీటున (శ్రీ) వేంకటేశ నే నలమేలుమంగను
చోటిచ్చి నే లోఁగఁగా సుద్దులు మరేఁటికి ॥ ఈఁత ॥ 481

పాడి

[1]కట్టరో కలువడాలు గక్కన వాకిళ్లను
పట్టరో వులుపలు శోభనద్రవ్యములును ॥ పల్లవి ॥

తిరుకొడి యెక్కెనదె దేవునికల్యాణానకు
గరుడపటము పెఁ (పై(?))డికంబమందును
ధరపై బ్రహ్మాదిదేవతలెల్లాను వచ్చిరదె
వరుసతో వాయిద్యాలు వాయించరో ॥ కట్ట ॥

ముంచి హోమములు సేసి మునులు సంభ్రమమున
అంచెల గడియ [2]కుడు కట్టె పెట్టిరి
పెంచముగఁ దెరవేసి పెండ్లిపీఁట వెట్టి రదె
మించఁ బేరంటాండ్లు నర్మిలిఁ బాడరో ॥ కట్ట ॥

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది.
2. ఉడుకు=ప్రకరణముతో గూడజీరకమా? అనిపించుచున్నది.

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యలమేల్మంగయు
యీవేళఁ దలఁబాలు ఇట్టె పోసిరి
బూవములు పొత్తునను భుజియించి రిప్పు డిట్టె
వేవేలకుఁ గప్పురపువిడె లియ్యరో ॥కట్ట॥ 482

రేకు 1598 శ్రీరాగం

నేఁడాతనిసంపదెల్ల నీభాగ్యము
పోఁడిమితో వలపులు పోగులువోసీని ॥పల్లవి॥

చలపాదితనమేల సకియతో నవ్వఁగదే
చెలువుఁడు మాటలనే సిగ్గు రేఁచీని
పలుపుఁజూపుల నీవు చక్కఁజూడఁగదవే
కలసొమ్ములెల్లాను సింగారించుకొనీని ॥నేఁడా॥

మంకుఁదన మింతయేల మాటలైనా నాడఁగదే
అంకెల నిన్నాతఁ డిట్టె ఆదరించీని
బింకపువీరాలు మాని పెదవి లంచమియ్యవే
కంకణము నీకతఁడు గట్టఁజూచీని ॥నేఁడా॥

పంతము [1]లప్పటినేల పానుపుపైఁ గూచుండవే
చెంత శ్రీవేంకటేశుఁడు చేయివట్టీని
ఇంతటలమేల్మంగ విన్నిటా మెచ్చవే
మంతనపురతులను మక్కళించీని ॥నేఁడా॥ 483

సామంతం

ఎంత సలిగిచ్చితివి యీపెకు నోయి
సంతతము నీకు నిది సాజమా వోయి ॥పల్లవి॥

1. అప్పటిన్ + ఏల.

మిన్నక నీతో నేను మేలములాడితినంటా
కన్నుల జంకించీ నాపె కంటివా వోయి
చన్నుమొనలను నిన్ను సారెఁ దాఁకించితినంటా
వెన్నాడి ఱట్టవచ్చీని వింటివా వోయి ॥ఎంత॥

వలపు నీమీఁదఁ జల్లి వద్దఁ గూచుండితినంటా
యెలమిఁ బైకొనివచ్చీ యిదేఁటిదోయి
చలివాయ నీకు మోవిచవులు [1] చూపీనంటా
మలసి సాదించీ నేఁటిమందె మేళమోయి ॥ఎంత॥

పరగ నీతో నేను పక్కనఁ గూడితినంటా
వరుసవంతుకుఁ దాను వచ్చీనోయి
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
సరవిఁ దానన్నిటికి సమ్మతించెనోయి ॥ఎంత॥ 484

గౌళ

ఎప్పుడూ నాపె నీ సొమ్మె యెందు వోయీని
చెప్పరానివలపు నీచేతిలోనె కాదా ॥పల్లవి॥

కన్నె నీతోఁ గోపగించి కదిసి మాటాడదంటా
యెన్నిప్రియములు చెప్పే వెందాఁకాను
సన్నలఁ దిట్టుదిట్టి చలము సాదించీనంటా
పన్ని యానలేల పెట్టి పంకిం(గిం?)చేవు ॥ఎప్ప॥

మంతనాన నాపె నీతో మాటలాడకున్నదంటా
వంతమేల ఇచ్చేవు పదరి నీవు
చెంత నిన్ను గేలిసేసి నెలవి నవ్వీనంటా
యింత యాల మొక్కేవు యిందరిలోను ॥ఎప్ప॥

1. 'చూపితినంటా' అనుట మంచిది.

అలమేలుమంగ నిన్ను అంటుకోకుమనీనంటా
 లలి శ్రీ వేంకటేశ యెంత భ్రమసేవు
 అలమి బలిమిఁబట్టి ఆపె నిన్నుఁ గూడెనంటా
 నిలువున నీవేల నివ్వెరగయ్యేవు ॥ఎప్పు॥ 485

మాళవి

నీకే తెలుసునయ్యా నీచేఁతలు
 యేకోలఁది కాకోలఁది కెందుకైనా వచ్చును ॥పల్లవి॥

నాతో నీవు నవ్వఁగ నగకుండవచ్చునా
 యీతల నందుకే చన్నులేల పట్టేవు
 ఘాతల మోనాన నుంటే కడు గర్వినవా
 యేతులఁ దొరలపొందు లెందుకైనా వచ్చును ॥నీకే॥

వూరకే మాటాడితే నే నూఁకొనకుండవచ్చునా
 మేరమీరి నీపాదము మీఁద వేసేవు
 కోరి గుట్టున నేనుంటే కుచ్చితమిదనవా
 యీరితి నీతోడిమేలా లెందుకైనా వచ్చును ॥నీకే॥

గుట్టున నీవు గూడఁగఁ గూడకుండవచ్చునా
 వొట్టి యందుకే గురుతు లొనరించేవు
 అట్టె శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
 యెట్టయిన నీమన్నన లెందుకైనా వచ్చును ॥నీకే॥ 486

దేసాళం

ఎంత వేగిరకాఁడవు యేమందు నిన్ను
 సంతతపువలపులు చల్లువెదలాయను ॥పల్లవి॥

సిగ్గువడకుండరాదా చింతలెల్లఁ బాపేఁగాని
ఎగ్గు లెంచకుండరాదా యెనసేఁగాని
తగ్గక నీవును నేను తతిగొని మొక్కఁగాను
వెగ్గళించి చెమటలు వెల్లావిరులాయను ॥ఎంత॥

చెఱఁగు విడువరాదా చెప్పినట్టు సేసేఁగాని
మఱఁగుకు రారాదా మాటాడేఁగాని
గుటిగాఁగ నిద్దరము కూరిములు గొసరఁగా
కఱకుఁబల్లదములు కడుఁబెంటలాయను ॥ఎంత॥

పీడె మందుకోరాదా వేడుకలు సేసేఁగాని
చూడరాదా నాదిక్కు చొక్కించేఁగాని
యీడుగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కూడితివి వెరగులు కోటానఁగోటా(ట్లా?)యను ॥ఎంత॥ 437

పాడి

కంటివా నీకన్నులను కాంతభావములు
వింటివా నాభావములు వీనుల నీవు ॥పల్లవి॥

నిలువుటద్దములోన నిన్నుఁ దన్ను నీడచూచి
నలినాక్షి సెలవుల నవ్వు నవ్వెను
మొలకచన్ను లందులో మోఁచెను నీమేననంటా
తలవంచుకొని పయ్యదను మూసుకొనెను ॥కంటి॥

పదములో నిన్నుఁ దన్నుఁ బాడుకొని మదిరాక్షి
చెదరనిచెక్కుచేత సిగ్గువడెను
అదన మర్మపుసందు లందులో సరిదాఁకితే
తుదలేని చెమటలఁ దొప్పఁదోఁగెను ॥కంటి॥

తలఁపులో నిన్నుఁ దన్నుఁ దగులఁ గాఁగిటనుంచి
అలమేలుమంగ కూడె నట్టె నిన్నును
అలరి శ్రీ వేంకటేశ అందులో నీమోవి యాని
నిలువెల్లాఁ గళలతో నిండుకున్నవి ॥ కంటి॥ 488

రేకు 1594 రామక్రియ

వట్టిబీరపుమాటలు వద్దు నాతోను
జట్టిగొని నామోవిచవి నీ వెఱఁగవా ॥ పల్లవి॥

పక్కన నీతో నేను పంతమాడుకోనఁ గాని
యిక్కువ నాకంటె హితు లెవ్వరున్నారు
గుక్కక నీవప్పటిని గుట్టుసేసే వింతే కాక
మిక్కిలి నాపైఁ జేసినమేలు నీ వెఱఁగవా ॥వట్టి॥

వింతలుగ నీతో నేను వేసాలు నెరపఁ గాని
యింతులు నావలె సేవ లిటు సేసేరా
మంతుకెక్కి నీవప్పటి మఱఁగు పెట్టేవు గాక
[1]అంతటి నాపై తమక మాఁపఁగలవా ॥వట్టి॥

ఆరితి నీతో నేను ఆనవెట్టుకోఁ గాని
నేరుపులు నావల్ల నీవెఱఁగవా
ఔరా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
తారుకాణరతులెల్లా దాఁచఁగలవా ॥వట్టి॥ 489

కన్నడగౌళ

ఎంతవాఁడవయ్యా నిన్ను నెఱఁగేపాటివారమా
దొంతరసిగ్గులనెల్లఁ దొరలించుకొంటివి ॥పల్లవి॥

---

1. 'నాయంతటిదానిపై' అనుట సహజము.

చలము సాదించనేర్పుజాణవుగనక నీవు
బలిమి నాపెచేయి పట్టితివి
వలపులకి తెలుఁగువాఁడవుగనక నీవు
వెలయఁగఁ బోఁకముడి విడిచితివి ॥ఎంత॥

దొరతనముగలట్టిదొడ్డవాఁడవుగనక
సరసాన నాపెకొప్పు జారించితివి
అరుదుగఁ బంతమే కూడైనవాఁడవుగనక
పరగఁ జన్నులమీఁదిపయ్యెద దీసితివి ॥ఎంత॥

గర్వితనముల శ్రీవేంకటపతివిగనక
నిబ్బరపలమేల్మంగ నీవు గూడితి
వుబ్బరితనముఃకు నోపేవాఁడవుగనక
గొబ్బున నన్నేలి యీాకెఁ గొలిపించితివి ॥ ఎంత ॥ 440

## ఆహిరి

నేరములేనిపతిపై నెరుసు లెంచఁగనేలే
గారవముఁ గాఁతాళముఁ గలుపుదురా ॥ పల్లవి ॥

మాఁటలలోనే తేనెలు మనసులోనే నూనెలు
యేఁటికి నీపతియెడ కింతవలెనా
వాటలలోఁ గొసరులు వరపుపై నుసురులు
నాటకాన రెండు నిట్టె నడుపుదురా ॥ నేర ॥

చూపులలోనే సిగ్గులు సోఁకులలోనే యెగ్గులు
ఆపొద్దుననుండి యింత అలిఇంతురా
చేపట్టులలో మొక్కులు చెనకులలో తొక్కులు
నీపంతాన నివిరెండు నేరుపుదురా ॥ నేర ॥

దవ్వులనే వలపులు దగ్గరితేఁ బులుపులు
నవ్వుతానే యిటులానే నాలిసేతురా
రవ్వ శ్రీవేంకటేశుఁడు రతి యలమేల్మంగవు
బువ్వపుమోవులు రెండు పొక్కఁజేతురా ॥ నేర ॥ 441

కాంబోది

చుట్టరికము సేసితే సూడువట్టే వా
గుట్టుతో మాటాడితేను రట్టుసేసేవే ॥ పల్లవి ॥

కొప్పు దువ్వి నీ కాతఁడు గొజ్జంగలు ముడువఁగా
అప్పుడే గోరుదాఁకెనంటా ఆడేవే
గొప్పయినచన్నులపై కుంకుమపూయఁగాను
ముప్పిరిఁ బిసికెనంటా మోము వంచేవే ॥ చుట్ట ॥

వేళె నిన్నతఁడు గారవించి సింగారించరాఁగా
జాటించిఁ బోఁకముడెంటా జంకించేవే
మీటినసొమ్ములెల్లా ని మెడనిండఁ బెట్టఁగాను
తూటి కాఁగిలించేనంటా దూరుసేసేవే ॥ చుట్ట ॥

వొడివట్టి నిన్నతఁడు వురముపైఁ బెట్టుకోఁగా
నడుమఁ బెండ్లాడెనంటా నవ్వ నవ్వేవే
అడరి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నిన్ను
చిడుముడిఁ గూడెనంటా సిగ్గువడేవే ॥ చుట్ట ॥ 442

సాళంగం

కన్నమాటాడకపోదు కలది గలిగినట్టె
యిన్నిటాను నీచిత్త మెట్టుండునో యిఁకను ॥పల్లవి॥

వంతులకు చెలులెల్లా వద్దనున్నా రింతేకాక
కాంతుఁడవు నీమనసు గానఁగలరా
పంతాన నందరి నీవు భ్రమయించే వింతేకాక
కొంతైనా నొకరిమీఁదఁ గూరిమి నీకున్నదా ॥కన్న॥

సిగ్గువడ కిందరు నీసేవసేసే రింతేకాక
దగ్గరి నిన్ను [1]వంచుకోఁ దాము [2]గలరా
అగ్గలమై పైకొనఁగ నాసకొలిపేవుగాక
నిగ్గుల చుట్టరికము నీకెందైన నున్నదా ॥కన్న॥

ప్రేమముతో నిన్ను నిట్టె పెండ్లాడి రింతేకాక
చేముట్టి కొనగోళ్లఁ జిమ్మఁగలరా
ఆముక శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
యీమేర నన్నుఁ గూడితి వితరము గలదా ॥కన్న॥ 443

బౌళి

అందాలు సేసుకొలేవు అయ్యో నీవు
[3]యిందుముఖి నీసంది యెరవులు గలవా ॥పల్లవి॥

వలవనికోలిఁ బెట్టి వాదు లడిచీఁగాక
అలిగెనా యింతి నీతో నప్పటనుండి
చెలరేఁగి మోహమున చిమ్ముచుఁ దిట్టీఁగాక
బలిమి సేయఁగ నీతో పగటా సతికి ॥అందా॥

తనియనియాసతోడ తప్పకచూచీఁగాక
గునిసి నిన్నాపె నేఁడు కోపగించెనా
మనసుతమకమున మరియూఁ బెనఁగీఁగాక
కినియ నీతోనేమి కేరడమా చెలికి ॥అందా॥

---

1. 2. 'వంచుకోఁగలరా' అన్నఘటకక్రియాసహితరూపము విరిచి. వ్యవహితముగ ప్రయోగించుట జరిగినది. 3. ఇందుముఖియొక్క నీయొక్క సంది-అనివిగ్రహము.

కరఁగినమతితోడ కాఁగిలించుకొనీఁగాక
గరువము చూపెనా కాంత నీతోను
అరయ శ్రీవేంకటేశ అలమేలుమంగ నిన్ను
యిరవుగఁ గూడెఁగాక యెమ్మెలా యీ లేమకు ॥అంటా॥ 444

రేకు 1595 లలిత

నీకొలఁది వారమా నేమెల్లాను
కైకొని యీపనులకె కాచుకున్న వారము ॥పల్లవి॥

సారెఁ గొప్పు దువ్వుతాను చన్నులనొత్తీ నాపె
ఆరితి నందె పరాకైనాఁ డితఁడు
చేరి విన్నపా లేమిసేసేవే విభునికి
నేరిచి మాటాడించితే నీవేపో సతివి ॥నీకొ॥

పరిమళమ(ము?) లందుతా పైఁ దొడవేసీ నాపె
కరఁగీఁ జెమటల గక్కున నాతఁడు
యెరవుల యాతనికి యేమివిడెమిచ్చేవే
మరిగించుకొంటేను మరి నీవే సతివి ॥నీకొ॥

సొమ్ములెట్టుతా నెనసెఁ జొక్కి యలమేలుమంగ
పమ్మి శ్రీవేంకటేశుఁడు భ్రమసినాఁడు
యిమ్ముల మనల నేలె యింతలో నేమిమొక్కేవే
యెమ్మెలు నెరపకుంటే యిఁక నీవే సతివి ॥నీకొ॥ 445

పూర్వగౌళ

చుట్టమై యాతఁడు రాఁగా సూడువట్టేవే
చెట్టపట్టి తియ్యఁగాను సిగ్గువడేవే ॥పల్లవి॥

వాటించి యాతఁడు నీకు బాసలెల్లాఁ జేయఁగాను
  సీటుతో నీవేమిటికి నిందలాడేవే
చీటికిమాటి కాతఁడు చేయివట్టి తియ్యఁగాను
  నాఁటఁజూచి యేమిటి కానలువెట్టేవే ॥చుట్ట॥

గుట్టుతో ముందర పతి కొండవలె నుండఁగాను
  దిట్టతనమున నేల తిట్టు దిట్టేవే
బెట్టుగాఁ బేరఁబిలిచి ప్రియములు చెప్పఁగాను
  వుట్టిపడి నీవేల వోపననేవే ॥చుట్ట॥

శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడఁగాను
  తావరించి నీవేల కాఁతాళించేవే
మోవి యీతఁడే నీకు ముందరనే యియ్యఁగాను
  చేవమీర నేల గంటిసేసి చూపేవే ॥చుట్ట॥ 446

నారాయణి

ఇద్దరి నేరుపులకు నిది వేళ
  సుద్దులెల్లాఁ జెప్పి పతిఁ జొక్కించవే ॥పల్లవి॥

చనవుగలుగువారు చలము సాదింతురా
  ననుపులనే వలపు నాఁటింతురు
మనసెరిఁగుండియును మగని నింత సేతురా
  కినుక నవ్వుసేసుక కేలెత్తి మొక్కవే ॥ఇద్ద॥

తగులమిగలవారు తప్పులు వట్టుదురా
  మొగమోటనే కళలు మొలపింతురు
తగవరివిభునిఁ బంతములాడి దూరుదురా
  బిగువు గుట్టుసేసుక ప్రియములు చెప్పవే ॥ఇద్ద॥

ఆసలుగలుగువారు ఆరడిఁబెట్టుదురా
సేసవెట్టి చేతిలోనె చిక్కింతురు
బాసిచ్చిన శ్రీవేంకటపతిఁ గూడి పంగింతురా
యీసులువాసులు సేసు కిచ్చకములాడవే ॥ఇద్ద॥ 447

ఆహిరి

దయదలఁచవలదా తరుణిమీఁద
ప్రియములు రాసివోసి బేరమాడీ నదివో ॥పల్లవి॥

మంతనాన నీతోను మాటలాడి మాటలాడి
యెంతైనాఁ దనియదు యీరమణి
వింతలైననీమోము వేడుకతోఁ జూచిచూచి
కొంతైనా రెప్పలు మూసుకోనఁజాల దిదివో ॥దయ॥

నలువంక నీతోను నవ్వులు నవ్వి నవ్వి
యెలమితో వేసరదు యీరమణి
చలివాసి చెనకుచు సరసములాడి యాడి
చలము మానఁగలేదు సంగడినే ఇదివో ॥దయ॥

గక్కన నిన్నింతలోనె కాఁగిటఁ గూడికూడి
యిక్కువలు మఱవదు యీరమణి
వెక్కసపురతుల శ్రీవేంకటేశుఁ బొంది పొంది
మిక్కిలివేడుకతోడ మించీ నీపె యిదివో ॥దయ॥ 448

దేవగాంధారి

ఎందాఁకా నలుకలు యేఁటికి నీకు
మందలించి యాతనితో మాటలాడరాదా ॥పల్లవి॥

వేడకగలవారికి వేసారుకోఁదగునా
 కోడై నవారి కెచ్చుకుందులేలా
 మేడెపురతివారం మేకు లింత వలెనా
 చూడవే యాతనిదిక్కు సొల సిఁకనైనాను ॥ఎందాఁ॥

సమ్మతులై నవారికి చలములు దగునా
 చిమ్ముఁజూపులవారికి సిగ్గులేలా
 దొమ్మివలపువారికి యెమ్మె లింత వలెనా
 రమ్మని పిలువవే రమణుని నండకు ॥ఎందాఁ॥

నవ్వు నవ్వేవారికి నాయములు దగునా
 రవ్వలై నవారికి బీరములేలా
 యివ్వల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
 నివ్వటిల్ల మెచ్చవే నేరుపుల నీతని ॥ఎందాఁ॥ 449

నారాయణి

చిత్తగించవయ్యా నీవు సేసినభాగ్యమిదివో
 కొత్తకొత్తసణఁగుల కొచ్చి చూచీని ॥పల్లవి॥

చెలి నీకు విడెమిచ్చి సిగ్గువడుతా నట్టె
 మలసి తలవంచుక మాటలాడీని
 అలిగినదీఁ గాదు ఆసలు విడువలేదు
 చలివాయ వలపుల సాముసేసీని ॥చిత్త॥

కాంత నీకొలువుసేసి కంబముమాఁటున నుండి
 కొంతగొంత కొంకుతోడ కుంచవేసీని
 పంతము నెరపలేదు పైకొనక మానదు
 చెంతలఁ దమకముతోఁ జిమ్మిరేఁగీని ॥చిత్త॥

తొయ్యాలి నీసేవ సేసి దోమతెరలో నుండి
కయ్యములన్నియుఁ దీరఁ గాఁగిలించీని
గయ్యాళితనము లేదు కడు నవ్వకమానదు
యియ్యెడ శ్రీవేంకటేశ యిరవయ్యీని ॥చిత్త॥ 450

రేకు 1596 వరాళి

అంత యేల వొరసేవు అప్పటి నన్ను
కాంతలకు నీమోవి గాడిపట్టుగాదా ॥పల్లవి॥

వలపెల్లా నాదెకాక వాసులెంచి చూచితేను
పలువుర నేలేనీకుఁ బాటి వున్నదా
బలిమిసేసి నాచేతఁ బడితలింపించితేను
వెలలేనినీకాఁగిలి విడిదిల్లుగాదా ॥అంత॥

సిగ్గెల్లా నాదెకాక చేరి యెరుకపరచితే
వొగ్గినయాసలనీకు వోజ వున్నదా
అగ్గలమై నీవు [1]గడునంత నన్ను రేఁచితేను
తగ్గనినీమే నన్నిటా దాయిమానుగాదా ॥అంత॥

పంతమెల్లా నాదెకాక భావించి చూచితేను
యింతులకు మొక్కనీకు యెమ్మె వున్నదా
ఇంతటి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
పొంతలనే శిరసిది బొ(డ్డా)యి గాదా ॥అంత॥ 451

సాళంగనాట

ఎంత వేగిరకాఁడవు యింతులయడాటాన
వింతవింతచేఁతలను వీరిడిఁ జేసేవు ॥పల్లవి॥

---

1. కడునంత=అంతయెక్కువగా అర్థముకాబోలు.

మేరమీరి యాపె నీతో మేలములాడెనంటా
తేరకొనఁజూచి కొప్పు జారఁదీసేవు
గోర గీరి యట్టె నిన్ను కోపగించి తిట్టెనంటా
సారెసారెఁ గొంగువట్టి సాదించేవు ॥ఎంత॥

బింకముగా నాపె నీతో బెట్టుగాఁ బెనఁగెనంటా
పొంకాన పూవుబంతిని పూఁచి వేసేవు
అంకెల నంతలో నిన్ను అద్దలించి చూచెనంటా
సంకెలేక వుద్దండాన చదురులాడేవు ॥ఎంత॥

గయ్యాళితనాన నాపె కాఁగిలించుకొనెనంటా
వుయ్యాలమంచముమీఁది కొంగిఁ దీసేవు
నెయ్యపుశ్రీవేంకటేశ నిన్నిట్టె చొక్కించెనంటా
తియ్యనిమోవి యిచ్చి దీకొనేవు ॥ఎంత॥ 462

## దేశాళం

నా మొక మట్టె చూచి నవ్వే వదేమయ్యా
కోమలి నొకతెఁ బేరుకొనవయ్య నీకును ॥పల్లవి॥

వరుసకు నొకసతి వచ్చి కాచుకున్నది
సరసాన నొకయింతి చాలివున్నది
[1]మరిగించేననొకతె మాటలాడుచున్నది
తెరలోని కెవ్వతెనుఁ దెత్తునయ్య నీకును ॥నా మొ॥

నిదురకు నొకభామ నీతోఁ జెప్పుమన్నది
వెదవితేనె కొకతె ప్రియపడీని
సదరాన వలపులు చల్లీ నొకవనితె
కదియ నెవ్వతెకు నుంగర మంపేవయ్యా ॥నా మొ॥

1. మరిగించేను+అని+ఒకతె

పగడసాలాడ నొకపడఁతి గాచుకున్నది
నగుతా నొకతె నిన్ను నాఁటఁజూచీని
అగపడి కలసితి వందరి శ్రీవేంకటేశ
తగ నన్నేలితివి చిత్తమింకా నెందున్నది ॥నామొ॥ 453

వరాళి

ఏమిసేయవచ్చు భాగ్యా లెవ్వరి కెట్టుండునో
ఆమనికాలము గాఁగా నగ్గువాయ నదివో ॥పల్లవి॥

కొంగువట్టి తియ్యఁగాను కొమ్మ సిగ్గువడితేను
కంగి కోపగించెనంటా కాఁక రేఁగేవు
చెంగటఁ గొసరఁబోతే చిరిచేఁదాయ వలపు
సంగడిఁ జవిగొంటేను చప్పనాయను ॥ఏమి॥

పగటుమాటలాడఁగ పడఁతి నవ్వు నవ్వితే
యెగసక్కెలంటా లోలో యీసడించేవు
వెగటుగాఁ జెప్పఁబోతే వొగరులాయఁ బ్రియము
మిగులా వడ్డించఁబోతే మించి కారమాయను ॥ఏమి॥

యీదెసఁ బెనఁగఁగాను ఇంతి సరసమాడితే
పాదము దాఁకించెనంటా పంతమాడేవు
సాదించి శ్రీవేంకటేశ జంకించితేఁ బులుసాయ
దాదాతఁ గూడితేను తరితీపులాయను ॥ఏమి॥ 454

దేసాళం

ఇందరిలోనా నీకు నేఁటికి రట్టు
పొందులు సేసుక అట్టె బుజ్జగించవయ్యా ॥పల్లవి॥

పీడెము చేతికిచ్చి వెలఁది నీతో నవ్వఁగ
యేడ చూచేవయ్యా నీకు నెంత పరాకు
ఆడరానిమాటలాడీ నందుకే కోపగించుక
కోడెకాఁడ వాపె నిట్టె కుస్తరించవయ్యా ॥ఇంద॥

చేసన్న చేసి ఆపె చెనకి నిన్నుఁ జూడఁగ
యేసుద్దులు చెప్పేవయ్యా ఇదె నాతోను
వాసితో నిందుకే యాపె వట్టినేరములు వేసీ
వేసాలగుట్లు మాని వేఁడుకొనవయ్యా ॥ఇంద॥

అలమేలుమంగ నిన్ను నట్టె కాఁగిలించఁగాను
నిలుచుండే వేమయ్యా నివ్వెరగుతో
అలరి శ్రీవేంకటేశ అందు కాపె వురమెక్కె
చెలి నేను; ఆపెనే చెక్కునొక్కవయ్యా ॥ఇంద॥ 455

పూర్వగౌళ

ఇద్దరితమకములు ఇటు నీకే తెలుసును
సుద్దులు చెప్పఁగ మరి చోటున్నదా ॥పల్లవి॥

చెక్కు చేతఁబట్టుకొని చిరునవ్వు లేఁటికే
మక్కువ నీవల్లనే మోమాఁట దోఁచీని
అక్కడ నాతఁడు నీతోనాడేమాఁటలకు
యిక్కడ నావునికి యిటు సరివచ్చెనా ॥ఇద్ద॥

యెదురుగా వచ్చివచ్చి యేమి తప్పక చూచేవే
అదన నీవల్లఁ బనులన్నీ నున్నవి
చెదర కాతఁడు దలఁచేటితలపులకును
మదిలో నామర్మానకు మరి సరివచ్చెనా ॥ఇద్ద॥

మిక్కిలివేడుకతోడ మెచ్చు లేమిమెచ్చెవే
తక్కక నీవల్ల మేలు దయిలువారిని
యిక్కువఁ గూడె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగ నే-
నిక్కడా నక్కడా నన్ని నిటు సరివచ్చెనా ॥ఇద్ద॥ 456

రేకు 1597 పాడి

ఎంతసేసితి రే నన్ను యేమి రే మీరు
రంతుల వాని నీడకు రప్పించలేనా ॥పల్లవి॥

అంగనలమోము చూచి ఆతఁ డిట్టె నవ్వఁగాను
ఙెంగిలినవ్వు నేనూ నిట్టె నవ్వేదా
అంగడిజాణతనాలు అందఁతో నాడఁగాను
జంగిలిసరసములు సారె నేనూ నాడేదా ॥ఎంత॥

మచ్చిక నందరితోను మాట లాతఁ డాడఁగాను
ఇచ్చట మూఁకమాటలు ఇప్పు డాడేదా
వచ్చివచ్చి అందరిపై వలపులు చల్లఁగాను
కచ్చుపెట్టి నావలపుఁ గలయవేసేదా ॥ఎంత॥

శ్రీవేంకటేశ్వరుఁడు చెలులఁ బిలువఁగాను
వోవరిలో నే నుండ వూఁకొనేదా
వావు లందరిపై వేసి వడిఁ దానే నన్నుఁ గూడె
యీవల నలమేల్మంగ నెరవులు సేతునా ॥ఎంత॥ 457

సౌరాష్ట్రం

తానే నామీఁదటఁ దొల్లె దయగలఁడు
కానిమ్మని వొడఁబడేఁగపట మేఁటికే ॥పల్లవి॥

ఛాటుదప్పేమావాఁడా తాను మఱవ నే ననరే
యేఁటికి నానలుపెట్టీ యింతలోననే
చాటిచెప్పీఁ దనడాగు చన్నులపైననరే
కోటికిఁ బడగెత్తె కొసరనేమిటికే ॥తానే॥

మేలెంచనివాఁడా తాను మేకొంటిననరే
యీలాగులనేల మొక్కీ ఇంతలోననే
వోలవేసీ నావేల నుంగర మిదెనరే
యీలాగుచనవులందు యెరవు లేమిటికే ॥తానే॥

సిగ్గువడేవాఁడా తాను చెనకితి ననరే
యెగ్గులేక నన్నుఁ గూడె ఇంతలోననే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
అగ్గలమాయ వలపు అలయనేమిటికే ॥తానే॥ 458

ఆహిరి

ఏమయ్య నీవెఱఁగవా యేలా ఇంత సేయించేవు
దామెనజగడాలకు తానా యెదురు ॥పల్లవి॥

సలిగెలు వట్టుకొని సతి మాటలాడీఁగాక
తలఁకక నే నాడితే తానా యెదురు
నెలవై దిట్టతనము నేరుచుక వచ్చెఁగాక
తలమని జంకించితే తానా యెదురు ॥ఏమ॥

తోడువెట్టుకొని చెలి తుటారించవచ్చీఁగాక
దాడిగా నేదికొంటే తానా యెదురు
యేడో కనుసన్నలకు యెమ్మెలు సేసీఁగాక
తాడుపడక పైకొంటే తానా యెదురు ॥ఏమ॥

చెప్పుడుబుద్ధులకును చేయెత్తి మొక్కఁగాక
తప్పులు నేఁ బట్టేనంటే తానా యెదురు
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
దప్పిదేరఁ గూడితివి తానా యెదురు ॥ఏమ॥ 459

లలిత

ఈపాటివాఁడవు యెట్టు పొందుసేసితివి
వోపికగలవారికి వొదుగనేలా ॥పల్లవి॥

పిలిచీఁగదయ్యా నిన్నుఁ బ్రియురాలు
చెలఁగి యేల పరాకుసేసుకొనేవు
చెలులము మేము వింటే సిగ్గయ్యీనా
బలవంతులకు మరి భయమున్నదా ॥ఈపా॥

బాగాలిచ్చీ నీప్రాణబందుగురాలు
[1]చేవ(గ?)దేర నీవెల చేయొగ్గవు
నీగుణాలు చూచి నేము నేరమెంచేమా
వేగిరపువారి కింత విచారించనున్నదా ॥ఈపా॥

యెనసీఁగదవయ్యా నీయిచ్చకురాలు
మనసిచ్చి నీవేల మాఁటలాడవు
అనుఁగు శ్రీవేంకటేశ అలమేలుమంగ యాపె
ఘనులైనవారికి కడుఁగొంక నున్నదా ॥ఈపా॥ 460

నాదరామక్రియ

ఎగ్గువట్టేవు గనక యిదివో వోయి
సిగ్గుతోడ నుండేనన్ను చిత్తగించవోయి ॥పల్లవి॥

1. ప్రాసభంగము.

మొగము చూచి నీకు మొక్కేనంటా రాఁగాను
నగవు వచ్చీనోయి నాసెలవుల
పగటున నే నీకు పాదాలొ త్తేనంటా రాఁగా
జిగిఁ జెమటలు చేతఁ జిప్పిలీనోయి ॥ఎగ్గు॥

వేడుకతోడ నీకు విడెమిచ్చేనంటా రాఁగా
తోడనే తమకములు తొలఁకీనోయి
వోడక నీపానుపుపై వొద్దనుండేనంటా రాఁగా
నీడల రెండుచేతులు నిన్నలమీనోయి ॥ఎగ్గు॥

మిక్కిలి నే నిన్నుఁ గూడి మెచ్చేనంటా రాఁగాను
పెక్కుపరవశములు పెరిగీనోయి
అక్కరై శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
తొక్కరాఁగా నీపాదము తొలుతే మీఁదోయి ॥ఎగ్గు॥ 461

సామంతం

నీవు గోవిందరాజువు నెరజాణవు
మోవులు చూపి వారు మోహము చల్లేరు ॥పల్లవి॥

కొలువులోపల నిన్నుఁ గొసరి కొసరి చూచి
చెలు లిద్దరును నిన్నుఁ జెనకేరు
వలపులు మక్కళించి వన్నె దేరే నీమోమున
కళలు రేఁచి రేఁచి కమ్మటి నవ్వేరు ॥నీవు॥

పానుపుమీఁదట నీకుఁ బాదము లొత్తియొత్తి
మానిను లిద్దరు నీతో మాటాడేరు
పూని యాసలు రెట్టించి పొత్తుల నీమేనెల్లా
మైనమువలెఁ బెనఁగి మచ్చిక రేఁచేరు ॥నీవు॥

వోవరిలోపల నుండి వొడివట్టి నిన్నుఁ దీసి
శ్రీవనితా భూవనితాఁ జెఁ(జెం?)ది కూడేరు
యీవలనావలా మొక్కి శ్రీవేంకటపతివైన —
గోవిందరాజ నీగుణము మెచ్చేరు ॥నీవు॥ 462

రేకు 1598 లలిత

సందుసుడి నేమిటికి సరి నింతసేసేవు
కందువకు రాఁగా బింకము చూపరాదా ॥పల్లవి॥

చిత్తరువువా(వ్రా?)సేవేళ చేరి పరాకైనదంటా
అత్తి చనుమొనలేల అదిమేవు
బత్తిగలవాఁడవై తే పానుపుమీఁదికి రాఁగా
చిత్తమువచ్చినసేఁత సేసి చూపరాదా ॥సందు॥

కంటమాలిగుచ్చేవేళ కడునను వాయనంటా
అంటేవు మర్మములు నీ వంతలోననే
నంటుగలవాఁడవు నవ్వుతా విడెమియ్యఁగ
[1]వొంటినీబలిమి చూపి వొరయఁగరాదా ॥సందు॥

కాఁపురముసేసేవేళ కడు సందడైనదంటా
యేపునఁ గాఁగిలించి యెనసితివి
యీపాటివాఁడవు ఇప్పుడే శ్రీవేంకటేశ
వోపినట్లల్లా రతుల నొద్దిక గారాదా ॥సందు ॥463

సాళంగనాట

ఇంతలేసి కావలెనా యింకాను నీ—
బంతిభోజనాతే చాలుఁ బాలించ మమ్మును ॥పల్లవి॥

1. 'నీయొంటిబలిమి' అమట సహజము. ఇక్కడ 'ఒంటి' 'ఒళ్లు'నకు బొవవిభక్తిక మైతే సహజముగ నుండును. 'ఒకటి'వికారమైతే అంతబాగుండదేమో?

పట్టకుమీ నీవు నన్నుఁ బలుమారును। నీ-
వెట్టివలపుల చేత వేసరితిమి
గుట్టెఱుఁగుదువు మాతో కొసరుటేల। నీ-
చుట్టరికములె చాలుఁ జొక్కించ మమ్మును ॥ఇంత॥

చెప్పకుమీ ప్రియములు చేరి నాకునూ। నీ-
తప్పనిఆనలచేతఁ దనిసితిమి
యెప్పటివాఁడవే మాఇచ్చకాలేల।[1] నీ-
కప్పురవిడేలే చాలుఁ గరఁగించ మమ్మును ॥ఇంత॥

నవ్వకుమీ నీవునాతో నయములను।నీ-
పువ్వులవాటులచేతఁ బొదలితిమి
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితి।నీ-
బువ్వపుమోవే చాలు పొసఁగించ మమ్మును ॥ఇంత॥ 464

పాడి

చెప్పినట్టె సేయవయ్యా చెలికి నీవు
చిప్పిలి నీవుద్దండాలు సేయకువయ్యా ॥పల్లవి॥

కంతునియమ్ములవిగో కాంతకొప్పులో నున్నవి
పంతగాఁడ వాతురుము పట్టకువయ్యా
చెంతలఁ బెదవు లవి చిగురుటడిదములు
అంతేసిమాటలు నీ వాడించుకోకువయ్యా ॥చెప్పి॥

చందురునివిషములు సతి నవ్వులలో నవె
కిందుపడాపెచెక్కులు గిల్లకువయ్యా
కందువఁ బయ్యదదె జక్కవలకొడ్డినవల
దిందుపడ నీవు ముట్టి తియ్యకువయ్యా ॥చెప్పి॥

1. ఈవ్రగ్రహచిహ్నము రేకులో లేదు.

చలిగాలినాములు సతిమేనివాసనలు
కలసితి వీఁక బెళకకువయ్యా
అలమేలుమంగ యీకె అన్నిటా శ్రీవేంకటేశ
కలకాలమును నబ్బెఁ గైకొనవయ్యా ॥చెప్పి॥ 465

పళపంజరం

ఇంతేసియాసోదకత్తె లెందరో ఇంకా నీకు
సంతసపుఁదమకాన చండిపెట్టీఁగాక ॥పల్లవి॥

సతితోడ నీవిచే జాణతనా లాఁడగాను
అతివ వేరొక్కతె నిన్నద్దలించీని
మతకాన నూరఁజుట్టమవు నీ వెవ్వరిసొమ్ము
తతితోడ నెఱఁగక తమకించీఁగాక ॥ఇంతే॥

అంగనవొకతెకు నీ వాసపడి పెనఁగఁగా
జంగిలిగా వేరొక్కతె కొంగువట్టీని
అంగడివరిమళ మందరివాఁడవు నీవు
సంగడిఁ దనసొమ్మంటా సాదించీఁగాక ॥ఇంతే॥

అలమేలుమంగ నీకు నెలు వురమెక్కగాను
వెలఁది భూకాంత వీఁపెక్కీని
పొలసి శ్రీవేంకటేశ బువ్వపుమోవి నీది
కలసినచనవునఁ గడుమెచ్చీఁగాక ॥ఇంతే॥ 466

శ్రీరాగం

ఏమని విన్నవించేము యెంతాఁకా నీతోను
కామినిసుద్దులు చెప్పఁ గతలాయ నీకును ॥పల్లవి॥

చప్పరములోన నుండి సారెసారె నుస్సురంటా
కప్పురములే యడుగుఁ గాంతలను
ముప్పిరి సంతటిలోన ముంగిట వచ్చి నిలిచి
రెప్పలు వేయక చూచు వొప్పగునీరాకకు ॥ఏమ॥

గందము వూసుకొని కడునుడుకెత్తెనంటా
అందుకొనుఁ బన్నీరు అప్పుడప్పుడే
విందుగాఁగ మోవితేనె వెస నీకు మీఁదెత్తుక
చెంది ప్రియాలు చెప్పెంపు చెలుల నీవద్దికి ॥ఏమ॥

పరగఁ బరపుమీఁద పైకొనఁగా నిన్నుఁ గూడె
సిరులుమీరఁగ నిట్టె శ్రీవేంకటేశ
సరసపుమాటలలో సన్నలు సేసి సేసి
పెరరేఁచుఁ దమకము పెనఁగుచు నీకు ॥ఏమ॥467

ఆహిరినాట

కూడితి రిద్దరు మీరు కొండగోఁడవలె
మోడామోడిమాఁటల ముచ్చట దీరీనా ॥పల్లవి॥

నిలుచున్నాఁ డతఁడు నీమీఁదిమోహమున
పిలువవే ఇఁక నైనాఁ బ్రియురాలవు
చెలులు యెడమాటలు చెప్పిరాఁగా మాపుదాఁకా
తలఁపులలో నీతహతహ వాసీనా ॥కూడి॥

నవ్వు నవ్వీ నాతఁడు నను పైనచనవున
ఇవ్వల నెదురుకోవే హితురాలవు
రవ్వగా నొద్దికవారలు రాయబారాలు సేసితే
జవ్వనపుమదాలగజరు దీరీనా ॥కూడి॥

దగ్గరివచ్చె నాతఁడు తమితోఁ గూడేనంటా
కగ్గ కా(శ్రీ)వేంకటేశుఁ గాఁగిలించవే
తగ్గ కూడిగపువారు తా మెంత పచ్చిసేసినా
యెగ్గులేనిమీరతికి నీడువచ్చీనా ॥కూడి॥ 468

రేకు 1599 వరాళి

వేగిరకానికి నేఁడు వెసలఁ బెట్టుమన్నట్టు
ఆగడాలు సేయవచ్చే వాస ఇంకా నేఁతో ॥పల్లవి॥

విన్నపాలు సేయఁగానే వేమరు బుద్దెడిగేవు
కన్నులను మొక్కఁగానే గరిసించేవు
చన్నుల నొత్తఁగానే సాములు సేయవచ్చేవు
ఇన్నిటా వేగిరించేవు యేమి దలఁచితివో ॥వేగి॥

విందుచెప్పరాఁగానే వెసఁ బవు లడిగేవు
పొందులు నేఁ జేయఁగానే పొదిగేవు
కందువకుఁ బిలువఁగా కడుఁదమకించేవు
సందడిఁ బెండ్లాడేవు జాణతన మెట్టిదో ॥వేగి॥

పానుపుపైఁ బండఁగానే పదరి కాఁగిలించేవు
ఆనుక మోవియ్యఁగానే ఆసపడేవు
కానీలే (శ్రీ)వేంకటేశ కలసితి విటు నన్ను
సానఁబట్టేవు చూపులు సమరతు లెట్టివో ॥వేగి॥ 469

కాంబోది

నీకుఁ జూడ వినోదాలై నిండుకవున్నవి గాక
కైకొన్నపతిగుండెలో గాలములుగావా ॥పల్లవి॥

తలఁపులోఁ దగిలి యాతని భ్రమయించేవి నీ—
మొలకనవ్వులేకావా ముదిత నేఁడు
చలివాపి రమణుని సారెకుఁ బైకొలిపేవి
పలచనిపెదవిపై పలుకులేకావా ॥నీకు॥

ఆయాలు సోఁకి యాతనియాసలు పెడరేఁచేవి
సోయగపునీకనుచూపులేకావా
వాయపుమదములు గొబ్బున నూరఁజేసేవి
చాయలమెఱుఁగుల నీచన్నులేకావా ॥నీకు॥

చిందువందుగా మేను చెమరింపఁజేసేది
కందువరతుల నీకాఁగిలేకాదా
అందపు శ్రీవేంకటేశు నన్నిటాను గూడితివి
సందడించేమీఇద్దరిసన్నలేకావా ॥నీకు॥ 470

పాడి

ఎంత వేగిరకాఁడ వేమయ్యా నీవు
మంతనాన యెట్లుండిన మచ్చిక లమరును ॥పల్లవి॥

సిగ్గువడ్డకోమలిని చెఱఁగువట్టి తీసేవు
యెగ్గువట్టి తిట్టితేను యేమిసేసేవు
వొగ్గక ముసుఁగిడఁగ వొడివట్టి పెనఁగేవు
బగ్గనఁ బాదమంటితే పడఁతులు నగరా ॥ఎంత॥

పఱపుపైనున్నదాని బలిమిసేయఁ జూచేవు
యెఱఁగి గోర గీరితే యేమిసేసేవు
చిఱునవ్వు నవ్వితే చేరి యానలువెట్టేవు
నెఱయా నొట్టువెట్టితే నీవు తిద్దఁగలవా ॥ఎంత॥

కవకవనవ్వేదాని( గాఁగిలించి కూడేవు
యివల( బచ్చిసేసితే నేమిసేసేవు
జవళి శ్రీవేంకటేశ సతిని((నిం?)త మీరితివి
వివరించి కొసరితే వెల్లవిరిగాదా ॥ఎంత॥ 471

మాళవిగౌళ

కంటిమి మీఇద్దరెందు [1]కట్టినయెచ్చరికెలు
జంటలై వున్నందుకును చలము లెచ్చరికె ॥పల్లవి॥

చెలిమిసేసేయందుకు చెనకులే యెచ్చరికె
యెలయింపులకు సన్న లెచ్చరికె
వలపులకును తలవంపులే యెచ్చరికె
పిలిచి చేకొనుటకు పెనఁగు లెచ్చరికె ॥కంటి॥

ముందర నిలుచుటకు మొక్కులే యెచ్చరికె
యెందుకును సరసము లెచ్చరికె
కందువల నుండుటకు కతలే యెచ్చరికె
చిందేటికరఁగులకు సిగ్గులే యెచ్చరికె ॥కంటి॥

కదిసి కూడుటకును కాఁగిలే యెచ్చరికె
హృదయాలకు నవ్వులే యెచ్చరికె
అదన శ్రీవేంకటేశుఁ డన్నిటా నిన్ను నెనసె
ముదములకు నప్పటిముచ్చట లెచ్చరికె ॥కంటి॥ 472

రామక్రియ

ఉండవయ్యా యించుకంత వుడుకువట్టే వలపు
దండిగా వెనకముందుఁ దలపించేఁగాక ॥పల్లవి॥

1. కట్టిన=ఏర్పాటుచేసిన, ఒప్పందము చేసిన కావచ్చు.

మంతనపునీమాటలు మఱచితినా నేను
కాంతలతోఁ జెప్పఁగాక కాకయ్యేవంటా
వంతుకు మాటలాడితే వాఁడివోయనా యేమి
చింతదీరఁ జెవిలోనే చెప్పిచూపేఁగాక ॥ఉండ॥

మల్లి నీసేవ సేయక మానితినా నేను
వొళ్లెల్లాఁ బచ్చియ్యానంటా నుండానఁగాక
వొల్లనే నవ్వు నవ్వితే వుడివోయనా యేమి
ఇల్లిదె విడెమిచ్చి యెచ్చరించేఁగాక ॥ఉండ॥

వొద్దికై నవీరతుల కొడిగట్టనా నేను
పెద్దరికము నీదంటాఁ బెనఁగేఁగాక
బుద్ధితో శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టె
వొద్దనేనా నిన్ను నింకా వొరసేఁగాక ॥ఉండ॥ 478

వరాళి

ఆయనాయ వొద్దులేవే అలసితివి
రాయడించీఁ జన్నుదోయి రవ్వయ్యీ నుండవే ॥పల్లవి॥

తగవులు చెప్పనేలే తగ నాతనికి నాకు
నగవులు నగనేలే నడుమ నీవు
యెగసక్కెలాడనేలే యింతలోనే వేగిరించి
దగ దొట్టీఁ జాలుఁజాలు తతి నూరకుండవే ॥ఆయ॥

వాసులు వుట్టించనేలే వడి నాతనికి నాకు
మోసాలు చూపనేలే మొక్కలాన
వేసాలు సేయనేలే వేమారు నన్నుఁ జూచి
ఆసలఁ జెమటరేఁగీ నట్టె వూరకుండవే ॥ఆయ॥

సాకిరచెప్పఁగనేలే సరి మాయిద్దరిలోన
ఆకడ నాడుకోనేలే అందరతోడ
పైకొని శ్రీవేంకటపతి నన్ను నిట్టె కూడె
చీకాకుగాఁ గొప్పువడీ సిగ్గుతోడ నుండవే ॥ఆయ॥ 474

రేకు 1600 ముఖారి

దొడ్డవానిఁ బంతము తోడిఁబడఁ గొనరాదు
వెడ్డువెట్టులే నేర్పు వేడుకతో నిన్నును ॥పల్లవి॥

చక్కఁగా నీతో నేను చలము సాదించరాదు
ఇక్కడ నీతోఁ బొందు లెట్టు గూడీని
తొక్కేవు నాపాదము తొలఁగుమనఁగరాదు
మొక్కకు నే దీవించితి మొదలనే నిన్నును ॥దొడ్డ॥

వాసులకు నీతోను వాదు లడువఁగరాదు
సేసవెట్టి నీపై నెట్టు చేయి చాఁచేము
ఆసపడేవు నాకు అవుఁగాదనఁగరాదు
బాసలు సేయకు నమ్మి భావించితి నిన్నును ॥దొడ్డ॥

మిగుల నీతో మందెమేళము సేయఁగరాదు
నగుతా నిన్నెట్లా నానలు వెట్టేది
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
పొగడే వప్పటి నన్ను; పోదిసేసే నిన్నును ॥దొడ్డ॥ 475

దేసాళం

కడపరాయఁడు నీకు కప్పురమందిచ్చీ వాఁడె
మడిచియ్యవే ఆకు మనసిచ్చీ నతఁడు ॥పల్లవి॥

ప్రియములు చెప్పఁగాను పెనఁగకువే నీవు
నయగారాలు చూపఁగా నవ్వకువే
నియతాన మొక్కఁగాను నిట్టింత యేఁటికే
క్రియగూడ నియ్యకోవే కేలుచాఁచీ నతఁడు ॥కడ॥

చేరి మోము చూడఁగాను సిగ్గులువడకువే
కూరిమి గొసరఁగాను కోపమేఁటికే
గారవించి పిలువఁగా కాఁతాళించకువే
పేరుకొని పాడఁగదే పెరరేఁచీ నతఁడు ॥కడ॥

గక్కనఁ గాఁగిలించఁగా గయ్యాళించకువే
ఇక్కువ లంటఁగఁ గోప మిఁక నేఁటికే
అక్కరతో శ్రీవేంకటాధిపతి కడపలో
వొక్కటాయ మెచ్చఁగదె వొద్దనున్నాఁడతఁడు ॥కడ॥ 476

బౌళి

ఇట్టిదివో నీమహిమ యేమని పొగడేమయ్యా
తిట్టివాను మోవిమీఁద తేనెతే తొరుగవా ॥ పల్లవి ॥

జలజాక్షితో నీవు సరసములాడఁగాను
చెలరేఁగి చెక్కులెల్లఁ జెమరించెను
మొలకచన్నులు నీవు ముట్టితేఁగనక ఇఁక
వలపెల్ల జడివట్టి వానలై కురియవా ॥ఇట్టి॥

మచ్చికల నీకెతోను మాటలు నీవాడఁగాను
కచ్చుపెట్టి పులకలు కడునిండెను
అచ్చుగాఁ గాఁగిట నించి ఆయము లంటితే నీఁక
పచ్చికోరికలెల్లాను పాలుకొని పండవా ॥ఇట్టి॥

చెనకుచు నవ్వులనె సేసలు నీవు వెట్టఁగ
గనినయై మోమున నిండుఁగళ లుబ్బెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విపుడింకా
చనవులు తీపులెక్కె చవులు మదురవా ॥ఇట్టి॥ 477

[1]దేశిసూళాది

మాళవి గౌళ, ధు(ధ్రు?)వ.

వలెవలెనని వలచితినట తనవలలకు లోఁగానటరే ఇఁక
పలమో చలమో నాకును పతితో జగడములా
నెలఁతలు దన కెందరు గలిగిన నేనే సతమని తెలియరె
పొలమెల్లాఁదిరిగినతేఁటికి పూఁబొదయే నెలవుగదే ॥పల్లవి॥

వాక్యం

అనఁగదరే వోచెలులాల ఆతనితోడుత నీమాటలె
వినయంబున నే నడవఁగ శ్రీవేంకటపతి కిది దగవా

రామక్రియ ,మఠెం

అల్లనాఁ డొకతెతోడ నక్కి మాటలాడఁగాను
చల్లఁగా నేనే చూచి జంకించితినా
పల్లదమాడితినట పైఁడివంటిమాటనైన
చిల్లరే మానఁడాయ శ్రీవేంకటేశ్వరుఁడు

1. రేకులలో, అన్ని పాటలకు ముందు రాగముపేరు 'పల్లవి' అనియుండుట వహజము. సరిష్కర్తలందరూ పల్లవిభాగము వ్రాసి దానికడవట 'పల్లవి' అనివ్రాసి, తరువాత క్రమముగ చరణములు వ్రాసి ముద్రించుచుంటిమి. ఈపాటమాత్రము రేకులోనే రాగతాళములు, తరువాత పల్లవిభాగముకొసన పల్లవి అని వ్రాసి, తక్కిన రాగము,వాక్యము వగైరాలు ఆయాభాగముల కడవట వ్రాసినారు. పల్లవితప్ప తక్కినవానిని నేను స్పష్టప్రతీతికై ఆభాగములకు ముందు వ్రాయుచున్నాను. సుప్రసిద్ధమైనరాగమాలికతో పాటు దీనిలో తాళమాలిక విశిష్టమని సంగీతమర్మజ్ఞులు శ్రీ॥ శే॥ రాళ్లపల్లివారు కొండాడేవారు.

వరాళి. రూపకం

ఈనాడినమాటలెల్లాఁ దలఁచుమని
కోనేటిరాయనికి నాగుబ్బలమీఁదటను
అనవెట్టరే

బౌళి, ఝంపె

వెగ్గళముగ సారెకు నీకె వెంగెములాడఁగఁజాలను
సిగ్గరితనమునఁ గొసరెద శేషాచలపతిని

పాడి, త్రిపుట

అలిగి సాదించఁ దగ దంజనాద్రీశ్వరునిఁ
గలికిచూపులనె మది గరగఁజేసెదను

నాట, అటతాళం

చనవుగలిగిన సరస మమరును సముకమున నే మనసు దెలిసెద
మునుప నడుగరె మదనజనకుని ముద్దుటుంగరము

శ్రీరాగం, ఏకతాళి

మాయింటికి నేఁడు రాఁగా మంకులూ బొంకులుఁ దేరె
వేయి నేల నే మొక్కనే వేంకటరాయనికి

అలరినరతులఁ దొయ్యలులాల నన్నుఁ
గలసె వేడుక శ్రీవేంకటవిభుఁడు ॥వలెవల॥ 478

పాడి

అప్పుడే వచ్చినదాన నందరిలోన
వుప్పుఁ గప్పురము సరా వొద్దే నీవు ॥పల్లవి॥

కన్నుల మొక్కితిని కాలూఁ దొక్కితిని
యెన్నికకుఁ దనయాల నింకా నేమే
నన్ను నేల పిలిచీనే, నాఁడునాఁడే పుచ్చఁబుచ్చఁ
బున్నమలౌ తెలుఁగవా పోవే నీవు ॥అప్పు॥

చేరువనే వుంటిని సేసాఁ బెట్టితిని
యీరుదియ్యఁ బేనువచ్చు నేలే నీవు
తారుకాణ లిప్పుడేలే; తనసుద్ది చెప్పఁజెప్పఁ
జేర[1]మరాయని చెల్లఁబెట్టేఁ బదవే ॥అప్పు॥

సీటున నవ్వితిని నెట్టనఁ గూడితిని
యేఁటికి శ్రీవేంకటేశుఁ డేమనీఁ దాను
మూఁటమాట లింతయేల; మోవితేనె లూరనూర-
నూటలాయఁ దనకు నే నొద్దికైతిఁ బదలే ॥అప్పు॥ 479

1. మర + ఆయ + అని. మర=కొలపాత్ర. చేరకు మించినది.

# 1—అనుబంధము

## అకారాదిగ రాగ సంకీర్తన సంఖ్యాసూచి

| రాగములు | సంకీర్తన సంఖ్యలు: |
|---|---|
| అమరసింధు | .... 137. |
| ఆందోళి | .... 383. |
| ఆరిబి | .... 364. |
| ఆహిరి | .... 5, 14, 25, 49, 65, 88, 91, 102, 127, 163, 177, 199, 214, 244, 255, 259, 277, 287, 297, 322, 325, 362, 366, 389, 405, 410, 423, 441, 448, 459. |
| ఆహిరినాట | .... 41, 84, 142, 205, 210, 424, 468. |
| కన్నడగౌళ | ... 36, 68, 131, 310, 338, 440. |
| కాంబో(భో)ది | .... 34, 48, 71, 94, 126, 166, 173, 179, 246, 288, 304, 355, 402, 412, 429, 442, 470. |
| కుంతలవరాళి | .... 39, 374. |
| కురంజి | .... 190, 352. |
| కేదారగౌళ | .... 50, 170, 197, 212, 415. |
| గుండక్రియ | .... 356, 379. |
| గుజ్జరి | .... 28, 111, 196, 229, 357, 401. |
| గౌళ | .... 24, 59, 124, 216, 253, 372, 397, 435. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| తెలుఁగుఁగాంబోది | .... 125, 204, 264. |
| తోండి | .... 331, 418. |
| దేవగాంధారి | .... 138, 174, 222, 295, 318, 421, 449. |
| దేశా(సా)ఙి | .... 76, 309, 399. |
| దేసాళం | .... 4, 40, 80, 114, 139, 148, 151, 165, 182, 200, 233, 252 258, 262, 281, 321, 329, 335, 388, 395, 419, 427, 437, 453, 455, 476. |
| ద్రావిళభైరవి | .... 353. |
| ధ(ద)న్నాశి(సి) | .... 18, 72, 121, 305, 332, 385. |
| నట్టనారాయణి | .... 95, 110, 341. |
| నాగవరాళి | .... 119. |
| నాట | .... 300. |
| నాదరామక్రియ | .... 47 51, 77, 104, 146, 191, 194, 219, 245, 267, 294, 323, 340, 393, 461. |
| నారాయణి | .... 213, 290, 354, 414, 447, 450. |
| నీలాంబరి | .... 161. |
| పళవంజరం | .... 58, 101, 130, 314, 361, 466. |
| పాడి | .... 7, 12, 15, 21, 45, 56, 81, 87, 105, 134, 168, 171, 198, 208, 226, 243, |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| | 268. 276 279. 282. 311. 339' 360, 386. 411. 432 438. 457. 465. 471, 479. |
| పూర్వగౌళ | .... 446, 456. |
| బళహంస | .... 363. |
| బౌళి(భవుళి) | .... 6. 26, 54, 57. 66. 78. 96. 109. 123. 128. 135, 149. 159. 185. 227. 240. 254. 270. 273. 312 315. 319. 345, 351. 369 376. 384. 396. 420, 444, 477. |
| భౌ(బౌ)ళిరామక్రియ | .... 2, 167. |
| భల్లాటి | .... 292. 403. |
| భూపాళం | .... 331. |
| భైరవి | .... 23. 30. 85. 180. 234. 261. 280. 370, 390. |
| మంగళకౌశిక | .... 46, 176. 272. 342. |
| మధ్యమావతి | .... 55, 99, 141, 346. |
| మాళవి | .... 63, 145, 158. 183 186. 308. 406, 436. |
| మాళవిగౌళ | .... 1. 11, 32. 73. 82. 108, 164. 188. 225. 237. 299. 382. 472. 478. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| మాళవి(వ)శ్రీ | .... 154. |
| ముఖారి | .... 17, 19, 44, 74, 86, 107, 129, 150, 169, 193, 215, 232, 247, 260, 284, 291, 293, 303, 333, 344, 349, 371, 373, 430, 475. |
| మేఘరంజి | .... 380. |
| రామక్రియ | .... 29, 38, 70, 93, 120, 140, 147, 181, 187, 209, 230, 301, 324, 343, 377, 404, 407, 439, 473. |
| రీతిగౌళ | .... 160, 217, 289, 347. |
| లలిత | .... 22, 42, 75, 83, 98, 132, 133, 175, 202, 207, 271, 285, 317, 330, 375, 387, 417, 445, 460, 463. |
| వరాళి | .... 3, 27, 33, 53, 62, 69, 89, 112, 153, 156, 192, 221, 224, 231, 241, 250, 269, 278, 298, 306, 358, 378, 394, 425, 451, 454, 469 474. |
| వసంతం | .... 136, |
| వేళావళి | .... 16, 67, 316, 365. |
| శంకరాభరణం | .... 9, 92, 115, 122, 162, 218, 228, 249, 263, 265, 296, 337, 348, 392, 408. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| శ్రీరాగం | .... 35. 61. 90. 100. 144, 236. 274, 327, 433, 467. |
| శుద్ధదేశి | .... 155, 248, 367. |
| శుద్ధవసంతం | .... 143, 178, 220, 235. 257. 409. 422. |
| సామంతం | .... 10. 13. 31, 64. 79. 118. 157. 172, 184, 223. 238. 256. 275. 286. 313, 320, 328. 391, 398. 434. 462 |
| సామవరాళి | ... 8, 413, 431. |
| సాళంగం | .... 113. 326. 443. |
| సాళంగనాట | .... 60. 103. 201, 206, 239. 251. 266. 334, 350. 428. 452. 464. |
| సావేరి | .... 117. |
| సింధురామక్రియ | .... 116. 203. 368. |
| సౌరాష్ట్రం | .... 37. 106. 152. 189. 242. 307. 400. 458. |
| హిందోళం | .... 52, 302, 359. |
| హిందోళవసంతం | .... 20. 336, 426. |
| హిజ్జిజి | .... 43. 97. 195. 211, 283. 416. |

# 2—వ అనుబంధము

అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి.


| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంకెకాఁడ | పాడి | 134 |
| అంటినిన్నుఁబాయ | పాడి | 282 |
| అంటేనన | ముఖారి | 74 |
| అంతయేల | వరాళి | 451 |
| అంతసేసి | సౌరాష్ట్రం | 400 |
| అందరి వడుగ | దేసాళం | 335 |
| అందరిలో | శ్రీరాగం | 35 |
| అందరి వల్లా | శుద్ధవసంతం | 257 |
| అందాలు | బౌళ | 444 |
| అందుకు | గౌళ | 372 |
| అందుకే నేనూ | బౌళి | 278 |
| అందుకేమయ్యా | సాళంగనాట | 266 |
| అందుకేమిదోసమా | రామక్రియ | 404 |
| అందుకేమి దోసము | శంకరాభరణం | 92 |
| అందువంక | ఆహిరి | 423 |
| అక్కచెల్లెండ్ల | దేవగాంధారి | 138 |
| అటువంటిది | సామంతం | 157 |
| అటువంటివార | ఆరిబి | 364 |
| అట్ట ఇయ్యి | బౌళి | 345 |
| అట్టే కాని | బౌళి | 315 |
| అడ్డము | ఆహిరినాట | 84 |
| అతఁడు | కాంబోది | 48 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అదియుఁజూతుము | పళవంజరం | 130 |
| అనరాదు | కురంజి | 352 |
| అన్నిటాఁజక్క | బౌళి | 78 |
| అన్నిటాజాణఁడై | దేసాళం | 151 |
| అన్నిటాను | శుద్ధవసంతం | 178 |
| అన్నితగవులు | దేవగాంధారి | 421 |
| అన్నీ మెచ్చు | శంకరాభరణం | 263 |
| అప్పటితారుకాణ | కాంబోది | 166 |
| అప్పటినవ్వే | దేసాళం | 329 |
| అప్పటి నా | గౌళ | 397 |
| అప్పుడు పరాకై | దేసాళం | 4 |
| అప్పుడుదామే | పళవంజరం | 361 |
| అప్పుడు వద్దని | నాదరామక్రియ | 77 |
| అప్పుడే వచ్చిన | పాడి | 479 |
| అవి నామీఁద | మాళవి గౌళ | 225 |
| ఆఁటదాన | బౌళి | 376 |
| ఆఁటదాని | ముఖారి | 333 |
| ఆకె చక్కఁదన | కాంబోది | 288 |
| ఆకె యెటు | సౌరాష్ట్రం | 37 |
| ఆతఁడు గలితే | నారాయణి | 414 |
| ఆతఁడే | వరాళి | 250 |
| ఆతని నేల | మధ్యమావతి | 99 |
| ఆనతియ్యి | ముఖారి | 169 |
| ఆనతియ్యి | భైరవి | 234 |
| ఆపెవచ్చి | దేసాళం | 114 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అయనాయ | మాళవిగౌళ | 299 |
| అయనాయ | దేసాళం | 419 |
| అయనాయ | ధన్నాసి | 72 |
| అయనాయ | వరాళి | 474 |
| అయాలు | శంకరాభరణం | 296 |
| ఆసపడి | ధన్నాసి | 18 |
| ఆసోదకాఁడ | శంకరాభరణం | 249 |
| ఇంకనేడ సుద్ది | గౌళ | 24 |
| ఇంకనేడ సుద్దులు | కాంబోది | 34 |
| ఇంకనేమనేము | లలిత | 375 |
| ఇంకనేమి | నాదరామక్రియ | 47 |
| ఇంకనేలనిన్ను | దేవగాంధారి | 174 |
| ఇంకనేలవెఱపు | ముఖారి | 303 |
| ఇంకనేలే | వరాళి | 358 |
| ఇంకానేమి | మాళవిగౌళ | 188 |
| ఇంకానేలచలము | శంకరాభరణం | 162 |
| ఇంకానేల తలపించీ | మాళవి | 68 |
| ఇంకానేలవెఱపు | నాదరామక్రియ | 393 |
| ఇంచుకంత | సాళంగం | 326 |
| ఇంచుకా | ఆహిరి | 389 |
| ఇంతట | శంకరాభరణం | 408 |
| ఇంతజాఁతి | ముఖారి | 232 |
| ఇంతయేలే | హిందోళం | 302 |
| ఇంతలేసి | సాళంగనాట | 464 |
| ఇంతలోనే | అహిరి | 287 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంతలోవిచారము | సామంతం | 328 |
| ఇంత వెలఁజేల | లలిత | 22 |
| ఇంత వోల | సామంతం | 172 |
| ఇంత సేసితి | లలిత | 75 |
| ఇంతికి నీకుఁ దగవు | ముఖారి | 193 |
| ఇంతికినీకును | శంకరాభరణం | 392 |
| ఇంతిగుణ | దేసాళం | 262 |
| ఇంతితోడ | ధన్నాసి | 121 |
| ఇంతి నీదేవులు | ఆహిరి | 244 |
| ఇంతినేల | ఆహిరి | 214 |
| ఇంతేసి | పళవంజరం | 466 |
| ఇందరికి | కాంబోది | 412 |
| ఇందరితో | మాళంగౌళ | 73 |
| ఇందరిలోనా | దేసాళం | 455 |
| ఇందరును | కన్నడగౌళ | 131 |
| ఇందరూ | ముఖారి | 371 |
| ఇంద రెరిఁగిన | ఆందోళి | 383 |
| ఇందాఁకా | రామక్రియ | 38 |
| ఇందుకేపో | భైరవి | 261 |
| ఇందుకేమి | దేసాళం | 233 |
| ఇచ్చెరిఁగి | భైరవి | 85 |
| ఇటువంటి | లలిత | 133 |
| ఇట్టిదివో | బౌళి | 477 |
| ఇట్టుండ | కాంబోది | 179 |
| ఇదివోనాగుణము | గుండక్రియ | 356 |

| సంకీ ర్తనమొదలు | రాగము | సంకీ ర్తనసంఖ్య |
|---|---|---|
| ఇదివో నీ | పాడి | 198 |
| ఇదివోనీవు | దేవగాంధారి | 295 |
| ఇదివో నీవెఱఁగవు | సామంతం | 313 |
| ఇదివో నీసరసము | భల్లాటి | 292 |
| ఇదివో నీసుద్దు | అమరసింధు | 187 |
| ఇదె నీకులాభము | ముఖారి | 344 |
| ఇద్దరికిఁదె | ధన్నాసి | 385 |
| ఇద్దరిచేఁత | సామంతం | 223 |
| ఇద్దరి తమక | పూర్వగౌళ | 456 |
| ఇద్దరినేరుపు | నారాయణి | 447 |
| ఇద్దరిమోహరసము | ఆహిరి | 277 |
| ఇద్దరుఁగదిసి | ఆహిరి | 5 |
| ఇద్దరు నిద్దరే | పాడి | 339 |
| ఇన్నాళ్లవలెఁగాదు | రామక్రియ | 29 |
| ఇన్నాళ్లవాఁడ | నాదరామక్రియ | 219 |
| ఇన్నాళ్లుఁబడుచ | పళవంజరం | 58 |
| ఇన్నిటిమూలము | దేసాళం | 281 |
| ఇన్నియు నిందే | నాదరామక్రియ | 267 |
| ఇప్పటనుండీ | లలిత | 387 |
| ఇప్పటికోపము | ఆహిరి | 14 |
| ఇప్పుడువేగిర | నాదరామక్రియ | 245 |
| ఇప్పుడే | వరాళి | 394 |
| ఇవియెల్లా | బౌళి | 227 |
| ఈఁతకు | సామవరాళి | 481 |
| ఈతఁడిందాఁకా | వరాళి | 62 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఈతఁడెట్టుండి | ఆహిరినాట | 41 |
| ఈపాటివాఁడవు | లలిత | 460 |
| ఈపాటివాడు | గౌళ | 216 |
| ఈయింతివల్ల | హిజ్జిజి | 195 |
| ఉండవయ్యా | రామక్రియ | 473 |
| ఊరకుండు | రామక్రియ | 324 |
| ఊరకె వున్నాఁడ | సామంతం | 184 |
| ఊరకే లోనౌదు | ఆహిరినాట | 424 |
| ఎంచుకొమ్మా | బౌళి | 185 |
| ఏంత కెత్తు | దేవగాంధారి | 222 |
| ఎంత గుట్టు | నాదరామక్రియ | 146 |
| ఎంత చుట్టమో | హిందోళవసంతం | 426 |
| ఎంత చులకఁగఁజూచే | దేశాక్షి | 309 |
| ఎంత తక్కరిఁడి | వరాళి | 112 |
| ఎంత తమకించే | నట్టనారాయణి | 110 |
| ఎంత దంటుతన | నాదరామక్రియ | 191 |
| ఎంత నన్నుఁ బొగడే | సావేరి | 117 |
| ఎంత నన్ను వేఁడు | శ్రీరాగం | 61 |
| ఎంత నేరుచు | శంకరాభరణం | 115 |
| ఎంత నేరుచు | లలిత | 132 |
| ఎంత రాజసము | దేసాళం | 182 |
| ఎంత రాతి | వరాళి | 269 |
| ఎంత లేదు | రామక్రియ | 209 |
| ఎంత వాఁడ | కన్నడగౌళ | 440 |
| ఎంత వేగిర | సాళంగనాట | 452 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంత వేగిర | దేసాళం | 437 |
| ఎంత వేగిర | బౌళి | 384 |
| ఎంత వేగిర | శుద్ధదేశి | 155 |
| ఎంత వేగిర | పాడి | 471 |
| ఎంత వేడుకో | హిందోళం | 52 |
| ఎంత సలిగి | సామంతం | 434 |
| ఎంత సేసితిరే | పాడి | 457 |
| ఎంత సేసేవే | పాడి | 360 |
| ఎందాఁకాఁగాచు | కేదారగౌళ | 415 |
| ఎందాఁకానలుకలు | దేవగాంధార | 449 |
| ఎందాఁకాబుద్ధి | మాళవి | 406 |
| ఎందాఁకానే | పాడి | 268 |
| ఎందాఁకామూసి | సామంతం | 8 |
| ఎందుకైనాఁదానే | సౌరాష్ట్రం | 242 |
| ఎందువోయే | తోండి | 418 |
| ఎక్కడ పరాకు | సాళంగనాట | 251 |
| ఎగ్గులుఁదప్పులు | కన్నడగౌళ | 310 |
| ఎగ్గువట్టేవు | నాదరామక్రియ | 461 |
| ఎగ్గోతపో్వ | బౌళి | 351 |
| ఎటువంటిజాణ | మంగళకౌశిక | 176 |
| ఎటువంటిదాన | వరాళి | 298 |
| ఎటువంటివాఁడవయ్యా | బౌళి | 319 |
| ఎటువంటివాఁడవయ్యా | హిందోళం | 359 |
| ఎట్టున్నదో | బౌళి | 54 |
| ఎడఁగొల్లకత్తె నీకె | బౌళిరామక్రియ | 2 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎదఁగొల్లక త్తెవు | శుద్ధవసంతం | 148 |
| ఎడమాటాడించ | సాళంగనాట | 103 |
| ఎదుట నున్నది | గుండక్రియ | 379 |
| ఎనసి యాతఁడు | మధ్యమావతి | 141 |
| ఎప్పుడును | నాదరామక్రియ | 194 |
| ఎప్పుడూ | గౌళ | 435 |
| ఎఱఁగనట్టు | వేళావళి | 16 |
| ఎఱఁగనట్టే | హిజ్జిజి | 416 |
| ఎఱఁగమా | బౌళి | 149 |
| ఎవ్వరిఁగాదనఁగ | మధ్యమావతి | 346 |
| ఎవ్వరిఁ బోలుదు | ఆహిరి | 362 |
| ఎవ్వరితో | లలిత | 207 |
| ఎవ్వరది | హిజ్జిజి | 283 |
| ఎవ్వరిముందరఁ జేసే | వరాళి | 425 |
| ఎవ్వరివాఁడవు | రామక్రియ | 377 |
| ఎవ్వరెక్కడో | సామంతం | 275 |
| ఎవరెట్లుండి | రామక్రియ | 230 |
| ఎవ్వరెవ్వరి | లలిత | 417 |
| ఏఁటికిఁగొంకేవు | శుద్ధవసంతం | 409 |
| ఏఁటికిదాఁచే | లలిత | 271 |
| ఏఁటికినీవే | కేదారగౌళ | 50 |
| ఏఁటికిభ్రమ | శంకరాభరణం | 348 |
| ఏఁటికివెఱగు | బౌళి | 26 |
| ఏఁటికివేగిరించే | వరాళి | 306 |
| ఏఁటిమాట | పాడి | 411 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏక తాన | వరాళి | 89 |
| ఏమనఁగ | కన్నడగౌళ | 36 |
| ఏమని చెప్పుద | శ్రీరాగం | 274 |
| ఏమని యాడు | నారాయణి | 354 |
| ఏమని విన్నవించే | అహిరి | 49 |
| ఏమనివిన్నవించే | శ్రీరాగం | 467 |
| ఏమయ్యానీ | ఆహిరి | 459 |
| ఏమయ్యాపాడి | గుజ్జరి | 196 |
| ఏమయ్యావేడుక | రీతిగౌళ | 160 |
| ఏమిచెప్పి | పాడి | 7 |
| ఏమి చెప్పేదినీభాగ్య | కేదార గౌళ | 170 |
| ఏమి చెప్పేది నీయాస | భౌళి | 128 |
| ఏమి చెప్పేరే | కాంబోది | 173 |
| ఏమిటాసన్న | రామక్రియ | 140 |
| ఏమి నేరుతు | పాడి | 279 |
| ఏమి యీడు | రీతిగౌళ | 217 |
| ఏమిసేతు | ఆహిరి | 65 |
| ఏమిసేయవచ్చునయ్యా | సామంతం | 10 |
| ఏమిసేయవచ్చునీవే | సామంతం | 398 |
| ఏమిసేయవచ్చుభాగ్య | వరాళి | 454 |
| ఏమిసేసితి | ఆహిరినాట | 210 |
| ఏమి సేసినాఁదగు | గుజ్జరి | 357 |
| ఏమీ నెఱఁగ | సౌరాష్ట్రం | 189 |
| ఏమేమి సేయఁగా | పాడి | 208 |
| ఏమేయెడమాట | నాదరామక్రియ | 51 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమైనాగుణము | బౌళి | 128 |
| ఏమోయి నన్ను | తెలుఁగుఁగాంబోది | 264 |
| ఏలకొత్తలు | పాడి | 15 |
| ఏల కోపగించు | దేసాళం | 395 |
| ఏల తలవంచు | లలిత | 42 |
| ఏల తలవంచే | వరాళి | 69 |
| ఏలదాఁచే | లలిత | 380 |
| ఏలదూరి | సామంతం | 256 |
| ఏల దూరేరె | రీతిగౌళ | 347 |
| ఏల నన్ను | గౌళ | 59 |
| ఏల నాకు | ఆహిరి | 297 |
| ఏల పురుఁడు | వరాళి | 53 |
| ఏల పూసుక | సాళంగనాట | 201 |
| ఏలరట్టు | ముఖారి | 107 |
| ఏలలేదనేవు | రామక్రియ | 407 |
| ఏలలోఁగేవు | ఆహిరి | 127 |
| ఏల వేగిరపడీ | సామవరాళి | 418 |
| ఏలసిగ్గులు | ఆహిరి | 177 |
| ఏల యిందరి | నాదరామక్రియ | 340 |
| ఏలోయిమమ్ము | మాళవిగౌళ | 237 |
| ఒక్కమగవాండ్లకు | కాంబోద | 429 |
| ఒడఁబరతురు | శంకరాభరణం | 218 |
| ఓపవయ్యో | దేసాళం | 189 |
| ఓపోలదేడ | దేసాళం | 427 |
| ఔనయ్యామరి | శంకరాభరణం | 337 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కంటినే | వేళావళి | 67 |
| కంటిమిగా | ముఖారి | 17 |
| కంటిమి మీ | మాళవిగౌళ | 472 |
| కంటివా సీ | పాడి | 438 |
| కంటివిగా | ముఖారి | 284 |
| కంతుఁడేమి | తెలుఁగుఁగాంబోది | 125 |
| కట్టరో కలువ | పాడి | 432 |
| కడపరాయఁడు | దేసాళం | 476 |
| కడు దూరకురే | సామంతం | 238 |
| కనుఁగొనవయ్యా | ఆహిరినాట | 142 |
| కన్నమాటాడక | సాళంగం | 443 |
| కన్న వారినెల్లాఁగూడి | ముఖారి | 293 |
| కన్నెముద్దరాలు | ఆహిరి | 199 |
| కలకాల | పాడి | 56 |
| కలగూరా | పాడి | 226 |
| కలది గలట్టె | ముఖారి | 349 |
| కలదీ యింతిక | శంకరాభరణం | 265 |
| కలిగినట్టు | ముఖారి | 44 |
| కాంత యేమి | కాంబోది | 246 |
| కాంతల చేత | ధన్నాసి | 305 |
| కాఁకల యెప్పట | శుద్ధదేశి | 248 |
| కూడితి రిద్దరు | ఆహిరినాట | 468 |
| కూరిమి గొసరితే | ద్రావిళభైరవి | 358 |
| కొండవంటి | సౌరాష్ట్రం | 307 |
| కొలువు సేసే | ముఖారి | 480 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కోపగించి | గుజ్జరి | 28 |
| కోపగించు | గుజ్జరి | 111 |
| కోరికలు | లలిత | 285 |
| గుట్టుగలవాఁడ | నారాయణి | 290 |
| గుట్టుతోడ | శ్రీరాగం | 90 |
| గుట్టుతోడి | మంగళకౌసిక | 342 |
| గుట్టుతోనే | పాడి | 105 |
| చలమింతే | సామంతం | 691 |
| చాయవాటు | దేసాళం | 40 |
| చాలవా | సామంతం | 320 |
| చిత్తగించ | నారాయణి | 450 |
| చిత్తగించు ✓ | రామక్రియ | 120 |
| చిత్తమెఱిఁగి | పాడి | 21 |
| చుట్టమై | పూర్వగౌళ | 446 |
| చుట్టరికము | కాంబోది | 442 |
| చూచిచూచి | మేఘరంజి | 380 |
| చూచితే | రామక్రియ | 70 |
| చూచిన | నట్టనారాయణి | 95 |
| చూచుకో | సామంతం | 13 |
| చూచేవారి | రామక్రియ | 181 |
| చూడనిట్టున్న | సింధురామక్రియ | 116 |
| చూడ రే యెంత | తెలుఁగుఁగాంబోది | 204 |
| చూతువురావయ్యా | ఆహిరి | 102 |
| చూపవయ్యా | ముఖారి | 150 |
| చెప్పఁగనేఁటికి | శంకరాభరణం | 9 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చెప్పకువే | మాళవిగౌళ | 82 |
| చెప్పినట్లె | పాడి | 465 |
| చెలఁగి నీ | బౌళి | 135 |
| చెలికత్తెఁగనక | పాడి | 81 |
| చెలియదానే | ముఖారి | 260 |
| చెలియింత | శ్రీరాగం | 236 |
| చెలులము | మాళవిశ్రీ | 154 |
| చెల్లుబడి | మాళవిగౌళ | 108 |
| చెల్లునయ్యా | దేసాళం | 388 |
| చేసినట్టెల్లా | దేసాళం | 80 |
| జాణలైన | దేసాళం | 148 |
| తక్కినవారి | సాళంగనాట | 206 |
| తగునీకునిట్టి | పాడి | 87 |
| తనంత వచ్చిన | సాళంగం | 113 |
| తనకే తెలుసు | భైరవి | 270 |
| తప్పకయేమి | మాళవిగౌళ | 32 |
| తప్పనేమిటా | కన్నడగౌళ | 68 |
| తమకాన | సాళంగనాట | 239 |
| తలినింతి | శ్రీరాగం | 144 |
| తలఁచుకొనఁగ | ఆహిరి | 88 |
| తలదడిసిన | మాళవి | 308 |
| తానే తెలుసు | నాగవరాళి | 119 |
| తానే నామీఁద | సౌరాష్ట్రం | 458 |
| తిట్టితేనేమి ✓ | నాట | 300 |
| తెలుసుకో నేవు | మాళవిగౌళ | 382 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తేరిచూడు మిది | పాడి | 171 |
| తోలు బొమ్మలము | గౌళ | 253 |
| దల దలచ | ఆహిరి | 448 |
| దీకొని నిన్నిటు | శంకరాభరణం | 228 |
| దేవరవుగావా | సామంతం | 286 |
| దొడ్డవాడైన | మంగళకౌశిక | 46 |
| దొడ్డవానిఁబంతము | ముఖారి | 475 |
| దొర మోహించఁజూచి | పాడి | 243 |
| నంటుసగనక | బౌళ | 159 |
| నంటునరెండు | వరాళి | 3 |
| నగుతానీయిచ్చ | భైరవి | 30 |
| ననవంటి | సింధురామక్రియ | 368 |
| నన్నుఁ జూతవే | కాంబోది | 71 |
| నన్నుఁజూచి | దేసాళం | 321 |
| నన్నునేలినాఁడితఁడు | మాళవి | 183 |
| నన్నేలయెచ్చరించే | కేదారగౌళ | 212 |
| నలినాతుల | బౌళ | 6 |
| నాకుఁగాన | ఆహిరి | 163 |
| నా మొకమట్టె | దేసాళం | 453 |
| నా మొగము | వరాళి | 27 |
| నాలాగుని | వరాళి | 224 |
| నావలెనుండ | గౌళ | 124 |
| నిజమునుఁగల్ల | హిజ్జిజి | 211 |
| నిన్నుఁజూచి | పాడి | 45 |
| నిన్నుఁబొందిన | ఆహిరి | 259 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీ కింత యేలె | భైరవి | 180 |
| నీకుఁజూడ | కాంబోది | 470 |
| నీకుఁబోదు | సామంతం | 118 |
| నీకు దేవులను | బౌళి | 420 |
| నీకు నాకు | కాంబోది | 304 |
| నీ కెప్పుడు | లలిత | 317 |
| నీకే తెలుసునయ్యానీ | మాళవి | 436 |
| నీకే తెలుసునయ్యానే | బౌళి | 369 |
| నీకేలే వెఱపు | సామంతం | 31 |
| నీకొలఁది వారమా | లలిత | 445 |
| నీ కొలఁది వారలా | దేసాళం | 165 |
| నీగుట్టు | బౌళి | 240 |
| నీచేఁతలోని | కాంబోది | 402 |
| నీజాడలన్నియు | దేసాళం | 258 |
| నీతలనే | ముఖారి | 373 |
| నీ నేరుపు | ఖలాటి | 403 |
| నీ పంతము | లలిత | 202 |
| నీ పతి | సౌరాష్ట్రం | 152 |
| నీ వల్లదోసము | ఆహిరి | 322 |
| నీవల్లనే వచ్చె | బౌళి | 396 |
| నీ వింతేసి | ఆహిరి | 255 |
| నీ విభుఁడు | సాళంగనాట | 428 |
| నీవు గోరినట్టే | వరాళి | 241 |
| నీవుగోవిందరాజ | సామంతం | 462 |
| నీవు చేసిన | ముఖారి | 129 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవు నాతో | హిజ్జిజి | 48 |
| నీవు మొదలి | మాళవిగౌళ | 1 |
| నీ వెఱఁగనిదా | భూపాళం | 331 |
| నీవెఱఁగనివి | హిజ్జిజి | 97 |
| నీవే తెలుసు | బౌళి | 57 |
| నీవే దలఁచే | ఆహిరి | 325 |
| నీవే బుద్ధి | బౌళి | 254 |
| నీవె యానతీరా | ఆహిరి | 405 |
| నీవేళ సిగ్గు | బౌళి | 109 |
| నీవై నా | భైరవి | 23 |
| నీవాళ్లి | కుంతలవరాళి | 39 |
| నెమ్మది నిచ్చ | వరాళి | 33 |
| నెమ్మది నుండ | మాళవిగౌళ | 11 |
| నేఁడాతని | శ్రీరాగం | 433 |
| నేఁడే యింత | ముఖారి | 86 |
| నే నెంత వోరుచు | గుజ్జరి | 401 |
| నే నెఱఁగఁజెప్ప | కాంబోది | 355 |
| నేమా విన్న | రామక్రియ | 187 |
| నేరములేని | ఆహిరి | 441 |
| నేరుపుతో | వరాళి | 278 |
| పచ్చిదేరె | బౌళి | 96 |
| పట్టకు | ఆహిరినాట | 205 |
| పట్టరాని | దేవగాంధారి | 318 |
| పడఁతి వలపు | శుద్ధవసంతం | 422 |
| పతిమీఁది | శ్రీరాగం | 100 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పిలువవే | శుద్ధవసంతం | 220 |
| పురుషవిరహ | కేదారగౌళ | 197 |
| పెండిలి పీట | తోండి | 381 |
| పెళ్లి చెట్టు | వరాళి | 231 |
| బహురాకులు | పాడి | 12 |
| బుద్ధిచెప్పరే | కాంబోది | 126 |
| బుద్ధిచెప్పవయ్యా | నాదరామక్రియ | 323 |
| బుద్దెడిగే నిను | నారాయణి | 218 |
| భామతోడి | ఆహిరి | 91 |
| మంకుఁదన | ఆహిరి | 410 |
| మంచిదాని | బౌళి | 66 |
| మంచివాఁడ | ముఖారి | 215 |
| మందులో | సామంతం | 64 |
| మగనికి | నీలాంబరి | 161 |
| మగవాఁడట | పాడి | 386 |
| మగవాఁడైతే | వరాళి | 378 |
| మగవాని | నట్టనారాయణి | 341 |
| మగవానితో | రీతిగౌళ | 289 |
| మగువ నేమీ | భైరవి | 280 |
| మగువరో | బౌళిరామక్రియ | 167 |
| మన్నించుమనవే | కన్నడగౌళ | 338 |
| మమ్మునేల | ఆహిరి | 336 |
| మమ్మేల | గుజ్జరి | 229 |
| మఱచితి | వరాళి | 156 |
| మఱి నీవేమి | సౌరాష్ట్రం | 106 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మఱియేటి | కురంజి | 190 |
| మాకేఁటికి | దేసాళి | 76 |
| మాటలైవా | ఆహిరి | 25 |
| మాతో నింతే | కుంతలవరాళి | 374 |
| మాతోనేమి | మధ్యమావతి | 55 |
| మాను మంటే | వేళావళి | 365 |
| మాపుదాఁకామాట | సూళవి | 186 |
| మాపుదాఁకా విన్న | వసంతం | 136 |
| మాయుందరఁ దెచ్చి | రామక్రియ | 93 |
| మారు మాటలాడ | సాళంగనాట | 334 |
| మీకుమీరే | బళహంస | 363 |
| ముంచుకొంటే | ముఖారి | 247 |
| ముందే యెఱఁగ | ముఖారి | 291 |
| మూలనున్న | వరాళి | 192 |
| మేనవారినేల | దేశాళి | 399 |
| మేమెఱఁగ | బౌళి | 312 |
| మేలుమేలు | లలిత | 83 |
| మేలుమేలా | భైరవి | 390 |
| మెదల నేనై | సాళంగనాట | 60 |
| రచ్చలోఁ బెనఁగు | పాడి | 168 |
| రతికెక్కెఁబనులు | నాదరామక్రియ | 294 |
| రమణుఁడు | ముఖారి | 19 |
| రావయ్యా ఇఁకనేల | పళవంజరం | 101 |
| రావయ్యాఇఁకనైన | కాంబోది | 94 |
| రావే యెక్కడి | ధన్నాసి | 332 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| లేకిమమ్మ | మాళవి | 158 |
| లేలే వేలాల | శుద్ధదేశి | 367 |
| వక్కణించి | నాదరామక్రియ | 104 |
| వట్టి జోలికిఁబిలువ | రామక్రియ | 343 |
| వట్టి బీరపుమాట | రామక్రియ | 439 |
| వట్టి నిష్ఠూరమే | పాడి | 276 |
| వట్టి విచారము | రామక్రియ | 147 |
| వట్టి సటలు | మాళవిగౌళ | 164 |
| వద్దనేమా | లలిత | 98 |
| వద్దు రావయ్యా | సాళంగనాట | 350 |
| వయసు | దేసాళం | 252 |
| వలె వలెనని | మాళవిగౌళ | 478 |
| వాకిట | లలిత | 175 |
| వింటిమి మీ | సామంతం | 79 |
| వింటివా నా | వరాళి | 153 |
| వింతదాననా | హిందోళవసంతం | 336 |
| విన్నపము | శ్రీరాగం | 327 |
| విన్నవించవలె | పాడి | 311 |
| వెనకటివలె | శుద్ధవసంతం | 285 |
| వెరగంది | హిందోళవసంతం | 20 |
| వేగిరకానికి | వరాళి | 469 |
| వేఱొక యాఁట | సింధురామక్రియ | 203 |
| వేవేలకు | పళవంజరం | 314 |
| సందు సుడి | లలిత | 463 |
| సతుల పట్టుకు | మాళవి | 145 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
| --- | --- | --- |
| సతులిందరి | బౌళి | 270 |
| సవతులమింతే | రామక్రియ | 301 |
| సవతులమైనా | శంకరాభరణం | 122 |
| సవరుల | వరాళి | 221 |
| సిగ్గువిడిచి | మంగళకౌసిక | 272 |
| సేయనీవే | దేసాళం | 200 |
| సేసినవారికి | వేళావళి | 316 |

T. T. D. Religious Publications Series No. 188

Price Rs. 16-00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ

Published by S. Lakshminarayana, I.A.S. Executive Officer,
T. T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.